

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 228

బుధవారం 8-11-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



3 రోజుల లాభాలకు బ్రేక్

స్వల్ప నష్టాల ముగింపు... విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాల ప్రభావం
-14లో



అర్థవంతమైన జీవితం

'ఆసక్తి ఉంటే అనంత విశ్వాన్ని మథించవచ్చు' అంటున్న శకుంతలాదేవిపై స్టోరీ
-ఫ్యామిలీలో



● ఒక్కడై గెలిచాడు

మ్యాక్స్‘వెల్‌డన్’

- డబుల్ సెంచరీతో ఆస్ట్రేలియాను ఒంటిచేత్తో గెలిపించిన బ్యాటర్
- అఫ్గానిస్తాన్‌పై మూడు వికెట్లతో నెగ్గి సెమీస్ చేరిన ఆసీస్

ఆస్ట్రేలియా విజయలక్ష్యం 292... ఒకదశలో ఆ జట్టు స్కోరు 91/7...

...దాంతో ఐదుసార్లు విశ్వవిజేతకు అఫ్గానిస్తాన్ చేతిలో దారుణ పరాభవం ఇక లాంఛనమేనని అందరూ అనుకుంటున్న దశలో... కాలి కండరాల నొప్పితో కదల్లేక పోతున్నా... నిల్చున్న చోటు నుంచే తనకే సాధ్యమైన కొన్ని అసాధారణమైన షాట్‌లు ఆడుతూ... వన్డే క్రికెట్ చరిత్రలోనే మర పురాని ఇన్నింగ్స్ ఆడి గ్లెన్ మ్యాక్స్‌వెల్ ఒంటిచేత్తో ఆస్ట్రేలియాను ప్రపంచకప్‌లో సెమీ ఫైనల్‌కు చేర్చాడు. అఫ్గానిస్తాన్‌తో ముంబైలో మంగళవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా మూడు వికెట్ల తేడాతో చిరస్మరణీయ విజయం సాధించింది. మరో మ్యాచ్ మిగిలి ఉండగానే అధికారికంగా సెమీఫైనల్‌కు చేరింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మ్యాక్స్‌వెల్ (128 బంతుల్లో 201 నాటౌట్; 21 ఫోర్లు, 10 సిక్స్‌లు) అజేయ డబుల్ సెంచరీతో ఆస్ట్రేలియాను విజయతీరానికి చేర్చాడు. ఒకవైపు కెప్టెన్ కమిన్స్ సంయమనంతో ఆడగా... మరోవైపు మ్యాక్స్‌వెల్ అఫ్గానిస్తాన్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. ఫలితంగా ఆస్ట్రేలియా 46.5 ఓవర్లలో 7 వికెట్లకు 293 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. -15లో



ఎలాగూ గెలవమని
అన్నన్ని హామీలిస్తే ఎలా సార్!

మంగళవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరిగిన 'బీసీల ఆత్మగౌరవ సభ'కు హాజరైన ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ





బీసీ విరోధి సర్కార్!

30న జరిగే పోలింగ్‌లో బీఆర్ఎస్ సర్కారును సాగనంపాలి

బీజేపీ 'బీసీల ఆత్మ గౌరవ సభ'లో ప్రధాని మోదీ పిలుపు

12లో

- రాష్ట్రంలో గత తొమ్మిదేళ్లుగా బీసీ, ఎస్సీ, ఎస్టీల వ్యతిరేక పాలన
- కాంగ్రెస్ అవినీతి, కుటుంబ పాలన మోడల్‌నే బీఆర్ఎస్ సాగిస్తోంది
- అక్రమాలపై దర్యాప్తు చేపట్టగానే నాపై తిట్లు, విమర్శలు
- ప్రజాధనాన్ని లూటీ చేసిన వారి నుంచి తిరిగి రాబడతాం
- తప్పు చేసినవారిని వదిలిపెట్టేదే లేదు.. ఇది మోదీ గ్యారంటీ
- బీజేపీ సర్కార్ రాగానే బీసీల గౌరవం పెంచేందుకు చర్యలు
- గతంలో మీ ఆశీర్వాదంతోనే ప్రధాని అయ్యానని వెల్లడి

అవినీతిపై విచారణ జరుగుతుంది

తెలంగాణలో చోటుచేసుకున్న అవినీతిపై దర్యాప్తు సంస్థలు విచారణ జరిపి తీరుతాయి. ప్రజాధనాన్ని లూటీ చేసినవారి నుంచి దానిని తిరిగి రాబడతాం. ఢంకా బజాయించి మరీ చెప్తున్నా. ఇది మోదీ గ్యారంటీ. బీఆర్ఎస్ నేతల్లో అహంకారం చాలా పెరిగింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో అహంకారి సీఎంకు ప్రజలు ఓట్లతో జవాబు చెప్పారు. దాంతో నాపై తిట్ల దండకం అందుకున్నారు. ఎన్నో విమర్శలు చేశారు. బీఆర్ఎస్ అవినీతి, అక్రమాల్లో ఢిల్లీ మద్యం కుంభకోణం కూడా ముడిపడి ఉంది. అవినీతి తారస్థాయికి చేరుకోవడంతో దర్యాప్తు సంస్థలు విచారణ ప్రారంభించాయి. వాటిపైనా బీఆర్ఎస్ నేతలు తీవ్ర విమర్శలు మొదలుపెట్టారు.

మీరు ఆశీర్వదిస్తే బీసీ సీఎం అవుతారు

2014లో ఇదే మైదానంలో జరిగిన నా సభకు టికెట్లు కొని మరీ ప్రజలు హాజరయ్యారు. మోదీ ప్రధాని అయ్యేందుకు ఎల్బీ స్టేడియం కీలకంగా మారింది. అప్పుడు మీ ఆశీర్వాదంతోనే ప్రధాని అయ్యాను. దేశాభివృద్ధికి గట్టి పునాది పడింది. ఈ సభకు వచ్చిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలను చూస్తుంటే కుటుంబ సభ్యుల మధ్య ఉన్నట్టు అనిపిస్తోంది. తెలంగాణ ప్రజలు బీజేపీపై విశ్వాసంతో ఉన్నారు. మీ ఆశీర్వాదంతో త్వరలో తెలంగాణలోనూ బీజేపీ బీసీ వ్యక్తి సీఎం అవుతారు. తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందాలంటే యువత, రైతులు, తదితర అన్ని వర్గాలకు మేలు జరగాలంటే బీజేపీ డబుల్ ఇంజన్ సర్కారుతోనే సాధ్యం.

\- మోదీ

తెలంగాణను ద్రోహుల చేతిలో పెట్టే కుట్ర

కేసీఆర్‌పై కక్షగట్టినవారంతా కాంగ్రెస్, బీజేపీల పంచన చేరారు



'సాక్షి' ఇంటర్వ్యూలో మంత్రి తన్నీరు హరీశ్‌రావు

- అధికారం కోసం అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారు
- రాష్ట్ర ఆత్మగౌరవాన్ని ఉత్తరాది నేతల కాళ్ల వద్ద తాకట్టు పెడుతున్నారు
- కర్ణాటక నుంచి డబ్బులు తెచ్చి ఇక్కడ ప్రభావితం చేసే ప్రయత్నాలు
- కాళేశ్వరం ప్రాజెక్టుపై విపక్షాలది పైశాచిక ఆనందం
- దానిపై రాహుల్‌గాంధీ ఆరోపణలు మతిలేని మాటలే..
- తెలంగాణను అవమానించిన ప్రధాని మోదీకి ఓట్లు అడిగే హక్కులేదని వ్యాఖ్య

"కష్టపడి సాధించిన రాష్ట్రాన్ని ద్రోహుల చేతిలో పెట్టే కుట్ర జరుగుతోంది. సమైక్యవాది చంద్రబాబుతో కలసి పనిచేస్తున్నవారు తెలంగాణ వ్యతిరేకుల చేతుల్లో రాష్ట్రాన్ని పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ఉద్యమ సమయంలో కేసీఆర్‌పై కక్షగట్టి తెలంగాణవాదాన్ని దెబ్బతీయాలనుకున్న ద్రోహులంతా ప్రస్తుతం కాంగ్రెస్, బీజేపీ పంచన చేరారు.
\- మంత్రి హరీశ్‌రావు

7లో

65 శాతానికి రిజర్వేషన్లు



- బిహార్ కేబినెట్ ఆమోదం
- ఈ నెల 9న అసెంబ్లీలో బిల్లు
- ప్రకటించిన సీఎం నితీశ్ కుమార్

- వివరాలు 6లో

'ప్రళయ్' సక్సెస్



● తక్కువ శ్రేణి బాలిస్టిక్ క్షిపణి(ఎస్ఆర్‌బీఎం) 'ప్రళయ్'ని మంగళవారం ఒడిశా తీరంలోని అబ్దుల్ కలాం దీవి నుంచి విజయవంతంగా పరీక్షించినట్లు రక్షణశాఖ తెలిపింది. డీఆర్‌డీఓ ఈ క్షిపణికి రూపకల్పన చేసిందని పేర్కొంది. - 6లో

కొడుకుపై కోపంతో

82 ఏళ్ల తల్లి నామినేషన్



నామినేషన్ వేస్తున్న వృద్ధురాలు శ్యామల

జగిత్యాల: ఆమె 82 ఏళ్ళ వృద్ధురాలు .. భర్త స్వాతంత్ర్య సమరయోధుడు.. కుమారుడు విదేశాలకు వెళ్లి వచ్చాడు.. కానీ తల్లికి చెందిన భూమిని ఆమెకు తెలియకుండానే అమ్మేసుకున్నాడు. దాంతో ఆమె అద్దె ఇంట్లో ఉంటూ అష్టకష్టాలు పడుతూ.. న్యాయం చేయా లని ఏకంగా సీఎం కేసీఆర్‌కు సైతం లేఖ రాసింది. కానీ ప్రయోజనం లేకపోయింది. దీంతో ఇప్పుడు ఎన్నికల నేపథ్యంలో పోటీ చేస్తే పదిమందికీ తెలిసి తన సమస్య పరిష్కారం అవుతుందని ఆ పెద్దావిడ భావించి నామినేషన్ వేశారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కురిక్యాల గ్రామానికి చెందిన మిగతా 2వ పేజీలో ▶



ఛత్తీస్‌గఢ్ జగదల్‌పూర్‌లోని ఓ పోలింగ్ కేంద్రంలో ఓటేసేందుకు బారులు తీరిన ఓటర్లు

ఛత్తీస్‌గఢ్‌లో 71% పోలింగ్

తొలి దశలో 20 నియోజకవర్గాల్లో పోలింగ్

ఓటేసిన మాజీ సీఎం రమణ్ సింగ్, కాంగ్రెస్ చీఫ్ దీపక్

● సార్వత్రిక ఎన్నికలకు సెమీ ఫైనల్స్‌గా భావించే ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో తొలి అంకానికి మంగళవారం ఛత్తీస్‌గఢ్, మిజోరం రాష్ట్రాలు శ్రీకారం చుట్టాయి. ఛత్తీస్‌గఢ్‌లో మొత్తం 90 స్థానాలకుగాను తొలి విడతలో 20 నియోజకవర్గాలకు మంగళవారం పోలింగ్ జరిగింది. సాయంత్రం ఐదింటికి అందిన సమాచారం మేరకు 71.48% పోలింగ్ నమోదైంది.

- వివరాలు 6లో

మిజోరంలో 77% పోలింగ్

తొలి 'ప్రయత్నం'లో ఓటు వేయలేకపోయిన ముఖ్యమంత్రి

- వివరాలు 6లో

'ఆసక్తి ఉంటే అనంత విశ్వాన్ని మథించవచ్చు' అనడానికి ప్రతీక శకుంతలాదేవి. అరవై దాటిన తర్వాత యూ ట్యూబర్‌గా ప్రపంచానికి పరిచయమయ్యారు. అంతకంటే ముందు ఆమె తనకంటూ ఓ ప్రపంచాన్ని సృష్టించుకున్నారు. ఆ ప్రపంచంలో సంగీతం, సాహిత్యం, మొక్కల పెంపకం ఉన్నాయి. ఇప్పుడు డిజిటల్ మీడియా వేదికగా సృజనాత్మకతను పంచుతున్నారు. భర్త బాటలో తాను కూడా మరణానంతరం దేహాన్ని డొనేట్ చేశారు.

అర్థవంతమైన జీవితం



శకుంతలాదేవి

శకుంతలాదేవి అత్యంత సాధారణ గృహిణి. నలుగురు పిల్లల్ని పెంచుతూ ఆమె తన అభిరుచులను కొనసాగించారు. సాహిత్యాన్ని ఆస్వాదించకుండా ఉట్టిగా పాటలు వినడంలో ఏదో అసంతృప్తి. అందుకే హిందీ పాటల సాహిత్యాన్ని అర్థం చేసుకోవడానికి హిందీ– తెలుగు డిక్షనరీలో అర్థాలు వెతుక్కున్నారు. స్మార్ట్‌ఫోన్, సోషల్ మీడియాలను ఉబుసుపోని పోస్టులకు పరిమితం చేయలేదామె. సాంకేతిక పాఠాలను స్మార్ట్‌ఫోన్‌తోనే నేర్చుకున్నారు. వీడియో రికార్డ్ చేయడం, ఎడిటింగ్, థంబ్‌నెయిల్ పెట్టడం, యూ ట్యూబ్‌లో అప్‌లోడ్ చేయడం వరకు అవసరమైనవి అన్నీ సొంతంగా నేర్చుకున్నారు. తనకు తెలిసిన మంచి విషయాలను డిజిటల్ మీడియా వేదికగా ప్రపంచంతో పంచుకుంటున్నారు. 'నన్ను ప్రపంచానికి తెలియ చేసిన యూట్యూబ్‌కి తొలుత కృతజ్ఞతలు' అంటూ తన వివరాలను 'సాక్షి'తో పంచుకున్నారు స్వర్ణ శకుంతలాదేవి.

ఆధ్యాత్మికం నుంచి అభ్యుదయం వరకు ...

''మాది తెనాలి దగ్గర మూల్పూరు గ్రామం. నాన్న వ్యవసాయంతోపాటు గుడిలో పూజలు చేసేవారు. ఏడుగురు సంతానం. ఐదుగురు అమ్మాయిల్లో ఎస్ఎస్ఎల్‌సీ వరకు చదివింది నేనే. మా వారు బీఏఎమ్ఎస్ చదువుతూ ఉండడంతో ఆయన చదువు పూర్తయ్యే వరకు, నాకూ చదువుకునే అవకాశం వచ్చింది. ఫిఫ్త్‌ఫారమ్‌లో ఉండగా పెళ్లయింది. తర్వాత పుట్టింట్లోనే ఉండి ఎస్ఎస్ఎల్‌సీ పూర్తి చేసి రిజల్ట్స్ వచ్చే నాటికి చీరాలలో అత్తగారింటిలో ఉన్నాను. అప్పట్లో ఆ చదువుకే సెకండరీ గ్రేడ్ టీచర్ ఉద్యోగం ఇచ్చేవారు. మా అత్తగారు 'ఉద్యోగం చేయాల్సిన అవసరం ఏముందిప్పుడు' అనడంతో ఇంటికే పరిమితమయ్యాను. టీచర్ అయ్యే అవకాశం అలా చేజారింది. కానీ మా వారి నుంచి ప్రోత్సాహం మాత్రం ఎప్పుడూ ఉండేది. ఆయన ఆయుర్వేద వైద్యులుగా ఒంగోలు దగ్గర అమ్మనబ్రోలులో ప్రాక్టీస్ చేసేవారు. అక్కడే 35 ఏళ్ల పాటు ఉన్నాం. ఇద్దరు పిల్లలు పుట్టిన తరవాత వీణ నేర్చుకున్నాను. ఆ తర్వాత మరో ఇద్దరు పిల్లలు. వాళ్లందరి ఆలనపాలన చూస్తూ నా అభిరుచులను కొనసాగించగలిగాను. ఆధ్యాత్మిక గ్రంథాల నుంచి రంగనాయకమ్మ రాసిన బలిపీఠం, కౌసల్యాదేవి– చక్రవాకం, రవీంద్రనాథుని గీతాంజలి, బాలగంగాధర తిలక్ అమృతం కురిసిన రాత్రి.. ఇలా అదీ ఇదీ అనే వర్గీకరణ లేకుండా చదివేదాన్ని. యద్దనపూడి, మాదిరెడ్డి, యండమూరి, శ్రీశ్రీ రచనలను, అబ్దుల్‌కలామ్ వంటి ప్రముఖుల జీవిత చరిత్రలను ఇష్టంగా చదివాను. కొన్ని రచనలు రేడియోలో నాటికలుగా వచ్చేవి. వాటి కోసం రేడియోకి అంకితమయ్యేదాన్ని. ఇలా సాగుతున్న జీవితంలో పిల్లలు నలుగురూ సెటిల్ అయిన తర్వాత మా వారు ప్రాక్టీస్ చాలించారు. 2005లో చీరాలకు వచ్చాం.

పెద్దబ్బాయి కొత్తదారిలో నడిపించాడు

మా పెద్దబ్బాయి నన్ను కొత్తగా ఆవిష్కరించాడు. తను మెకానికల్ ఇంజనీర్. తాను ఆసక్తి కొద్దీ జెమాలజీ కోర్సు చేశాడు. రత్నాల గురించిన కబుర్లు నాకు ఎక్కువ ఆసక్తినివ్వడంతో రత్నాలకు – రాళ్లకు మధ్య తేడాను గుర్తించడం నేర్పించాడు. ముత్యాలు, పగడాలతోపాటు రకరకాల బీడ్స్, జెమ్స్, సెమీ ప్రెషియస్ స్టోన్స్‌తో ఆర్నమెంట్ మేకింగ్ నేర్పించాడు. జీవితాన్ని మనం ఎంత ఉత్సాహవంతంగా, రాగరంజితంగా మార్చుకున్నప్పటికీ ఏదో ఒక వెలితిని సృష్టించి ప్రశ్నార్థకంగా మన ముందు పెడుతుంది. నా అభిరుచులు మాత్రమే నాతో మిగిలాయి, వాటిని ప్రోత్సహించిన మావారు మాకు దూరమయ్యారు. ఆయన కోరిక మేరకు దేహాన్ని వైద్య విద్యార్థుల అధ్యయనం కోసం ఒంగోలులో మెడికల్ కాలేజీకి ప్రదానం చేశాం. ఆయన బాటలో నేను కూడా మరణానంతరం నా దేహాన్ని డొనేట్ చేస్తూ సంతకం చేశాను. మనం జీవిస్తూ మరొకరికి ఉపయోగం కలిగించడమే జీవితానికి అసలైన అర్థం అని నమ్ముతాను. ఆయన జ్ఞాపకాలతో రోజులు సాగుతున్న సమయంలో కోవిడ్ ప్రపంచాన్ని కుదిపేసింది.

యూ ట్యూబ్ ఆత్మీయులనిచ్చింది

కోవిడ్ సమయంలో అగాధంలాంటి విరామం. ఆ విరామం ఎంత కాలమో కూడా తెలియదు. యూ ట్యూబ్ చానెల్స్ చూస్తూ, మా వారు సుబ్రహ్మణ్య కుమార్ రాసిన వైద్య గ్రంథాన్ని చదువుతూ గడిపాను. అప్పుడు నాక్కూడా నాకు తెలిసిన సంగతులు చెప్పాలనిపించింది. గూగుల్ లేని రోజుల్లోనే నిత్యాన్వేషిగా ఎన్నో విషయాలు తెలుసుకున్నాను. చేతిలోకి స్మార్ట్‌ఫోన్ వచ్చిన తర్వాత ఇక కష్టమేముంది? యూ ట్యూబ్‌కి సంబంధించిన పరిజ్ఞానమంతా 'హౌ టూ అప్‌లోడ్, హౌ టూ డూ ఎడిటింగ్, హౌ టూ డూ థంబ్‌నెయిల్' అంటూ 'హౌ టూ' అని అడుగుతూ నేర్చుకున్నాను. మొదట వంటలు, ఇంటి అలంకరణ, మా వారు రాసిన వైద్యగ్రంథంలోని విషయాలను చెప్పాలనుకుని 2021లో యూ ట్యూబ్ చానెల్ మొదలుపెట్టాను. కొంతకాలం తర్వాత యూ ట్యూబ్ గుర్తించాలంటే ఏదో ఒక టాపిక్ మీదనే దృష్టి పెట్టమని సూచించారు పిల్లలు. వంటలు చాలామంది చేస్తున్నారు. ముత్యాలు, పగడాల గురించి చాలామందికి తెలియని సంగతులు చాలా ఉన్నాయి. వాటి గురించి చెప్పమన్నారు మా పిల్లలు. ఆ తర్వాత నాకు సబ్‌స్క్రైబర్స్ రెండున్నర లక్షలకు పెరగడంతోపాటు ఫాన్ ఫాలోయింగ్ కూడా పెరిగింది. డాక్టర్లు, సైంటిస్టులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు... సందేహాలడుగుతుంటే నాకు తెలిసిన దెంత? ఇంత పెద్ద చదువులు చదువుకున్న వాళ్ల సందేహాలు నేను తీర్చడమేమిటని ఆశ్చర్యంగా ఉంటుంది కూడా. అసలు ముత్యాన్ని, నకిలీ ముత్యాన్ని ఎలా గుర్తించాలి, తైవాన్ పగడం ఎలా ఉంటుంది, ఇటాలియన్ పగడాలెలా ఉంటాయి, వేటిని క్యారట్‌లలో తూస్తారు, వేటిని గ్రాముల్లో తూస్తారు... వంటి విషయాలనెన్నో చెప్పాను. యూ ట్యూబర్‌గా నేను డబ్బుకంటే వెలకట్టలేని ఆత్మీయతను, అభిమానాన్ని సంపాదించుకున్నాను. ఆంటీ, అమ్మా అనే పిలుపులతోపాటు ఈ తరం యువతులు వాళ్ల సందేహాల కోసం ఫోన్ చేసి 'అమ్మమ్మా' అని పిలుస్తుంటే చాలా సంతోషంగా ఉంటోంది. మనిషి, మెదడు పని లేకుండా ఖాళీగా ఉండకూడదు. అలాగే ఎంటర్‌టైన్‌మెంట్ మన మైండ్‌ని చెడగొట్టకూడదని నమ్ముతాను. అందుకే టీవీ సీరియల్స్ నన్ను ఆకర్షించలేదు. నాకు నేనుగా సమయాన్ని ఇలా ఆనందంగా, ఉపయుక్తంగా మలుచుకున్నాను'' అన్నారు శకుంతలాదేవి.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

కళ

ఆర్ట్, ఫ్యాషన్‌ను కలిపి తనదైన కళను ఆవిష్కరించింది ఢిల్లీకి చెందిన పాయల్ జైన్.

ఫ్యాషన్ రంగంలో పేరుగాంచిన పాయల్ జైన్ మంచి ఆర్టిస్ట్ కూడా.

ఆమె తాజా ఎగ్జిబిషన్....సోల్ ఆఫ్ ఏ ఉమెన్.

ఎగ్జిబిషన్‌లో కనిపించే 30 పీస్‌లలో ప్రతి దాంట్లో ఒక ప్రత్యేకత కనిపిస్తుంది. చరిత్ర నుంచి కవిత్వం వరకు ఏదో ఒక అంశ ధ్వనిస్తుంది.

'ఆర్ట్‌లో సైన్స్ ఉంటుంది. సైన్స్‌లో ఆర్ట్ ఉంటుంది' అనే పాయల్ జైన్‌ను ఆర్ట్ సైంటిస్ట్‌గా పిలుచుకోవచ్చు.

ఫ్యాషన్ ఇండస్ట్రీలో తన మూడు దశాబ్దాల ప్రయాణానికి 'సోల్ ఆఫ్ ఏ ఉమెన్' ప్రతిబింబం అంటుంది పాయల్. ఈ ఎగ్జిబిషన్‌లోని ముప్పై పీస్‌లలో ప్రతి పీస్‌కు ఏదో ఒక ప్రత్యేకత ఉంది. మెక్సికన్ పెయింటర్ ఫ్రీదా ఖాలోను స్ఫూర్తిగా తీసుకొని 'ఫర్‌బిడెన్ లవ్' కలెక్షన్ రూపొందించింది. పాయల్ అభిమానించే ఖాలో పెయింటర్, మ్యాజికల్ సర్రియలిస్ట్, ఫెమినిస్ట్, రెవల్యూషనరీ.

పాయల్ ఆర్కిటెక్చర్ నుంచి ఫ్యాషన్ రంగంలోకి రావడానికి కారణం చిత్రకళ పట్ల తనకు ఉన్న అనురక్తి. స్కెచ్చింగ్ తనకు ఇష్టమైన పని. ఆమె తల్లి కూడా ఆర్టిస్టే. సితార్ అద్భుతంగా వాయించేది. తన కలల గురించి తల్లిదండ్రులకు చెప్పినప్పుడు ' ఏదో ఒక డిగ్రీ నీ చేతిలో కనిపించాలి. ఆ తరువాతే ఏదైనా' అన్నారు. అలా బీకామ్ పూర్తి చేసింది.

ఆర్ట్ సైంటిస్ట్

పాయల్ స్కెచ్చింగ్ నైపుణ్యాన్ని చూసి 'నువ్వు ఫ్యాషన్ ఇండస్ట్రీలో ప్రయత్నించవచ్చు' అని సలహా ఇచ్చారు సన్నిహితులు. మొదట ఫ్యాషన్ ఇండస్ట్రీకి సంబంధించి పుస్తకాలు, మ్యాగజైన్స్ విరివిగా చదివేది. అలా ఫ్యాషన్ కూడా తన ప్యాషన్‌గా మారింది. శాన్‌ఫ్రాన్సిస్కోలో ఫ్యాషన్ డిజైనింగ్ చేసింది.

'ఫ్యాషన్‌కు ఆర్ట్, సైన్స్ అనే రెండు కోణాలు ఉంటాయి. ఆర్ట్ అనేది సృజనాత్మకతకు సంబంధించిన కోణం, సైన్స్ అనేది సాంకేతిక నైపుణ్యానికి సంబంధించిన కోణం. ఫ్యాషన్ డిజైనింగ్ కోర్స్ నా దృష్టిని విశాలం చేసింది. ప్యాటర్న్‌మేకింగ్, డ్రాపింగ్, గ్రేడింగ్, ఇలస్ట్రేషన్, ఫ్యాషన్ మార్కెటింగ్...ఇలా ఎన్నో విషయాలను తెలుసుకున్నాను' అంటున్న పాయల్





సోల్ ఆఫ్ ఏ ఉమెన్

ఎన్నో కార్పొరేట్ హోటల్స్‌కు ఆకట్టుకునేలా 'హోటల్ యూనిఫామ్'ను డిజైన్ చేసి ఇచ్చింది.

'డిజైనర్స్ అంటే గొప్ప ఏమీ కాదు. గ్లోరిఫైడ్ టైలర్స్ మాత్రమే' అని చాలా మంది అనుకొని అపోహపడే కాలంలో డిజైనర్‌గా కెరీర్ ప్రారంభించింది పాయల్. ఆమె వెస్ట్రన్ క్లాతింగ్ మొదలుపెట్టినప్పుడు దానికి మార్కెట్ లేదు. అయితే ఆ తరువాత మాత్రం పరిస్థితిలో మార్పు వచ్చింది.

పాయల్ సక్సెస్ మంత్రా ఏమిటి?

ఆమె మాటల్లోనే చెప్పాలంటే...

'చేయాలి కాబట్టి చేస్తున్నాం అనే ధోరణిలో కాకుండా మనం చేస్తున్న పనిని మనసారా ప్రేమించాలి. నిద్ర, శ్వాస, కలలో మన లక్ష్యం కనిపించాలి. ఫెయిల్యూర్‌కు చోటివ్వకుండా సాంకేతిక జ్ఞానంపై గట్టి పట్టు సంపాదించాలి. ఎప్పటికప్పుడు మన ఆలోచనల్లో కొత్తదనం వచ్చేలా చూసుకోవాలి. ప్రశంసలు ఆస్వాదించడానికి మాత్రమే పరిమితమైపోకుండా అన్ని కోణాల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలి. మార్పులు చేర్పులు చేసుకోవాలి. సానుకూల శక్తి, సంకల్పబలం ఎప్పటికీ మనకు తోడుగా ఉండాలి'

కెరీర్ తొలి రోజుల్లో తాను ఎదుర్కొన్న ఆటుపోట్లను ఇప్పటికీ గుర్తు పెట్టుకుంటుంది పాయల్. చేదుజ్ఞాపకాలుగా కాదు...ఆ సమయంలోనూ తాను ఎంత ధైర్యంగా ఉందో మళ్లీ మళ్లీ గుర్తు తెచ్చుకోవడానికి.

'విజయం ధైర్యవంతులను వెదుక్కుంటూ వస్తుంది' అని చెప్పడానికి ఫ్యాషన్ ఇండస్ట్రీలో ఆమె తెచ్చుకున్న పేరే నిదర్శనం.

సినిమా

ప్రతి కణం కణం...



సల్మాన్ ఖాన్, కత్రినా కైఫ్

టైగర్, జోయాల ప్రేమ బలమైనది. ప్రేయసి మీద తనకున్న ప్రేమను వ్యక్తపరచడానికి 'మెరిసే నీ కనులే.. ముసిరే నీ కనులే..', 'ప్రతి కణం.. కణంలో...' అంటూ పాట అందుకున్నారు టైగర్. యశ్ రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్‌లో భాగంగా రూపొందిన 'టైగర్ జిందా హై'కి సీక్వెల్‌గా రూపొందిన 'టైగర్ 3'లోని పాట ఇది. టైగర్‌గా సల్మాన్ ఖాన్, జోయాగా కత్రినా కైఫ్ నటించగా మనీష్ శర్మ దర్శకత్వంలో ఆదిత్య చోప్రా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రంలోని రెండో పాట 'ప్రతి కణం కణం..'ను మంగళవారం రిలీజ్ చేశారు. ''ఈ పాట టైగర్, జోయాల అన్యోన్యతను ఆవిష్కరించే విధంగా ఉంటుంది. ఆ కెమిస్ట్రీని సిల్వర్ స్క్రీన్‌పై చూసి, అనుభూతి చెందాల్సిందే. అందుకే వీడియోను ముందుగా రిలీజ్ చేయలేదు'' అన్నారు ఆదిత్యా చోప్రా. ఈ చిత్రం ఈ నెల 12న రిలీజ్ కానుంది.

యాత్రలో జర్మనీ నటి సుజానే



'యాత్ర' ఫేమ్ మహి వి. రాఘవ్ దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం 'యాత్ర 2'. ఇందులో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి పాత్రలో మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాత్రలో హీరో జీవా నటిస్తున్నారు. త్రీ ఆటమ్ లీవ్స్, వీ సెల్యూలాయిడ్, శివ మేక నిర్మిస్తున్న 'యాత్ర 2' షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. కాగా ఈ సినిమాలో సోనియా గాంధీ పాత్రని జర్మనీ నటి సుజానే బెర్నెర్ట్ పోషిస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ మేరకు ఆమె పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మంగళవారం రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా మహి వి. రాఘవ్ మాట్లాడుతూ–''యాత్ర'కి కొనసాగింపుగా 'యాత్ర 2' రూపొందుతోంది. వైఎస్ జగన్‌గారు ప్రజా నాయకుడిగా ఎదిగిన తీరుని, 2009 నుంచి 2019 వరకు ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన రాజకీయ ఘటనలను ఈ చిత్రంలో చూపిస్తున్నాం. 'యాత్ర 2'ని 2024 ఫిబ్రవరి 8న రిలీజ్ చేస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: మధి, సంగీతం: సంతోష్ నారాయణన్.


నా తలరాతే రంగుల రంగోలి...



మహేశ్‌బాబు

మహేశ్‌బాబు అభిమానుల్లో దీపావళి పండగ సంబరం ఆరంభమైంది. జోష్‌గా పండగ చేసుకునేలా మహేశ్‌బాబు హీరోగా రూపొందుతున్న తాజా చిత్రం 'గుంటూరు కారం' నుంచి 'దమ్ మసాలా...' పూర్తి పాటను విడుదల చేశారు. ఈ చిత్రదర్శకుడు త్రివిక్రమ్ పుట్టినరోజు (నవంబర్ 7) సందర్భంగా మంగళవారం ఈ పాటను రిలీజ్ చేశారు. చిత్ర సంగీతదర్శకుడు తమన్ స్వరపరచిన ఈ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించగా సంజిత్ హెగ్డే, జ్యోతి నూరన్ ఆలపించారు. ''నా తలరాతే రంగుల రంగోలి.. దిగులైనా చేస్తా దీవాలి.. నా నవ్వుల కోటని నేనే ఎందుకు పడగొట్టాలి', 'నేనో నిశ్శబ్దం.. అనునిత్యం నాతో నాకే యుద్ధం' అంటూ సాగే ఈ పాట హీరో పాత్ర తీరుని తెలియజేసే విధంగా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది. మహేశ్ సరసన శ్రీలీల కథానాయికగా, మీనాక్షీ చౌదరి, జగపతిబాబు, జయరామ్, ప్రకాశ్‌రాజ్, రమ్యకృష్ణ తదితరులతో ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే సంక్రాంతికి విడుదల కానుంది.

దీపావళి మనసుని హత్తుకుంటుంది – 'స్రవంతి' రవికిశోర్



''ఇప్పుడు ప్రేక్షకులు పెద్ద చిత్రాలతో పాటు చిన్న సినిమాలు కూడా చూస్తున్నారు. మా 'దీపావళి' చిన్నదైనా అందమైన సినిమా. ఇందులోని భావోద్వేగాలు ప్రేక్షకుల మనసులను హత్తుకుంటాయి'' అని నిర్మాత 'స్రవంతి' రవికిశోర్ అన్నారు. పూ రాము, కాళీ వెంకట్ ప్రధాన పాత్రల్లో ఆర్ఏ వెంకట్ దర్శకత్వం వహించిన తమిళ చిత్రం 'కీడా' (తెలుగులో 'దీపావళి'). కృష్ణ చైతన్య సమర్పణలో 'స్రవంతి' రవికిశోర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న తెలుగు, తమిళ భాషల్లో విడుదలవుతోంది. ఈ సందర్భంగా 'స్రవంతి' రవికిశోర్ మాట్లాడుతూ– ''నిర్మాతగా 38 ఏళ్ల జర్నీలో దాదాపుగా నేను చేసిన సినిమాలన్నీ సంతృప్తినిచ్చాయి. నేను డబ్బుల గురించి ఆలోచించను. ప్రేక్షకులకు సినిమా కనెక్ట్ అవుతుందా? లేదా అని మాత్రమే ఆలోచిస్తా. కథ పూర్తయ్యాకే సినిమాని సెట్స్ మీదకు తీసుకెళతాను. ఓ సినిమా పూర్తయ్యాకే మరొకటి చేస్తాను. నేను తక్కువ సినిమాలు చేయడానికి కారణం అదే. 'దీపావళి' కథని ప్రాణం పెట్టి రాశాడు వెంకట్. చెప్పిన కథను చెప్పినట్లు స్క్రీన్ మీదకు తీసుకొచ్చాడు. మా సినిమా ఇండియన్ పనోరమాకి ఎంపికవడం గొప్ప అనుభూతి. చెన్నై ఫిల్మ్ ఫెస్టివల్‌లోనూ ప్రదర్శించడం సంతోషంగా ఉంది. ఇక రామ్ హీరోగా ఓ సినిమా చేసేందుకు స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది. అలాగే రామ్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ సినిమా చేయాలని ఉంది. ఇందుకు సరైన కథ కుదరాలి'' అన్నారు.

జపాన్‌లో నటిగా కనిపిస్తాను



అనూ ఇమ్మాన్యుయేల్

''జపాన్' వైవిధ్యమైన చిత్రం. చాలా క్రేజీగా ఉంటుంది. ఈ దీపావళికి పర్ఫెక్ట్ ఫిల్మ్ ఇది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుంది. తప్పకుండా అందరూ థియేటర్స్‌లోనే చూడాలి'' అని హీరోయిన్ అనూ ఇమ్మాన్యుయేల్ అన్నారు. కార్తీ, అనూ ఇమ్మాన్యుయేల్ జంటగా రాజు మురుగన్ దర్శకత్వం వహించిన చిత్రం 'జపాన్'. ఎస్ఆర్ ప్రకాశ్‌బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మించిన ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో ఈ నెల 10న రిలీజవుతోంది. తెలుగులో అన్నపూర్ణ స్టూడియోస్ రిలీజ్ చేస్తోంది. ఈ సందర్భంగా అనూ ఇమ్మాన్యుయేల్ మాట్లాడుతూ– ''రాజు మురుగన్‌గారి సినిమాలు వైవిధ్యంగా ఉంటాయి. అలాగే 'జపాన్' కూడా. ఈ చిత్రంలో ఓ నటిగా కనిపిస్తా. నా పాత్ర జపాన్ (కార్తీ) లైఫ్‌లో కీలకంగా ఉంటుంది. ఇక ఫలానా పాత్ర చేయాలనే కలలు నాకు లేవు. ప్రేక్షకులు ఇష్టపడే పాత్రలు చేయాలని ఉంది'' అన్నారు.

వారి మాటలే నాలో స్ఫూర్తి నింపాయి – సురేష్ కొండేటి



''సంతోషం' సినీ వారపత్రిక ప్రారంభోత్సవం సందర్భంగా 'ఫిల్మ్ ఫేర్' అవార్డుల్లాగా సంతోషం అవార్డులు ఇస్తే బాగుంటుందని నాగార్జునగారు అన్నారు. దీంతో 'సంతోషం సౌత్ ఇండియన్ ఫిల్మ్ అవార్డ్స్'ని ప్రతి ఏటా ఇస్తున్నాను. అలాగే నన్ను నిర్మాతగా చూడాలని చిరంజీవిగారు అనడంతో నిర్మాత అయ్యాను. వారిద్దరి మాటలు నాలో స్ఫూర్తి నింపడంతో ఇప్పుడు ఈ స్థాయిలో ఉన్నాను'' అని నిర్మాత, 'సంతోషం' సినీ వార పత్రిక అధినేత సురేష్ కొండేటి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ– ''ఈ నెల 18న హైదరాబాద్‌లో 'సంతోషం ఓటీటీ అవార్డ్స్'ని ఇస్తున్నాం. డిసెంబరు 2న గోవాలో 'సంతోషం సౌత్ ఇండియన్ ఫిల్మ్ అవార్డ్స్' వేడుకను ఘనంగా నిర్వహించనున్నాం. ఈ వేడుకకు తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ చిత్ర పరిశ్రమకు చెందిన నటీనటులు, సాంకేతిక నిపుణులు హాజరవుతారు. సంతోషం అవార్డ్స్‌ని 25ఏళ్ల పాటు కొనసాగించాలనుకున్నాను. ఇప్పటికి 22 ఏళ్లయింది. ఇంకో మూడేళ్లు కచ్చితంగా అవార్డ్స్ ఫంక్షన్ నిర్వహిస్తాను. మరోవైపు సినిమాలు నిర్మిస్తున్నాను. నటుడిగా ఐదారు సినిమాల్లో కీ రోల్స్ చేస్తున్నాను'' అన్నారు.

లవ్.. థ్రిల్...



హృతిక్ శౌర్య

హృతిక్ శౌర్య హీరోగా వరలక్ష్మీ శరత్‌కుమార్ కీలక పాత్రలో రూపొందుతోన్న చిత్రం 'అశ్వత్థామ'. 'హతః అశ్వత్థామ' అనేది ఉపశీర్షిక. చంద్రశేఖర్ ఆజాద్ పాటిబండ్ల దర్శకత్వంలో ఈ చిత్రాన్ని ఫ్లిక్‌నైన్ స్టూడియో సంస్థ నిర్మిస్తోంది. హృతిక్ శౌర్య బర్త్‌డే సందర్భంగా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. చంద్రశేఖర్ ఆజాద్ మాట్లాడుతూ – ''ఓ టు'తో హృతిక్ హీరోగా కెరీర్ ప్రారంభించారు. అందులో సాఫ్ట్ కుర్రాడిగా కనిపించిన ఆయన 'అశ్వత్థామ'లో కమర్షియల్ హీరోగా కనిపించనున్నారు. ఈ సినిమా కోసం హృతిక్ చేసిన యాక్షన్ సీన్స్ అద్భుతంగా ఉంటాయి. రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే లవ్, క్రైమ్ థ్రిల్లర్ మూవీ ఇది'' అని అన్నారు.

పాటల్లో నవరసాలుంటాయి – సుభాష్ ఆనంద్



''అలా నిన్ను చేరి' సినిమాలోని ప్రతీ పాట అద్భుతంగా ఉంటుంది. ఒక్కో పాటను ఒక్కో శైలిలో కంపోజ్ చేసే చాన్స్ నాకు దొరికింది. నవరసాలను చూపించేలా ఇందులోని పాటలుంటాయి'' అని సంగీత దర్శకుడు సుభాష్ ఆనంద్ అన్నారు. దినేష్ తేజ్, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'అలా నిన్ను చేరి'. మారేష్ శివన్ దర్శకత్వం వహించారు. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న రిలీజవుతోంది. ఈ సందర్భంగా చిత్ర సంగీత దర్శకుడు సుభాష్ ఆనంద్ మాట్లాడుతూ– ''ఫీల్ గుడ్ లవ్ స్టోరీ చిత్రమిది. ప్రేమ కథా చిత్రాలకు సంగీతమే ప్రాణం. నేను చాలా సినిమాలకు సంగీతం అందించాను. అయితే 'అలా నిన్ను చేరి' నా కెరీర్‌కి గుడ్ టర్న్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు.

ఆరుగురి కథ



'టెనెంట్'లో ఓ దృశ్యం

'సత్యం' రాజేశ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'టెనెంట్'. ఇందులో మేఘా చౌదరి హీరోయిన్. వై. యుగంధర్ దర్శకత్వంలో మోగుళ్ళ చంద్రశేఖర్‌రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సినిమా క్యారెక్టర్ ఇంట్రడక్షన్ గ్లింప్స్ వీడియోను విడుదల చేశారు. ఈ సందర్భంగా వై. యుగంధర్ మాట్లాడుతూ– ''జీవితం ఆడే వైకుంఠపాళిలో ఎంచుకున్న పాచికల్లాంటి ఆరు ముఖ్య పాత్రల మధ్య జరిగే కథే ఈ చిత్రం. ప్రస్తుత అర్బన్ లైఫ్ జీవన శైలిలో మహిళలు ఎంత అప్రమత్తంగా ఉండాలో చెబుతూ తయారు చేసిన ఈ కథ, కథనం ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సాహిత్య సాగర్, కెమెరా: జెమిన్ జోం అయ్యనీత్, సహనిర్మాత: ఎస్. రవీందర్ రెడ్డి.



'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 228

బుధవారం 8-11-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



వుయ్‌వర్క్ దివాలా!

వ్యాపార పునర్వ్యవస్థీకరణపై దృష్టి.. లీజుల క్రమబద్ధీకరణకు కసరత్తు

-14లో

ఆపన్నులకు అండ..

పేదలకు లీగల్ సర్వీసెస్ అథారిటీ భరోసా

- 5లో

మంగళవారం పెద్దపల్లిలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్



ప్రజలే బాస్‌లు

మంథని, పెద్దపల్లి, మందమర్రి ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్

- మన పార్టీ హైకమాండ్ ఢిల్లీలో ఉండదు
- ప్రతిపక్షాలకు అక్కడ స్విచ్ వేస్తేనే ఇక్కడ లైట్లు వెలుగుతాయి
- గత పదేళ్లుగా రాష్ట్రం ప్రశాంతంగా ఉంది
- దేశంలో ఓ పాలిసీక దళితబంధు పథకం
- రైతుబంధు పదాన్ని పుట్టించిందే బీఆర్ఎస్ ప్రభుత్వమన్న సీఎం
- అన్నీ ఆలోచించి, పార్టీని, అభ్యర్థిని చూసి ఓటెయ్యాలని విజ్ఞప్తి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/ సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: బీఆర్ఎస్ పార్టీకి హైకమాండ్ ఢిల్లీలో ఉండదని, మన బాసులు తెలంగాణ ప్రజలేనని బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు స్పష్టం చేశారు. టికెట్ల కోసం ఆఫీసులు తగులబెట్టుకునే పరిస్థితి మన దగ్గర లేదని చెప్పారు. మన నిర్ణయాలు ఇక్కడే జరుగుతాయని అన్నారు. ఇతర పార్టీలకు ఢిల్లీలో స్విచ్ వేస్తేనే ఇక్కడ లైట్లు వెలుగుతాయని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీలో డజను మంది సీఎం అభ్యర్థులున్నారని

మిగతా 2వ పేజీలో ▶

ఉచిత విద్యుత్ పేటెంట్ కాంగ్రెస్‌దే..

- 2004లోనే వైఎస్సార్ సంతకం చేసి అమల్లోకి తెచ్చారు
- రైతు బాగు కోసం ఆలోచించేది మా పార్టీయే: రేవంత్‌రెడ్డి
- కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ అవాస్తవ ప్రచారాలు చేస్తోంది
- 3, 5 గంటల కరెంట్ చాలని ఎక్కడ అన్నానో నిరూపించండి
- అసలు రాష్ట్రంలో 24 గంటలు ఎక్కడ వస్తోందో చూపించండి
- ఇవి నిరూపిస్తే ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకుంటానని సవాల్
- అలంపూర్, గద్వాల, మక్తల్ ప్రజాగర్జన సభల్లో ప్రసంగం



సభలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: రైతులు బాగు పడాలని ఉచిత కరెంట్ ఆలోచన చేసినదే కాంగ్రెస్ పార్టీ అని, అసలు ఉచిత విద్యుత్ గురించి చెప్పుకొనే పేటెంట్ హక్కు తమ పార్టీకే ఉందని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. 2004లో ముఖ్యమంత్రి పదవీ బాధ్యతలు స్వీకరించినప్పుడు వైఎస్ రాజశేఖరరెడ్డి వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌పైనే తొలి సంతకం చేశారని, రూ.1,200 కోట్ల విద్యుత్ బకాయిలను రద్దు చేసి, రైతులపై ఉన్న అక్రమ కేసులను సైతం తొలగించారని గుర్తు చేశారు. అలాంటి కాంగ్రెస్‌పై బీఆర్ఎస్, ఆ పార్టీ నేతలు అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తాను రైతులకు 24 గంటల కరెంట్ వద్దు.. 3, 5 గంటలు చాలని అన్నట్టు దుష్ప్రచారం చేస్తున్నారని.. తాను అలా ఎక్కడ అన్నానో నిరూపించాలని సవాల్ విసిరారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని అలంపూర్, గద్వాల, మక్తల్ నియోజకవర్గాల పరిధిలో మంగళవారం నిర్వహించిన ప్రజాగర్జన సభల్లో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే.. ''అలంపూర్ సాక్షిగా చెబుతున్నా.. ఏదైనా ఒక సబ్‌స్టేషన్‌కు వెళ్లి పరిశీలిద్దాం. రైతులకు

మిగతా 13వ పేజీలో ▶

జంగ్ తెలంగాణ

'సుత్తి' దెబ్బ ఎవరికి?

ఇది ఏ పార్టీకి లాభం అనే అంశంపై చర్చ

కాంగ్రెస్‌తో కొలిక్కిరాని పొత్తు

19 నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించిన సీపీఎం

ఎన్నికలకు కళ..

సంప్రదాయ కళలకు ఇప్పటికీ తగ్గని ఆదరణ


రాజకీయ ప్రచారంలో ఆకట్టుకునేలా నృత్యాలు, కళారూపాలు

ఎన్నికల సీజన్‌లో కళాకారులకు డిమాండ్

- వివరాలు 7,8లో

న్యూస్‌రీల్

కేసీఆర్‌ను ఓడించేందుకు దండుగా నేతలు



'తెలంగాణకు ఉన్న ఒకే ఒక్క గొంతు కేసీఆర్. ఆయన గొంతు నులిమి ఓడించడా నికి చాలా మంది నాయకులు వస్తున్నరు. అయినా మేము భయపడం. మేము తెలంగాణ ప్రజలనే నమ్ముకున్నం' అని కేటీఆర్ అన్నారు.

- వివరాలు 2లో

చెత్త కుప్పలో 30 లక్షల డాలర్లు



రోడ్డు పక్కన చిత్తు కాగితాలు ఏరుకునే వ్యక్తికి ఒక బ్యాగు దొరికింది. అందులో 30 లక్షల అమెరికన్ డాలర్ల కట్టలున్నాయి. భారతీయ కరెన్సీలోకి మారిస్తే వాటి విలువ సుమారు రూ.25 కోట్లు ఉంటుంది.

- వివరాలు 12లో

బరిలోకి బీఆర్ఎస్ ఫుల్ టీమ్

- అభ్యర్థులందరికీ బీ ఫారాల పంపిణీ పూర్తిచేసిన అధికార పార్టీ
- మంగళవారం తొమ్మిది మందికి అందజేసిన కేటీఆర్
- గోషామహల్ నుంచి నందకిషోర్, నాంపల్లి నుంచి ఆనంద్..
- అలంపూర్ అభ్యర్థి మార్పు.. ఎమ్మెల్సీ చల్లా అనుచరుడు విజయుడుకు టికెట్



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఫుల్‌టీమ్ రంగంలోకి దిగింది. పార్టీ అభ్యర్థులంతా ఖరారవడంతోపాటు బీఫారాల పంపిణీ మంగళవారం పూర్తయింది. పెండింగ్‌లో ఉన్న గోషామహల్ నుంచి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నంద కిషోర్ వ్యాస్ బిలాల్, నాంపల్లి నుంచి సీహెచ్ ఆనంద్‌కుమార్‌గౌడ్‌లకు టికెట్లు ఖరారయ్యాయి. ఇక అలంపూర్ (ఎస్సీ) అభ్యర్థిగా గతంలో ప్రకటించిన సిట్టింగ్ ఎమ్మెల్యే అబ్రహంను మారుస్తూ.. ఆయన స్థానంలో కొత్తగా కోడెదూడ విజయుడును ఎంపిక చేశారు. హైదరాబాద్ పాతబస్తీ ప్రాంతంలోని ఎనిమిది స్థానాల అభ్యర్థులకు, విజయుడుకు మంగళవారం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు పార్టీ బీఫారాలను అందజేశారు. దీంతో రాష్ట్రంలోని మొత్తం 119 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థుల ప్రకటన, బీఫారాల జారీ పూర్తయిందని నేతలు ప్రకటించారు.

చల్లా అనుచరుడికి చాన్స్..

సిట్టింగ్ ఎమ్మెల్యే అబ్రహం తొలి జాబితాలోనే అలంపూర్ బీఆర్ఎస్ టికెట్ దక్కించుకున్నా.. స్థానిక నేతల్లో ఆయనపై వ్యతిరేకత వ్యక్తమైంది. దానికితోడు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రాంరెడ్డితో ఉన్న విభేదాలు కూడా ప్రభావం చూపాయి. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న తన అనుచరుడు 'విజయుడు'కు టికెట్ కోసం ఒత్తిడి చేసిన ఎమ్మెల్సీ చల్లా చివరికి తన పంతం నెగ్గించుకున్నారు. ఎమ్మెల్సీ చల్లా మంగళవారం

మిగతా 2వ పేజీలో ▶

కొడంగల్‌లో 'బంటు' సిద్దిపేటలో శ్రీకాంత్‌రెడ్డి

- 12 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన అధిష్టానం
- వేములవాడ నుంచి తుల ఉమ, మునుగోడు నుంచి చల్లమల్ల
- జనసేనతో పొత్తు స్పష్టత వచ్చాక మలి జాబితా



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నాలుగో జాబితాను బీజేపీ అధిష్టానం మంగళవారం విడుదల చేసింది. కసరత్తు పూర్తి చేసిన తర్వాత 12 మంది అభ్యర్థులను బీజేపీ సీఈసీ ఖరారు చేసింది. ఈ మేరకు పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి అరుణ్‌సింగ్ ప్రకటన జారీ చేశారు. బీజేపీ ఇప్పటివరకు నాలుగు జాబితాల్లో కలిపి 100 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. మిగిలిన 19 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. జనసేన పార్టీతో పొత్తు, సీట్ల అంశంపై జరుగుతున్న చర్చల్లో స్పష్టత వచ్చాక మిగిలిన అభ్యర్థులను ప్రకటించనుంది. ఇటీవల కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన వి.సుభాష్‌రెడ్డికి ఎల్లారెడ్డి స్థానాన్ని, చల్లమల్ల కృష్ణారెడ్డికి మునుగోడు, తుల ఉమకు వేములవాడ, బొమ్మ శ్రీరామ్‌చక్రవర్తికి హుస్నాబాద్ స్థానాన్ని కేటాయించింది.

బీజేపీ అభ్యర్థుల నాలుగో జాబితా..

చెన్నూరు(ఎస్సీ) - దుర్గం అశోక్, ఎల్లారెడ్డి- వి.సుభాష్‌రెడ్డి, వేములవాడ- తుల ఉమ, హుస్నాబాద్-బొమ్మ శ్రీరామ్‌చక్రవర్తి, సిద్దిపేట- దూది శ్రీకాంత్ రెడ్డి, వికారాబాద్ (ఎస్సీ) - పెద్దింటి నవీన్‌కుమార్, కొడంగల్- బంటు రమేశ్‌కుమార్, గద్వాల్- బోయ శివ, మిర్యాలగూడ- సాదినేని శివ, మునుగోడు- చల్లమల్ల కృష్ణారెడ్డి, నకిరేకల్ (ఎస్సీ)- నకిరకంటి మొగులయ్య, ములుగు(ఎస్టీ)- అజ్మీరా ప్రహ్లాద్ నాయక్.

బీఆర్ఎస్ అవినీతికి పాతరేద్దాం

- గజ్వేల్ నుంచే మార్పు మొదలవ్వాలి: కిషన్‌రెడ్డి
- గజ్వేల్‌లో బీజేపీ అభ్యర్థి ఈటల నామినేషన్



గజ్వేల్ రోడ్‌షోలో ప్రసంగిస్తున్న కిషన్‌రెడ్డి. చిత్రంలో ఈటల

గజ్వేల్: రజాకార్లకు సీఎం కేసీఆర్ వారసుడని, బీఆర్ఎస్ అవినీతి పాలనకు గజ్వేల్ నుంచే పాతరేయాలని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని కోటమైసమ్మ ఆలయం వద్ద నుంచి ఇందిరాపార్కు మీదుగా ఐఓసీ (ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్) వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఇందిరాపార్కు వద్ద నిర్వహించిన రోడ్ షోలో కిషన్‌రెడ్డి ప్రసంగించారు. తెలంగాణ కోసం ఆత్మ బలిదానాలు చేసుకున్న అమరుల ఆత్మకు శాంతి చేకూరాలంటే బీఆర్ఎస్ పాలనకు చరమగీతం పాడాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుల నుంచి నేరుగా సీఎం ఫామ్‌హౌస్‌కే నీరు వస్తుండగా ప్రజలకు మాత్రం చుక్క నీరందడం లేదన్నారు. నియోజకవర్గంలోని 30వేల కుటుంబాలకు చెందిన భూములను లాక్కొని, ఆ కుటుంబాలను కేసీఆర్ రోడ్డున పడేశారని ఆరోపించారు. గజ్వేల్‌లో డబుల్ బెడ్రూమ్ ఇండ్లు ఇవ్వకపోగా, ఉన్న ఇండ్లను కూలగొట్టారని మండిపడ్డారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు వదిలిన బాణమే ఈటల

ఈ ఎన్నికల్లో గజ్వేల్లోనే కాదు కామారెడ్డిలోనూ కేసీఆర్‌కు ఓటమి తప్పదని కిషన్‌రెడ్డి జోస్యం చెప్పారు. తెలంగాణలో ప్రజాస్వామ్య పరిరక్షణకు వదిలిన బాణమే ఈటల రాజేందర్ అని వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే బీసీ నేత ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని స్పష్టం చేశారు. బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ మాట్లాడుతూ గజ్వేల్‌కు కేసీఆర్ పరాయి వ్యక్తి అని, తాను కాదని చెప్పారు. తానూ 1992 నుంచి ఇక్కడ పార్టీ పరిశ్రమ నడపానని, అప్పటినుంచి తనకు ఈ ప్రాంతంతో అవినాభావ సంబంధం ఉందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలు కేసీఆర్ అహంకారానికి, ప్రజల ఆత్మగౌరవానికి మధ్య యుద్ధంగా ఈటల అభివర్ణించారు.



అమరుల కుటుంబాలకు ఎందుకు ఉద్యోగాలు ఇవ్వలేదు..?

సీఎంను ప్రశ్నించిన కోమటిరెడ్డి

- తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీని బలిదేవత అంటున్నారు
- బంగారు తెలంగాణ కాదు.. బాధల తెలంగాణ చేశారు
- డిసెంబరు 3న కేసీఆర్ రాజీనామా.. 9న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రమాణ స్వీకారం
- ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తాం: కోమటిరెడ్డి

- వివరాలు 13లో



కాంగ్రెస్‌కు అసంతృప్తుల కాక

- టికెట్లు దక్కకపోవడంతో ఆశావహులు, వారి అనుచరుల నిరసనలు
- గాంధీభవన్, రేవంత్ నివాసం వద్ద ఆందోళనలు.. టికెట్లు అమ్ముకున్నారంటూ ఆరోపణలు
- ఉద్రిక్తతల నేపథ్యంలో పోలీసు బందోబస్తు

13లో

మంగళవారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ నేతల నిరసన



గాజాలో ఆగని వేట

➤ ఇజ్రాయెల్–హమాస్ మిలిటెంట్ల మధ్య యుద్ధం మంగళవారం నెల రోజులకు చేరుకుంది. సోమవారం రాత్రి నుంచి ఇజ్రాయెల్ సైన్యం దక్షిణ గాజాపై వైమానిక దాడులు నిర్వహించింది. ఖాన్ యూనిస్, రఫా, డెయిర్ అల్-బలా నగరాల్లో పదుల సంఖ్యలో జనం ప్రాణాలు కోల్పోయారు. ఉత్తర గాజాలోని గాజీ సిటీలోకి ఇజ్రాయెల్ సేనలు అడుగుపెట్టినట్లు తెలిసింది. యుద్ధంలో ఇప్పటిదాకా గాజాలో 4,100 మంది చిన్నారులు సహా 10,328 మంది, ఇజ్రాయెల్‌లో 1,400 మందికిపైగా జనం మరణించారు.

- వివరాలు 6లో

జడ్జీలను 'ఎంచు'కుంటోంది

వారి పేర్లనే ఆమోదిస్తోంది.. కేంద్రంపై సుప్రీం మండిపాటు తామే నిర్ణయం తీసుకునేలా చేయొద్దని హితవు



➤ ఉన్నత న్యాయస్థానాల్లో ఖాళీల భర్తీకి కొలీజియం సిఫార్సు చేసిన జాబితా నుంచి కొంతమందిని మాత్రమే న్యాయమూర్తులుగా కేంద్రం ఎంపిక చేసుకుంటోందని సుప్రీంకోర్టు ఆరోపించింది. కొలీజియం సిఫారసులన్నింటినీ పరిగణనలోకి తీసుకోవడం లేదని ఆక్షేపించింది. ఈ విషయంలో కేంద్రం వ్యవహార శైలి చాలా ఇబ్బందికరంగా ఉందంటూ తీవ్ర అసహనం వెలిబుచ్చింది.

- వివరాలు 6లో

గహ్లోత్‌కు సొంతింట సమస్యలు

సొంత నియోజకవర్గం సర్దార్‌పురలో జనం కినుక.. దశాబ్దాలైనా సమస్యలకు మోక్షం లేదని విమర్శలు

రాష్ట్రంలో శాంతి భద్రత, సంక్షేమం మాయం

మేజీషియన్‌కు మాత్రమే ఇది సాధ్యం సీఎం గెహ్లోత్‌పై అమిత్ షా ఆరోపణలు..

- వివరాలు 8లో

స్ట్రాంగ్ రూమ్స్‌లో వేరే ఈవీఎంలు ఉండరాదు

కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక పరిశీలకుడు అజయ్ ఆదేశం



సాక్షి, హైదరాబాద్: శాసనసభ ఎన్నికల పోలింగ్‌లో వినియోగించే ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్స్‌లో ఇతర ఈవీఎంలను నిల్వ చేయరాదని కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక పరిశీలకుడు అజయ్ వి.నాయక్ ఆదేశించారు. మంగళవారం రెండో రోజు ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) కార్యాలయ అధికారులకు అవగాహన కల్పించారు. కొత్త ఓటర్ల గుర్తింపు కార్డుల ముద్రణను ఈనెల 20లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి ఎన్నికల సిబ్బందికి చివరి నిమిషం వరకు శిక్షణ ఇస్తూనే ఉండాలని మరో ప్రత్యేక పరిశీలకుడు (పోలీస్) దీపక్ మిశ్రాకు సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల విధులతో సంబంధంలేని వ్యక్తులను అనుమతించరాదని స్పష్టం చేశారు. పోస్టల్ ఓటర్ల తుది జాబితాను అభ్యర్థులు, రాజకీయ పార్టీలకు ఇచ్చి, వారి నుంచి రశీదును తీసుకోవాలన్నారు. దీంతో వివాదాలు నివారించవచ్చని పేర్కొన్నారు. ఎన్నికల వ్యయాల నిర్వహణ తీరును వ్యయ ప్రత్యేక పరిశీలకుడు ఆర్.బాలకృష్ణన్ వివరించారు. షాడో రిజిస్టర్లను తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. అనుమతుల కోసం అభ్యర్థులు, రాజకీయ పార్టీలు చేసే అభ్యర్థనలను కేవలం సాంకేతిక కారణాలతో తిరస్కరించవద్దని సీఈఓ వికాస్ రాజ్ సూచించారు. ఎన్నికల నిబంధనల మేరకు అభ్యర్థులకు వెసులుబాటు ఉండేట్లు చూడాలన్నారు. దాఖలైన అఫిడవిట్లను వెంటనే పరిశీలించి అప్‌లోడ్ చేయాలని రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు సీఈఓ లోకేశ్‌కుమార్, జాయింట్ సీఈఓ సర్ఫరాజ్ అహ్మద్, డిప్యూటీ సీఈఓ సత్యవాణి, డీజీపీ అంజనీకుమార్ పాల్గొన్నారు.

తెలంగాణ నుంచి వైఎస్ షర్మిలను బహిష్కరిస్తున్నాం

మూకుమ్మడిగా రాజీనామాలు చేసిన వైఎస్సార్‌టీపీ నేతలు




పార్టీకి రాజీనామా ప్రకటిస్తున్న నేతలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అంశంతో వైఎస్సార్‌టీపీ పేరుతో రాజకీయ పార్టీని పెట్టి కార్యకర్తలను నమ్మించి మోసం చేసిన ఆ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను తెలంగాణ నుంచి బహిష్కరిస్తున్నామని ఆ పార్టీ నేతలు ముక్తకంఠంతో పేర్కొన్నారు. అనంతరం షర్మిల గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గట్టు రామచంద్రరావు నేతృత్వంలో జరిగిన సమావేశంలో ఆయనతో పాటు సత్యవతి, సంజీవరావు, గణేశ్ నాయక్ తదితరులు ఆ పార్టీకి మూకుమ్మడిగా రాజీనామా చేశారు. దివంగత మహానేత వైఎస్సార్‌కు తెలంగాణలో ఉన్న మంచి పేరును ఆమె చెడగొట్టారని ఆరోపించారు. ఇన్ని రోజులు షర్మిలను సపోర్ట్ చేసినందుకు తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెబుతున్నామన్నారు. త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ చెబుతామని తెలిపారు. సత్యవతి మాట్లాడుతూ..రాబోయే ఎన్నికల్లో షర్మిల ఎక్కడ పోటీ చేసినా ఓడగొడతామని హెచ్చరించారు. తెలంగాణ సొమ్ము దోచుకోవడానికే ఆమె ఇక్కడకు వచ్చారని, ఇప్పుడు ఎన్నికల బరి నుంచి తప్పుకున్న ఆమెను భవిష్యత్తులో ఎక్కడ పోటీ చేసినా రాళ్లతో కొట్టి ఆంధ్రాకు పంపిస్తామని హెచ్చరించారు.

తెలంగాణ ప్రజల కోసం త్యాగం చేశా.. మోసం కాదు

నేతల రాజీనామాల నేపథ్యంలో వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రజల కోసం త్యాగం చేశాం తప్ప.. ఇది మోసం కాదని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. మోసం చేయడం వైఎస్సార్ బిడ్డ రక్తంలో లేదని, ఆ అవసరం కూడా లేదని స్పష్టంచేశారు. మంగళవారం పార్టీ నేతల మూకుమ్మడి రాజీనామాలపై ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఆమె స్పందిస్తూ.. తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం తమ పోరాటం ఆగదన్నారు. కేసీఆర్ తెలంగాణ ప్రజలను వాగ్దానాలతో మోసం చేస్తున్నారు కాబట్టే వైఎస్సార్ తెలంగాణ పార్టీ స్థాపించినట్లు చెప్పారు. కేసీఆర్ నియంత పాలనకు వ్యతిరేకంగా ఎన్నో నిరాహార దీక్షలు, ధర్నాలు చేశామని గుర్తుచేశారు. 'ఇప్పుడు కేసీఆర్‌ని గద్దె దించే అవకాశమొచ్చింది. అది మనకు కాకుండా మరో పార్టీకి ఆ అవకాశముంది. అలాంటప్పుడు మనం ఆ పార్టీని బలోపేతం చేద్దామా? లేదా మనం పోటీకి దిగి ఓట్లు చీల్చి మళ్లీ కేసీఆర్‌ను గద్దెనెక్కిద్దామా? ఇన్నాళ్లు నాతో కలిసి నడిచిన అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు ఆలోచించాలి. రేపు ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటా. రాజకీయాల్లో ఉన్నది పదవుల కోసం కాదు. ప్రజల పక్షాన నిలబడటం కోసమన్న విషయాన్ని గ్రహించి నాతో ఉన్నవాళ్లే నా వాళ్లు. తెలంగాణ ప్రజల శ్రేయస్సు కోరేవారు. మళ్లీ చెప్తున్నా.. నేను నిలబడతా.. మిమ్మల్ని నిలబెడతా' అని షర్మిల స్పష్టంచేశారు.



మంగళవారం మందమర్రిలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన ప్రజలు



మంథనిలో జరిగిన బహిరంగసభకు భారీగా తరలివచ్చిన జనం

ప్రజలే బాస్‌లు

▶ మొదటి పేజీ తరువాయి

విమర్శించారు. అధికారంలోకొస్తే ఏడాదిలో ఎంతమంది మారతారో కూడా తెలియదని వ్యాఖ్యానించారు. మంగళవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మంథని, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లా మందమర్రిలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో కేసీఆర్ మాట్లాడారు.

కాంగ్రెస్ ఏ ఎండకు ఆ గొడుగు పట్టే పార్టీ

'కర్ణాటకలో ఏం జరుగుతోందో చూస్తున్నాం. కాంగ్రెస్ పార్టీ ఒక నిశ్చితాభిప్రాయం లేకుండా, ఒక సిద్ధాంతం లేకుండా, రాష్ట్రానికో నీతి పెట్టింది. కాంగ్రెస్ జాతీయ పార్టీ కదా..? తెలంగాణలో ప్రకటించిన స్కీమ్స్ ఛత్తీస్‌గఢ్‌లో పెట్టారా? రాజస్తాన్‌లో ఎందుకు అమలు చేయడం లేదు? ఏ ఎండకు ఆ గొడుగు పట్టి ఎన్నికలు అయిపోగానే బయటపడటం కాంగ్రెస్ నైజం. ఇతర పార్టీ నేతలను పశువులను కొన్నట్టు కొంటోంది. నేను కరీంనగర్ ఎంపీగా పోటీ చేసిన ఎన్నికల్లో చొప్పదండి నియోజకవర్గంలో ఐదుగురు పార్టీ మండల అధ్యక్షులను కొనేశారు. అయితే ఆ ఊళ్లలో వారిని దంచింగ్రు. అక్కడ ఆ పార్టీలకు ఐదు ఓట్లు కూడా రాలేదు. ఇప్పుడు కూడా అదే జరుగుతుంది. కొంతమంది పిచ్చి నాయకులు గొర్రెల్లాగా పోవొచ్చు. నూరు కథల పద్దా.. ప్రజల మనసులో గ్యారెంటీగా బీఆర్‌ఎస్ సర్కార్ వస్తుందనే నమ్మకం ఉంది. అందులో అనుమాన పడాల్సిన అవసరం లేదు. గవర్నమెంట్ ఉన్న ఎమ్మెల్యేనే రావాలి. వేరే ఆయన వస్తే లాభమైతదా.? ప్రజలు ఆలోచన చేయాలి..' అని కేసీఆర్ కోరారు.

58 ఏళ్ల గోస పోసుకున్న కాంగ్రెస్

1956కు ముందు తెలంగాణ ఇండిపెండెంట్ స్టేట్‌గా ఉండేది. అయితే ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ తెలంగాణను ఆంధ్రాలో కలిపింది. సమైక్య రాష్ట్రంలో సాగు, తాగు నీళ్లు లేవు. కరెంట్ లేదు. ఉద్యమాలు, తుపాకీ మోతలు, ఎన్‌కౌంటర్లు, అమాయకులు చనిపోవడం, పోలీసులు చనిపోవడం.. రక్తపాతం.. దారుణమైన పరిస్థితి ఉండేది. ఆ దుస్థితి ఎవరి వల్ల వచ్చిందో తెలంగాణ సమాజం ఆలోచించాలి. ఇవాళ కాంగ్రెసోళ్లు తియ్యగా మాట్లాడితే సరిపోదు. 58 ఏండ్లు మా గోస పోసుకున్నది మీరు కాదా..? తెలంగాణ ఉద్యమ ఉప్పెనను చూసి తెలంగాణ ఇస్తామని 15 ఏళ్లు మోసం చేశారు. చివరకు గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రత్యేక రాష్ట్రం ఇచ్చారు. దేశంలోని 33 పార్టీల సపోర్టుతో తెలంగాణ వచ్చింది. గత పదేళ్లుగా రాష్ట్రం ప్రశాంతంగా ఉంది. అందరం కలిసిమెలిసి బతుకుతున్నాం. అదే కాంగ్రెస్ ఉన్నప్పుడు తెల్లారితే మతకల్లోలాలు, కర్ఫ్యూలు.. ఆ పంచాయితీలన్నీ ఎవరు పెట్టారో ప్రజలు ఆలోచించాలి..' అని సీఎం విజ్ఞప్తి చేశారు

బీసీ చైతన్యం చూపెట్టాలి

'బీసీ నాయకుడు బలంగా ఎదిగి పనిచేస్తుంటే అతన్ని ఎందుకు ఇబ్బంది పెట్టాలో ఆలోచించాలి. ఈసారి మంథని ఎన్నికల్లో బీసీ ఉద్యోగులు, విద్యార్థులు, రిటైర్డ్ ఉద్యోగులు మీ బీసీల చైతన్యం చూపెట్టి పుట్ట మధును గెలిపించాలి. మధును భారీ మెజార్టీతో గెలిపిస్తే రూ.1,000 కోట్ల ప్రత్యేక నిధులతో మంథని నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా. మంచిర్యాల జిల్లాలో ఇద్దరు ముగ్గురు మోపయ్యారు. ఒకాయన పేకాట క్లబ్‌లతో డబ్బులు సంపాదించాడు. సీసాలు పంచుతున్నడు. సూటుకేసులతో వచ్చే వారు కావాల్నా? బాల్క సుమన్ లాంటి వారు కావాల్నా? ఆలోచించుకోండి. ప్రజాస్వామ్యంలో ఏకైక వజ్రాయుధం ఓటు. ఆషామాషీగా, డబ్బులకో.. ఎవరో చెప్పారనో వేయొద్దు. మీరు వేసే ఓటు మీ తలరాతను, ఐదేళ్ల భవిష్యత్‌ను నిర్ణయిస్తుంది. పార్టీ నడవడిక, సరళి, అభ్యర్థిని చూసి ఓటెయ్యాలి. ఏ ప్రభుత్వం మనకు పని చేస్తదో ఆలోచించివేయాలి..' అని సీఎం కోరారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులు పుట్ట మధు, దాసరి మనోహర్‌రెడ్డి, కోరుకంటి చందర్, బాల్క సుమన్, ఎమ్మెల్యేలు దుర్గం చిన్నయ్య, దివాకర్‌రావు, ఎమ్మెల్సీలు రఘోత్తంరెడ్డి, మధుసూదనాచారి, ఎంపీ వెంకటేశ్ నేత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ సమక్షంలో కాంగ్రెస్ నాయకులు, మాజీ మంత్రి బోడ జనార్దన్, రాజారమేష్, దుర్గం నగేష్, బీజేపీ నాయకుడు పత్తి శీను బీఆర్‌ఎస్‌లో చేరారు.

తెలంగాణ వచ్చాక సింగరేణి లాభాల వాటా పెంచాం

'పార్లమెంట్ ఎన్నికల్లో అంబేడ్కర్‌ను ఓడగొట్టింది కాంగ్రెస్ పార్టీనే. అమ్మా, బొమ్మా పేరు చెప్పి దళితులను మోసం చేసింది. కానీ దేశంలో పొలికేక 'దళితబంధు'తో ఆ వర్గాలకు మేలు జరిగింది. మాజీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రైతుబంధు వేస్ట్ పథకమంటున్నారు. రైతుబంధు పదం పుట్టించిందే బీఆర్‌ఎస్ ప్రభుత్వం. ఈ పథకం ఉండాలా? వద్దా? 24 గంటలు విద్యుత్ వద్దు.. 3గంటలు చాలని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అంటున్నారు. ఉండాలా? వద్దా? 'ధరణి'ని బంగాళాఖాతంలో కలిపేస్తామంటున్నారు. తెలంగాణ కొంగు బంగారమైన సింగరేణిని కాంగ్రెస్ పార్టీయే ముంచింది. తెలంగాణ వచ్చాక లాభాలు పెంచాం. తెలంగాణ రాక ముందు రూ.419 కోట్ల లాభాలు ఉంటే, ఇప్పుడు రూ.2,184 కోట్లకు చేరుకున్నాయి. కార్మికులకు దసరా, దీపావళికి రూ.వెయ్యి కోట్లు ఇస్తున్నాం. సింగరేణి స్థలాల్లో పట్టాలు ఇచ్చాం. వారసత్వ ఉద్యోగాలు బీఆర్‌ఎస్ ప్రభుత్వమే పునరుద్ధరించింది. సింగరేణి కార్మికులకు గ్యాస్, నీరు, విద్యుత్ సౌకర్యాలపై వేసే పెర్క్ ట్యాక్స్‌ను కోల్ ఇండియాలో అమలు చేస్తున్న విధంగా యాజమాన్యమే చెల్లించేలా చూస్తాం. ఎమ్మెల్యే బాల్క సుమన్ వినతి మేరకు కాంట్రాక్టు కార్మికులకు ఈఎస్‌ఐ వర్తించేలా, మందమర్రి ఏజెన్సీలో ఎన్నికలు జరిగేలా చూస్తాం..' అని కేసీఆర్ హామీ ఇచ్చారు.



మంగళవారం పెద్దపల్లి బహిరంగసభలో ప్రజలకు అభివాదం చేస్తున్న కేసీఆర్

సీఎం హెలికాప్టర్ తనిఖీ

సాక్షి, పెద్దపల్లి: మంగళవారం పెద్దపల్లి ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన నేపథ్యంలో సీఎం కేసీఆర్ హెలికాప్టర్‌లో, కాన్వాయ్‌లో ఎన్నికల అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఎన్నికల నిబంధనలు అనుసరించి ముఖ్యమంత్రి వారికి సహకరించారు.

కేసీఆర్‌ను ఓడించేందుకు దండుగా నేతలు

ఎందరు వస్తున్నా మేం ఎవరికీ భయపడం

- సింహం సింగిల్‌గా వస్తుంది
- ఢిల్లీ దొరల నుంచి కేసీఆర్‌ను కాపాడే బాధ్యత ప్రజలదే
- చేరికల కార్యక్రమంలో మంత్రి కేటీఆర్



కేటీఆర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న విజయ్‌కుమార్ చిత్రంలో పొన్నాల లక్ష్మయ్య తదితరులు

సాక్షి, హైదరాబాద్: 'తెలంగాణకు ఉన్న ఒకే ఒక్క గొంతు కేసీఆర్. ఆయన గొంతు నులిమి ఓడించడానికి చాలా మంది నాయకులు వస్తున్నరు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, 15 రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, సామంతులు, మాజీ మంత్రులు దిగుతున్నరు. కాంగ్రెస్ నుంచి రాహుల్, ప్రియాంక, ఖర్గే, సిద్ధరామయ్య దండు కట్టి తెలంగాణకు క్యూ కడుతున్నరు. కేసీఆర్ బొండిగ పిసికేందుకు ఎంత మంది వస్తున్నా మేము భయపడం. మేము తెలంగాణ ప్రజలనే నమ్ముకున్నం. సింహం సింగిల్‌గా వస్తుంది. తెలంగాణ గొంతు కేసీఆర్‌ను ఖతం చేసేందుకు ఢిల్లీ దొరలు ఒక్కటై దాడి చేస్తే కాపాడుకొనే బాధ్యత తెలంగాణ ప్రజలపైనే ఉంది' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కె. తారక రామారావు అన్నారు. తెలంగాణ భవన్‌లో మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన విద్యార్థి నేత కురువ విజయ్‌కుమార్, పాలకుర్తి, ముధోల్ కాంగ్రెస్ నేతలు తిరుపతిరెడ్డి, కిరణ్ వాంగ్మోరేతోపాటు మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ఆధ్వర్యంలో హైదరాబాద్, జనగామ, పాలకుర్తికి చెందిన పలువురు నేతలు మంగళవారం కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ 'ఇక్కడ నాయకత్వం లేనట్లు చేతకాని, చేవచచ్చిన కాంగ్రెస్, బీజేపీ పక్క రాష్ట్రాల నుంచి నాయకులను తెచ్చుకుంటున్నాయి. తెలంగాణ గొంతు కేసీఆర్ ఉండగా మనకు ఇతరుల అవసరం ఏముంది? తెలంగాణ కథకు స్క్రీన్ ప్లే, దర్శకత్వం కేసీఆర్. మన సినిమా బ్లాక్ బస్టర్. కానీ కాంగ్రెస్, బీజేపీకి కన్నడ నిర్మాతలు, ఢిల్లీ దర్శకులు, గుజరాత్ నటులు అని వారి సినిమా డిజాస్టర్‌గా నిలుస్తుంది' అని కేటీఆర్ ఎద్దేవా చేశారు.

రేవంత్ రాష్ట్రాన్ని ప్లాట్లు చేసి అమ్మేస్తాడు

'ఐదేళ్ల క్రితం ఎమ్మెల్యేను కొనుగోలు చేస్తూ అడ్డంగా దొరికి జైలుకు వెళ్లిన రేవంత్‌రెడ్డి అధికారంలోకి వస్తే తెలంగాణ రాష్ట్రం మొత్తాన్ని ప్లాట్లు చేసి అమ్మేస్తాడు. తొమ్మిదిన్నరేళ్లుగా కేసీఆర్ తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా నడుపుతున్నారు. తెలంగాణలోని ప్రతి వర్గానికీ కేసీఆర్ మంచి చేశారు తప్ప నష్టం చేయలేదు. విద్యుత్, సాగునీరు, తాగునీరుతో అన్ని రంగాల్లో సమృద్ధిని సాధిస్తోంది. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అందని ఇల్లు లేదు. పాలమూరు ఎత్తిపోతల పథకం ద్వారా 14లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతుంది. పాలమూరులో నిండు చెరువులు, పచ్చని పైరులు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్‌కు 11 మార్లు తెలంగాణ ప్రజలు అధికారం, అవకాశం ఇచ్చినా సాగునీరు, తాగునీరు, కరెంటు ఇవ్వలేదు. కాంగ్రెస్ పాలనలో కరెంటు, ఎరువులు, విత్తనాల కోసం రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. మూడు కరెంటు చాలని రేవంత్, రైతుబంధు దుబారా అని ఉత్తమ్ కుమార్ రెడ్డి అంటున్నాడు. తెలంగాణలో మూడోసారి కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత మేనిఫెస్టోను పూర్తి స్థాయిలో అమలు చేస్తాం' అని కేటీఆర్ ప్రకటించారు. సమావేశంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, పొన్నాల లక్ష్మయ్య, ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, దాసోజు శ్రవణ్, గెల్లు శ్రీనివాస్ యాదవ్, రాకేశ్, ధర్మేందర్, తుంగబాలు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

పాపాల కాంగ్రెస్‌ను ప్రజలే శిక్షిస్తారు: కేటీఆర్

తెలంగాణలో కాంగ్రెస్ పాపాల శతకం, స్కాంగ్రెస్ పుస్తకాల ఆవిష్కరణ



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో దాసోజు శ్రవణ్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: పూర్వం కవులు శతకపద్యాలు రాసినట్లు, చిత్రగుప్తుడు మనుషుల పాపాల చిట్టా రాసినట్లు.. ఇప్పుడు కాంగ్రెస్ పాపాల గురించి శతకాలు, గ్రంథాలు రాయాల్సి వస్తోందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కె. తారక రామారావు ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ సోషల్ మీడియా విభాగం రూపొందించిన 'తెలంగాణలో కాంగ్రెస్ పాపాల శతకం', 'స్కాంగ్రెస్'పుస్తకాలను మంగళవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి, దేశానికి కాంగ్రెస్ తీరని అన్యాయం చేసిందని, ఎక్కువ కాలం పాలించి దోచుకోవడమే పనిగా పెట్టుకుందని ఆరోపించారు. ఆ పాపాల చిట్టాలను రాష్ట్ర ప్రజలకు, దేశ ప్రజలు తెలియజేయాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. కాంగ్రెస్ చేసిన పాపాలకు ప్రజలే శిక్ష విధిస్తారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ తెలంగాణ ప్రాంతానికి చేసిన ద్రోహం, అన్యాయాలను వివరిస్తూ 'తెలంగాణలో కాంగ్రెస్ పాపాల శతకం పుస్తకాన్ని రూపొందించినట్లు చెప్పారు. హైదరాబాద్ స్టేట్‌ను ఆంధ్రా ప్రాంతంతో కలపడం మొదలు.. తొలి, మలి దశ తెలంగాణ ఉద్యమాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలు బలిగొన్న యువకులు, ఉద్యమకారుల గురించి ఈ పుస్తకంలో వివరించామన్నారు. కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలో ఉన్న సమయంలో చేసిన ఏ నుంచి జెడ్ వరకు జరిగిన కుంభకోణాల గురించి 'స్కాంగ్రెస్'పుస్తకంలో పొందుపరిచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్లు వై.సతీశ్‌రెడ్డి, జగన్‌మోహన్ రావు, దినేశ్‌చౌదరి, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, సీనియర్ నాయకులు దాసోజు శ్రవణ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలను అపోహలుగా తోసిపుచ్చలేం

కృష్ణా ట్రిబ్యునల్ టీవోఆర్‌పై స్టే విధించాలన్న ఏపీ పిటిషన్ వాయిదా వేసిన సుప్రీంకోర్టు



సాక్షి, న్యూఢిల్లీ: అభ్యంతరాలను అపోహలుగా తోసిపుచ్చలేమని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. కృష్ణా ట్రిబ్యునల్-2కు కొత్తగా నిర్దేశించిన విధి విధానాల (టీవోఆర్)ను వ్యతిరేకిస్తూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. కేంద్ర జల్ శక్తి శాఖ అక్టోబర్ 6న కృష్ణా ట్రిబ్యునల్-2కు కొత్తగా నిర్దేశించిన విధి విధానాలపై తదుపరి చర్యలు లేకుండా నిలుపుదల చేయాలంటూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఈ పిటిషన్ మంగళవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చింది. తెలంగాణ తరఫు సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ వాదనలు వినిపిస్తూ.. జల వివాదాలపై నిర్ణయం తీసుకునే అధికారం జల వివాదాల ట్రిబ్యునల్‌కే ఉందని, ఏపీ ప్రభుత్వం పిటిషన్‌లో లేవనెత్తిన అంశాలు ఆర్టికల్ 262 పరిధిలోకి వస్తాయన్నారు. ఆర్టికల్ 32 కింద కాకుండా ఆర్టికల్ 131 ప్రకారం పిటిషన్ దాఖలు చేయాల్సిందని వైద్యనాథన్ పేర్కొన్నారు. పిటిషన్‌కు మెయింటైన్‌బిలిటీ లేదంటూ అభ్యంతరాలను అపోహలుగా తోసిపుచ్చలేమని జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. ఈ పిటిషన్‌పై తెలంగాణ, కేంద్ర ప్రభుత్వాలు తమ తమ ప్రాథమిక అభ్యంతరాలను కౌంటర్ అఫిడవిట్‌లో పేర్కొనాలని జస్టిస్ సూర్యకాంత్ సూచించారు. ఏపీ ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా వాదనలు వినిపిస్తూ.. తెలంగాణ న్యాయవాది మెరిట్స్‌లోకి వెళ్తున్నారని, ఆ అవసరం లేదని, ట్రిబ్యునల్ టీవోఆర్‌పై స్టే విధించాలని కోరారు. ఈ సమయంలో కేంద్రం తరఫు న్యాయవాది వారం రోజులు గడువు ఇస్తే అభిప్రాయం చెబుతామని ధర్మాసనాన్ని కోరారు. మెరిట్స్‌పై వాదించడానికి సిద్ధంగా ఉన్నామని, స్టే విధించొద్దని వైద్యనాథన్ కోరగా.. అయితే తాము కూడా మెరిట్స్‌పై వాదనకు సిద్ధమేనని ఏపీ ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా పేర్కొన్నారు. అనంతరం తెలంగాణ, కేంద్రం కౌంటర్ దాఖలు చేయడానికి రెండు వారాలు గడువు ఇస్తూ ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. ట్రిబ్యునల్ కార్యకలాపాలు కొనసాగడం అనేది కోర్టు తుది తీర్పునకు లోబడి ఉండాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణ ట్రిబ్యునల్ ఇప్పటికే దాఖలైన ఇతర పిటిషన్లతో కలిపి ఈ నెల 29న చేపడతామని ధర్మాసనం పేర్కొంది.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

కొండమల్లేపల్లి(దేవరకొండ): నల్లగొండ జిల్లాలో ఓ రైతు అప్పులబాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. కొండమల్లేపల్లి మండలం కొత్తబావి గ్రామానికి చెందిన మావిళ్ల సాలయ్య(45) తనకున్న ఐదు ఎకరాల భూమిలో పత్తి, వరి, మిర్చి పంటలు సాగుచేశాడు. పెట్టుబడుల నిమిత్తం రూ. 6 లక్షల వరకు అప్పులు చేశాడు. రెండేళ్లుగా దిగుబడులు ఆశాజనకంగా లేకపోవడంతో అప్పులు పెరిగిపోయాయి. అప్పుల భారం, మరోవైపు ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టడంతో సాలయ్య మనస్తాపం చెందాడు. ఈ నేపథ్యంలోనే మంగళవారం తన వ్యవసాయ భూమిలో ఉన్న రేకుల గదిలో ఉరేసుకున్నాడు. భర్త ఇంటికి తిరిగి రాకపోవడంతో భార్య వెళ్లి చూడగా అప్పటికే సాలయ్య విగతజీవిగా మారాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నారు.


కొడుకుపై కోపంతో

▶ మొదటి పేజీ తరువాయి

దివంగత స్వాతంత్ర్య సమరయోధుడు చీటి మురళీధర్ భార్య, 82ఏళ్ల చీటి శ్యామల మంగళవారం జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గానికి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసి తన గోడును వెళ్లబోసుకున్నారు. పెద్ద కుమారుడు శ్రీరామ్ విదేశాలకు వెళ్లి వచ్చి తమకు తెలియకుండానే తమ స్థలాన్ని అమ్ముకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. తన కుమారుడిపై నిరసనగా.. తన సమస్య పరిష్కారం కావాలనే నామినేషన్ వేశానని ఆమె చెప్పుకొచ్చారు.

కూతురు సాయంతో భర్తను చంపేసింది

- మొదట భార్య కత్తితో దాడి.. అనంతరం ముఖంపై దిండు అదిమిపట్టిన కూతురు
- వేధింపులు భరించలేకే హత్య
- శవాన్ని మాయం చేసే ప్రయత్నంలో వారం రోజులు ఇంట్లోనే మృతదేహం
- గొడ్డలితో ముక్కలు చేయాలని యత్నం.. అనంతరం ఇంట్లోనే పూడ్చాలని యోచన
- కుదరకపోవడంతో పెట్రోల్ పోసి తగులబెట్టేందుకూ ప్రయత్నాలు
- ఏదీ కుదరకపోవడంతో హడావుడిగా అంత్యక్రియలు



ప్రకాశ్‌రావు (ఫైల్)

సిరిసిల్ల క్రైం: మద్యానికి బానిసైన ఇంటిపెద్ద, వివాహేతర సంబంధాలకు అలవాటుపడి.. ఇంట్లోవారిని కొట్టడం, దుర్భాషలాడటంతో భరించలేకపోయిన భార్య, కూతురు కలిసి అతన్ని పాశవికంగా హత్య చేశారు. సిరిసిల్లలో వారం క్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణం శివనగర్‌కు చెందిన లేచర్ల ప్రకాశ్‌రావు (44) జల్సాలకు అలవాటు పడటంతోపాటు, ఇంట్లో వారిపై తరచూ భౌతిక దాడులకు దిగేవాడు. వేధింపులు తాళలేని భార్య స్వప్న, కుమార్తె ఉషశ్రీ ఎలాగైనా అతడి అడ్డు తొలగించుకోవాలని, ఇందుకు చంపడమే మార్గమని అనుకున్నారు. ప్లాన్ ప్రకారం ఈ నెల 1న రాత్రి ప్రకాశ్‌రావు మెడపై కూరగాయలు కోసే కత్తితో భార్య దాడి చేయగా, కూతురు తండ్రి ముఖం మీద దిండుతో ఒత్తిపట్టి చంపేశారు. అనంతరం మృతదేహాన్ని గొడ్డలితో ముక్కలు చేసేందుకు ప్రయత్నించారు. ఆ ప్రయత్నం విఫలంకావడంతో మృతదేహాన్ని ఎలాగైనా మాయం చేయాలన్న ఆలోచనతో ఇంట్లోనే గుంత తవ్వి పాతిపెడదామనుకున్నారు. కానీ అలా చేస్తే శవం నుంచి వాసన వచ్చి బయటకు విషయం తెలుస్తుందని భావించారు. తదుపరి పెట్రోలు పోసి కాల్చేసే ప్రయత్నం చేసినా మృతదేహం పూర్తిగా కాలిపోలేదు. దీంతో స్వప్న ఈనెల 3న తన తమ్ముడితో మరింత పెట్రోలు తెప్పించి శవానికి నిప్పంటించారు. మంటలు ఎగిసిపడడంతో బయటకు తెలుస్తుందని నీళ్లు, దుప్పట్లతో మంటలు ఆర్పివేశారు. ఇలా కుదరదని నిర్ణయించుకుని ఎట్టకేలకు హత్యను కాస్తా ఆకస్మిక మృతిగా చిత్రించి దహన సంస్కారాలు చేయాలని ప్రణాళిక చేశారు. దీనిలో భాగంగా ఈనెల 4న నిందితురాలు తన చిన్నాన్నను వేకువజామున పిలిపించుకుని జరిగిన విషయాన్ని వివరించింది. ఈక్రమంలో ప్రకాశ్‌రావు నిద్రలో చనిపోయినట్లు కథ సృష్టించి దహనసంస్కారాలు చేసేందుకు దగ్గరి బంధువులకు సమాచారం అందించారు. చివరిచూపునకు కొద్ది మంది బంధువులు రాగానే హుటాహుటిన విద్యానగర్‌లోని వైకుంఠధామంలో దహన సంస్కారాలు పూర్తిచేశారు.

ఇలా వెలుగులోకి..

ప్రకాశ్‌రావు నిద్రలో మృతిచెందాడని బంధువులకు సమాచారం ఇచ్చిన నిందితులు, బంధువులందరూ వచ్చే వరకు ఎదురుచూడకుండా దహన సంస్కారాలు పూర్తి చేయడంతో మృతిపై పలువురికి అనుమానం వచ్చింది. ఈక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మృతుడి ఇంటికి వెళ్లగా తాళం వేసి ఉంది. ఇంట్లోంచి దుర్వాసన వచ్చింది. దీంతో ప్రకాశ్‌రావు మృతిపై అనుమానం ఉందని సిరిసిల్ల టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు ప్రారంభించిన టౌన్ సీఐ ఉపేందర్ హత్య ఉదంతాన్ని ఛేదించారు. నిందితులు స్వప్న, ఉషశ్రీని రిమాండ్‌కు తరలించగా, హత్యకు సహకరించిన మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు సీఐ వెల్లడించారు.

బరిలోకి బీఆర్‌ఎస్ ఫుల్ టీమ్

▶ మొదటి పేజీ తరువాయి

అలంపూర్ అభ్యర్థి విజయుడును వెంటబెట్టుకుని తొలుత ప్రగతిభవన్‌కు, తర్వాత తెలంగాణ భవన్‌కు వచ్చారు.

తాజాగా బీఫారం అందుకున్న అభ్యర్థులు వీరే..

కేటీఆర్ చేతుల మీదుగా మంగళవారం బీ ఫారాలు అందుకున్న వారిలో సామ సుందర్‌రెడ్డి (యాకుత్‌పురా), అయిందాల కృష్ణయ్య (కార్వాన్), నందకిషోర్ వ్యాస్ బిలాల్ (గోషామహల్), ఇబ్రహీం లోడీ (చార్మినార్), ఎం.సీతారాంరెడ్డి (చాంద్రాయణ్‌గుట్ట), అలీ బక్రీ (బహదూర్‌పురా), తీగల అజిత్‌రెడ్డి (మలక్‌పేట), సీహెచ్ ఆనంద్‌గౌడ్ (నాంపల్లి), విజయుడు (అలంపూర్) ఉన్నారు. గోషామహల్ టికెట్ ఆశించిన ఆశిష్‌కుమార్ యాదవ్ మంగళవారం ప్రగతిభవన్‌లో కేటీఆర్‌ను కలిశారు. భవిష్యత్తులో అవకాశాలు కల్పిస్తామని, నందకిషోర్‌తో కలసి పనిచేయాలని ఆశిష్‌ను కేటీఆర్ బుజ్జగించారు.

119 స్థానాల్లోనూ అభ్యర్థుల ఖరారు

బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఆగస్టు 21వ తేదీనే 115 మంది అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ప్రాధాన్యత ఇస్తూనే.. ఏడుగురికి మాత్రం నిరాకరించారు. నాలుగు చోట్ల పూర్తిగా కొత్తవారికి అవకాశమిచ్చారు. అప్పట్లో జనగామ, నర్సాపూర్, గోషామహల్, నాంపల్లి అభ్యర్థుల ప్రకటనను పెండింగ్‌లో పెట్టారు. తర్వాత మల్కాజిగిరి అభ్యర్థిగా ప్రకటించిన మైనంపల్లి హన్మంతరావు పార్టీని వీడటంతో.. ఆ స్థానంలో మంత్రి మల్లారెడ్డి అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డికి అవకాశమిచ్చారు. జనగామ నుంచి ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నర్సాపూర్ నుంచి మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డిలకు టికెట్ లభించింది. తాజాగా గోషామహల్, నాంపల్లికి కూడా అభ్యర్థులను ప్రకటించారు. అలంపూర్ అభ్యర్థిని మార్చారు.



అకాల వర్షం.. తీరని నష్టం

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో మంగళవారం గంట పాటు అకాల వర్షం కురిసింది. దీంతో మార్కెట్‌లో ఆరబెట్టిన ధాన్యం కొట్టుకుపోవడంతో రైతులకు తీరని నష్టం వాటిల్లింది. ధాన్యం కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడ్డారు.

\- హుస్నాబాద్

హెచ్చరించినా మీరు మారరా?

పీసీబీ అధికారులపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ)ని ఎన్నిసార్లు హెచ్చరించినా తీరు మారడంలేదని, ప్రజల కోసం పనిచేయాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇదే పరిస్థితి కొనసాగితే చైర్మన్‌సహా అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించింది. ఇప్పటివరకు ఎన్ని ఫిర్యాదులొచ్చాయి.. ఎన్నింటిని పరిష్కరించారో చెప్పాలని ఆదేశించింది. కాలుష్య కారకమైన ఓ పరిశ్రమ మూసివేతకు చర్యలు తీసుకోకపోవడాన్ని సవాల్ చేస్తూ హైదరాబాద్‌కు చెందిన జి.అరుంధతి, మరొకరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రధానన్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం ఇప్పాలపల్లిలోని సుందర్ ఇస్పాత్ లిమిటెడ్ కారణంగా వాతావరణం కలుషితమవుతోందని పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది రచనారెడ్డి వాదనలు వినిపించారు. పంటలు దెబ్బతింటున్నాయని పీసీబీకి వినతిపత్రాలిచ్చినా చర్యలు చేపట్టలేదన్నారు. వినతిపత్రాలపై ఏం చర్యలు తీసుకున్నారో తెలుసుకోవడానికి గడువు కావాలని పీసీబీ తరఫు న్యాయవాది విజ్ఞప్తి చేశారు. వినతిపత్రంపై ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని ధర్మాసనం ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

చేసిందేమిటో నేను ఎప్పుడూ చూడను;
చేయాల్సిందేమిటో మాత్రమే చూస్తాను.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 8 నవంబర్ 2023

ఈ నగరానికి ఏమైంది?

ప్రభుత్వాల మధ్య ఆరోపణల పర్వం వింత కాకపోవచ్చు. కానీ, పర్యావరణ అంశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నిందారోపణలు సాగడం విచిత్రమే. దేశ రాజధానిలోని వాయు కాలుష్యం వ్యవహారంలో ఇప్పుడు కేంద్రానికీ, ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వానికీ నడుమ చోటుచేసుకుంటున్నది అదే. ఢిల్లీ – ఎన్సీఆర్ (దేశ రాజధాని ప్రాంతం)లో మంగళవారం సైతం వాయునాణ్యత 'తీవ్ర ఆందోళన దశ'లో ఉన్న వేళ... చివరకు సర్వోన్నత న్యాయస్థానం సైతం జోక్యం చేసుకుంది. వాయు కాలుష్యాన్ని ఓ రాజకీయ పోరుగా మార్చరాదనీ, గాలి నాణ్యత ప్రజారోగ్యాన్ని హత్య చేస్తోందనీ న్యాయస్థానం చెప్పాల్సి వచ్చింది. పొరుగున పంజాబ్, హర్యానా, ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్‌లలో పంట వ్యర్థాలను తగలబెట్టడమే ఏటా చలికాలంలో ఢిల్లీ వాయు కాలుష్యానికి ప్రధాన కారణమని కోర్ట్ అభిప్రాయపడింది. రాష్ట్రాలన్నీ ఈ కొయ్యకాళ్ళ దహనాన్ని ఆపాలని ఆదేశించింది. ఢిల్లీలో కాలుష్యం తగ్గించడానికి సరి – బేసి వాహనాల ట్రాఫిక్ నియంత్రణ విధానాన్ని మళ్ళీ తేవాలన్న ఢిల్లీ ఆప్ సర్కార్ నిర్ణయం కంటితుడుపేనని కోర్ట్ కుండబద్దలు కొట్టడం పరాకాష్ఠ.

ఢిల్లీ పరిసరాల్లో వాయునాణ్యత తృప్తికరమైన దాని కన్నా నాలుగు రెట్లు క్షీణించి, మంగళవారం సైతం వాయు నాణ్యత సూచి దాదాపు 400 మార్కుకు దగ్గరగా నిలిచిందని కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డ్ మాట. ఏడేళ్ళ తర్వాత కాలుష్యం దెబ్బతో స్కూళ్ళు మూతబడ్డాయి. ఇప్పటికే ఆఫీసులకు వర్క్ ఫ్రమ్ హోమ్ పెట్టారు. దట్టమైన పొగ నిండిన రోడ్లతో, గాలి పీల్చుకోవడానికి ఇబ్బంది పడుతూ, ముక్కులకు మాస్కులు తగిలించుకొని సాహసించి జనం బయటకు రావాల్సిన పరిస్థితి. ఈ కాలుష్య బాధ నుంచి తప్పించుకోవడానికి ఇప్పటికే పెద్ద సంఖ్యలో పర్యాటకులు హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలకు తరలిపోయిన దృశ్యాలు సోషల్ మీడియాలో తిరిగాయి. మనుషులే కాదు మూగజీవాలైన పక్షులూ పెద్దయెత్తున అనారోగ్యం పాలవుతున్న పరిస్థితి. ఉన్నంతలో వాహన కాలుష్యాన్ని తగ్గించాలని ఈ నెల 13 నుంచి సరి – బేసి విధానం పాటిస్తామని ఢిల్లీ సర్కార్ ప్రకటించింది. 2019 తర్వాత ఢిల్లీలో మళ్ళీ ఈ పద్ధతిని తేవడం ఇదే తొలిసారి. పరిస్థితి తీవ్రతకు ఇది ప్రతీక.

ఢిల్లీలో వాయు కాలుష్యం స్థాయి ఒక్కసారిగా పెరిగిపోవడం, పరిసర రాష్ట్రాల్లో కొయ్యకాళ్ళను కాల్చడం లాంటివి కనీసం పదేళ్ళుగా చూస్తున్నాం. కొన్నేళ్ళుగా ఇది రాజకీయ అంశమూ అయింది. పంట వ్యర్థాలను తగలబెడుతున్నవారిపై చర్యలు తీసుకోవడంలో పొరుగున ప్రత్యర్థి పార్టీలు అధికారంలో ఉన్న పంజాబ్, హర్యానాలు విఫలమవుతున్నాయని ఢిల్లీ ఆప్ సర్కార్ గతంలో ఆరోపిస్తూ వచ్చింది. ఇప్పుడు పంజాబ్‌లో సొంత సర్కారే ఉన్నా, పరిస్థితిలో మార్పు లేదు. విడ్డూరమేమిటంటే, పర్యావరణ అంశాలకు వచ్చేసరికి సుప్రీమ్ కోర్టే ప్రతిసారీ జోక్యం చేసుకోవాల్సి రావడం! 'పర్యావరణ పరిరక్షణ కోర్టు బాధ్యత అనుకోవడం తప్పు. వాయు, శబ్ద కాలుష్య నియంత్రణ బాధ్యత ప్రతి ఒక్కరిదీ' అని సుప్రీమ్ మరో కేసులోనూ హితవు పలకాల్సొచ్చింది. టపాసుల్లో నిర్ణీత రసాయనాల వాడకంపై నిషేధం ఢిల్లీకే కాక, అన్ని రాష్ట్రాలకూ వర్తిస్తుందని కుండబద్దలు కొట్టాల్సి వచ్చింది.

రాజధానిలో ఇంత రచ్చ జరుగుతున్నా, పంజాబ్ లాంటి చోట్ల ఇప్పటికీ యథేచ్ఛగా మోళ్ళ కాల్చివేత కొనసాగుతూనే ఉంది. ఇటీవల పంజాబ్‌లో ఈ దహనాలు 740 శాతం మేర హెచ్చాయి. ఒకే రోజు వెయ్యి నుంచి 3 వేల పైగా అలాంటి ఘటనలు రికార్డవుతున్నాయి. ఫలితంగా ఏటా నవంబర్, జనవరి మధ్యన ఢిల్లీ వాయునాణ్యత దారుణంగా పడిపోవడం రివాజైంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వాలు తప్పును పక్కవారి మీదకు నెట్టివేస్తే లాభం లేదు. ఢిల్లీలోని ఈ వాయు కాలుష్యాన్ని జాతీయ ఆరోగ్య అత్యవసర పరిస్థితిగా ప్రకటించాలి. స్థానిక అవసరాలు, దీర్ఘకాలిక సంప్రదాయాలను దృష్టిలో పెట్టుకొంటూనే మోళ్ళను కాల్చడాన్ని నిషేధిస్తూ, కేంద్ర స్థాయిలో చట్టం తీసుకురావచ్చు. దశాబ్దాల క్రితమే అమెరికా లాంటి చోట్ల తెచ్చిన కఠినమైన చట్టాలు ఫలితాన్నిచ్చాయి. అయితే, పంజాబ్ లాంటి చోట్ల మోళ్ళ కాల్చివేతను నిషేధిస్తూ, చట్టమున్నా అమలు శూన్యం. అందుకే, వట్టి చట్టం చేయడం కన్నా అందరూ పాటించే ఆచరణాత్మక మార్గం చూడడం ఉత్తమం.

నిజానికి, ఖరీఫ్‌లోని పంట కోత తర్వాత, రబీ సీజన్‌కు 10 నుంచి 14 రోజుల్లో రైతులు త్వరితగతిన పొలాల్ని సిద్ధం చేయాలి. అందుకు వరి మోళ్ళను తగులబెట్టడమే మార్గమని వారి భావన. ఈ పరిస్థితుల్లో హానికారక కాలుష్యంపై చైతన్యం పెంచాలి. పంట వ్యర్థాలను వదిలించుకొనేందుకు ఆధునిక ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలి. దాదాపు 3.3 కోట్ల జనాభాకు నివాసమైన దేశ రాజధాని ఇవాళ ప్రపంచంలోనే అత్యంత కాలుష్యభరిత నగరం. ఈ గాలి పీల్చడం వల్ల ఢిల్లీ వాసులకు శ్వాసకోశ వ్యాధులు రావడమే కాదు, సగటు ఆయుర్దాయం దాదాపు 11.9 ఏళ్ళు తగ్గుతోందని చికాగో విశ్వవిద్యాలయ అధ్యయనం. గతంలో బీజింగ్, లండన్ లాంటివీ ఈ సమస్యను ఎదుర్కొని బయటపడ్డవే. వారి అనుభవాల నుంచి పాఠాలు నేర్వాలి.

ఢిల్లీలో స్మోక్ టవర్ల ఏర్పాటును పెంచాలి. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరిగేలా సబ్సిడీలతో ప్రోత్సహించాలి. కేంద్రం సైతం వాయుకాలుష్య పరిష్కారం తన బాధ్యత కాదని చేతులు దులుపుకోలేదు. ముందుకొచ్చి, నిర్ణీత బడ్జెట్ కేటాయింపుతో సమస్య తీవ్రత ఉన్న ఢిల్లీ లాంటి రాష్ట్రాలకు అండగా నిలవాలి. ఢిల్లీ లాంటి చోట్ల బయో డీకంపోజర్లను తెస్తామంటూ భారీ వాగ్దానాలు, ప్రచారం చేసి ఇప్పుడా ఊసే ఎత్తని పాలకపక్షాలు సమన్వయంతో సమగ్ర కార్యాచరణకు దిగితేనే సత్ఫలితాలు వస్తాయి. లేదంటే, ప్రతి ఏటా ఇదే వాయు కాలుష్యం మాట వినాల్సి వస్తుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు,
ఆశ్వయుజ మాసం, తిథి: బ.దశమి ఉ.7.28 వరకు
తదుపరి ఏకాదశి, నక్షత్రం: పుబ్బ రా.7.21 వరకు
తదుపరి ఉత్తర, వర్జ్యం: రా.3.14 నుండి 5.02 వరకు,
దుర్ముహూర్తం: ప.11.22 నుండి 12.18 వరకు,
అమృత ఘడియలు: ప.12.14 నుండి 2.02 వరకు.

సూర్యోదయం : 6.05
సూర్యాస్తమయం: 5.24
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

పాక్‌లోనూ ఎన్నికల హడావిడి

విశ్లేషణ



జి. పార్థసారథి

పాకిస్తాన్ వార్షిక వృద్ధిరేటు అసాధారణంగా అత్యంత తక్కువగా మైనస్ 0.5 శాతం దగ్గర ఉంది. ఐఎమ్ఎఫ్ నుండి అందే బెయిల్ అవుట్‌లు, స్నేహపూర్వక అరబ్ దేశాల నుండి, ముఖ్యంగా సౌదీ అరేబియా, యూఏఈ నుండి కాలానుగుణంగా అందుతున్న ఆర్థిక సహాయాల మీదే పాక్ నిరంతరం ఆధారపడుతోంది. ఈ నేపథ్యంలో అక్కడ 2024 జనవరిలో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్నాయి. పోటీ నుండి తప్పించబడినప్పటికీ, ఇమ్రాన్ ఖాన్ ప్రభావాన్ని విస్మరించలేము. నవాజ్ షరీఫ్ స్వయంగా విధించుకున్న ప్రవాసం నుండి తిరిగి రావడం ఆయన మద్దతుదారులను ఉత్సాహపరిచింది. అయినప్పటికీ, సైన్యం వల్ల ప్రభావితమయ్యే నాయకులతో కూడిన మరో సంకీర్ణ ప్రభుత్వమే అక్కడ ఏర్పడనుందనడంలో ఏ సందేహమూ లేదు.

ప్రస్తుతం జరుగుతున్న వన్డే క్రికెట్ ప్రపంచ కప్‌లో అఫ్గానిస్తాన్ చేతిలో పాకిస్తాన్ పొందిన ఘోర పరాజయం ఆ దేశ ప్రజలకు తీవ్ర నిరాశను కలిగించింది. సహజంగానే క్రికెట్‌లో తమ విజయాల రికార్డ్ గురించి పాకిస్తానీలు ఎంతో గర్వపడతారు. అసలే పాకిస్తాన్ ఆర్థికంగా కష్టాల్లో ఉన్న సమయంలో వారికి ఈ నిరాశ ఎదురైంది. వార్షిక వృద్ధిరేటు అసాధారణంగా అత్యంత తక్కువగా మైనస్ 0.5 శాతం దగ్గర ఉంది. ద్రవ్యోల్బణం పెరుగుతోంది. దీనిని ప్రస్తుతం 29.6 శాతంగా అంచనా వేశారు. ఇప్పుడు 22 శాతంగా అంచనా వేస్తున్న వడ్డీ రేట్లు, దేశంలోని వ్యాపార కార్యకలాపాలను ధ్వంసం చేస్తున్నాయి. కేవలం కొన్ని వారాల క్రితం, విదేశీ మారక ద్రవ్య వనరులు 4.19 బిలియన్ డాలర్లకు క్షీణించాయని పాకిస్తాన్ సెంట్రల్ బ్యాంక్ ప్రకటించింది. ఇవి ఒక నెల కఠినంగా క్రమబద్ధీకరించిన దిగుమతులకు మాత్రమే సరిపోతాయి. ఇది ఆర్థికవేత్తలకు మాత్రమే కాకుండా, సాధారణ ప్రజలకు కూడా ఒక పీడకలగా మారింది. దీనికితోడు గత సంవత్సరం కురిసిన కుండపోత వర్షాలు, కనీవినీ ఎరుగని వరదలు దేశవ్యాప్తంగా 3.3 కోట్ల మంది ప్రజలపై ప్రభావం చూపాయి. వరదల ఫలితంగా సుమారు 10,000 మంది ప్రాణాలు కోల్పోయారు. 10 బిలియన్ డాలర్ల ఆర్థిక నష్టం వాటిల్లినట్టుగా అంచనా వేశారు.

ఇమ్రాన్ వర్సెస్ మునీర్

ఈ ఆర్థిక ఒడుదొడుకులు ఇమ్రాన్ ఖాన్ ప్రభుత్వాన్ని తొలగించడానికి దారితీసిన రాజకీయ పరిణామాలతో జతకూడి ఉన్నాయి. పంజాబ్‌లో విజయవంతమైన ముఖ్యమంత్రిగా పనిచేసిన షెహబాజ్ షరీఫ్ ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వానికి ప్రధానిగా నాయకత్వం వహించారు. ఆయన ఆర్థిక గందరగోళాన్ని, దేశవ్యాప్తంగా పెరుగుతున్న రాజకీయ విభజనను ఎదుర్కోవలసి వచ్చింది. అనివార్యమైన ఐఎమ్ఎఫ్(అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ) కఠిన షరతులను షెహబాజ్ అంగీకరించడానికి చాలా తీవ్రమైన చర్చలు జరిగాయి. భారీ విదేశీ సహాయం కోసం తలుపులు తట్టాలంటే, పాకిస్తాన్‌కు ఐఎమ్ఎఫ్ వెన్నుదన్ను అనేది కనీసం అవసరం. ఐఎమ్ఎఫ్ నుండి అందే బెయిల్ అవుట్‌లు, స్నేహపూర్వక అరబ్ దేశాల నుండి, ముఖ్యంగా సౌదీ అరేబియా, యూఏఈ నుండి కాలనుగుణంగా అందుతున్న ఆర్థిక సహాయాల మీదే పాకిస్తాన్ నిరంతరం ఆధారపడుతోంది.

ఈలోగా, తనకు ముందటివాడు, గురువు అయిన జనరల్ కమర్ జావేద్ బాజ్వాకు ఎంతో ఇష్టమైన జనరల్ సయ్యద్ అసీమ్ మునీర్ ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇమ్రాన్ తనను ఐఎస్ఐ చీఫ్ పదవి నుంచి తొలగించి, రొటీన్ పనులు, అప్రధానమైన అసైన్‌మెంట్‌లు ఇచ్చిన రోజుల గురించి జనరల్ మునీర్‌కు సంతోషకరమైన జ్ఞాపకాలు ఉండే అవకాశం లేదు.



ఈ పరిణామాలు ఇమ్రాన్, జనరల్ మునీర్ నేతృత్వంలోని సాయుధ దళాల మధ్య నిష్ఫలమైన పోరాటానికి దారితీశాయి. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కాజీ ఫైజ్ ఇసా మద్దతును పొందుతున్న ఇమ్రాన్‌పై అనేక కేసులు నమోదయ్యాయి. కానీ ప్రధాన న్యాయమూర్తి ఇసాకు ఇప్పుడు తన మార్గం అంత తేలిక కాదు. ఎందుకంటే ఆయన జూనియర్ సహోద్యోగులు ఆయన పదవీ విరమణ అనంతర పరిస్థితులను ఊహిస్తున్నారు. వారు ఇమ్రాన్‌ను రక్షించడంలో ఆయన ఉత్సాహాన్ని ఇప్పుడు పంచుకోవడం లేదు. పైగా ఈ ప్రక్రియలో, ఇప్పుడు కూడా విస్తారమైన అధికారాలను, ప్రభావాన్ని కలిగి ఉన్న సాయుధ దళాల ఆగ్రహానికి గురవుతారు. ఇదే సమయంలో, దేశం ఎన్నికల ప్రక్రియ కోసం సమాయత్తమవుతోంది. 2024 జనవరిలో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్నాయి. సైన్యం నుండి తగిన మద్దతుతో, పాకిస్తాన్ ఎన్నికల యంత్రాంగం, శాంతి భద్రతల యంత్రాంగం విజయవంతంగా ఎన్నికలు నిర్వహించడానికి అవసరమైన పరిస్థితులను కల్పిస్తాయని ఎవరైనా ఆశించవచ్చు. అయితే, సైన్యం కష్టాలు కూడా కొనసాగుతున్నాయి. జనరల్ బాజ్వాకు జనరల్ మునీర్ ఇష్టమైనవాడు అయినప్పటికీ, పదవి నుండి తొలగించబడిన ఏడాదిన్నర తర్వాత కూడా మంచి ప్రజాకర్షణ కలిగిన ఇమ్రాన్‌తో ఆయనకు తీవ్రమైన విభేదాలు ఉన్నాయి. అదే సమయంలో ఇమ్రాన్ కూడా తన అహంకారపూరితమైన, దుర్మార్గపు ప్రవర్తన వల్ల రాజకీయ వర్గాల్లో చాలామంది స్నేహితులను కోల్పోయారు. ముఖ్యంగా, తన పార్టీ ఎన్నికల ఓటమిని నిర్ధారించడానికి సిద్ధంగా ఉన్న ఆర్మీ నాయకత్వంలోని మిత్రులకు దూరమయ్యారు.

భారత్‌తో ఎలా వ్యవహరిస్తారు?

ఇమ్రాన్‌లా కాకుండా, జనరల్ బాజ్వా స్వాభావికంగా భారత్ వ్యతిరేకి కాదు. భారత్‌తో సంబంధాలను మెరుగుపరచు కునేందుకు ఆయన సిద్ధమయ్యారు. ఆయన అమెరికాకు సన్నిహితుడు. అమెరికా ఆదేశాల మేరకు ఉక్రెయిన్ కు పాకిస్తాన్ ఆయుధాల అమ్మకాలను కూడా ఆమోదించారు. ఈ చర్య కచ్చితంగా ఐఎమ్ఎఫ్ సహాయం కోసం అమెరికా సహకారాన్ని పొందడంలో, దివాళా తీయకుండా కాపాడటంలో పాకిస్తాన్‌కు సహాయపడింది.

జనరల్ బాజ్వా అనుసరించిన వాస్తవిక దృష్టిని జనరల్ మునీర్ చూపించగలడా, 1971లో జనరల్ యాహ్యా ఖాన్ అనుసరించిన వినాశకరమైన మార్గాన్ని ఇష్టపడతాడా అనేది చూడాలి.

జనరల్ ముషారఫ్ హయాంలో జరిగినట్టుగా జమ్మూ కశ్మీర్ సమస్యను పరిష్కరించడంలోని పురోగతిలోనే భారతదేశంతో సంబంధాలలో శాంతి నెలకొల్పవచ్చని ఆయన గుర్తుంచుకోవాలి. తాను నాయకత్వం వహించిన కార్గిల్ విపత్తు తర్వాత, భారత దేశంతో వివాదాన్ని ప్రోత్సహించడం లేదా రెచ్చగొట్టడం లోని నిష్ప్రయోజకత్వం గురించి, దాంట్లో ఉన్న ప్రమాదాలను గురించి ముషారఫ్ పాఠాలు నేర్చుకున్నారు. జనరల్ మునీర్ భారతదేశంపై గట్టి ప్రకటనలు జారీ చేయడంలో ఖ్యాతిని సంపాదించుకున్నట్లు కనిపిస్తోంది. ఇటీవల నియంత్రణ రేఖ వెంబడి, అంతర్జాతీయ సరిహద్దు వెంబడి కాల్పులు, చొరబాట్లు కూడా జరిగాయి.

పాకిస్తాన్ ఆర్థిక అవసరాలు, పరిమితుల గురించి జనరల్ మునీర్ వాస్తవిక దృక్పథాన్ని తీసుకుంటారని అందరూ ఆశిస్తున్నారు. వచ్చే ఏడాది భారత్, పాకిస్తాన్‌లలో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్నాయి. విదేశాంగ, భద్రతా విధానాల సమస్యలపై భారతదేశంలో ఉన్న విస్తృత జాతీయ ఏకాభిప్రాయంలా కాకుండా, సైన్యం ఆధిపత్యం కొనసాగడం వల్ల కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాకిస్తాన్ ఏ దిశలో నడుస్తుందో విశ్లేషించడం కష్టతరం అవుతోంది. మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ స్వయంగా విధించుకున్న ప్రవాసం నుండి తిరిగి రావడం పాకిస్తాన్ ముస్లిం లీగ్‌లోని ఆయన మద్దతుదారులను ఉత్సాహపరిచింది. అయినప్పటికీ, సైన్యం వల్ల ప్రభావితమయ్యే నాయకులతో కూడిన మరో సంకీర్ణ ప్రభుత్వమే పాకిస్తాన్‌లో ఏర్పడుతుందనడంలో ఏ సందేహమూ లేదు. పోటీ నుండి తప్పించబడినప్పటికీ, ప్రజా జీవితంలో ఇమ్రాన్ ప్రభావాన్ని కూడా విస్మరించలేము.

వ్యాసకర్త జమ్మూ సెంట్రల్ యూనివర్సిటీ ఛాన్స్‌లర్,
పాకిస్తాన్‌లో భారత మాజీ హైకమిషనర్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సోషల్ మీడియా

మరో ఢిల్లీ?



బెంగళూరు గాలి నాణ్యత కూడా క్షీణించిందనీ, మరో ఢిల్లీ కావడానికి దగ్గరలో ఉందనీ ఇంకెవరికైనా అనిపిస్తోందా? కొయ్యకాళ్లను కాల్చడం వల్ల ఢిల్లీ ఉక్కిరిబిక్కిరి అవుతుంటే, చెత్తను కాల్చడం వల్ల బెంగళూరు ఇబ్బంది పడుతోంది.

– సాయి స్వరూప, అసిస్టెంట్ ప్రొఫెసర్

ఎందుకు గెలవకూడదు?



ఒకవేళ క్రికెట్ ప్రపంచ కప్‌ను అఫ్గానిస్తాన్ గెలిస్తే? ఉన్నట్టుండి అదేమీ అసాధ్యం అనిపించడం లేదు. ఎంత అద్భుతమైన ఆటగాళ్లతో కూడిన జట్టు అది!

– సుశాంత్ సరీన్, సీనియర్ ఫెలో

మంచి రోజులే...



ఫోర్బ్స్(ఇండియా) ప్రకారం, నరేంద్ర మోదీ హయాంలో భారతదేశంలో నిరుద్యోగం స్థిరంగా 5.3 శాతం నుంచి 8.4 శాతానికి పెరుగుతోంది.

– సుబ్రమణియన్ స్వామి, కేంద్ర మాజీ మంత్రి

శుభాకాంక్షలు



హ్యాపీ బర్త్ డే (నవంబర్ 7) డియర్ (కమల్ హాసన్) సర్! వ్యక్తిగతంగా, వృత్తిపరంగా కూడా మీకు సూపర్ సక్సెస్‌ఫుల్ సంవత్సరం ముందుండాలని కోరుకుంటున్నాను.

– మమ్ముట్టి, నటుడు


ముందే తెలిసుంటే...



క్రికెట్‌లో ఒక బ్యాట్స్‌మన్ 'టైమ్డ్ అవుట్' అవడం ఎంత అరుదు అంటే, ఆఖరికి 'లగాన్' (సినిమా) రచయిత కూడా తన స్క్రిప్టులో దాన్ని వాడలేదు. (శ్రీలంక క్రికెటర్ ఏంజెలో మాథ్యూస్ రెండు నిమిషాల్లో ఆటను ప్రారంభించలేకపోవడంతో బంగ్లాదేశ్ వివాదాస్పదంగా అవుట్ అయిన నేపథ్యంలో.)

– రమేశ్ శ్రీవత్స్, వ్యంగ్య వ్యాఖ్యాత

ఊహించిన భయం



ఐదు, పదేళ్ల కిందటే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ – కృత్రిమ మేధ) కలిగించనున్న భయాల గురించి నేను రాయడం, మాట్లాడడం మొదలు పెట్టినప్పుడు ఎవరూ సీరియస్‌గా తీసుకోలేదు. ఇండియాలో జరిగిన చాలా టెక్ కాన్ఫరెన్సులు సెన్సేషనలిజంగా, కుట్ర సిద్ధాంతంగా భావించి నా 'వర్క్'ను బహిష్కరించాయి. ('డీప్‌ఫేక్ ఏఐ'తో మార్ఫింగ్ చేసిన నటి రష్మికా మందన్న వీడియో వైరల్ అయిన నేపథ్యంలో.)

– రాజీవ్ మల్హోత్రా, పరిశోధకుడు

ప్రాధాన్యాలు



ఆన్‌లైన్‌లో చంపేస్తామన్న బెదిరింపులు వచ్చేది ఒక ధనవంతుడికి అయితే, పోలీసులు ఎల్లప్పుడూ ఆ 'ట్రోల్'ను పట్టుకుంటారు. అదే ఆన్‌లైన్‌లో ఒక మహిళకు అత్యాచార బెదిరింపులు వస్తే, పోలీసులు ఎప్పుడూ ఆ ట్రోల్ ఎవరో తేల్చలేరు.

– దేవ్‌దత్ పట్నాయక్, రచయిత

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇన్ బాక్స్

తేలిక ప్రశ్నలు – లోతైన జవాబులు

మీరేమిటోల్లు రా?
దళితులమయ్యా!
అంటే, ఎందులో వస్తారూ?
మీ తిట్లల్ల ఒస్తం
మురికి కాలవల్ల ఒస్తం
విడిగా పెట్టిన కంచంల ఒస్తమయ్య.
అంటే – హిందువులు కారా?
ఎందుకు కాం దొర – అయితం –
మీ ఎలక్షన్ లెక్కలల్ల అయితం!

ఏం తింటార్రా మీరూ?
దళితులు తినేవన్నీ తింటం నాయిన.
అవే, ఏమేం తింటరు?
మీతో దెబ్బలు తింటం
అప్పుల బాధలు తింటం
మీ తొక్కిసలాటల, మేం తన్నులు తింటం,
ఎప్పుడన్న మీరేసిన తొక్కు దింటం – బాంచెన్!
కోళ్ళు తింటరేమో ననుకున్నారా?
తింటాం గద దొర! మీ ఎలక్షన్ టయిముల –

ఏమేం తాగుతర్రా మీరూ?
దళితులు తాగేవే తాగుతమయ్య.
అవే – ఏమిటవి?
అంటరాని నీల్లు తాగుతం
ఇరిగిన కోర్కెల ఇషం తాగుతం
రేపనేది లేని చీకటి తాగుతం
బీరు – బ్రాంది తాగుతారేమోననుకున్నారా?
తాగుతం కద నాయిన – మీ ఎలక్షన్లప్పుడు –

మీకేం దొరుకుతయిరా?
దళితులకు దొరికేవన్నీ దొరుకతయి దొర.
అంటే – అదే ఏమేం దొరుకుతయ్?
మీరు ఒదిలేసి చివరికి
అందుకున్న కొన ప్రాణాలు ఉరికి
అదేమిటీ? ఆశలేవీ దొరకవా?
దొరుకతయి కద దొర – మీ ఎలక్షన్లప్పుడు –

ఇంతకీ మీరు చేసిన పనేంట్రా?
దళితులు చేసే పనులన్నీ చేశినం దొర.
అదే – ఏమేం చేశారు?
వంద రోజులు చెరువు పని చేశినం
మా చెమటల్తో దాన్ని నింపేశినం
పగలంత పనిచేసి, దాన్నే రాత్రి చేసినం
రాత్రంత పనిచేసి, దాంతోనే
పొద్దు పొడిపించినం

అవునా? ఇంకేమేం చేశార్రా?
ఆ దారిన ఒచ్చిపోయే మీ దొరలందరికి
దండాలు పెట్టం కాదు నాయిన?
అంతేనా? ఇంకా ఏదో పెద్ద పని
చేశారనుకున్నానే?
చేశినం కద దొర – మీ ఎలక్షన్ ప్రచారం!
అంతకుమించి మాకు,
మరో పెద్ద పనేముంటదయ్యా?
బాంచెన్ నీ కాల్ మొక్త –

హిందీ మూలం: బచ్చాలాల్ ఉన్మేష్
తెలుగు సేత : డాక్టర్ దేవరాజు మహారాజు

రైతు భరోసా మేనిఫెస్టో కావాలి!

రాష్ట్రంలో మూడవ సాధారణ ఎన్నికలు ఈ నెల 30వ తేదీన జరగ బోతున్నాయి. మూడు కోట్లకు పైగా ఉన్న ఓటర్లను ఆకర్షించడం కోసం వివిధ పార్టీలు ప్రచార రూపంలో, మేనిఫెస్టో రూపంలో ప్రణాళికలను రచిస్తున్నాయి. కులాలు , మతాలు, వర్గాల వారీగా డిక్లరేషన్లను ప్రకటిస్తున్నారు. కానీ ఎక్కువ సంఖ్యలో ఉన్న రైతులకు మాత్రం ప్రత్యేక డిక్లరేషన్‌లనూ, భరోసానూ ఏ పార్టీ ఇవ్వడం లేదు. కానీ వారి ఓట్లపై మాత్రం అన్ని పార్టీలూ కన్నేస్తున్నాయి.

రాష్ట్రంలో పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్న రైతాంగం 73.40 లక్షల మంది. వీరే కాకుండా కౌలురైతులు, వ్యవసాయ కూలీలూ, వ్యవసాయంపై ఆధారపడి జీవించే కుటుంబాలూ చాలానే (77 లక్షలు) ఉన్నాయి. కనీసం ఒక కుటుంబానికి ఇద్దరు చొప్పున ఓటర్లు ఉన్నా దాదాపు రెండు కోట్ల మంది వరకూ కేవలం రైతు కుటుంబాలకు చెందిన ఓటర్లే ఉంటారు. వీరు తలుచుకుంటే ఏ పార్టీని అధికారంలోకి తేవాలంటే వారిని తేగలరు. అందుకే అన్ని పార్టీలు కూడా రైతులను బుజ్జగించుకునేందుకు వివిధ హామీల రూపంలో ముందుకు వస్తున్నారు.

తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత రైతు సమస్యల రూపం మారింది. 'రోగం ఒకటైతే మందు ఒకటి' ఇచ్చిన చందంగా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు కావలసినది కాకుండా వేరేవి ఇవ్వడానికి ప్రయత్నిస్తోంది.

రాష్ట్రంలో ఎక్కువమంది సన్న కారు, చిన్నకారు కౌలు రైతులు వ్యవసాయం చేస్తున్నారు. స్వరాష్ట్రంలో సాగుబడి పెరిగింది, దిగుబడి పెరిగింది. అంతే స్థాయిలో పెట్టుబడి వ్యయం కూడా పెరిగింది. రైతులు ఆహార పంట స్థానంలో వాణిజ్య పంటలను సాగు చేయడం వల్ల పెట్టుబడి వ్యయం పెరిగి అప్పులపాలవుతున్నారు. ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రుణమాఫీ పథకం కింద రుణాలను అందిస్తున్నప్పటికీ ఈ పథకం సరిగా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. 'రైతుబంధు' పథకం కింద పెట్టుబడి సహాయాన్ని ఇస్తున్నప్పటికీ అది చిన్న, సన్నకారు రైతులకు ఏమాత్రం ప్రయోజనం ఇవ్వడం లేదు. కేవలం భూస్వాములకు, సాగుబడిలేని భూ యజమానులకు మాత్రమే ఈ పథకం కింద ఎక్కువ లబ్ధి చేకూరుతోంది.



రైతుకు అప్పులకు పిల్లల చదువుల ఖర్చూ, వైద్య ఖర్చులూ కారణాలే. నాణ్యమైన విద్య అందించే ప్రభుత్వ విద్యా సంస్థలు లేని కారణంగా అధిక ఫీజులు కట్టి ప్రైవేటు విద్యాసంస్థలకు పంపాల్సి వస్తోంది. అనారోగ్య సమస్యలు ఎదురైనప్పుడు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సౌకర్యాలు లేక ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లవలసి వస్తోంది.

రాబోయే ఎన్నికల్లోనైనా రైతులను ఆదుకునే పథకాలను అన్ని పార్టీలూ ఇవ్వాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా సరైన సమయంలో బ్యాంకుల నుండి రుణాలను ఇప్పించడం, రుణమాఫీలు చేయడం, జరగాలి. రైతు పండించే పంటలు దళారులు మోసం చేయకుండా మద్దతు ధరకు కొను గోలు చేసేలా చర్యలు తీసుకోవాలి. పట్టాదారు రైతుల మాదిరిగానే కౌలు రైతులకు కూడా రుణ సౌకర్యాలను కల్పించాలి. అన్ని పార్టీలు కూడా రైతులను మోసం చేసే విధంగా కాకుండా రైతు సంక్షేమ ఎజెండాను అమలు చేసే విధంగా హామీ ఇవ్వాలి. రైతులు కూడా అన్ని పార్టీల ఎజెండాను నిశితంగా పరిశీలించి ఓటెవరికి వేయాలో నిర్ణయించుకోవాలి.

– డా॥ చింత ఎల్లస్వామి,
ఓయూ పరిశోధక విద్యార్థి | 99081 86025

జ్ఞాన వృద్ధులు

జ్ఞానానికి వయసుతో సంబంధం లేదు. కొన్ని సందర్భాలలో పెద్దవారైన వారు తీర్చలేని సందేహాలను వారి కంటే చిన్నవారు అవలీలగా తీర్చగలుగుతారు. దీనికి వారి జ్ఞానార్జన, ప్రతిభలే కారణం. వయసులో చిన్నవారై, అపారమైన జ్ఞానం ఉన్నవారిని జ్ఞానవృద్ధులంటాం.

శ్వేత కేతునితో కలిసి బాలుడైన అష్టావక్రుడు జనక మహారాజు చేస్తున్న యజ్ఞానికి వెళ్లాడు. ద్వార పాలకుడు వారిని లోపలకి వెళ్ళనివ్వలేదు. 'మహానుభావులైన వృద్ధ విద్వాంసులూ, అనుభవజ్ఞులైన ఋత్విజులు మాత్రమే ఈ యజ్ఞ వాటికలో ప్రవేశించటానికి అర్హులు. మీరు చిన్నవారు. ఈ యజ్ఞ సభలో ప్రవేశించటానికి మీకు అర్హత లేదు' అంటాడు. అప్పుడు అష్టావక్రుడు 'చాలా సంవత్సరాలు జీవించటం, వెంట్రుకలు తెల్లబడటం వృద్ధాప్యానికి చిహ్నాలా? జ్ఞానం కలవాడైతే బాలుడైనా వృద్ధుడే. చక్కగా చదువుకుని ఆ చదువు నిత్య జీవితంలో ప్రతిఫలించేట్లు తన ప్రవర్తనను తీర్చి దిద్దుకునే మనిషి, వయసులో చిన్నవాడైనా, అందరూ మన్నించదగిన వాడవుతాడు. మమ్మల్ని వయసులో చిన్నవారని తక్కువగా చూడకండి. మేం జనక మహారాజు గారి సభలోని వేద విదులతో చర్చించటానికి వచ్చాము' అంటాడు. అప్పుడు ద్వార పాలకుడు రాజు అనుమతితో వారిని సభలోకి ప్రవేశపెట్టాడు.

జ్యోతిర్మయం

జనకుడు అడిగిన చిక్కు ప్రశ్నలన్నింటికీ అష్టావక్రుడు చక్కగా సమాధానాలు చెబుతాడు. రాజకొలువులో పండితుల మధ్య నున్న 'వంది'తో వాదించి, అతనిని ఓడించి, అంతకు ముందు వందితో వాదించి ఓడిపోయిన పండితులను, తన తండ్రిని అష్టావక్రుడు బంధ విముక్తులను చేస్తాడు. జనక మహారాజు చేత బాల అష్టావక్రుడు సన్మానా లందుకుంటాడు. పండితుల ప్రశంసలు పొంది తన తండ్రి ఏకపాదునితో ఆశ్రమానికి చేరుకుంటాడు. అష్టావక్రుడు జనకుడికి చేసిన బోధలే 'అష్టావక్ర గీతలు'గా ప్రసిద్ధి పొందాయి.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

క్లుప్తంగా...

బీఎస్సీ నర్సింగ్ ప్రవేశాల దరఖాస్తుకు మరోసారి అవకాశం

- నేటి నుంచి ఈ నెల 12 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు
- ప్రకటన జారీ చేసిన కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం

సాక్షి, హైదరాబాద్: బీఎస్సీ నర్సింగ్ కోర్సులో ప్రవేశాల దరఖాస్తుకు కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం మరోసారి అవకాశం ఇచ్చింది. ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ నిబంధనల మేరకు బీఎస్సీ నర్సింగ్ సీట్లను ఎంసెట్ మెరిట్ ఆధారంగా యూనివర్సిటీ ఇప్పటికే ప్రవేశాల ప్రక్రియ చేపట్టింది. బీఎస్సీ నర్సింగ్ ప్రవేశాలకు ఉన్న ఎంసెట్ క్వాలిఫైయింగ్ పర్సంటైల్ ప్రమాణాలను ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ ఈ ఏడాదికి సడలించింది. ఎంసెట్‌కు హాజరైన అభ్యర్థులను బీఎస్సీ నర్సింగ్ కోర్సు లో చేర్చుకోవడం ద్వారా ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయడానికి ఐఎన్‌సీకి అభ్యంతరం లేదని ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ మేరకు కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం దరఖాస్తుకు మరోసారి అవకాశం కల్పిస్తూ మంగళవారం ప్రకటన జారీ చేసింది. ఎంసెట్‌కు హాజరైన అభ్యర్థులు ఈ నెల 12వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు సంబంధిత ధ్రువపత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖా స్తు చేసుకో వాలని పేర్కొంది. మరింత సమాచారం కోసం www.knruhs.gov.in, https://tsparamed.tsche.inలో చూడాలని తెలిపింది.

సరిహద్దు జిల్లాల్లో మరింత అప్రమత్తం..!

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల హింసాత్మక ఘటన నేపథ్యంలో అప్రమత్తమైన పోలీసులు


సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉన్న పోలీసులు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. మంగళవారం ఛత్తీస్‌గఢ్‌లో తొలివిడత అసెంబ్లీ ఎన్నికల్లో మావోయిస్టుల హింసాత్మక ఘటనలు నమోదు కావడంతో తెలంగాణ పోలీసులు అప్రమత్తం అయ్యారు. మావోయిస్టుల కదలికలపై నిఘా పెట్టిన పోలీసులు, గ్రేహౌండ్స్, స్పెషల్ పార్టీ బృందాలతోపాటు కేంద్ర సాయుధ పోలీసు బలగాలతో తనిఖీలు ముమ్మరం చేశారు. ఇప్పటికే సరిహద్దుల్లోని చెక్‌పోస్టులతోపాటు సున్నిత ప్రాంతాలపైనా నిఘా పెంచారు. మంగళవారం సుక్మా జిల్లాలోని తోండమర్కా ప్రాంతంలో మందుపాతర పేలుడుకు పాల్పడటం, అదే జిల్లాలో బందా పోలింగ్ స్టేషన్, కాంకేర్ జిల్లాలో పోలింగ్ స్టేషన్‌పై నక్సల్స్ కాల్పులకు పాల్పడిన ఘటనల నేపథ్యంలో పోలీస్ ఉన్నతాధికారులు అప్రమత్తం అయ్యారు.

ఆపన్నులకు అండ..

పేదలకు లీగల్ సర్వీసెస్ అథారిటీ భరోసా

ఉచిత న్యాయ సేవలతోపాటు సామాజిక సేవా కార్యక్రమాలు	రైతుల కోసం అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌ల ఏర్పాటు	లోక్ అదాలత్‌ల నిర్వహణతో కోర్టుల భారం తగ్గింపు	రేపు జాతీయ న్యాయసేవల ప్రాధికారిక దినం

హక్కులకు భంగం కలిగితే కోర్టును ఎలా ఆశ్రయించాలో తెలియదు.. పోలీసు స్టేషన్‌లో తప్పుడు కేసు నమోదైతే ఎలా ఎదుర్కోవాలో అర్థం కాదు.. న్యాయవాదిని పెట్టుకొనేంత ఆర్థిక స్తోమత లేదు.. ఇదీ సగటు పేదవాడి దుస్థితి. ఈ పరిస్థితుల్లో పేద ప్రజలు న్యాయం కోసం ఏం చేయాలి.. ఎవరిని ఆశ్రయించాలి? ఈ ప్రశ్నలకు సమాధానంగా దాదాపు 25 ఏళ్ల క్రితం ఏర్పాటైందే 'లీగల్ సర్వీసెస్ అథారిటీ (ఎల్ఎస్ఏ)'. ఈ నెల 9న జాతీయ లీగల్ సర్వీసెస్ అథారిటీ డే, తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ (టీఎస్ఎల్ఎస్ఏ) నూతన భవన ప్రారంభోత్సవం సందర్భంగా ఆ సంస్థ కార్యకలాపాలపై ప్రత్యేక కథనం.



సాక్షి, హైదరాబాద్: పేదలకు న్యాయ సాయం అందించడం, కోర్టు కేసులను మధ్య వర్తిత్వంతో పరిష్కరించడం, లోక్ అదాలత్‌లు నిర్వహించడమే కాదు.. వృద్ధులకు ఆసరాగా నిలవడం, పేద విద్యార్థులకు సాయం చేయడం సహా అనేక సామాజిక కార్యక్రమాలను లీగల్ సర్వీసెస్ అథారిటీ నిర్వహిస్తోంది. పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా లేదా సుమోటోగా పలువురి బాధలను తీరుస్తోంది. కోవిడ్ సమయంలో ఆస్పత్రుల్లో పడకలు అందేలా చర్యలు తీసుకోవడం, విడిపోయిన భార్యాభర్తలను కలపడం, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి పనిచేస్తున్న కార్మికులకు చట్ట ప్రకారం వసతులు, వేతనం అందేలా చేయడం, మతిస్థిమితం కోల్పోయిన వారికి ఆశ్రయం కల్పించడం లాంటి ఎన్నో కార్యక్రమాలు చేపడుతోంది.

1995లో ఏర్పాటు

లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం–1987 ప్రకారం 1995 నవంబర్ 9న జాతీయ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఏర్పాటైంది. దీనికి జాతీయ స్థాయిలో ప్యాట్రన్ ఇన్ చీఫ్‌గా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్ర స్థాయిలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి వ్యవహరిస్తారు. జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో లీగల్ సర్వీసెస్ అథారిటీలు పని చేస్తాయి.

వృద్ధ దంపతులకు ఆసరా..

ఖమ్మం జిల్లాకు చెందిన రామన్న, కృష్ణమ్మ దంపతులు. ఉన్న ఆస్తినంతా పిల్లలకు పంచిపెట్టారు. మలి వయసులో తల్లిదండ్రులను చూసుకోవాల్సిన పిల్లలు వారిని నడిరోడ్డుపై వదిలేశారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా లీగల్ సెల్ అథారిటీ వారిని సంప్రదించింది. చట్టప్రకారం 3 ఎకరాల 20 గుంటల భూమిని తిరిగి వృద్ధ దంపతుల పేర రిజిస్ట్రేషన్ చేయించి ఆసరా కల్పించింది. అమరచింతలోని కియోస్క్‌లో వారికి ఆశ్రయం అందించింది.

నిరుద్యోగులకు చేయూత..

మహబూబ్‌నగర్ జిల్లా సెంట్రల్ లైబ్రరీకి రోజూ సుమారు 200 మంది విద్యార్థులు, నిరుద్యోగులు వస్తుంటారు. ఉదయం 8 గంటలకు వచ్చిన కొందరు సాయంత్రం 6 గంటల వరకు అక్కడే చదువుకుంటారు. వారిలో ఎక్కువ మంది పేదలే కావడం, మధ్యాహ్నాలు భోజనం కూడా చేయడం లేదని గుర్తించిన జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ.. మున్సిపల్ చైర్మన్‌తో సంప్రదింపులు జరిపింది. రూ. 5కే మంచి భోజనం అందేలా చర్యలు తీసుకొని చేయూతనిచ్చింది.

33 జిల్లాల్లో ప్రత్యేక న్యాయవాదులు

పేదల కేసులను వాదించేందుకు, న్యాయ సలహా అందించేందుకు ప్రత్యేకంగా న్యాయవాదులను నియమించాలన్న జాతీయ లీగల్ సర్వీసెస్ అథారిటీ నిర్ణయం మేరకు రాష్ట్రంలో చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సెల్ (జిల్లా స్థాయి), డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సెల్ (సబ్‌–కోర్టు), అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సెల్ (మేజిస్ట్రేట్ కోర్టు)ను పూర్తి స్థాయిలో నియమించారు. రాష్ట్రంలో ప్రభుత్వ సహకారంతో 33 జిల్లాల్లో ఈ కార్యాలయాలు ఏర్పాటయ్యాయి.

ఏం న్యాయ సేవలు అందిస్తారు?


1). ఉచితంగా న్యాయ సలహాలు అందించడం
2). కేసులు పరిశీలించి బాధితుని తరపున న్యాయవాదిని నియమించడం
3). కోర్టు ఫీజులను భరించడం
4). తీర్పు వచ్చిన తర్వాత కాపీలను ఉచితంగా అందజేయడం

ఆశ్రయించడం ఎలా?

ఉచిత న్యాయ సాయం కోసం మండల న్యాయసేవాధికార సంఘం, జిల్లా న్యాయ సేవాధికార సంస్థలు, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థకు దరఖాస్తు చేసుకోవచ్చు. మరిన్ని వివరాల కోసం 040–23446723 లేదా టోల్‌ఫ్రీ నంబర్ 15100ను సంప్రదించవచ్చు.

న్యాయ సాయం ఎవరికి..

1). షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు
2). మానవ అక్రమ రవాణా బాధితులు, యాచకులు
3). మహిళలు, బాలబాలికలు
4). అంగవైకల్యం కలిగిన వ్యక్తులు
5). ప్రకృతి విపత్తులు, కుల, మత కల్లోలాల బాధితులు
6). పారిశ్రామిక కార్మికులు
7). రక్షణ గృహం, అనాథ గృహం, బాలల గృహం, మానసిక చికిత్సాలయంలో ఆశ్రయం పొందుతున్న వారికి..
8). సంవత్సర ఆదాయం రూ.3 లక్షలు మించని వారికి...



అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్..



దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు సాయం చేయడం కోసం అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను రాష్ట్రంలో ప్రారంభించాం. దుక్కి దున్నే నాటి నుంచి పంటను మార్కెట్లో అమ్మేదాకా సాగు చట్టాలు, నియమాల గురించి రైతులకు అవగాహన కల్పిస్తాం. కోర్టులపై భారం తగ్గించేందుకు లోక్ అదాలత్‌లను నిర్వహిస్తున్నాం.

– గోవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి

ఐఏఎంసీకి ఆ భూమి

ఉచితంగా ఎందుకిచ్చారు?

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు
- 21లోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఇంటర్నేషనల్ అర్బిట్రేషన్ అండ్ మీడియేషన్ సెంటర్ (ఐఏఎంసీ) ట్రస్టుకు అత్యంత విలువైన ప్రాంతంలో రూ.300 కోట్ల విలువ చేసే 3.7 ఎకరాల ప్రభుత్వ భూమిని ఉచితంగా ఎందుకు ఇవ్వాల్సి వచ్చిందో చెప్పాలంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శి, రెవెన్యూ కార్యదర్శి, ఐఏఎంసీకి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ..విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది. 'రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం రాయదుర్గ్‌లోని సర్వే నంబర్ 83/1 ప్లాట్ నంబర్ 27 లోని 3.7 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయిస్తూ 2021, నవంబర్ 26న జీవో నంబర్ 126ను విడుదల చేసింది. నిర్వహణ ఖర్చుల కింద అదనంగా రూ.3 కోట్లను మంజూరు చేస్తూ మరో జీవోను విడుదల చేసింది. ఇది తెలంగాణ అర్బన్ ఏరియాస్ (డెవలప్‌మెంట్) చట్టాన్ని ఉల్లంఘించడమే అవుతుంది. సహజన్యాయ సూత్రాలకు ప్రభుత్వ నిర్ణయం విరుద్ధం. ఈ జీవోలను కొట్టివేసి, ప్రభుత్వం భూమిని స్వాధీనం చేసుకునేలా, రూ.3 కోట్లలో ఇక ముందు ఎలాంటి నిధులు ఇవ్వకుండా ఆపడంతో పాటు ఇప్పటివరకు ఇచ్చిన మొత్తాన్ని తిరిగి వెనక్కి తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలి. ఐఏఎంసీ ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా చర్యలు తీసుకోవాలి' అని పేర్కొంటూ న్యాయవాది కె.రఘునాథ్ రావు హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు.

సుప్రీంకోర్టు తీర్పు ఉల్లంఘనే...

ఈ పిల్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ కె.సుజన ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ..ఓ ప్రైవేట్ సంస్థకు రూ.300 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని ఉచితంగా ఇవ్వడం చట్టవిరుద్ధమన్నారు. ఈ సంస్థతో ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేకున్నా.. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పులను ఉల్లంఘించి భూమిని కేటాయించారన్నారు. ప్రైవేట్ సంస్థలకు ఉచితంగా భూమిని ఇవ్వకూడదని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును గుర్తు చేశారు. వాదనల అనంతరం కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు ఆదేశించింది.

బాబోయ్.. బాణసంచా

- వరుస ప్రమాదాలతో రైల్వేలో వణుకు
- టపాసులను రైళ్లలో తరలించకుండా ఈసారి గట్టి నిఘా
- పేలుడు సామాను తరలిస్తే గుర్తించేందుకు స్నిఫర్ డాగ్స్
- క్విక్ రియాక్షన్ బృందాలు సిద్ధం
- అదనంగా సీసీ కెమెరాలు ఏర్పాటు

రైళ్లలో బాణసంచా తరలిస్తే కఠిన చర్యలు

రైళ్లలో బాణసంచా తరలిస్తే కఠినచర్యలు తీసుకుంటామని దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఇలాంటి పేలుడు పదార్థాల వల్ల ప్రయాణికుల భద్రత, రైళ్లు, రైల్వేస్టేషన్‌లు, రైల్వే ఆస్తుల భద్రతకు తీవ్ర ముప్పుగా పరిణమిస్తుందన్నారు.

సాక్షి, హైదరాబాద్: వరుస ప్రమాదాలతో సతమతమవుతున్న రైల్వే శాఖ ఇప్పుడు దీపావళి పండుగ అనగానే తీవ్ర ఆందోళనకు గురవుతోంది. గుట్టు చప్పుడు కాకుండా బ్యాగుల్లో బాణసంచా పెట్టుకుని కొందరు ప్రయాణికులు రైళ్లలో ప్రయాణిస్తుంటారు. దీన్ని అడ్డుకునేందుకు ప్రతీ దీపావళి సందర్భంలో రైల్వే ఉద్యోగులు తనిఖీలు చేస్తుంటారు. అయినా వాటిని పూర్తిగా నియంత్రించ లేకపోతున్నారు. కొంతకాలంగా రైల్వే భద్రతపై మళ్లీ విమర్శలు వస్తున్నాయి. ఇటీవల తరచూ ఏదో ఒక ప్రాంతంలో రైలు ప్రమాదాలు చోటు చేసుకుని ప్రయాణికులు ప్రాణాలు కోల్పోతున్నారు. పరస్పరం రెండు రైళ్లు ఢీకొంటుండటంతో పాటు అగ్ని ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. దీంతో ఈసారి దీపావళి సందర్భంగా రైళ్లలో బాణసంచా తరలించకుండా మరింత పకడ్బందీగా వ్యవహరించాలని రైల్వే శాఖ జోన్లను ఆదేశించింది.

రంగంలోకి స్నిఫర్ డాగ్స్..

నిత్యం కిటకిటలాడే ప్రధాన రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల తనిఖీ రైల్వే సిబ్బందికి సవాల్‌గా ఉంటోంది. వందలాది మంది ఒకేసారి వస్తుండటంతో వారిని క్రమపద్ధతిన లోనికి పంపుతూ చెక్ చేసే వ్యవస్థ ఏర్పాటు చేసుకోవటం కుదరటం లేదు. స్టేషన్‌కు వెళ్లేందుకు నాలుగైదు దారులు ఉండటంతో, ఏదో ఓ దారి నుంచి లోనికి చేరుతున్నారు. వారి లగేజీలో బాణాసంచా ఉందో లేదో తనిఖీ చేసే పరిస్థితి లేకుండాపోయింది. ఈ నేపథ్యంలో స్నిఫర్ డాగ్స్ (జాగిలాలు)తో కూడిన క్విక్ రియాక్షన్ బృందాలను రైల్వే రంగంలోకి దింపుతోంది. ఈ సిబ్బంది సాధారణ దుస్తుల్లో ఉండి తనిఖీ చేస్తారు. రైల్వే స్టేషన్లలో, రైళ్లలో.. రెండు చోట్ల జాగిలాలతో తనిఖీ చేసి బాణాసంచాను సులభంగా గుర్తించాలని అధికారులు నిర్ణయించారు.

బాణ సంచా తరలిస్తే మూడేళ్ల జైలు శిక్ష

ప్రస్తుతం ఉన్న సీసీటీవీ కెమెరాలతోపాటు అదనంగా మరికొన్నింటిని ప్రధాన స్టేషన్లలో ఏర్పాటు చేస్తున్నారు. వాటి ద్వారా పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నారు. రైళ్లలో బాణసంచా తరలిస్తే రైల్వే చట్టం 1989లోని సెక్షన్ 164, 165 ప్రకారం రూ.వేయి జరిమానా, మూడేళ్ల జైలు శిక్ష విధించే అవకాశం ఉందంటూ రైల్వే సిబ్బంది ప్రచారం ప్రారంభించారు. ఎవరైనా బాణ సంచా సహా మండే స్వభావం ఉన్న ఇతర వస్తువులను రైళ్లలో తరలిస్తున్నట్టు దృష్టికొస్తే 139కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు.

క్లుప్తంగా...

విజయవంతంగా 'ప్రళయ్' క్షిపణి ప్రయోగం

బాలాసోర్: తక్కువ శ్రేణి బాలిస్టిక్ క్షిపణి(ఎస్ఆర్‌బీఎం) 'ప్రళయ్'ని మంగళవారం ఒడిశా తీరంలోని అబ్దుల్ కలాం దీవి నుంచి విజయవంతంగా పరీక్షించినట్లు రక్షణశాఖ తెలిపింది. పృథ్వీ డిఫెన్స్ వెహికల్ మీది నుంచి ఉదయం 9.30 గంటల సమయంలో ప్రయోగించిన ఈ క్షిపణి అన్ని నిర్దేశిత లక్ష్యాలను కచ్చితత్వంతో ఛేదించిందని వెల్లడించింది. భూమిపై నుంచి భూమిపై ప్రయోగించే వీలున్న ప్రళయ్‌కి 350 నుంచి 500 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఛేదించే సత్తా ఉందని తెలిపింది. ఘన రూప ఇంధనాన్ని ఇది ఉపయోగించుకుంటూ 500 నుంచి 1,000 కిలోల వరకు పేలోడ్‌ను మోసుకెళ్లగలదు. సరిహద్దుల్లో చైనా, పాకిస్తాన్‌ల నుంచి ఎదురవుతున్న సవాళ్లను తిప్పికొట్టే లక్ష్యంతో రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఓ) ఈ క్షిపణికి రూపకల్పన చేసిందని పేర్కొంది.

ఆ పథకం ఐదేళ్ల పొడిగింపు కోడ్ ఉల్లంఘనే

కాంగ్రెస్ పార్టీ ఆరోపణ

న్యూఢిల్లీ: ఛత్తీస్‌గఢ్‌లో ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న వేళ ప్రధాన్‌మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన(పీఎంజీకేవై) పథకాన్ని మోదీ సర్కార్ మరో ఐదేళ్లు పొడిగించడం ఎన్నికల కోడ్ నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుందని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ తన సామాజిక మాధ్యమ 'ఎక్స్' ఖాతాలో మంగళవారం ఒక పోస్ట్‌చేశారు. 'ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల మధ్యలో ఇలా పథకాన్ని పొడిగిస్తున్నట్లు ప్రధాని ప్రకటించడం ముమ్మాటికీ ఎన్నికల నిబంధనావళిని అతిక్రమించడమే. ఈ అంశాన్ని కేంద్ర ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణించి చర్యలు తీసుకోవాలి. పీఎంజీకేవై పథకం తప్పనిసరి అంటున్న ఇదే మోదీ 2013లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నపుడు పథకాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు' అని రమేశ్ ట్వీట్‌చేశారు.

ఈడీ.. బీజేపీ స్టార్ క్యాంపెయినర్: ఖర్గే

గ్వాలియర్: ఎన్నికల ప్రచారంలో బీజేపీ పార్టీ అభ్యర్థుల తరఫున ప్రధాని మోదీతోపాటు ఈడీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలూ స్టార్ క్యాంపెయినర్(ముఖ్య ప్రచారకర్త)లుగా మారిపోయాయని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. మంగళవారం మధ్య ప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో కాంగ్రెస్ ప్రచార సభలో ఖర్గే ప్రసంగించారు. 'ఒక్కో నియోజ వర్గంలో కాంగ్రెస్ ఒక్క అభ్యర్థినే బరిలో నిలుపుతోంది. కానీ బీజేపీ నలుగురిని రంగంలోకి దింపుతోంది. ఆ నలుగురిలో భౌతికంగా కనిపించేది ఒక్కడే. అతనే అక్కడి పార్టీ అభ్యర్థి. ఇక రెండో వ్యక్తి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్. మూడో వ్యక్తి సీబీఐ. నాలుగో వ్యక్తి ఇన్‌కమ్ ట్యాక్స్. ఈడీ, సీబీఐ, ఐటీ విభాగాలేకాక మోదీ, మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్ చౌహాన్ కలిసి మమ్మల్ని ఓడించాలని చూస్తున్నారు' అని ఖర్గే వ్యాఖ్యానించారు.

సోషలిస్టు సిద్ధాంతం నశించాలన్నదే కాంగ్రెస్ కోరిక

భోపాల్: సోషలిస్టు సిద్ధాంతం నశించాలని కాంగ్రెస్ పార్టీ కోరుకుంటోందని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. కాంగ్రెస్ సిద్ధాంతం, తమ పార్టీ సిద్ధాంతం వేర్వేరు అని చెప్పారు. అందుకే మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు లేకుండా విడిగా పోటీ చేస్తున్నామని తెలిపారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం నివారీ జిల్లా ఓర్చా పట్టణంలోని రామ్‌రాజా ఆలయంలో అఖిలేష్ మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కొన్ని పరిస్థితుల వల్ల కాంగ్రెస్‌తో జట్టు కట్టాల్సి వచ్చిందని అన్నారు. కానీ, సోషలిస్టుల అవసరం లేదని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారని ఆక్షేపించారు.

కెన్యా, సోమాలియాల్లో వరదలు.. 40 మంది మృతి

నైరోబీ: కెన్యా, సోమాలియాల్లో భారీ వర్షాలు, ఆకస్మిక వరదల కారణంగా 40 మంది మృతి చెందగా వేలాదిమంది నిరాశ్రయులయ్యారు. సోమాలియాలో సోమవారం సంభవించిన వర్షాలు, వరదల సంబంధిత ఘటనల్లో 25 మంది చనిపోయారు. జుబల్యాండ్ రాష్ట్రంలోని లూక్ జిల్లాలో 2,400 మంది వరదనీటిలో చిక్కుకుపోయారు. ఎగువనున్న ఇథియోపియా నుంచి వచ్చే వరదతో పరిస్థితి విషమించే ప్రమాదముందని భావిస్తున్నారు. దీంతో, ప్రభుత్వం అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. వరుసగా నాలుగేళ్లుగా దేశంలో వర్షాభావ పరిస్థితులు కొనసాగుతుండగా, ఇప్పుడు భారీ వర్షాలు కురుస్తున్నాయి. అదేవిధంగా, పొరుగునున్న కెన్యాలో శుక్రవారం నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో 15 మంది చనిపోయారు.

కేదార్‌నాథ్‌లో వరుణ్, రాహుల్

న్యూఢిల్లీ: ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్‌లో మంగళవారం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తన బాబాయి కొడుకు వరుణ్ గాంధీని కలుసుకున్నారు. ఇద్దరూ కొద్దిసేపు ముచ్చటించుకున్నారు. తర్వాత ఆలయంలో పూజల్లో పాల్గొన్నారు. సంజయ్, మేనకా గాంధీల కొడుకు, బీజేపీ ఎంపీ అయిన వరుణ్ గాంధీ కొంతకాలంగా కాషాయ పార్టీలో అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. గత ఏడాది వివాదాస్పద వ్యవసాయ బిల్లులపై ఆందోళనలు కొనసాగుతున్న సమయంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆయన వ్యాఖ్యలు చేశారు. తాజాగా, అన్నదమ్ముల కొడుకులిద్దరూ బహిరంగంగా ఒకే చోట కనిపించడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది.





ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్ పోలింగ్ బూత్ వద్ద క్యూలో నిలబడి గుర్తింపు కార్డులు చూపిస్తున్న ఓటర్లు, క్వార్ధాలో ఓటేసిన ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం రమణ్ సింగ్

ఛత్తీస్‌గఢ్‌లో 71% పోలింగ్

తొలి దశలో 20 నియోజకవర్గాల్లో పోలింగ్ | ఓటేసిన మాజీ సీఎం రమణ్ సింగ్, కాంగ్రెస్ చీఫ్ దీపక్

రాయ్‌పూర్/చర్ల: సార్వత్రిక ఎన్నికలకు సెమీ ఫైనల్స్‌గా భావించే ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో తొలి అంకానికి మంగళవారం ఛత్తీస్‌గఢ్, మిజోరం రాష్ట్రాలు శ్రీకారం చుట్టాయి. ఛత్తీస్‌గఢ్‌లో మొత్తం 90 స్థానాలకుగాను తొలి విడతలో 20 నియోజకవర్గాలకు మంగళవారం పోలింగ్ జరిగింది. సాయంత్రం ఐదింటికి అందిన సమాచారం మేరకు 71.48శాతం పోలింగ్ నమోదైంది. ఎన్నికలను నక్సల్స్ నిషేధించడం, కొన్ని ప్రాంతాల్లో ఉద్రిక్తత వంటి సమస్యలున్నా పోలింగ్ 70 శాతాన్ని మించడం విశేషం. మావోయిస్టు ప్రభావిత బస్తర్ ప్రాంతంలో మావోయిస్టులు ఎన్నికలను బహిష్కరించడంతో ముందుజాగ్రత్తగా మధ్యాహ్నం మూడింటి వరకే పోలింగ్‌ను అనుమతించారు. వేరే పోలింగ్ కేంద్రాల వద్ద జనం బారులు తీరి ఉండటంతో పోలింగ్ శాతం పెరిగే అవకాశాలున్నాయి. తొలి దశలో 20 నియోజకవర్గాల్లో 25 మంది మహిళలు సహా 223 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. 16 నియోజకవర్గాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్ల సంఖ్యే ఎక్కువ. మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ నేత రమణ్ సింగ్, ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ చీఫ్ దీపక్, ముగ్గురు రాష్ట్ర మంత్రుల పోటీచేస్తున్న స్థానాల్లోనూ పోలింగ్ జరిగింది. రాజ్‌నంద్‌గావ్ నుంచి బరిలో నిల్చిన రమణ్ సింగ్ తన స్వస్థలం కవర్ధాలో ఓటేశారు. 'ఈరోజు పోలింగ్ జరిగిన 20 స్థానాలకు 14 చోట్ల బీజేపీదే విజయం' అని రమణ్‌సింగ్ అన్నారు. బస్తర్ డివిజన్‌లో ఏడు జిల్లాల పరిధిలోని 126 గ్రామాల్లో స్వాతంత్ర్యం వచ్చాక మొట్టమొదటిసారిగా ఆయా గ్రామాల్లో ఏర్పాటైన పోలింగ్‌కేంద్రాల్లో గ్రామస్తులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఒకప్పుడు నక్సలైట్ జీవితం గడుపుతూ అమ్‌దాయ్ ఏరియా కమాండర్‌గా ఉన్న మాజీ మహిళా నక్సలైట్ సుమిత్రా సాహూ తొలిసారిగా ఓటేశారు. 34 ఏళ్ల సుమిత్రా నక్సలిజం వీడి 2019లో పోలీసు శాఖలో చేరి కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. రాజ్‌నంద్‌గావ్ పరిధిలోని రామ్‌నగర్ పోలింగ్ స్టేషన్‌లో ఒక ఈవీఎం మొరాయించింది. దీంతో ఓటర్లు భారీ క్యూలో చాలా సేపు వేచి ఉండాల్సి వచ్చింది.

దేశంలో తొలిసారిగా..

అంతాగఢ్ నియోజకవర్గంలో ట్రాన్స్‌జెండర్ ఓటర్ల కోసం ప్రత్యేకంగా ఏడువర్ణాల్లో 'రెయిన్‌బో' మోడల్ పోలింగ్ స్టేషన్లను ఏర్పాటుచేశారు. రెయిన్‌బో పోలింగ్‌బూత్‌లు ఏర్పాటుచేయడం దేశంలోనే తొలిసారి. ఇక్కడ భద్రత కోసం నలుగురు ట్రాన్స్‌జెండర్ పోలీస్ సిబ్బందిని నియమించడం విశేషం. పూర్తిగా మహిళా సిబ్బందితో 200 'సంఘవారీ' పోలింగ్ స్టేషన్లను ఏర్పాటుచేశారు. 20 పోలింగ్ కేంద్రాలను దివ్యాంగులైన సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్ర గవర్నర్, మాజీ బీజేపీ నేత కంభంపాటి హరిబాబు ఐజ్వాల్ సౌత్–2 నియోజకవర్గంలోని పోలింగ్‌కేంద్రంలో ఓటు వేశారు.



నారాయణ్‌పూర్‌లో పోలింగ్ బూత్ వద్ద ఓటేసిన గుర్తు చూపిస్తున్న పోలీస్ కానిస్టేబుల్ సుమిత్రా సాహూ. మొట్ట మొదటిసారిగా ఓటు హక్కు వినియోగించుకున్న ఈమె మాజీ మావోయిస్టు.

దద్దరిల్లిన బస్తర్

ఛత్తీస్‌గఢ్‌లో మొదటి విడత పోలింగ్ సందర్భంగా మావోయిస్టులు రెచ్చిపోయారు. నాలుగుచోట్ల భద్రతాబలగాలతో ఎదురుకాల్పులకు దిగారు. ఒక మందుపాతర పేల్చారు. సుక్మా జిల్లా తొండామర్కా క్యాంపు సమీపంలోని ఎల్మగుండ వద్ద మావోలు అమర్చిన మందుపాతరపై పొరపాటున కాలుమోపిన సీఆర్‌పీఎఫ్ కోబ్రా కమాండో శ్రీకాంత్ గాయపడ్డారు. కాగా, చింతగుఫ పోలీస్ స్టేషన్ పరిధిలో మావోయిస్టులతో జరిగిన ఎదురుకాల్పుల్లో నలుగురు భద్రతా సిబ్బంది గాయపడ్డారు. కాంకేర్ జిల్లా బందే పోలీస్‌స్టేషన్ పరిధిలోని పనావర్ గ్రామం సమీపంలో ఎదురుకాల్పులు జరిగాయి. ఘటనాస్థలి నుంచి ఒక ఏకే–47 రైఫిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తప్పించుకుపోయిన మావోయిస్టుల కోసం పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. బిజాపూర్, సుక్మా జిల్లా బందా, నారాయణ్‌పూర్ జిల్లా ఓర్చా పోలీస్‌స్టేషన్ పరిధిలో మావోయిస్టులు, బలగాలకు మధ్య స్వల్ప ఎదురుకాల్పుల ఘటనలు చోటుచేసుకున్నాయని పోలీసులు తెలిపారు.

మిజోరంలో 77 శాతానికి పైగా పోలింగ్

తొలి 'ప్రయత్నం'లో ఓటు వేయలేకపోయిన ముఖ్యమంత్రి

ఐజ్వాల్: అధికార మిజో నేషనల్ ఫ్రంట్(ఎంఎన్ఎఫ్), విపక్ష జోరమ్ పీపుల్స్ మూవ్‌మెంట్(జెడ్‌పీఎం), కాంగ్రెస్ మధ్య తీవ్రపోటీకి వేదికగా నిలిచిన మిజోరం శాసనసభ ఎన్నికలు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం 40 స్థానాలకూ ఒకే దఫాలో పోలింగ్ నిర్వహించారు. మంగళవారం సాయంత్రం ఆరు గంటలకు అందిన సమాచారం మేరకు 77.39 శాతం పోలింగ్ నమోదైందని అదనపు చీఫ్ ఎలక్టోరల్ అధికారి హెచ్.లియాంజెలా చెప్పారు. సవరించిన తుది ఫలితాలు బుధవారం వచ్చేసరికి పోలింగ్ శాతం 80 శాతాన్ని తాకొచ్చు. 18 మంది మహిళలు సహా మొత్తంగా 174 మంది అభ్యర్థులు ఈసారి బరిలో నిలిచారు. రాష్ట్రంలోని 8.57 లక్షల ఓటర్లు ఉన్నారు. సెర్చిప్ జిల్లాలో అత్యధికంగా 84.49 శాతం, ఐజ్వాల్ జిల్లాలో అత్యల్పంగా 73.09 శాతం పోలింగ్ నమోదైంది. ఎన్నికలు స్వేచ్ఛగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు 7,200 భద్రతా సిబ్బందిని నియోగించారు. పోలింగ్ కోసం రాష్ట్రవ్యాప్తంగా 1,276 పోలింగ్‌కేంద్రాలను ఏర్పాటుచేశారు.



మిజోరంలోని మమిట్ జిల్లాలో ఓటేసి వేలికున్న సిరాను చూపిస్తున్న వృద్ధ ఓటర్లు

ముఖ్యమంత్రి ఓటేయబోతే మొరాయించింది

ఐజ్వాల్‌లోని ఒక ఈవీఎం ఏకంగా ముఖ్యమంత్రినే రెండోసారి పోలింగ్‌కేంద్రానికి రప్పించింది. మొదటిసారి మొరాయించడమే ఇందుకు కారణం. ర్యామ్‌హ్ల్యాన్ వెంగ్లాయ్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో ఓటేసేందుకు ఉదయాన్ని ముఖ్యమంత్రి జోరామ్‌థంగా విచ్చేశారు. అప్పుడే ఈవీఎం మొరాయించింది. చేసేదేం లేక ఇంటికి వెనుతిరిగారు. మళ్లీ 9.40 గంటలకు వచ్చి ఓటేశారు. 'ఈసారి కనీసం 25 చోట్ల గెలుస్తాం' అని సీఎం వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు లాల్‌సావ్‌తా ఐజ్వాల్ వెస్ట్–3 నియోజకవర్గంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. 96 ఏళ్ల అంధుడు పూ జదావ్లా పోస్టల్ బ్యాలెట్‌ను కాదని స్వయంగా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటేశారు. పోలింగ్ నేపథ్యంలో మయన్మార్, బంగ్లాదేశ్ సరిహద్దులను మూసేశారు. రాకపోకలను ఆపేశారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడ ఏకంగా 81.61 శాతం పోలింగ్ నమోదవడం విశేషం. డిసెంబర్ మూడో తేదీన ఓట్లలెక్కింపు ఉంటుంది. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఎన్ఎఫ్ 26 చోట్ల గెలిచి అధికారాన్ని కైవసం చేసుకుంది. ఉపఎన్నికల్లో మరో రెండు చోట్ల గెలిచింది. విపక్ష జెడ్‌పీఎం ఎనిమిది చోట్ల గెలిచింది. బీజేపీ కేవలం ఒక్క స్థానంలో, కాంగ్రెస్ ఐదు చోట్ల విజయబావుటా ఎగరేశాయి. 'ఈసారి పట్టణప్రాంతాల్లో జెడ్‌పీఎం, గ్రామీణ ప్రాంతాల్లో ఎంఎన్ఎఫ్ ఎక్కువ సీట్లు గెలవొచ్చు' అన్న విశ్లేషణలు వినిపించాయి.



ఐజ్వాల్‌లో ఓటేస్తున్న సీఎం జోరామ్‌థంగా



ఐజ్వాల్‌లో ఓటేసిన అనంతరం వేలికున్న సిరాను చూపిస్తున్న మిజోరం కాంగ్రెస్ చీఫ్ లాల్‌సావ్తా



మిజోరంలోని చంఫాయ్(దక్షిణ) నియోజకవర్గంలో ఓటేసేందుకు వచ్చిన 101 ఏళ్ల పు రువాల్‌హ్‌నుడాలా దంపతులు

65 శాతానికి రిజర్వేషన్లు

- బిహార్ కేబినెట్ ఆమోదం
- ఈ నెల 9న అసెంబ్లీలో బిల్లు
- ప్రకటించిన సీఎం నితీశ్ కుమార్

పట్నా: బిహార్‌లో కుల రిజర్వేషన్లను 65 శాతానికి పెంచాలన్న సీఎం నితీశ్ కుమార్ ప్రతిపాదనకు మంగళవారం రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీని ఫలితంగా ఇతర వెనుకబడిన కులాలు, షెడ్యూల్డ్ కులాలు, తెగలకు రిజర్వేషన్ల వాటా ప్రస్తుతమున్న 50 శాతం నుంచి 65 శాతానికి పెరగనుంది. ఈ మేరకు తమ ప్రభుత్వం ప్రస్తుత సెషన్‌లోనే ఈ నెల 9వ తేదీన బిల్లును ప్రవేశపెట్టనుందని సీఎం నితీశ్ అసెంబ్లీలో తెలిపారు. అంతకుముందు, రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పూర్తి చేసిన వివాదాస్పద కులగణన సర్వే నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. వివిధ వర్గాల ఆర్థిక పరిస్థితులను సర్వే ప్రస్తావించింది. ఈ సందర్భంగా జరిగిన చర్చలో సీఎం మాట్లాడుతూ.. సంబంధిత వర్గాలతో సంప్రదింపుల తర్వాత కోటాను ఖరారు చేస్తామని, ఈ సెషన్‌లోనే ఆ మేరకు మార్పులు చేపడతామని ప్రకటించారు.

ప్రతిపాదిత రిజర్వేషన్లు ఇలా..

ఎస్సీల రిజర్వేషన్లు..	20%,
ఎస్టీ రిజర్వేషన్లు..	2%,
ఓబీసీలు, ఈబీసీ కోటా	43%

ప్రస్తుతం రిజర్వేషన్లు ఇవీ..

ఈబీసీలకు 18 శాతం రిజర్వేషన్లు, ఓబీసీలకు 12%, ఎస్సీలకు 16%, ఎస్టీలకు 1%, వెనుకబడిన కులాల మహిళలకు 3% రిజర్వేషన్ల కోటా ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యావకాశాల్లో అమలవుతోంది. బిహార్ సీఎం నితీశ్ ప్రతిపాదనలతో కేంద్రం కల్పించిన ఆర్థికంగా బలహీన వర్గాల(ఈడబ్ల్యూఎస్)కు 10% రిజర్వేషన్లు కూడా కలిపితే మొత్తం రిజర్వేషన్లు 75 శాతానికి చేరుకుంటాయి. సుప్రీంకోర్టు కులాల ఆధారిత రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి విధించిన విషయం తెలిసిందే.

ఇండియా ఎల్లప్పుడూ హిందూ దేశమే: హొసబళె

భుజ్: హిందూ దేశంగా ఖ్యాతికెక్కిన మన దేశాన్ని మళ్లీ కొత్తగా 'హిందూ దేశం'గా అధికారికంగా ప్రకటించాల్సిన పనిలేదని ఆర్ఎస్ఎస్ జాతీయ కార్యదర్శి దత్తాత్రేయ హొసబళె వ్యాఖ్యానించారు. గుజరాత్‌లోని భుజ్‌లో మూడ్రోజులుగా జరుగుతున్న ఆర్ఎస్ఎస్ అఖిల భారత కార్యనిర్వాహకుల సంఘం సమావేశాల సందర్భంగా హొసబళె మంగళవారం మీడియాతో మాట్లాడారు. ''ఇండియా ప్రస్తుత హిందూ దేశమే. భవిష్యత్తులోనూ భారత్ ఇలాగే కొనసాగుతుంది' అని అన్నారు.

జడ్జీలను 'ఎంచు'కుంటోంది

- వారి పేర్లనే ఆమోదిస్తోంది
- కేంద్రంపై సుప్రీం మండిపాటు
- తామే నిర్ణయం తీసుకునేలా చేయొద్దని హితవు



న్యూఢిల్లీ: ఉన్నత న్యాయస్థానాల్లో ఖాళీల భర్తీకి కొలీజియం సిఫార్సు చేసిన జాబితా నుంచి కొంత మందిని మాత్రమే న్యాయమూర్తులుగా కేంద్రం ఎంపిక చేసుకుంటోందని సుప్రీంకోర్టు ఆరోపించింది. కొలీజియం సిఫారసులన్నింటినీ పరిగణనలోకి తీసుకోవడం లేదని ఆక్షేపించింది. ఈ విషయంలో కేంద్రం వ్యవహార శైలి చాలా ఇబ్బందికరంగా ఉందంటూ తీవ్ర అసహనం వెలిబుచ్చింది. న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సుధాన్షు ధూలియా ధర్మాసనం మంగళవారం ఈ మేరకు పేర్కొంది. ఒక హైకోర్టు నుంచి మరో హైకోర్టుకు న్యాయమూర్తుల బదిలీకి కొలీజియం చేసిన పలు సిఫార్సులను కూడా పెండింగ్‌లో పెట్టడం ఆందోళనకరమని వ్యాఖ్యానించింది. ''ఈ పరిస్థితి చివరికి సర్వోన్నత న్యాయస్థానమో, కొలీజియమో దీనిపై కేంద్రానికి రుచించని నిర్ణయం తీసుకునేందుకు దారి తీయదనే మేం ఆశిస్తున్నాం'' అంటూ సుతిమెత్తగా హెచ్చరించింది. న్యాయమూర్తుల నియామకం, బదిలీలకు సంబంధించి కొలీజియం చేసిన సిఫార్సుల ఆమోదంలో కేంద్రం ఆలస్యం చేస్తోందంటూ దాఖలైన పిటిషన్లపై ధర్మాసనం విచారణ జరిపింది. కేంద్రం ఈ తీరుగా చేయడం చాలా సమస్యలకు దారి తీస్తోందని జస్టిస్ కౌల్ ఆందోళన వెలిబుచ్చారు. ''ఇది పదేపదే సమస్యగా మారుతోంది. దీన్ని మేం గతంలోనూ అటార్నీ జనరల్ దృష్టికి తీసుకొచ్చాం. కొన్ని సిఫార్సులను ఆమోదించి మరికొన్నింటిని పెండింగ్‌లో పెట్టడం న్యాయమూర్తుల సీనియారిటీ తదితర కీలక విషయాల్లో అనవసర సమస్యలకు తావిస్తోంది'' అంటూ ఆయన మండిపడ్డారు. కేంద్రం వ్యవహార శైలిని చూసి సీనియర్ న్యాయవాదులు న్యాయమూర్తులుగా బాధ్యతలు తీసుకునేందుకు ఇష్టపడటం కూడా లేదన్నారు. ''కొన్ని సిఫార్సులను కేంద్రం వెంటనే ఆమోదిస్తోంది. అది అభినందనీయమే. కానీ చాలాసార్లు కొలీజియం సిఫార్సుల్లో కొన్నింటిని మాత్రమే ఎంచుకుని ఆమోదిస్తుండటం ఆందోళనకరం. దయచేసి దీనికి అడ్డుకట్ట వేయండి'' అని అటార్నీ జనరల్ వెంకట రమణికి సూచించారు. ఏ న్యాయమూర్తి ఏ హైకోర్టులో పని చేయాలన్నది న్యాయవ్యవస్థ నిర్ణయానికే వదిలేయడం సబబన్నారు. ఈ అంశంపై కేంద్రం తీరుపై సుప్రీంకోర్టు ఇప్పటికే ఎంతో సహనంతో వ్యవహరించిందని పిటిషనర్ తరఫున వాదించిన ప్రశాంత్ భూషణ్ అన్నారు. ఇక దీనిపై కోర్టే కేంద్రాన్ని ఆదేశించాల్సిన సమయం వచ్చిందన్నారు. లేదంటే తామేం చేసినా చెల్లుతుందని అలుసుగా తీసుకునే ఆస్కారముందని చెప్పారు. దీనిపై గతంలోనే ఏజీని హెచ్చరించామని, కేంద్రం దృష్టికి తీసుకెళ్లానని ఆయన హామీ ఇచ్చారని జస్టిస్ కౌల్ గుర్తు చేశారు. కేంద్రంతో లోతైన చర్చలకు మరింత సమయం కోరారన్నారు. కానీ ఆ తర్వాత కూడా కొలీజియం చేసిన ఇటీవలి సిఫార్సుల నుంచి కూడా కేంద్రం కొన్ని పేర్లనే ఎంచుకుని ఆమోదించిందంటూ అభ్యంతరం వెలిబుచ్చారు. దీనిపై విచారణను నవంబర్ 20కి ధర్మాసనం వాయిదా వేసింది.

గాజాలో ఆగని వేట

నెల రోజులకు చేరిన ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం | దక్షిణ గాజాలో రాత్రి నుంచి ఉధృతంగా దాడులు

గాజా స్ట్రిప్/జెరూసలేం: ఇజ్రాయెల్–హమాస్ మిలిటెంట్ల మధ్య యుద్ధం మంగళవారం నెల రోజులకు చేరుకుంది. సోమవారం రాత్రి నుంచి ఇజ్రాయెల్ సైన్యం దక్షిణ గాజాపై వైమానిక దాడులు నిర్వహించింది. ఖాన్ యూనిస్, రఫా, డెయిర్ అల్–బలా నగరాల్లో పదుల సంఖ్యలో జనం ప్రాణాలు కోల్పోయారు. ఉత్తర గాజాలోని గాజీ సిటీలోకి ఇజ్రాయెల్ సేనలు అడుగుపెట్టినట్లు తెలిసింది. యుద్ధంలో ఇప్పటిదాకా గాజాలో 4,100 మంది చిన్నారులు సహా 10,328 మంది, ఇజ్రాయెల్‌లో 1,400 మందికిపైగా జనం మరణించారు. గాజాలో హమాస్‌ను అధికారం నుంచి కూలదోయడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ ప్రభుత్వం వ్యూహాలకు పదును పెడుతోంది. మిలిటెంట్ల కోసం ఇజ్రాయెల్ సైన్యం వేట కొనసాగిస్తోంది. ఉత్తర గాజాపై దృష్టి పెట్టింది. గాజా జనాభా 23 లక్షలు కాగా, యుద్ధం మొదలైన తర్వాత 70 శాతం మంది నిరాశ్రయులయ్యారు. ఆహారం, నీరు, ఔషధాలు, నిత్యావసరాలు లేక క్షణమొక యుగంగా కాలం గడుపుతున్నారు.

మరో ఐదుగురు బందీల విడుదల

ఇప్పటికే నలుగురు బందీలను విడుదల చేసిన హమాస్ మిలిటెంట్లు మరో ఐదుగురికి విముక్తి కలిగించారు. అక్టోబర్ 7న ఇజ్రాయెల్ దాడిచేసిన మిలిటెంట్లు దాదాపు 240 మందిని బందీలుగా గాజాకు తరలించడం తెల్సిందే.

గాజా రక్షణ బాధ్యత మాదే: నెతన్యాహూ

హమాస్ మిలిటెంట్లపై యుద్ధం ముగిసిన తర్వాత గాజా స్ట్రిప్ రక్షణ బాధ్యతను నిరవధికంగా ఇజ్రాయెల్ తీసుకుంటుందని ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహూ చెప్పారు. తద్వారా గాజా స్ట్రిప్ మొత్తం ఇజ్రాయెల్ నియంత్రణ కిందికి వస్తుందని సంకేతాలిచ్చారు. గాజాను తమఅధీనంలోకి తీసుకొచ్చేందుకు ఇజ్రాయెల్ ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. ఓ వార్తా సంస్థ ఇంటర్వ్యూలో నెతన్యాహూ మాట్లాడారు. గాజాలోకి మానవతా సాయాన్ని చేరవేయడానికి లేదా హమాస్ చెరలో ఉన్న 240 మంది బందీలను విడిపించడానికి వీలుగా మిలిటెంట్లపై యుద్ధానికి స్వల్పంగా విరామం ఇచ్చేందుకు అంగీకరించారు. అయితే, బందీలను హమాస్ విడిచిపెట్టేదాకా గాజాలో కాల్పుల విరమణ పాటించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.



రఫా పట్టణంలో ఇజ్రాయెల్ దాడి తర్వాత స్థానికుల ఆక్రందన

పెట్రోల్, డీజిల్ నిల్వలు ఖాళీ!

గాజాలోకి పెట్రోల్, డీజిల్ సరఫరాకు ఇజ్రాయెల్ అనుమతి ఇవ్వడం లేదు. గాజాలో ఇంధనం నిల్వలు పూర్తిగా నిండుకున్నట్లు సమాచారం. ఇంధనం లేక పరిస్థితి మరింత దిగజారుతోందని స్థానిక అధికారులు ఆందోళన చెందుతున్నారు. గాజాలో 35 ఆసుపత్రులు ఉండగా, వీటిలో 15 ఆసుపత్రుల్లో వైద్య సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. ఇజ్రాయెల్ దాడులతోపాటు ఇంధనం లేకపోవడమే ఇందుకు కారణం. మిగిలిన ఆసుపత్రులు పాక్షికంగానే పని చేస్తున్నాయి.

సమస్య పరిష్కారంలో భద్రతా మండలి విఫలం

నెల రోజులుగా కొనసాగుతున్న ఇజ్రాయెల్–హమాస్ యుద్ధానికి పరిష్కారం సాధించడంలో ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి మరోసారి విఫలమైంది. తాజాగా మండలిలో రెండు గంటలకుపైగా చర్చ జరిగింది. సభ్యదేశాలు భిన్న వాదనలు వినిపించాయి. ఏకాభిప్రాయానికి రాకపోవడంతో తీర్మానం ఆమోదం పొందలేదు. మానవతా సాయాన్ని గాజాకు చేరవేయడానికి అవకాశం కల్పించాలని ఇజ్రాయెల్‌కు అమెరికా సూచించింది.

స్త్రీలు చదువుకుంటే... భర్తలను కంట్రోల్‌లో పెట్టి జనాభాను తగ్గిస్తారు

నితీశ్ వ్యాఖ్య, సర్వత్రా దుమారం

పట్నా: మహిళలు విద్యావంతులైతే కలయిక వేళ భర్తలను అదుపులో పెడతారని, తద్వారా జనాభా తగ్గుతుందని బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. మహిళలు విద్యావంతులు అవుతున్నందువల్లే ఒకప్పుడు 4.3గా ఉన్న జననాల రేటు ప్రస్తుతం 2.9కు తగ్గిందని, త్వరలోనే 2కు చేరుతుందని నితీశ్ అసెంబ్లీలో అన్నారు. జాతీయ మహిళా కమిషన్ నితీశ్ వ్యాఖ్యలను ఖండించింది. 'అసెంబ్లీలో ఒక ముఖ్యమంత్రి దిగజారుడు వ్యాఖ్యలు చేయడం దారుణమని కమిషన్ చైర్ పర్సన్ రేఖ దుయ్యబట్టారు. 'ఒక ప్రజాస్వామ్య దేశంలో సీఎం స్థాయి నేతలే బాహాటంగా ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ఇక ఆ రాష్ట్రం పరిస్థితేంటో ఊహించవచ్చు' అని ఆమె అన్నారు.

కేజ్రీవాల్ జైలునుంచే పాలించాలా...?

దేశవ్యాప్త రిఫరెండం: ఆప్

న్యూఢిల్లీ: మద్యం విధానం కుంభకోణం కేసులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్టు చేస్తే ఆయన రాజీనామా చేయాలా, లేక జైలునుంచే పాలన కొనసాగించాలా అన్నదానిపై దేశవ్యాప్త రిఫరెండం నిర్వహిస్తామని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రకటించింది. మంగళవారం పార్టీ కౌన్సిలర్లతో కేజ్రీవాల్ జరిపిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. రిఫరెండం ఎప్పుడు జరపబోయేది మాత్రం ప్రకటించలేదు. అరెస్టయినా రాజీనామా మాత్రం చేయొద్దని భేటీలో కౌన్సిలర్లంతా కేజ్రీవాల్‌ను ముక్త కంఠంతో కోరినట్టు సమాచారం.

ఇప్పుడు ఓటుకు నోట్లు

అప్పట్లో జనాలే డబ్బులిచ్చే వారు

- అలా ప్రజల విరాళంతోనే ఎమ్మెల్యే అయ్యా...
- 1978లో ఆర్మూర్ నుంచి పోటీ చేసేందుకు.. ప్రజలే రూ. 36 వేలు విరాళంగా ఇచ్చారు
- మాజీ మంత్రి శనిగరం సంతోష్‌రెడ్డి మనోగతం

మోర్తాడ్(బాల్కొండ): వాస్తవంగా మాట్లాడుకుంటే..ఇప్పుడైతే ఓటుకు నోటు ఇవ్వాల్సిందే.. రూ.కోట్లు ఖర్చు పెట్టాల్సిందే.. కానీ 1978లో ఆర్మూర్ నుంచి తొలిసారిగా ఎన్నికల బరిలోకి దిగిన శనిగరం సంతోష్‌రెడ్డికి జనమే డబ్బులు పోగు చేసి ఇచ్చారట.. స్వయంగా అప్పట్లో ప్రజలు విరాళంగా ఇచ్చిన రూ.36 వేలనే ఎన్నికల ప్రచారం కోసం ఖర్చు చేసి తొలిసారిగా అసెంబ్లీలో అడుగుపెట్టానని సంతోష్‌రెడ్డి చెప్పుకొచ్చారు. ఆ తర్వాత పలు మార్లు అసెంబ్లీకి ఎన్నికై మంత్రిగా కూడా పని చేసిన ఆయన ప్రస్తుత ఎన్నికల నేపథ్యంలో తన మనోగతాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు. వివరాలు ఆయన మాటల్లోనే.



- 1978లో ఆర్మూర్ నియోజకవర్గం నుంచి ఇందిరా కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన నేను సొంతంగా ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. రాజకీయాల్లోకి రాక ముందు బీడీ కార్మికుల కోసం మజ్దూర్ యూనియన్ ఏర్పాటు చేశాం. బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాం. ఆ అభిమానంతో ఆర్మూర్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాల ప్రజలు నా ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం కోసం రూ.36 వేలను విరాళంగా ఇచ్చారు.

స్వచ్ఛందంగానే తరలివచ్చేవారు...

ఎన్నికల ప్రచారం కోసం మేము ఏ గ్రామానికి ఏ రోజు వస్తున్నామో ఆ గ్రామ పెద్దలకు ఒకటి, రెండు రోజుల ముందు సమాచారం ఇచ్చేవాళ్లం , మేము గ్రామానికి చేరుకోగానే మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి బొడ్డెమ్మ(బతుకమ్మ) పాటలు పాడుతూ గ్రామంలో ఊరేగించేవారు. ఏ ఒక్కరు కూడా నయాపైసా ఆశించకుండా ప్రచారంలో నా వెంట ఉండేవారు. ఇప్పుడు మాత్రం ప్రచారం కోసం జనసమీకరణ చేయడానికి నాయకులు ఎన్ని తంటాలు పడుతున్నారో చెప్పనక్కరలేదు.



ధాన్యలక్ష్మి దీవించమ్మా!

ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం సూర్యాపేట జిల్లా మోతె మండలం నర్సింహాపురంలో ధాన్యం బస్తాకు దండం పెడుతున్న కోదాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పద్మావతి.



తెలంగాణను ద్రోహుల చేతిలో పెట్టే కుట్ర..

Interview

- కేసీఆర్‌పై కక్షగట్టిన వారంతా కాంగ్రెస్, బీజేపీల పంచన చేరారు
- అధికారం కోసం అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారు

మంత్రి హరీశ్‌రావు

కల్వల మల్లికార్జున్‌రెడ్డి

కష్టపడి సాధించిన రాష్ట్రాన్ని ద్రోహుల చేతిలో పెట్టే కుట్ర జరుగుతోందని.. సమైక్యవాది చంద్రబాబుతో కలసి పనిచేస్తున్నవారు తెలంగాణ వ్యతిరేకుల చేతుల్లో రాష్ట్రాన్ని పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. ఉద్యమ సమయంలో కేసీఆర్‌పై కక్షగట్టి, కుట్రలు చేసి నిందలు వేసి తెలంగాణవాదాన్ని దెబ్బతీయాలనుకున్న ద్రోహులంతా ప్రస్తుతం కాంగ్రెస్, బీజేపీ పంచన చేరారని పేర్కొన్నారు. బ్యారేజీ పిల్లర్లు ఒకటో రెండో కుంగితే కాళేశ్వరం ప్రాజెక్టే మునిగిపోయిందంటూ విపక్షాలు పైశాచిక ఆనందంతో వికృత వ్యాఖ్యలు చేస్తున్నాయని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో హరీశ్‌రావు 'సాక్షి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలివీ..

బీజేపీ, కాంగ్రెస్ జాతీయ నేతల ప్రచారాన్ని ఏమంటారు?

టికెట్ల కోసం ఇప్పటికే ఢిల్లీ చుట్టూ తిరుగుతున్న కాంగ్రెస్, బీజేపీ నేతలు.. చివరికి ప్రచారం కోసం కూడా ఆ నాయకులపైనే ఆధారపడటం సిగ్గుచేటు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాంగ్రెస్, బీజేపీ నేతలు ఉత్తరాది నేతల కాళ్ల వద్ద తాకట్టు పెడుతున్నారు. రేపు పాలన కూడా ఢిల్లీ నేతల రిమోట్‌లోనే ఉంటుంది. కేసీఆర్ ఉండగా పరాయిపాలన అవసరమా?


రాబోయే రోజుల్లో మీ ప్రచార సరళి ఎలా ఉండబోతోంది?

హుస్నాబాద్ సహా ఉమ్మడి మెదక్‌లోని 11 నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ యంత్రాంగాన్ని సమన్వయం చేస్తూనే పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రచారంలో పాల్గొంటున్నా. మొదటి దశలో సీఎం ప్రచార సభలు పూర్తయిన చోట అవసరాన్ని బట్టి, పార్టీ వ్యూహం మేరకు నేను, కేటీఆర్ పర్యటనలు చేస్తాం.

> “కర్ణాటక నుంచి డబ్బులు తెచ్చి ఇక్కడ ప్రభావితం చేసే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి.”

దుబ్బాక అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడిని ఎలా చూస్తున్నారు?

కొత్త ప్రభాకర్‌రెడ్డిపై హత్యాయత్నం ఘటనలో పోలీసులు విచారణ చేస్తున్నారు. దీని వెనుక కాంగ్రెస్, బీజేపీ నాయకులు సహా ఏ ఇతర శక్తులున్నా వదిలి పెట్టేది లేదు. రాష్ట్రంలో ప్రత్యర్థులను నిర్మూలించే సంస్కృతి లేదు. ఆస్పత్రిలో ఉన్న ప్రభాకర్‌రెడ్డితో నామినేషన్ వేయించేందుకు ఎలా తరలించాలనే అంశంపై వైద్యులతో మాట్లాడుతున్నాం. ప్రభాకర్‌రెడ్డి కుటుంబానికి అండగా ఉంటాం, అవసరమైతే దుబ్బాక ఎన్నికల ప్రచార బాధ్యత కూడా తీసుకుంటా.



కాంగ్రెస్, బీజేపీ ఇతర పార్టీలతో పొత్తులతో ముందుకు వెళ్తున్నాయి. మీ ఒంటరి పోరు ఫలితాన్నిస్తుందా?

రాష్ట్రం ఏర్పడితే కొన్నిరోజులు అన్నం మానేసిన పవన్‌కల్యాణ్‌తో బీజేపీ పొత్తు పెట్టుకుంటే.. టీడీపీతో కాంగ్రెస్ పరోక్షంగా పొత్తు పెట్టుకుంది. కష్టపడి సాధించిన రాష్ట్రాన్ని ద్రోహుల చేతిలో పెట్టే కుట్ర జరుగుతోంది. తెలంగాణవాదాన్ని దెబ్బతీయాలనుకున్న ద్రోహులు కాంగ్రెస్, బీజేపీలను అడ్డం పెట్టుకుని తెలంగాణను, కేసీఆర్‌ను దెబ్బతీయాలని ప్రయత్నిస్తున్నారు. సమైక్యవాది చంద్రబాబుతో కలసి పనిచేస్తున్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి తెలంగాణ ద్రోహులతో సత్సంబంధాలు ఉన్నాయి. ఆయన సమైక్యవాదులతో అంటకాగుతున్నారు. ఉద్యమ సమయంలో పదవికి రాజీనామా చేయని కిషన్‌రెడ్డి నేడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి ఆయనకు సలహాదారు. తెలంగాణ ద్రోహుల పట్ల తెలంగాణ ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. మేం తెలంగాణ ప్రజలకు దగ్గరగా ఉన్నాం. బీజేపీ, కాంగ్రెస్ మాకు సమాన ప్రత్యర్థులే.

కాళేశ్వరం ప్రాజెక్టుపై విమర్శలు, నివేదికల సంగతేంటి?

నాయకులకు ప్రజలకు మంచి జరగాలనే ఉద్దేశం లేదు. కాళేశ్వరం మునిగితే కేసీఆర్‌ను బద్నాం చేయడం ద్వారా నాలుగు ఓట్లు సాధించే తాపత్రయం. కాళేశ్వరం అంటే 21 పంపుహౌస్‌లు, 22 లిఫ్టులు, 203 కిలోమీటర్ల గ్రావిటీ టన్నెల్, 98 కిలోమీటర్ల ప్రెజర్ పైప్ లైన్, 1,531 కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్స్, 141 టీఎంసీల సామర్థ్యం కలిగిన 19 రిజర్వాయర్లు, మూడు బ్యారేజీలు.. ఇంత భారీ ప్రాజెక్టులోని ఒక బ్యారేజీలో ఒకటో రెండో పిల్లర్లు కుంగితే కాళేశ్వరం మునిగిపోయిందంటూ పైశాచిక ఆనందంతో విపక్షాలు వికృత వ్యాఖ్యలు చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మీద నయాపైసా భారం పడకుండా టెక్నికల్ రిపోర్టుల ఆధారంగా ఏజెన్సీల ద్వారా పునరుద్ధరణ జరుగుతుంది. కాళేశ్వరానికి రూ.80వేల కోట్లు ఖర్చు పెడితే రాహుల్‌గాంధీ రూ.లక్ష కోట్ల అవినీతి అంటూ మతిలేని మాటలు అంటున్నారు. ఇప్పటికే మల్లన్నసాగర్‌లో 20 టీఎంసీలు, కొండపోచమ్మ సాగర్‌లో 10 టీఎంసీలు, అనంతగిరి, రంగనాయక్ సాగర్‌లలో మూడేసి టీఎంసీలు, మిడ్ మానేరులో 25 టీఎంసీల నీళ్లు నిల్వ ఉన్నాయి.

బీఆర్‌ఎస్ మేనిఫెస్టోపై కాంగ్రెస్, బీజేపీ చేస్తున్న విమర్శలపై మీ స్పందన?

రైతుబంధు, ఆసరా వంటి మా పథకాలను కాంగ్రెస్ కాపీ కొట్టింది. గతంలో నీటి తీరువా, భూమిశిస్తు, కరెంటు బిల్లులు, మార్కెట్ శిస్తు రూపంలో రైతుల ముక్కుపిండి వసూలు చేసిన చరిత్ర కాంగ్రెస్‌ది. అవన్నీ బంద్ చేసి 'రైతుబంధు'తో ఆదుకుంటున్నది కేసీఆర్. కానీ కాంగ్రెస్ రైతులను అవమానిస్తూ రైతుబంధు పథకాన్ని నిలిపివేయాలని ఎన్నికల సంఘానికి లేఖలు రాసింది.

మీ ప్రచారంలో కాంగ్రెస్ కర్ణాటక నేతలపై విమర్శలు ఎందుకు?

ఇక్కడి ప్రజాసమస్యలను గాలికొదిలేసి తెలంగాణలో 'కర్ణాటక మోడల్' అమలు చేస్తామనడం తెలంగాణ పురోగతిని 20 ఏళ్లు వెనక్కి నెట్టడమే. కాంగ్రెస్ వస్తే కరెంటు కష్టాలు వస్తాయని గతంలో తెలంగాణ ప్రజలకు అనుభవమే. 24గంటలు ఇస్తున్నచోట 5 గంటలు ఇచ్చేవాళ్ల ప్రచారం చేయడం విడ్డూరం. కర్ణాటక నుంచి తెచ్చిన డబ్బుతో తెలంగాణ రాజకీయాలను ప్రభావితం చేయాలని చూస్తున్నారు. నేతలను అంగడి సరుకులా కొనుగోలు చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది.

బీజేపీ 'బీసీ సీఎం' ప్రకటనపై...

'తల్లిని చంపి బిడ్డను తీశారు' అని తెలంగాణ ఏర్పాటును అవమానించిన ప్రధాని మోదీకి ఇక్కడి ప్రజల ఓట్లు అడిగే నైతిక హక్కు లేదు. బీసీల మీద ప్రేమ ఉంటే కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి.

గజ్వేల్‌లో ఈటల రాజేందర్ పోటీపై...

గజ్వేల్‌లో కేసీఆర్ కనీసం లక్ష ఓట్ల మెజారిటీతో గెలుస్తారు. కేసీఆర్ గతుకుల గజ్వేల్‌ను బతుకుల గజ్వేల్‌గా మార్చారు. వందేళ్ల అభివృద్ధిని పదేళ్లలోనే చేసి చూపించారు. సీఎంపై పోటీ ద్వారా తాను పెద్ద నాయకుడినని చెప్పుకోవడానికి ఈటల ప్రయత్నిస్తున్నారు.

సిద్దిపేటలో మీ మెజారిటీ రికార్డును మళ్లీ బ్రేక్ చేస్తారా?

పార్టీ కోసం పనిచేయడం నా బాధ్యత. నిరంతరం నియోజకవర్గ ప్రజల నడుమ ఉంటూ శక్తివంచన లేకుండా వారి కష్టసుఖాల్లో తోడున్నా. వారంతా నా కుటుంబ సభ్యులు. ఈసారి ఎన్నికల పరీక్షలోనూ మంచి మార్కులు వేస్తారనే భావిస్తున్నా.

మైనంపల్లి హన్మంతరావు మీపై ఆరోపణలు ఎందుకు చేశారు?

సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో 90 శాతం మందికిపై టికెట్లు ఇచ్చాం. అందువల్ల కొందరు ఆశించినవి నెరవేరలేదు. మైనంపల్లికి, ఆయన కుమారుడికి టికెట్ ఇస్తేనే బీఆర్‌ఎస్, కేసీఆర్, హరీశ్ మంచివారు, లేకపోతే కాదా ? మైనంపల్లి తన కుటుంబం కోసమే తప్ప ప్రజల కోసం ఆలోచించ లేదని స్పష్టమవుతోంది.



తన తల్లితో కలిసి ఆలేరులో నామినేషన్ వేస్తున్న గుజ్జుల రాంచంద్రారెడ్డి

ఒక్కో రూపాయి.. ఓటర్ల నుంచే తీసుకొని

వరుసగా నాలుగు ఎన్నికల్లో ఇదే తీరుగా... ఆలేరులో గుజ్జుల నామినేషన్

యాదగిరిగుట్ట రూరల్: ఎలక్షన్లంటే ఓటర్లకు వందలు, వేలు ఇవ్వడం ఎక్కడైనా చాలా రివాజుగా మారింది. కానీ ఇందుకు విరుద్ధంగా యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం గౌరాయపల్లికి చెందిన గుజ్జుల రాంచంద్రారెడ్డి ప్రజల నుంచే ఒక్కొక్క రూపాయి తీసుకొని ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేస్తుంటారు. డబ్బున్న వాళ్లే రాజకీయాల్లోకి వస్తున్న ప్రస్తుత నేపథ్యంలో ప్రజల్లో అవగాహన తెచ్చేందుకు ఆయన ఇప్పటికే మూడు సార్లు ఎన్నికల్లో పోటీ చేశారు. 2009 ఎన్నికల్లో 2,011 ఓట్లు, 2014లో 1,050, 2018లో 700 ఓట్లు సాధించారు. ఇప్పుడు తాజాగా నాలుగోసారి బరిలోకి దిగేందుకు మంగళవారం నామినేషన్ వేశారు. ధన రాజకీయాలకు స్వస్తి పలికేందుకు, ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు జనవరి 23న సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా 2009లో ఈ ఒక్క రూపాయి ఉద్యమాన్ని ప్రారంభించినట్లు గుజ్జుల తెలిపారు. తాత్కాలిక ప్రయోజనాలను ఆశించకుండా ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కార్యకర్తల సాయంతో సభకు వస్తున్న ఇల్లెందు కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య



గాయమైననూ తప్పడం లేదు!

ఇల్లెందురూరల్: భద్రాది కొత్తగూడెం జిల్లా ఇల్లెందు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరం కనకయ్య మూడు రోజుల క్రితం ప్రమాదానికి గురయ్యారు. ఆస్పత్రిలో చికిత్స చేయించుకోగా, వైద్యులు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. కానీ, ఎన్నికలు సమీపిస్తుండటంతో కాలుకు కట్టు కట్టుకుని మరీ ఆయన ప్రచారంలో పాల్గొంటున్నారు. ఇల్లెందు మండలం రాఘబోయినగూడెంలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రచారానికి వాహనంలో వచ్చిన ఆయన్ను కార్యకర్తలు చేతులతో కొద్దిదూరం తీసుకెళ్లారు. ఆ తర్వాత వాకర్ సాయంతో వేదిక వద్దకు చేరుకుని మాట్లాడారు.

'సుత్తి' దెబ్బ ఎవరికి..

బొల్లోజు రవి

- ఏ పార్టీకి లాభం అనే అంశంపై చర్చ
- కాంగ్రెస్‌తో కొలిక్కిరాని పొత్తు
- 19 నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించిన సీపీఎం
- ఎక్కువగా ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లోనే పోటీ
- ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలితే ఆయా స్థానాల్లో కాంగ్రెస్‌కు నష్టమనే అభిప్రాయం

నల్లగొండ జిల్లాలోని మిర్యాలగూడతో పాటు ఖమ్మం జిల్లాలోని వైరా స్థానం కూడా తమకు ఇవ్వాలని సీపీఎం పట్టుబట్టడం, మిర్యాలగూడ మాత్రమే ఇస్తానని కాంగ్రెస్ చెప్పడంతో సీపీఎం ఒంటరిగా అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దిగింది. ఇప్పటి వరకు రెండు విడతల్లో 19 నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించింది. కానీ కాంగ్రెస్ పార్టీ ఇప్పటికీ పొత్తుపై సీపీఎంతో చర్చలు జరుపుతూనే ఉంది. దీంతో చివరి క్షణంలో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయనే దానిపై రెండు పార్టీల కార్యకర్తల్లో కొంత ఉత్కంఠ నెలకొంది. మరోవైపు సీపీఐతో కాంగ్రెస్ పొత్తు కుదిరిన నేపథ్యంలో.. సీపీఎం ఒంటరిగా బరిలోకి దిగితే ఎవరికి లాభం? ఎవరికి నష్టం? అనే చర్చ జోరుగా సాగుతోంది.



అసలు సీపీఎం ఓటింగ్ ఎంత?

సీపీఎం పోటీ చేస్తున్న 19 స్థానాల్లో ఉమ్మడి ఖమ్మం , నల్లగొండ జిల్లాల్లోనే ఎక్కువ సీట్లు ఉన్నాయి. కాగా సీపీఎం కారణంగా ఈ జిల్లాల్లో లేదా ఈ స్థానాల్లో తమకు ఏమైనా నష్టం జరుగుతుందా అనే ఆందోళన కాంగ్రెస్ వర్గాల్లో ఉంది. 2018 అసెంబ్లీ ఎన్నికలలో వచ్చిన ఓట్లను విశ్లేషిస్తే, సీపీఎం కొన్నిచోట్ల కాస్త ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు. భద్రాచలం, వైరా, మిర్యాలగూడ లాంటి స్థానాల్లో ఓ మాదిరి సంఖ్యలో ఓట్లు పడే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు. అప్పటి ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ కలిసి పోటీ చేయగా, సీపీఎం ఒంటరిగా రాష్ట్ర వ్యాప్తంగా 26 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసి మొత్తం 91,099 ఓట్లు మాత్రమే పొంది ఒక్క సీటూ గెలవలేదు. సీపీఐ 3 స్థానాల్లో పోటీ చేసి 83,215 ఓట్లు సాధించినా ఎక్కడా గెలవలేదు. ఇండిపెండెంట్ అభ్యర్థులు రాష్ట్రవ్యాప్తంగా పొందిన ఓట్ల కన్నా సీపీఐ, సీపీఎం పార్టీలు సాధించిన ఓట్లు చాలా తక్కువగా ఉన్నాయి. ఆ ఎన్నికల్లో ఇండిపెండెంట్లకు ఏకంగా 6.73 లక్షల ఓట్లు (3.3 శాతం) వచ్చాయి. అంతేకాదు నోటాకు వచ్చిన స్థాయిలోనూ ఉభయ కమ్యూనిస్టు పార్టీలకు ఓట్లు రాలేదంటే అప్పటి పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుంది. అప్పట్లో నోటాకు 2.2 లక్షలు అంటే 1.1 శాతం ఓట్లు వచ్చాయి. సీపీఎం రాష్ట్రంలో ఆ ఎన్నికల్లో కేవలం 0.44 శాతం ఓట్లు మాత్రమే పొందింది. అధికంగా భద్రాచలంలో 14,228, వైరాలో 11,373, మిర్యాలగూడలో 11,221, ఇబ్రహీంపట్నంలో 9,106, పాలేరులో 6,769 ఓట్లు వచ్చాయి. అత్యంత తక్కువగా హైదరాబాద్‌లోని నాంపల్లిలో 400 ఓట్లు మాత్రమే వచ్చాయి. కాగా అప్పటికీ ఇప్పటికీ సీపీఎం పెద్దగా పుంజుకున్నదేం లేదని, వాస్తవానికి అప్పటికంటే ఇప్పుడు పార్టీ ఓటు బ్యాంక్ ఇంకా తగ్గిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సీపీఎం పోటీతో ఏ పార్టీకి ప్రయోజనం?

2018లో ఓటింగ్‌ను పరిశీలిస్తే చూస్తే, ఇప్పుడు సీపీఎం బరిలో నిలిచే స్థానాల్లో ఎక్కడా గెలిచే పరిస్థితి లేదని ఆ పార్టీ వర్గాలే చెబుతున్నాయి. అయితే పార్టీ విధానాన్ని ముందుకు తీసుకెళ్లడం, బీజేపీని ఓడించడమే తమ లక్ష్యమని ఆ పార్టీ చెబుతోంది. కాగా ఐదారు నియోజకవర్గాల్లో ఇతర పార్టీల గెలుపు ఓటములను ప్రభావితం చేసే అవకాశం సీపీఎంకు ఉందని విశ్లేషకులంటున్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల మధ్య ఓట్ల వ్యత్యాసం భారీగా ఉంటే, ఆయా స్థానాల్లో సీపీఎం పోటీ వల్ల పెద్దగా నష్టం ఏమీ ఉండదని అంటున్నారు. అదే పోటాపోటీగా ఉన్న స్థానాల్లో మాత్రం సీపీఎంకు పడిన ఓట్ల వల్ల ఏదో ఒక పార్టీ నష్టపోయినట్టుగానే పరిగణించాల్సి వస్తుంది. మరోవైపు కొన్నిచోట్ల ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలితే ఆ మేరకు కాంగ్రెస్‌కు నష్టమని అంటున్నారు. ఈ నేపథ్యంలోనే, సీపీఎంతో పొత్తుతో కొంత ప్రయోజనం ఉంటుందన్న అభిప్రాయంతోనే.. కాంగ్రెస్ ఇంకా ఆశలు వదులుకోలేదు. మిర్యాలగూడ స్థానంలో అభ్యర్థిని ప్రకటించకుండా అందుకే పెండింగ్‌లో పెట్టిందని చెబుతున్నారు.

మరో 3 స్థానాలకు సీపీఎం అభ్యర్థుల ప్రకటన

ఇప్పటివరకు 16 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన సీపీఎం, మంగళవారం మరో మూడు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. కోదాడలో మట్టిపెల్లి సైదులు, మునుగోడులో దోనూరు నర్సిరెడ్డి, ఇల్లెందులో దుగ్గి కృష్ణలను ఖరారు చేసినట్టు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు.

జంగ్ తెలంగాణ

గాసిప్ టైమ్

ఏది నిజం?

ఎన్నికలంటేనే ఉత్కంఠ. ఎన్నికలకు ముందు అభ్యర్థుల ఎంపిక, నామినేషన్లు, ప్రచారం, ఓటింగ్ రోజు సర్వేలు నిర్వహిస్తుండడం సాధారణం. అయితే ఇప్పుడు వస్తున్న సర్వేల్లో ఏది నమ్మాలి..? ఏది నమ్మొద్దు?.. అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా తయారైందట. రోజుకో సర్వే సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షమవుతుండటంతో వాటిని చూసేవారు కంగుతింటున్నారట. బయట ప్రజల్లో వ్యక్తమవుతున్న అభిప్రాయానికి.. సర్వేల్లో వస్తున్న దానికి ఏమాత్రం పొంతన లేకపోవడంతో.. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న నివేదికలను చూసి పరేషాన్ అవుతున్నారు. ప్రతిష్టాత్మక సంస్థల పేరిట కూడా సోషల్ మీడియాలో వస్తున్న సర్వే నివేదికలు నకిలీవి ఉండడంతో రాజకీయ నాయకులు బెంబేలెత్తిపోతున్నారు. సర్వేల్లో తమ పార్టీకి అనుకూలంగా వస్తే ఒక రకంగా.. రాకపోతే మరోలా వ్యాఖ్యానిస్తున్నారు. సొంత సర్వేలు చేసుకుంటున్నవారు కూడా.. సర్వే రిపోర్టుల్లో తేడా వస్తే మళ్లీ మళ్లీ చేయించుకుంటున్న నేతలూ ఉన్నారు. ఈ సర్వేలు తమకు బీపీ పెంచుతున్నాయంటూ రాజకీయనేతలు వాపోతున్నారు.

తాండ్ర కృష్ణ గోవింద్




ప్రచార ర్యాలీలో కొమ్ము కోయ నృత్యం చేస్తున్న కళాకారులు

ఎన్నికలకు కళ

సంప్రదాయ కళలకు ఇప్పటికీ తగ్గని ఆదరణ

- రాజకీయ ప్రచారంలో ఆకట్టుకునేలా నృత్యాలు, కళారూపాలు
- ఎన్నికల సీజన్‌లో కళాకారులకు డిమాండ్

రాజకీయ నేతలను ప్రజలకు చేరువ చేయడంలో ఏడెనిమి దేళ్లుగా సోషల్ మీడియా కీలకంగా మారింది. ఫేస్‌బుక్, యూట్యూబ్ మొదలు ఇన్‌స్టాగ్రామ్ వరకు నాయకుల కార్యక్రమాలు క్షణాల్లో ప్రజలకు చేరిపోతున్నాయి. అయితే టెక్నాలజీ ఎంతగా అందుబాటులోకి వచ్చినా ఇప్పటికీ ప్రజలకు చేరువయ్యేందుకు కళారూపాలనే కొందరు నేతలు ఎంచుకుంటున్నారు. ప్రజల్లో వీటికి ఆదరణ తగ్గకపోవడంతో ఇప్పుడు ఎన్నికల సీజన్‌లో ఆయా కళాకారులకు డిమాండ్ ఎక్కువగానే ఉంటోంది.

సోషల్ జమానా

ఎన్నికల్లో గెలిచింది మొదలు తిరిగి ఎన్నికల్లో పోటీ చేసే వరకు తాము చేపడుతున్న కార్యక్రమాల వివరాలను ప్రజలకు తెలియజేసేందుకు ఇద్దరు నేతలు సోషల్ మీడియాను విరివిగా ఉపయోగిస్తున్నారు. ఈ మేరకు ఫేస్‌బుక్, యూట్యూబ్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి పాపులర్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లపై వ్యక్తిగత పేజీలతో పాటు ఫాలోవర్స్, ఫ్యాన్స్ పేజీలతో ప్రత్యేకంగా ఖాతాలు ఓపెన్ చేస్తున్నారు. తాము రోజువారీగా చేపడుతున్న కార్యక్రమాలు, ప్రధాన మీడియాలో వచ్చిన వార్తల క్లిప్పింగ్‌లు, లింకులను ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారు. ఈ మేరకు బూత్ లెవల్ వరకు సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌లను కూడా నియమిస్తున్నారు. మండల, యూత్, మహిళా తదితర విభాగాల బాధ్యుల తరహాలోనే సోషల్ మీడియా ఇన్‌చార్జ్ పోస్టులూ రాజకీయ పార్టీల్లో పుట్టుకొచ్చాయి.

ర్యాలీలు, సభల్లో...

బహిరంగంగా చేసే ర్యాలీలు, సభల్లో ఇప్పటికీ ఆదివాసీ నృత్యాలైన కొమ్ము కోయ, థింస్సా, గుస్సాడీ, బంజారా నృత్యాలు, డప్పు కళాకారులకు ఫుల్ డిమాండ్ ఉంది. ప్రధాన నాయకుడు వెనుక వస్తుంటే అతనికి ముందు వరుసలో ఆదివాసీ/బంజారా కళాకారులు చేసే నృత్యాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఇళ్లలో ఉన్న వారు, వాణిజ్య సముదాయాల్లో ఉన్నవారిని బయటకు రప్పిస్తున్నాయి. తద్వారా నేతలు చేపట్టే కార్యక్రమాలు మరింత విస్తృతంగా ప్రజల్లోకి వెళ్తున్నాయి. దీంతో టెక్నాలజీ యుగంలోనూ ఆదివాసీ, బంజారా కళలు.. తగ్గేదేలే అన్నట్టుగా తమ ఉనికిని చాటుకుంటున్నాయి.

కొమ్ము కోయ..

రాష్ట్ర విభజనకు ముందు కొమ్ము, కోయ నృత్య కళాకారులు ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో ఉండేవారు. విభజన తర్వాత ఏపీ పరిధిలోకి వెళ్లారు. ప్రస్తుతం చింతూరు కేంద్రంగా కొమ్ము కోయ నృత్య బృందాలు ఉన్నాయి. ఈ బృందాల్లో పొడవైన వాడి కలిగిన కొమ్ములు, నెమలి ఈకలతో చేసిన తలపాగా మగవాళ్లు ధరిస్తారు. మెడలో పెద్దడోలు వాయిద్యం కలిగి ఉంటారు. మహిళలు ఆకుపచ్చచీరలు ధరించి, తలకు ఎర్రని రుమాలు, కాళ్లకు గజ్జెలు కట్టుకుంటారు. మగవారు వేసే డప్పు వాయిద్యాలకు అనుగుణంగా మహిళలు నృత్యం చేస్తారు.

అలరిస్తున్న గుస్సాడీ..

ఆదిలాబాద్‌కు చెందిన ఆదివాసీ నృత్యం గుస్సాడీ. ఆదివాసీ పండగల సందర్భంగా ఈ నృత్యం చేస్తారు. ఆ తర్వాత ప్రభుత్వ ప్రోత్సాహంతో జాతీయ పండగలు, ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ గుస్సాడీ నృత్యాన్ని ప్రదర్శించడం ఆనవాయితీగా వస్తోంది. దీన్ని మరింత ముందుకు తీసుకెళ్తూ రాజకీయ నాయకులు తమ కార్యక్రమాల్లో గుస్సాడీకి స్థానం కల్పిస్తున్నారు. గుస్సాడీ కళాకారులు ధరించే భారీ నెమలి ఈకలు, పూసలతో చేసిన తలపాగా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

బంజారా నృత్యం

తెలంగాణ గిరిజనుల్లో అత్యధిక జనాభా లంబాడీలదే. ఇప్పటికీ తండాల్లో లంబాడీ మహిళలు పూ ర్వకాలం నుంచి వస్తున్న వేషధా రణ కొనసాగిస్తున్నారు. ఎరుపురంగులో అద్దాలు, చెమ్కీలతో చేసిన దుస్తులను ధరిస్తుంటారు. చేతులకు తెల్లని పెద్ద గాజులు, చెవులు, ముక్కుకు పెద్ద ఆభరణాలు పెట్టుకుని ప్రత్యేకంగా కనిపిస్తారు. వీరు బంజరా భాష గోర్‌బోలీలో పాట లు పాడుతూ చేసే నృత్యాలు రాజకీయ ర్యాలీలలో ప్రత్యేకంగా నిలుస్తున్నాయి.

డప్పు బృందాలు

ఒకప్పుడు వామపక్ష పార్టీ పట్ల ప్రజలు ఆకర్షితులయ్యేలా చేసిన అంశాల్లో డప్పు బృందాలది ప్రత్యేక స్థానం. కళాకారులు కాళ్లకు గజ్జెలు కట్టి డప్పు వాయిస్తూ చేసే నృత్యాలు నేటికీ ఎవర్‌గ్రీన్‌గా కొనసాగుతూ వస్తున్నాయి. ఒకప్పుడు కామ్రేడ్లకే పరిమితమైన డప్పు డ్యాన్సులను ఇప్పుడు అన్ని రాజకీయ పక్షాలు అక్కున చేర్చుకున్నాయి.

అపర బాహుబలి మా కల్వకుంట్ల కేసీఆరయ్య!!



షుగర్ & పెప్పర్
..:: యాసీన్

"అప్పుడెప్పుడో కాటన్‌దొర అని ఓ ఆసామి ఉండేవాడు. ఆయన నూర్రూ, నూటాయాభై ఏళ్ల కిందట కట్టిన బ్యారేజీలు చెక్కుచెదర..." అంటూ కాంగ్రెస్ కార్యకర్తలు ఏదో విమర్శించబోతుంటే..రాబోతున్న గుగ్లీ బంతేమిటో తెలిసి, మధ్యలోనే దాన్ని కట్ చేస్తూ...

"ఏయ్... ఎవల్లో ఎప్పుడో ఆంధ్రోల్ల కోసం, ఆంధ్ర ఏరియాల కట్టిన ప్రాజెక్టులతోని పోల్చి.. తెలంగాణను తక్కువ చేస్తూ మాట్లాడతరెందుకురా?" అంటూ దాన్ని కవర్‌డ్రైవ్ వైపు నెట్టేశారు బీఆర్‌ఎస్ కార్యకర్తలు.

"అయితే తెలంగాణ గురించే మాట్లాడదాం. ఈడ హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్‌లకు ప్లానిచ్చిండు. ఇక్కడి డ్రైనేజీ సిస్టమ్‌ను చక్కబెట్టడానికి అలనాడెప్పుడో మోక్షగుండం విశ్వేశ్వర..." మళ్లీ మధ్యలోనే మాట కట్ చేసి, మళ్లీ ఇలా చెప్పారు. "అసలు తెలంగాణ అపరభగీరథుడు కేసీఆర్ పవరేమిటో తెల్సా? అసలాయన ఉనికేందో, ఎల్లవేళలా నీళ్లల పుట్టి నీళ్లల పెరిగిన ఆ సంగతులు తెల్సా మీకు?"

"ఏందీ... నీల్లల్ల బుట్టి నీల్లల్ల పెరిగిండా? అదెట్ల?" చెప్పడం మొదలుపెట్టారు బీఆర్‌ఎస్ వారు. అదేదో సిన్మాల బాహుబలి అనేటాయన ఒక పే...ద్ద జలపాతం.. దాని ఎమ్మట్నే పారే పే...ద్ద నది ఉండే..ఆ ఊళ్ల పెరిగిండు కదా. కానీ కేసీఆర్ సార్ నిజంగనే నాలుగు మూలలల్ల నాలుగు అద్భుత తటాకాలున్న పల్లెల పుట్టి, పెరిగిండు. చింతమడక అనే ఆ ఊళ్లె... ఊరికి ఉత్తరాన పెద్ద చెరువు ఉంటె, దక్షిణాన దమ్మచెరువుంది. కొద్దిగ పెడమర్ల పడమర్ల కోమటి చెరువు! తూర్పున సింగచెరువు!! కొద్దిగ దూరంల అంకపేటల ఈశాన్యాన పెద్ద చెర్వు!!

కోమటిచెరువుల ఈదిండు. పెద్ద చెరువుల తొక్కునీల్ల కాడ దునికి కాకరాల్ల దాక పొయ్యి... అక్కడ మత్తడి దాంక ఈతగొట్టిండు. చింతచెర్వు మొత్తం ఈదిండు. దమ్మచెర్వుకింద ఒక బాయి ఉండె. దాంట్లెకు మోటచిమ్ములెక్కి దునికేది. ఎత్తు సరిపోక మర్రిచెట్టుకొమ్మలెక్కి కూడ దునికేది. అసలు వాళ్ల ఊళ్లె వాళ్లింటి పాటకు ముందు నుంచే మూణ్ణెల్లు జాలు నీళ్ల జాలుబారుతుంటే, ఆ నీళ్లల కాయితప్పడవలేసి, ఆడిండు. ఇగ రాజకీయాలల్లకు వచ్చినంక గూడ.. కార్ల పొయ్యేటప్పుడు ఏడ్నన్న బీడ్జి కనబడితే సాలు... ఆగి దాంట్లెకు ఓ రూపాయో, రెండో, ఐదురూపాల బిళ్లను ఇసిరేటోడు. అది బుడుంగన మునిగేదాంక ఆగి చూసి, అప్పుడు కదలేటోడు.

నీళ్లతోని ఇంత అనుభవం, ఇంత నైపుణ్యం ఉండి, జాలునీళ్లల్ల కాయితప్పడవల తోటి ఫ్లోటాలజీ, నీళ్ల పారే తీరు తెలిసిన 'ఫ్లోవాలజీ', మునిగే కాయిన్లతోని తెలుసుకున్న 'బుడుంగాలజీ', వాటర్ల నీటిశాతం, బురదల జిగటశాతం, ఉస్కెతోని రేణుశాస్త్రం.. ఇయన్నీ తెలుసుగాబట్టే.. తెల్లారితె బాహుబలి జలపాతాన్ని ఎక్స్‌ప్లోర్ చేసినట్టే... కేసీఆర్ సారు గూడ పొద్దుందాక నీళ్లతత్వం అధ్యయనం చేసి, తెలుసుకునేది. ఆ అనుభవంతోని వచ్చినయే ఈ మేడిగడ్డలూ, అన్నారాలు... ఈ ప్రాజెక్టులన్నీ.

ఆ సిన్మాల బాహుబలి వాళ్ల అమ్మగారు బాధపడ్డట్టే... తెలంగాణ తల్లి కూడ బుగులుబడతాంది. కానీ..బక్కపానమైనా మాసారు బాహుబలికంటె ఎక్కువ బలమూ, సంకల్పబలమూ ఉన్నోడు. 'జటాకటాహ సంభ్రమ భ్రమన్నిలింప నిర్ఝరీ, విలోలవీచి వల్లరీ విరాజమాన మూర్ధనీ.. ధగద్ధగద్ధగజ్వలల్లలాట పట్టపావకే..కిశోర "చంద్రశేఖరే"..అని మాసారు పేరుతోని బ్యాక్‌గ్రౌండ్‌ల పాట వినిపిస్తుండంగా...

ఎవ్వరంట ఎవ్వరంటా
పిల్లరెత్తుకుందీ?
తెలంగాణ తల్లికీ ముద్దులకొడుకీ నందీ.
ఉస్కెలో దస్కిందీ..బురదలో కుంగిందీ
పిల్లరెత్తుకున్నాక
భుజమ్మీద పెట్కోనీ పైకెత్తేనండీ...

ఇట్లా మునపటి లెవల్‌కు తెచ్చి... తల్లితో "అమ్మా ఒప్పేనా?" అంటూ అడిగాడు. అప్పుడామె "నాకేమి తెలుసు? ఓటరు దేవరనడుగు?" అనగానే ఇటు తిరిగి... ఆయన ఓటరు దేవరనడిగాడు. అప్పుడు... "ఏమో శివుడి మనసులో ఏముందో... శివుడేటనుకుంటున్నాడో మనకేమి తెల్సు" అంటూ అప్పటికి గడుసుగా బదులిచ్చాడు ఓటరు దేవర.

ఎవరొస్తే వారికే జై!

- మూడు రోజులు మూడు పార్టీల కండువాలతో ప్రచారం
- ఎన్నికల వేళ ద్వితీయశ్రేణి నాయకులు, కార్యకర్తల చిత్రవిచిత్రాలు




మొయినాబాద్: ఎన్నికల వేళ ఎన్నెన్ని చిత్రవిచిత్రాలో! గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు ఏ పార్టీ వారు ప్రచారానికి వస్తే వారికే జై కొడుతున్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల పరిధిలోని కనకమామిడికి చెందిన కొంత మంది మూడు పార్టీల తరఫున ప్రచారంలో పాల్గొన్నారు. శనివారం బీఆర్‌ఎస్ అభ్యర్థి కాలె యాదయ్య తరఫున గులాబీ కండువా వేసుకుని ప్రచారంలో పాల్గొన్నారు. ఆదివారం రాత్రి కాంగ్రెస్ నేత పామెన భీంభరత్ నిర్వహించిన ప్రచారంలో హస్తం పార్టీ కండువా ధరించి ప్రచారరథంపై కనిపించారు. సోమవారం బీజేపీ అభ్యర్థి రత్నం నిర్వహించిన ప్రచారంలో కాషాయ కండువా వేసుకుని జీపుపైకి ఎక్కి రత్నంకు జై కొట్టారు.

జంగ్ తెలంగాణ
VOTE
పంచతంత్రం



కాంగ్రెస్ దళిత, గిరిజన వ్యతిరేక పార్టీ

- సీఐసీ ఎంపిక సమావేశానికి హాజరు కాలేదు
- రాష్ట్రపతిగా ద్రౌపదీ ముర్ము అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించింది
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆగ్రహం
- మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లో ఎన్నికల ప్రచారం

సిద్ధి/సూరజ్‌పూర్: విపక్ష కాంగ్రెస్ పార్టీపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మరోసారి విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ దళిత, గిరిజన వ్యతిరేక పార్టీ అని ఆరోపించారు. నూతన ముఖ్య సమాచార కమిషనర్(సీఐసీ)గా హీరాలాల్ సమారియా ఎంపిక కోసం నిర్వహించిన సమావేశానికి కాంగ్రెస్ హాజరు కాలేదని ఆక్షేపించారు. ఆయన దళితుడు కావడమే ఇందుకు కారణమని అన్నారు. సీఐసీగా నియమితుడైన తొలి దళితుడు హీరాలాల్‌ను కాంగ్రెస్ నేతలు నిత్యం దూషిస్తున్నారని మోదీ విమర్శించారు. దేశంలో మొట్టమొదట గిరిజన మహిళా రాష్ట్రపతిగా ద్రౌపదీ ముర్ము అభ్యర్థిత్వాన్ని కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకించిందని గుర్తుచేశారు. ఆ పార్టీ మైండ్‌సెట్‌ను దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చని అన్నారు. మంగళవారం మధ్యప్రదేశ్‌లోని సిద్ధి జిల్లాలో, ఛత్తీస్‌గఢ్‌లోని సూరజ్‌పూర్ జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభల్లో ప్రధానమంత్రి ప్రసంగించారు. తనను రోజంతా తిట్టడమే పనిగా పెట్టుకున్నారని కాంగ్రెస్ నాయకులపై మండిపడ్డారు. కానీ, వారు ఓబీసీ వర్గాలను తిడుతున్నారని చెప్పారు. ప్రధాని మోదీ ఓబీసీ వర్గానికి చెందిన నాయకుడన్న సంగతి తెలిసిందే. దళితులు, గిరిజనులు, ఓబీసీల సంక్షేమం కోసం బీజేపీ నిరంతరం కృషి చేస్తోందని మోదీ ఉద్ఘాటించారు. ఆయా వర్గాల ఆకాంక్షలను గౌరవిస్తోందని తెలిపారు. 2014లో తాము కేంద్రంలో అధికారంలోకి వచ్చాక అన్ని రకాల కుంభకోణాలకు అడ్డుకట్ట వేశామన్నారు. అలా పొదుపు అయిన డబ్బుతో ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, 80 కోట్ల మంది పేదలకు ఉచితంగా రేషన్ సరుకులు ఇస్తున్నామని వివరించారు.

కాంగ్రెస్ పాలనలో నేరాలు, లూటీలు

కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పుడల్లా దేశంలో నక్సలైట్లు, ఉగ్రవాదులు బలం పుంజుకుంటున్నారని ప్రధాని నరేంద్ర మోదీ దుయ్యబట్టారు. కాంగ్రెస్ అధికారంలో ఉంటే, దేశమంతటా బాంబు పేలుళ్లు, హత్యల వార్తలు నిత్యం వస్తుంటాయని చెప్పారు. నేరాలు, లూటీలు విచ్చలవిడిగా జరుగుతుంటాయని పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం నక్సలిజాన్ని అరికట్టడంలో దారుణంగా విఫలమైందని అన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే మహాదేవ్ బెట్టింగ్ యాప్ బాగోతంపై విచారణ జరిపిస్తామని, దోషులను శిక్షిస్తామని ప్రకటించారు. ఈ కుంభకోణంలో ఎంతటి బడా బాబులున్నా వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. భద్రత అనేది ప్రతి పౌరుడికి అవసరమని మోదీ చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌లో ప్రజలు క్షేమంగా ఉండాలంటే కాంగ్రెస్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నామని, అయోధ్యలో రామమందిర నిర్మాణం మొదలైందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 4 కోట్ల మంది పేదలకు ఇళ్లు నిర్మించి ఇచ్చామని ప్రధానమంత్రి తెలిపారు.

రాష్ట్రంలో శాంతి భద్రత, సంక్షేమం మాయం

- మేజీషియన్‌కు మాత్రమే ఇది సాధ్యం
- సీఎం గెహ్లోత్‌పై అమిత్ షా ఆరోపణలు



జైపూర్: 'రాజస్తాన్‌లో గత ప్రభుత్వ హయాంలో నెలకొన్న శాంతిభద్రతలు, కొనసాగిన సంక్షేమ పథకాలు ఇప్పుడు మాయమయ్యాయి. ఇలా మాయం చేసే సత్తా ఒక్క మేజీషియన్‌కు మాత్రమే ఉంది. అదే.. ఇప్పుడున్న అశోక్ గెహ్లోత్ సర్కార్'అంటూ బీజేపీ అగ్రనేత అమిత్ షా ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కుచమన్, మక్‌రానా పట్టణాల్లో బీజేపీ ర్యాలీల్లో అమిత్ షా మాట్లాడారు. 'గెహ్లోత్ నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్ అత్యంత అవినీతిమయంగా పేరుమోసింది. బుజ్జగింపు రాజకీయలను అత్యున్నత శిఖరాలకు తీసుకెళ్లింది. ఇలాంటి ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకలించండి'అని ఓటర్లకు విజ్ఞప్తిచేశారు. 'వసుంధర రాజే హయాంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు నెలకొన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ గంటలు విద్యుత్‌సహా పలు సంక్షేమ పథకాలు పక్కాగా అమలయ్యేవి. ఇప్పుడున్న గెహ్లోత్ సర్కార్ మేజీషియన్‌లాగా అన్నింటినీ మాయంచేసింది'అని అమిత్ షా ఆరోపించారు. తన తండ్రి చేసే మేజిక్ షోలలో సహాయపడేవాడినని గతంలో గెహ్లోత్ చెప్పడం తెల్సిందే. 'కేంద్రంలో యూపీఏ ప్రభుత్వాలు ఉన్నప్పుడు రాజస్తాన్‌కు రూ.2 లక్షల కోట్లు కేటాయిస్తే మోదీ ప్రభుత్వం 2014–2023 కాలంలో ఏకంగా రూ.8.71 లక్షల కోట్లు కేటాయించింది. రాజస్తాన్‌లో మేం అధికారంలోకి వస్తే అన్ని కుటుంబాలకు కుళాయి నీటి సౌకర్యం కల్పిస్తాం'అని అమిత్ హామీ ఇచ్చారు.

రెడ్ డైరీలో ఏముందో బయటపెట్టాలి

'ఎరుపు అన్న పదం వినపడితేనే గెహ్లోత్‌కు కోపం వస్తోంది. పౌరులను ఓట్లు అడిగేముందు ఆ రెడ్ డైరీలో ఏఏ వివరాలు ఉన్నాయో గెహ్లోత్ బహిర్గతం చేయాలి. అవినీతి వివరాలు బట్టబయలుచేశారని మంత్రిని తొలగించారు. అసలు ఆ లావాదేవీలు చేసినందుకు నైతిక బాధ్యతగా సీఎం గెహ్లోత్ రాజీనామా చేయాలి'అని అమిత్ డిమాండ్‌చేశారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

కేంద్ర హోం మంత్రి అమిత్ షా పెనుప్రమాదం నుంచి త్రుటిలో తప్పించుకున్నారు. రాజస్తాన్‌లోని నాగౌర్‌లో ఆయన ప్రయాణిస్తున్న వాహనం విద్యుత్ తీగను తాకింది. పర్బత్‌సర్ నుంచి బిడియాద్ గ్రామానికి ఎన్నికల ప్రచార ర్యాలీలో పాల్గొనేందుకు వెళ్తున్న సమయంలో ఘటన చోటుచేసుకుంది. మంత్రి ప్రయాణిస్తున్న ప్రచార రథం పైభాగానికి రహదారి పక్కనే ఉన్న విద్యుత్ తీగ తాకడంతో నిప్పు రవ్వలు చెలరేగాయి. దీంతో, ఆ వెనుకే వస్తున్న వాహన శ్రేణిని వెంటనే ఆపు చేయించారు. ఆ మార్గంలో విద్యుత్ సరఫరా నిలిపివేయించారు. మంత్రి అమిత్ షా వేరే వాహనంలో ముందుకు సాగారు. సీఎం అశోక్ గెహ్లోత్ ఈ ఘటనపై దర్యాప్తునకు ఆదేశించారు.

సొంత నియోజకవర్గం సర్దార్‌పురలో జనం కినుక

దశాబ్దాలైనా సమస్యలకు మోక్షం లేదని విమర్శలు

సర్దార్‌పురా.. సమస్యల చిట్టా...

రాజస్తాన్‌లోని అతి పెద్ద అసెంబ్లీ స్థానాల్లో సర్దార్‌పురా ఒకటి. స్వయానా సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న స్థానం. అయినా ఇక్కడ సమస్యలకు మాత్రం కొదవ లేదు...!

- అధ్వానమైన రోడ్లు
- దారుణమైన డ్రైనేజీ వ్యవస్థ
- తీవ్రమైన తాగునీటి సమస్య
- వాననీరు పోయే ఏర్పాట్ల లేమి
- ప్రతి సీజన్లోనూ నీట మునిగే కాలనీలు
- ఆరోగ్య సేవలు, వసతులకు తీవ్ర కొరత
- కలుషిత నీటితో పంటల సాగు

సర్దార్‌పురా అసెంబ్లీ స్థానం విశేషాలు..

జోధ్‌పూర్ జిల్లా నట్టనడుమ ఉన్న అసెంబ్లీ స్థానమిది. మహరాజు సర్దార్‌సింగ్ పేరిట దీనికి ఈ పేరొచ్చింది. ఇక్కడ ఆరు శతాబ్దాల నాటి మెహ్రాన్‌గఢ్ కోట ఉంది. దాని పక్కనే 300 ఏళ్ల కింద సర్దార్‌సింగ్ నిర్మించిన ఘంటా ఘర్ ఇప్పటికీ ఉంది. ఆ పక్కనే ఉన్న సర్దార్ మార్కెట్ కూడా ఆయన హయాంలో వచ్చినదే.

మొత్తం ఓటర్లు 2,54,572 మంది	మొత్తం పోలింగ్ కేంద్రాలు 212
పురుషులు 1,29,869 మంది	
స్త్రీలు 1,24,703 మంది	
తొలిసారి ఓటర్లు 8,295 మంది	
పోలింగ్ తేదీ నవంబర్ 25	

- సాక్షి, నేషనల్ డెస్క్

సర్దార్‌పురా. కాంగ్రెస్ పాలిత రాజస్థాన్‌లో ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో అందరి దృష్టినీ ఆకర్షిస్తున్న స్థానం. ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్ ప్రాతినిధ్యం వహిస్తున్న సర్దార్‌పురాలో ఎన్నెన్నో సమస్యలు సీఎంను చీకాకు పెడుతున్నట్టు వస్తున్న వార్తలు కాంగ్రెస్ పార్టీని కలవరపరిచేవే. వాటిని హైలైట్ చేస్తూ, సీఎం సెగ్మెంట్లోనే సమస్యల పరిష్కారానికి దిక్కు లేదంటూ బీజేపీ రాష్ట్రమంతటా ప్రచారాన్ని హోరెత్తిస్తోంది...

గహ్లోత్‌కు సొంతింట సమస్యలు

సర్దార్‌పురా అసెంబ్లీ స్థానం రాజస్తాన్‌లో గత పాతికేళ్ల నుంచీ అందరి నోళ్లలోనూ నానుతూ వస్తోంది. సీఎం అశోక్ గెహ్లోత్ ఇక్కణ్నుంచి తొలిసారి 1998లో ఉప ఎన్నికలో నెగ్గారు. ఆ ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పీసీసీ చీఫ్‌గా ఆయన సారథ్యంలో కాంగ్రెస్ ఘనవిజయం సాధించింది. 200 అసెంబ్లీ స్థానాలకు గాను ఏకంగా 153 సీట్లు గెలుచుకుంది. దాంతో గెహ్లోత్ తొలిసారి సీఎం పీఠమెక్కారు. అప్పటినుంచీ ఇక్కడ వరుసగా ఆయనే గెలుపొందుతూ వస్తున్నారు. సర్దార్‌పురాలో కాంగ్రెస్ మొత్తమ్మీద 8సార్లు నెగ్గగా రెండు సార్లు బీజేపీ గెలిచింది. గెహ్లోత్ తొలిసారి నెగ్గేందుకు ముందు 1990, 1993ల్లో బీజేపీ తరఫున రాజేంద్ర గెహ్లోత్ ఇక్కడ రెండు సార్లు గెలిచారు. 1998 నుంచి అశోక్ గెహ్లోత్ హవాయే సాగుతూ వస్తోంది. 2008లో బీజేపీ నుంచి మరోసారి బరిలో దిగిన రాజేంద్ర గెహ్లోత్ 15 శాతానికి పైగా ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఇక 2013, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ శంభుసింగ్ ఖేత్సర్‌ను బరిలో దించినా లాభం లేకపోయింది. గెహ్లోత్ చేతిలో ఆయన వరుసగా 13 శాతం, 30 శాతానికి పైగా ఓట్ల తేడాతో ఓడారు.

అయినా...

స్వయంగా సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్నా తమ సమస్యలకు మాత్రం ఎండ్ కార్డు పడటం లేదన్నది సర్దార్‌పురా వాసుల ఆవేదన. వానాకాలం వస్తే చాలు, ఎక్కడ చూసినా నీరు నిలిచిపోయి తమ బతుకు దుర్భరమవుతుందని శివ్‌సింగ్ రాథోడ్ అనే స్థానికుడు వాపోయాడు. "రోడ్లు దారుణంగా ఉన్నాయి. డ్రైనేజీ అవ్యవస్థ గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది. ప్రతి వానాకాలంలోనూ డ్రైనేజీలు పొంగిపొర్లడం, రోడ్లన్నీ నీటితో నిండిపోవడం నియోజకవర్గంలో చాలాచోట్ల సాధారణ దృశ్యం. సీఎం సెగ్మెంట్‌లోనే ఇలాంటి సమస్యలకు దశాబ్దాలుగా మోక్షం దక్కకపోవడం నిజంగా దారుణం"అన్నాడాయన.

కాలనీలే మునిగాయి...!

2021 వర్షాకాలంలోనైతే డ్రైనేజీలు పొంగిపొర్లి సర్దార్‌పురా పట్టణంలో కాలనీలకు కాలనీలే నీట మునిగాయి! దాంతో సహాయక చర్యల కోసం ఏకంగా సైన్యాన్ని రంగంలోకి దించాల్సిన పరిస్థితి తలెత్తింది!! రెండేళ్లు గడిచిపోయినా సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ఒక్క చర్య కూడా తీసుకోలేదని గోపాల్‌సింగ్ అనే స్థానికుడు ఆవేదన వెలిబుచ్చాడు. నియోజకవర్గంలో చాలాచోట్ల డ్రైనేజీ నీళ్లతోనే కూరగాయలు పండిస్తున్నారంటూ రాథోడ్ ఆందోళన వెలిబుచ్చాడు. ఇది చాలా ఏళ్లుగా జరుగుతున్నా యంత్రాంగం పట్టించుకోవడం లేదన్నది స్థానికుల ఫిర్యాదు. గెహ్లోత్ కేవలం తన సామాజికవర్గం ఓట్లు ఎక్కువగా ఉన్న కొన్ని ప్రాంతాలకు మాత్రమే అభివృద్ధిని పరిమితం చేయడమే ఈ సమస్యకు మూల కారణమని బీజేపీ ఆరోపిస్తోంది.

మాలీలే ఎక్కువ...

సర్దార్‌పురాలో మాలీ సామాజికవర్గం వారి సంఖ్య చాలా ఎక్కువ. తర్వాతి స్థానంలో ఓబీసీలుంటారు. ఇక జాట్లు, మహాజన్‌లు, ఎస్సీ, మైనారిటీలూ ఎక్కువగానే ఉన్నారు.



సర్దార్‌పురా నియోజకవర్గంలో ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలను అందజేస్తున్న సీఎం అశోక్ గహ్లోత్

సాక్షి హైదరాబాద్

బుధవారం । 8 । నవంబర్ । 2023



క్లీన్ నగరి కావాలి

సిటీ స్టార్

నా కలల నగరి క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉండాలి. పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలి. ప్రభుత్వాలపై ఆధారపడవద్దు. రోడ్లపై, మురుగు కాలువల్లో చెత్తను పడేయడం, నీటిని, విద్యుత్‌ని వృథా చేయడం చాలా తప్పు. ట్రాఫిక్ నియమాలు పాటించాలి. ఫ్రీ లెఫ్ట్ రహదారులను కూడా బ్లాక్ చేయవద్దు. ఇది నా రాష్ట్రం, ఇది నా రాజధాని అనుకునేలా ప్రజలంతా బాధ్యతాయుతంగా ఉంటే బాగుంటుంది. అలాగే ఓటు అనేది ఒక పదునైన ఆయుధం. దాన్ని మనం సక్రమంగా వాడగలిగితే మనల్ని మనం కాపాడుకోగలం. విశ్వనగరంగా ఎదుగుతున్న హైదరాబాద్ మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలి. - తిరువీర్, 'మసూద', 'పరేషాన్' సినిమాల హీరో

ఓటు జీవితావసరం



సెలబ్రిటీ కామెంట్

ప్రజాస్వామ్యంలో ఓటు అనేది హక్కు మాత్రమే కాదు.. ప్రతి పౌరుడి జీవితావసరం అని గుర్తుంచుకోవాలి. ప్రతి మనిషికి ఆహారం, వస్త్రాలు, ఇల్లు మాదిరిగానే ప్రతి వయోజనుడికీ ఓటు కూడా తన కనీస అవసరంగా భావించాలి. ప్రపంచంలోనే మనది అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం. యువత అత్యధికంగా ఉన్న దేశం కూడా. యువత ఎక్కువగా పోలింగ్‌లో పాల్గొనాలి. నేటి యువతరం అన్ని రంగాల్లోనే చురుకుగా, మెలకువతో వ్యవహరిస్తోంది. ఓటింగ్ దగ్గరకు వచ్చేసరికి మాత్రం ఆసక్తి చూపట్లేదు. రేపు నాయకులు కాదల్చితే నేడు కచ్చితంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి. నగరంలో ఉన్న సీనియర్ సిటిజన్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చి, తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి యువత సహకరించాలి. మా పెద్ద కుమార్తె ప్రకృతికి ఈసారే ఓటు హక్కు వచ్చింది. మా కుటుంబంలోకి వచ్చిన ఈ కొత్త ఓటర్ మాలాగే కచ్చితంగా ఓటు హక్కు వినియోగించుకోనుంది. - బి.సుమతి, ఐపీఎస్

యువతకు సదుపాయంగా..



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లాలో పోలింగ్ శాతం పెంచేందుకు అధికారులు వివిధ ఏర్పాట్లు చేస్తున్నారు. కొత్తగా ఓటుహక్కు పొందిన యువతకు సదుపాయంగా ఉండేలా నియోజకవర్గానికో పోలింగ్ కేంద్రాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. వీటిని యువ అధికారులే నిర్వహిస్తారు. వివిధ విభాగాల్లోనూ ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. వీటిలో భాగంగా శారీరక వికలాంగులే(దివ్యాంగులు) నిర్వహించేలా నియోజకవర్గానికో పోలింగ్ కేంద్రాన్ని, మహిళలకు తగిన గుర్తింపునిస్తూ నిర్వహణ మొత్తం మహిళలే నిర్వహించేలా ఉద్యోగినులతో నియోజకవర్గానికి ఐదు పోలింగ్ కేంద్రాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్నారు. వీటితోపాటు మిగతా అన్ని పోలింగ్ కేంద్రాలకంటే ప్రత్యేకంగా ఉండేలా నియోజకవర్గానికి ఐదు పోలింగ్ కేంద్రాలను సకల సదుపాయాలతో తీర్చిదిద్దనున్నారు. మహిళలు నిర్వహించే పోలింగ్ కేంద్రాల్లో సిబ్బందితో పాటు సాధ్యమైనంత మేరకు పోలీసు, సెక్యూరిటీ సిబ్బంది సైతం మహిళలే ఉండేలా చూస్తారు. సదరు కేంద్రాల్లో రాజకీయ పార్టీల పోలింగ్ ఏజెంట్లు సైతం మహిళలు ఉండేలా రాజకీయ పార్టీలను కోరనున్నారు. మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్న ప్రాంతాలు, గతంలో తక్కువ పోలింగ్ నమోదైన ప్రాంతాలను పరిగణనలోకి తీసుకొని వీటిని ఏర్పాటు చేస్తారు. నియోజకవర్గానికో పోలింగ్ కేంద్రాన్ని దివ్యాంగులైన ఉద్యోగులు నిర్వహించేలా ఏర్పాటు చేయనున్నారు. తాము కూడా మిగతా వారికే మాత్రం తీసిపోమని తగిన మానసిక స్థైర్యం కల్పించేందుకు ఇవి ఉపకరిస్తాయని భావిస్తున్నారు. ఈ ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసే భవనాలను అధికారులు ఇప్పటికే గుర్తించారు.

ఆ రెండింటిలో బీఆర్'ఎస్'





మంత్రి కేటీఆర్ నుంచి బీఫాం అందుకున్న నందకిశోర్, ఆనంద్ కుమార్

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న గోషామహల్, నాంపల్లి నియోజకవర్గాలకు బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించారు. గోషామహల్‌కు నందకిశోర్‌వ్యాస్ బిలాల్‌ను, నాంపల్లికి సీహెచ్ ఆనంద్ కుమార్‌గౌడ్‌ను ఎంపిక చేశారు. వీరితో పాటు గతంలోనే ప్రకటించిన పాతబస్తీ పరిధిలోని అభ్యర్థులకు మంగళవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బీంలు అందజేశారు. కార్వాన్ అభ్యర్థిగా ఎ. కృష్ణయ్య, చార్మినార్‌కు ఇబ్రహీం లోధి, చాంద్రాయణగుట్టకు ఎం. సీతారాంరెడ్డి, యాకుత్‌పురాకు సామసుందర్‌రెడ్డి, బహదూర్‌పురాకు అలీబక్రి, మలక్‌పేటకు తీగల అజిత్‌రెడ్డి బీఫారాలు అందుకున్నారు. దీంతో బీఆర్ఎస్‌లో అందరికీ బీఫాంలు అందినట్టే. నామినేషన్ల గడువుకు ఈ నెల 10వ తేదీ వరకు మాత్రమే గడువు ఉండటంతో టికెట్లు ప్రకటించని, బీఫాంలు అందని వీరు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. గోషామహల్ టికెట్ ఎవరికి కేటాయించనున్నారనేది తీవ్ర ఉత్కంఠ రేపింది. ఆ నియోజకవర్గంలో బీజేపీ నుంచి రాజాసింగ్ ఇప్పటికే రెండు పర్యాయాలు గెలిచారు. గత ఎన్నికల్లో బీజేపీ గెలిచిన ఒకే ఒక సీటు కూడా అదే. ఈ నేపథ్యంలో గోషామహల్ నియోజకవర్గం రాష్ట్ర వ్యాప్తంగానూ చర్చనీయాంశంగా మారింది. దీంతో గోషామహల్ అభ్యర్థిగా నందకిశోర్ పేరు మొదట్నుంచీ వినిపిస్తున్నప్పటికీ, ఇప్పటి వరకూ ప్రకటించకపోవడంతో సస్పెన్స్ నెలకొంది. గ్రేటర్‌లోని మిగతా నియోజకవర్గాల అభ్యర్థులకు బీఫాంలు ఇప్పటికే ఇచ్చినప్పటికీ, పాతబస్తీ నియోజకవర్గాల అభ్యర్థులకు ఇప్పటి వరకు ఇవ్వలేదు. వారికి కూడా ఇవ్వడంతో ఇక అందరూ ప్రచారంపై దృష్టి సారించారు.

మా భూముల్ని మల్లారెడ్డి మింగిండు



శామీర్‌పేట్: రాష్ట్ర మంత్రి, మేడ్చల్ బీఆర్ఎస్ అభ్యర్థి చామకూర మల్లారెడ్డి తమ భూములను కబ్జా చేశారని గిరిజనులు మంగళవారం ఆందోళన చేపట్టారు. మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మండలం కేశవరం గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 33, 34, 35లలోని తమకు సంబంధించిన 47 ఎకరాల 18 గుంటల భూమిని మంత్రి మల్లారెడ్డి, ఆయన అనుయాయులు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని గిరిజనులు ఆరోపించారు. 50 ఏళ్ల పాటు తమ పెద్దలు ఆ భూమిలో సాగు చేశారని, పలు కారణాలతో బతుకుదెరువు కోసం నగరానికి వలస వెళ్లామని వివరించారు. భూ యజమాని అయిన భిక్షపతిని మాయమాటలతో లోబర్చుకుని, కోట్లాది రూపాయలు ఇస్తామని నమ్మబలికి రాత్రికి రాత్రే మంత్రి, మరికొందరు నేతలు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. మంత్రి మల్లారెడ్డి, కొందరు నేతలు తమను రోడ్డున పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి మల్లారెడ్డి ఇప్పటికైనా స్పందించి తమకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఆయన ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు.

అడ్రస్ మారిందా..? ఆయుధాలు డిపాజిట్ చేయండి

సాక్షి, సిటీబ్యూరో: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో చిరునామా మార్చుకున్న లైసెన్స్‌దారులు తమ ఆయుధాలను వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్లలో డిపాజిట్ చేయాలని నగర పోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్య సూచించారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత ఆయుధాలను డిపాజిట్ చేయాలని ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. చాలామంది తమ లైసెన్స్ ఆయుధాలను డిపాజిట్ చేశారు. ఇంటి చిరునామా మారడంతో కొందరు తమ ఆయుధాలను డిపాజిట్ చేయలేదు. వీరు వెంటనే తమ ఆయుధాలను డిపాజిట్ చేయాలని సీపీ చెప్పారు. ఆయుధాలను డిపాజిట్ చేయని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

రూ.50 లక్షల నగదు సీజ్

దుండిగల్: కారులో తరలిస్తున్న రూ.50 లక్షల నగదును దుండిగల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే..దుండిగల్, బాలానగర్ ఎస్‌ఓటీ పోలీసులు వాహనాలను తనిఖీలు చేస్తుండగా బౌరంపేట సమీపంలోని ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ వద్ద కూకట్‌పల్లి నుంచి బౌరంపేట వైపు వెళ్తున్న కారులో రూ.50 లక్షలు పట్టుబడ్డాయి. కారులో ప్రయాణిస్తున్న మహేందర్ యాదవ్, బుచ్చిరెడ్డిలను ప్రశ్నించగా పొంతనలేని సమాధానాలు చెప్పారు. నిఖిల్ అనే వ్యక్తి కారు దిగి పరారయ్యాడు. దీంతో పోలీసులు డబ్బును స్వాధీనం చేసుకుని సంబంధిత అధికారులకు అప్పగించారు. ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం డబ్బుకు సంబంధించిన సరైన ధృవీకరణ పత్రాలు సమర్పిస్తే అధికారులు పరిశీలించిన అనంతరం తిరిగి అప్పగిస్తారని దుండిగల్ సీఐ రామకృష్ణ తెలిపారు.

నమో బీసీ



శంఖం పూరిస్తున్న బీజేపీ కార్యకర్త





- ఓపెన్ టాప్ జీపులో జనం మధ్యకు ప్రధాని
- పూల వర్షం కురిపించిన అభిమానులు
- మోదీ నామస్మరణతో మార్మోగిన ఎల్బీస్టేడియం
- కమలం పార్టీ శ్రేణుల్లో కదనోత్సాహం

బీజేపీ బీసీ ఆత్మగౌరవ సభ విజయవంతం

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని ఎల్బీ స్టేడియంలో బీజేపీ తలపెట్టిన బీసీ ఆత్మగౌరవ సభ విజయవంతమైంది. అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై బీసీల ఐక్యతను చాటి చెప్పారు. 'జై శ్రీరాం.. జయహో.. వందే మాతరం' నినాదంతో సభా ప్రాంగణం మార్మోగింది. బీసీ సీఎం నినాదంతో మంగళవారం సాయంత్రం ఎల్బీ స్టేడియంలో బీజేపీ నిర్వహించిన 'బీసీ ఆత్మగౌరవ సభ'కు ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, జాతీయ కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌లతో కలిసి ప్రధాని ఓపెన్ టాప్ జీపుపై నిలబడి.. జనం మధ్య ప్రత్యక్షమై అందరినీ ఆశ్చర్యపరిచారు. నిత్యం బుల్లెట్ ప్రూఫ్ వాహనాల్లో, జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత మధ్య కనిపించే ప్రధాని అనూహ్యంగా కార్యకర్తల మధ్యకు రావడంతో అభిమానులు ఉబ్బితబ్బియ్యారు. బారికేడ్లకు అవతలి వైపున ఉన్న పార్టీ శ్రేణులు, అభిమానులు ఆయనపై పూల వర్షం కురిపించారు. అనంతరం ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభలో ప్రధాని ప్రసంగించారు.

ఫోన్ లైట్లు వెలిగించి.. మద్దతు పలికి...

'సమ్మక్క సారలమ్మలకు.. యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామికీ' అంటూ తెలుగులో మోదీ ప్రసంగాన్ని ఆరంభించారు. 'కుటుంబ సభ్యుల్లారా.. బీసీ ఆత్మబంధువుల్లారా.. ఈ సభలో నేను భాగం కావడం నా అదృష్టంగా భావిస్తున్నా. ఎల్బీస్టేడియంతో నాకు ఎంతో సంబంధం ఉంది. నాటి సభలో నా ప్రసంగం కోసం టికెట్ పెట్టారు. దేశ చరిత్రలో అది కొత్త ప్రయోగం. ఇదే గ్రౌండ్‌లో ప్రజలు ఆశీర్వదించడంతో నేను ప్రధాని అయ్యాను. ఇదే మైదానం సాక్షిగా బీజేపీ బీసీ ముఖ్యమంత్రి రాబోతున్నారు. పేదలకు ఐదు కేజీల బియ్యం పంపిణీ పథకం చేపట్టి ఐదేళ్లు అవుతోంది. ఈ పథకాన్ని మరో ఐదేళ్ల పాటు పొడిగించాలని బీజేపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సభకు హాజరైన పేద, మధ్య తరగతి ప్రజలంతా మద్దతు తెలుపాలని కోరుతున్నా'నని చెప్పగానే కార్యకర్తలు, అభిమానులు తమ జేబులల్లోని స్మార్ట్‌ఫోన్లను బయటికి తీసి.. టార్చ్ లైట్లు వెలిగించి మోదీకి మద్దతు ప్రకటించారు.



ప్రధాని మోదీ, కుత్బుల్లాపూర్ బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలం పరస్పర నమస్కారాలు

సీఎం.. సీఎం అనే నినాదాలతో హోరెత్తి..

పార్టీ జాతీయ కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్, ఈటల రాజేందర్‌లు ప్రసంగిస్తున్న సమయంలో అభిమానులు సీఎం.. సీఎం అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థులు కృష్ణ యాదవ్, మర్రి శశిధర్‌రెడ్డి, చింతల రాంచంద్రారెడ్డి తదితరులు వేదికపై ఆసీనులై.. ప్రధాని మోదీతో కలిసి ప్రజలకు అభివాదం చేశారు. మోదీ రాక సందర్భంగా పోలీసులు ఎల్బీస్టేడియం చుట్టూ భారీ భద్రతను ఏర్పాటు చేశారు. నిజాం కాలేజీ, బషీర్‌బాగ్, నాంపల్లి, అసెంబ్లీ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడాల్సి వచ్చింది.

హేళన చేసే పార్టీలను భూస్థాపితం చేస్తాం..



బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నేతలు బీసీలను హేళన చేసి మాట్లాడుతున్నారు. బీసీలను హేళన చేసే పార్టీలను భూస్థాపితం చేయాల్సిన ఆవశ్యకత ఉంది. బీజేపీ ఓ చాయ్ వాలాను దేశానికి ప్రధానమంత్రిని చేసింది. తెలంగాణలో మూడు కోట్ల మంది ఓటర్లు ఉంటే.. వారిలో 1.60 కోట్ల మంది ఓటర్లు బీసీలే. ఇక్కడ బీజేపీ అధికారంలోకి వస్తే బీసీనే సీఎంను చేయనుంది. బీసీని సీఎం చేస్తామని చెప్పే దమ్ము కాంగ్రెస్‌కు లేదు. ఐదు తరాలుగా ఆ పార్టీ బీసీలను మోసం చేస్తూనే ఉంది. ఢిల్లీలో మోదీ.. తెలంగాణలో బీసీ సీఎం నినాదంతో ముందుకు వెళ్తాం. బీసీలంతా ఏకమవ్వాల్సిన ఆవశ్యత ఏర్పడింది. అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఉంది. దేశంలో క్యారెక్టర్ ఉన్న పార్టీ బీజేపీ మాత్రమే. - మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్

గాంధీ భవన్ కాదు.. రెడ్డి భవన్..



కాంగ్రెస్ పార్టీ బీసీలకు తీరని అన్యాయం చేసింది. రాజస్థాన్ డిక్లరేషన్‌లో 34 సీట్లు ఇస్తామని.. 24 సీట్లే ఇచ్చింది. అది కూడా ఓడిపోయే పాతబస్తీలో బీసీలకు టికెట్లు ఇచ్చింది. అది గాంధీ భవన్ కాదు.. రెడ్డి భవన్. రెడ్లకే అక్కడ ప్రాధాన్యం ఉంది. బీసీలకు కనీస గౌరవం లేదు. సామాజిక న్యాయం బీజేపీతోనే సాధ్యం. రామ్‌నాథ్ కోవింద్, ద్రౌపది ముర్ము వంటి దళిత, గిరిజన బిడ్డలను రాష్ట్రపతిగా నియమించింది. కేంద్ర కేబినెట్‌లో 27 మంది ఓబీసీలకు ప్రాధాన్యం కల్పించింది. ప్రస్తుత ఎన్నికల్లో బీసీలకే బీజేపీ మెజార్టీ టికెట్లు కేటాయించింది. వారిని గెలిపించుకోవాల్సిన బాధ్యత బీసీలందరిపై ఉంది. బీఆర్ఎస్ కుటుంబ పార్టీ. ఆ పార్టీ కూడా బీసీలకు సరైన ప్రాధాన్యమివ్వలేదు. మహిళా బిల్లులో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలి. బీసీ జనగణన చేపట్టి, దామాషా ప్రకారం చట్ట సభల్లో ప్రాధాన్యం కల్పించాలి.

- జాజుల శ్రీనివాస్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు

ఎన్ని 'కళ'లో..

ఇంటింటి గడపకు నడక, వీధి గోడల మీద పోస్టర్లు, మౌత్ టాక్.. మైక్ స్పీకర్లు.. ఇదీ ఆనాటి ఎన్నికల ప్రచార హంగామా. ప్రస్తుతం తరం మారింది. ఆధునికత పుణికిపుచ్చుకున్న ఈ- తరం ప్రచారమంతా ఆన్‌లైన్ వేదికగా హోరెత్తిస్తోంది. ప్రస్తుత ప్రచార వ్యవహారాలు ఒక్క పోస్టుతో, ఒకే ఒక్క షేర్‌తో లక్షల మందికి చేరువైతోంది. యువ రాజకీయ నాయకులు, టెక్నాలజీ పైన అవగాహన ఉన్న నేతలు ఈ ఆన్‌లైన్ ప్రచారాన్ని బ్రహ్మాస్త్రంగా మలుచుకుంటున్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ (ట్విట్టర్) తదితర సోషల్ యాప్స్‌లో ఇప్పటికే ఎక్కువ మంది ఫాలోవర్స్ ఉన్న నేతలు తమ సోషల్ ప్రచారంలో ముందుండగా.. ఇవేమీ లేని నాయకులు ఫాలోవర్స్ ఎక్కువగా ఉన్న సోషల్ ఇన్‌ఫ్లూయెన్సర్లను తమ తాత్కాలిక వారధులుగా వాడుకుంటున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే సెలబ్రిటీల పెద్ద సినిమా రిలీజ్‌ను తలదన్నే విధంగా ఉన్నాయి ఎన్నికల సోషల్ ప్రచారమంతా. -సాక్షి, సిటీబ్యూరో

- హోరెత్తిస్తున్న సోషల్ మీడియా ప్రచారం
- ఎక్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టా, య్యూటూబ్‌లే వేదికలు
- సినిమా రిలీజ్‌లను తలదన్నేలా..
- వావ్ అనేలా.. విదేశాల్లోని తెలుగువారి పొలిటికల్ రీల్స్



మీమ్స్‌తో మెసేజ్.. రీల్స్‌తో రిక్వెస్ట్..

ప్రస్తుత ఎన్నికల వేళ ఎక్స్ (ట్విట్టర్) ప్రాబల్యం బాగా పెరిగింది. ఫేస్ బుక్, ఇన్‌స్టాలోనూ ప్రచారం జోరుగా ఉన్నప్పటికీ పలు సామాజిక మాధ్యమాల ఆంక్షల విషయంలో ఎక్స్‌కు ఎన్నో మినహాయింపులున్నాయి. ఈ నేపథ్యంలో చాలా మంది రాజకీయ నాయకులు, పార్టీలు ఎక్స్‌ను ఫాలో అవుతున్నారు. షార్ట్ అండ్ స్వీట్‌గానే తక్కువ సమాచారంతోనే ఫొటోలు, వీడియోలతో ఎక్స్ ఎన్నికలకు వారధిగా మారింది. ఫేస్‌బుక్‌లోని పేజ్, గ్రూప్ అనే వెసులుబాటుతో కూడా ఎన్నికల ప్రచారం జోరందుకుంది. ప్రతి పార్టీ ప్రత్యేక ఫేస్‌బుక్ పేజీలను తెరచి, అందులో వేల సంఖ్యలతో కార్యకర్తలను చేర్చుకుని తమ సోషల్ ప్రచారాన్ని ఊపందించాయి.

యూట్యూబ్ స్టార్స్., ఇన్‌స్టా రీల్స్..

- లక్షల సంఖ్యలో ఫాలోవర్స్ ఉన్న యూట్యూబ్ చానళ్లకు ఎన్నికల వేళ గిరాకీ చాలా పెరిగింది. దీనికి నిదర్శనం.. ఈ మధ్యనే మంత్రి కేటీఆర్ తెలంగాణలో మస్తు మైలేజ్ ఉన్న 'మై విలేజ్ షో' అనే యూట్యూబ్ చానల్ బృందంతో పల్లెటూరిలో వంటా వార్పు అంటూ ఓ వీడియో రిలీజ్ చేయడం. పల్లెటూర్ల నుంచి పట్నం వరకు గంగవ్వకు ఉన్న క్రేజ్‌ను మంత్రి కేటీఆర్ ఎన్నికల వేళ భలే వడుకున్నారంటూ స్పందన వస్తోంది. ఏ మాత్రం ఖాళీ సమయం దొరికినా ఎఫ్ఎం వినే వాళ్లు లక్షల్లోనే ఉంటారు. ఈ వేదికను సైతం కేటీఆర్ వదల్లేదు అంటే సోషల్ ప్రచారం ఎంత కీలకమైందో అర్థం చేసుకోవచ్చు.
- ఇన్‌స్టా రీల్స్‌కు లక్షల్లో రీచ్ ఉండటంతో అన్ని పార్టీలు ఈ రీల్స్‌ను షేర్ చేస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీకి చెందిన రేవంత్ రెడ్డి, కోమటి రెడ్డి వంటి అభ్యర్థులు ప్రత్యేకంగా రూపొందించుకున్న ఎన్నికల పాటలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. బీఆర్ఎస్‌కు చెందిన 'గులాబీ జెండలే రామక్క' అనే పాటను విదేశాల్లోని తెలుగు వారు సైతం రీల్స్‌తో అదరగొడుతున్నారు. వాట్సాప్ యూనివర్సిటీ అని ముందు నుంచే పేరున్న బీజేపీ తన పంథాను కొనసాగిస్తూనే ఉంది. కాంగ్రెస్, బీజేపీలకు సంబంధించి ఢిల్లీ వేదికగా నిర్వహించే సోషల్ మీడియా యాప్స్ మంచి ప్రజాదరణ పొందుతున్నాయి.

ఏడాది నుంచే కసరత్తు..

ప్రస్తుత ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గత ఏడాది నుంచే సోషల్ మీడియా ప్రచార ప్రణాళికలను మొదలు పెట్టాయి వివిధ పార్టీలు. ఇందులో భాగంగా ఎన్నికల కోసమే ప్రత్యేకంగా పార్టీలు, అభ్యర్థులు తమ వ్యక్తిగత సోషల్ మీడియా అకౌంట్లు, గ్రూపులను ప్రారంభించాయి. గత ఏడాది, రెండేళ్లలో తమ అకౌంట్లకు ఫాలోవర్స్‌ను పెంచుకునేలా శ్రద్ధ తీసుకున్నాయి. ఫాలోవర్స్‌ను ఆకర్షించడానికి అధికార పార్టీ వర్గాలు తమ సంక్షేమ కార్యక్రమాలు, పథకాలను వాడుకోగా, ప్రతిపక్ష పార్టీలో ప్రభుత్వ వైఫల్యాలను, సామాజిక వ్యతిరేకతలపై దృష్టి పెట్టాయి. ఈ విషయంలో రాష్ట్రంలోని అధికార పార్టీ బీఆర్ఎస్, కేంద్రంలోని అధికార పార్టీ బీజేపీలు చాలా ఫోకస్డ్‌గా పని చేశాయి. ప్రజలను ఆకర్షించడంలో ఫలితాలను సైతం పొందాయి. కొన్ని విషయాల్లో సోషల్ మీడియా యుద్ధాలే జరిగాయి. ఈ సోషల్ మీడియా ప్రచారం ఎలా ఉన్నప్పటికీ ఈ వేదికల్లో చక్కర్లు కొట్టే సమాచారంలో ఫేక్ న్యూస్ ఎక్కువుందని తరచూ ఫిర్యాదులు అందడంతో ఎన్నికల వేళ పోలీసు శాఖ కూడా పటిష్టంగానే ఆంక్షలు విధించింది.



- అవ్వా అధైర్యపడకు.. కేసీఆరే భరోసా మీకు

మియాపూర్‌లోని న్యూ కాలనీలో శేరిలింగంపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కేసీఆర్ భరోసాతో సంక్షేమ ఫలాలను అందజేస్తానని.. ఓ అవ్వకు హామీ ఇచ్చారు. - శేరిలింగంపల్లి

ఘనంగా అరోరా కళాశాల స్నాతకోత్సవం

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో మంగళవారం అరోరా విద్యాసంస్థల స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు సన్మార్గంలో నడుస్తూ ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరారు. ఓయూ వీసీ డి.రవీందర్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ చైర్మన్ వి.బాలకిష్టారెడ్డి, అరోరా కళాశాల సెక్రటరీ నిమ్మటూరి రమేష్ బాబు, వైస్ చైర్మన్ నిమ్మటూరి అనుదీప్ అరోరాలు పాల్గొని ప్రసంగించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు.

దుస్తులు కుట్టి...ఓట్లు పట్టి..



బంజారాహిల్స్ రోడ్ నెం.2 లోని జవహర్‌కాలనీలో మంగళవారం ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పి.విజయారెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఓ దర్జీ వద్దకు వెళ్ళి కుట్టుమిషన్‌పై కూర్చొని దుస్తులు కుట్టి సందడి చేశారు. హస్తం గుర్తుకే తన ఓటు అంటూ అక్కడి మహిళలకు అవగాహన కలిగించారు. కాలనీలో ఆమె ప్రచారానికి భారీ స్పందన లభించింది. - బంజారాహిల్స్

సభ సాక్షిగా...



రోడామేస్త్రీనగర్‌లో మంగళవారం ఎమ్మెల్యే వివేకానంద్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తానని, తనకు మరోసారి ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. - కుత్బుల్లాపూర్

ప్రచారం..సన్మానం



మంత్రి సబితా రెడ్డి మంగళవారం సరూర్‌నగర్, కొత్తపేట తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సరూర్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు జగన్, గోవర్ధన్‌రెడ్డి తదితరులు సబితకు మద్దతు తెలిపి...శాలువాతో సన్మానించారు. ఎన్నికల్లో అండగా ఉంటామని పేర్కొన్నారు. - హుడాకాంప్లెక్స్

పజ్జన్న పాదయాత్ర



తార్నాక డివిజన్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ మంగళవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా కాలనీలు, బస్తీల్లో ఆయన ఇంటింటికీ తిరిగి బీఆర్ఎస్‌కు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. మరోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

ఎన్నికల 'ముఠా'



ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ మంగళవారం భరత్‌నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముషీరాబాద్‌కు చెందిన ప్రముఖ టిక్‌టాక్ సాయి యాదవ్ బీఆర్ఎస్ పార్టీలో చేరగా.. ఎమ్మెల్యే ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

మీ..సరిలేని 'కాలేరు'ను



అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మంగళవారం జైస్వాల్ గార్డెన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరుగుతూ ఈసారి కూడా తనకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు.

విరామంలో ఆహారం



గత పది రోజుల నుంచి ఖైరతాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ విరామం లేకుండా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఒక్కోసారి నాగేందర్‌కు కనీసం తినేందుకు సమయం కూడా చిక్కడం లేదు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆయన నందినగర్‌లో ప్రచారం నిర్వహిస్తూ..కొద్దిసేపు విరామం తీసుకొని బ్రెడ్ శాండ్‌విచ్‌తో తన బ్రేక్‌ఫాస్ట్‌ను ఇలా కానిచ్చేశారు. - బంజారాహిల్స్

ఎన్నికల ముచ్చట



అంబర్‌పేటలోని పటేల్‌నగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి రోహిణ్‌రెడ్డి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో ముచ్చటించి అంబర్‌పేట అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. - అంబర్‌పేట

లిఫ్ట్‌లో ఇరుక్కుని నాలుగేళ్ల బాలుడి మృతి



మృతి చెందిన అక్షయ్‌కుమార్

నాగోలు: కొత్తగా నిర్మించిన భవనం లిఫ్ట్‌లో ఇరుక్కొని ఓ బాలుడు మృతి చెందిన సంఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం ధర్మపురానికి చెందిన బొల్లికొండ నాగరాజు, అనురాధ దంపతులు ఎల్‌బీనగర్‌లోని ఆర్టీసీ కాలనీలో నూతనంగా నిర్మించిన ఓ భవనంలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నారు. వీరి పెద్ద కుమారుడు అక్షయ్ కుమార్ (4) మంగళవారం ఉదయం లిఫ్ట్‌లో ఆడుకుంటూ కిందకు వెళ్తుండగా..మొదటి అంతస్తు వద్దకు లిఫ్ట్ చేరుకున్న సమయంలో సగంలో తలుపు తెరవడంతో ఇరుక్కుని కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కామినేని ఆస్పత్రికి తరలించగా..చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. బాలుడి తల్లి, బంధువులు మాట్లాడుతూ తన కుమారుడిని చూపించకుండానే పోలీసులు, బిల్డింగ్ ఓనర్ కుమ్మక్కై పోస్ట్‌మార్టంకు తరలించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎల్‌బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



సిటీలో హైలైఫ్ ఎగ్జిబిషన్ ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: రానున్న దీపావళి పండుగను పురస్కరించుకొని నగరంలోని హెచ్ఐసీసీ నోవాటెల్ వేదికగా 3 రోజుల పాటు కొనసాగే హైలైఫ్ ఎగ్జిబిషన్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్‌ను సినీ తారలు సుభశ్రీ రాయగురు, అనుశ్రీయ త్రిపాఠి ఆవిష్కరించగా పలువురు టాప్ మోడల్స్ ఈ ప్రదర్శనలో పాల్గొని సందడి చేశారు.

ఈ ప్రదర్శనలో అధునాతన ఫ్యాషన్ వేర్, డిజైనింగ్ వేర్, ఆభరణాలు, వెడ్డింగ్ వేర్ అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు.

పండుగల నేపథ్యంలో 'వేగ శ్రీ' ప్రత్యేక ఆఫర్లు

సాక్షి, సిటీబ్యూరో: రానున్న దంతేరాస్, దీపావళి పండుగల నేపథ్యంలో నగరంలోని బంగారు–వజ్రాభరణాల షోరూమ్ 'వేగ శ్రీ గోల్డ్ అండ్ డైమండ్స్' ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. ఇందులో భాగంగా ఈ నెల 12వ తేదీ వరకు 2 లక్షల విలువ గల బంగారు ఆభరణాల కొనుగోళ్లపైన ఒక గ్రాము బంగారం కాయిన్ బహుమతిగా అందిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. డైమండ్ జ్యువెలరీ క్యారట్ ధర రూ.55,999 మాత్రమేనని, పోల్కి ఆభరణాలపైన ఎటువంటి మేకింగ్, వేస్టేజ్ ఛార్జీలుండవని పేర్కొన్నారు. తెలుగు ప్రజలు బంగారం, వజ్రాభరణాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా అన్ని ప్రాంతాల్లోని ప్రత్యేకమైన ఆభరణాలను నగరంలోనే ప్రదర్శిస్తున్నామని వెల్లడించారు.

రాజేష్ మహాసేనపై క్రిమినల్ కేసు

బంజారాహిల్స్: యూట్యూబ్ వీడియోలు తీస్తూ వివాదాస్పదమైన రాజేష్ మహాసేన అలియాస్ రాజేష్ సరిపెల్లపై బంజారాహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఓ చానల్ మేనేజింగ్ ఎడిటర్ ఫిర్యాదు మేరకు సోమవారం దీన్ని రిజిస్టర్ చేశారు. సదరు చానల్‌లో వస్తున్న చర్చా కార్యక్రమానికి ఈ మేనేజింగ్ ఎడిటర్ హోస్ట్‌గా వ్యవహరిస్తున్నారు. వారి న్యూస్ రూమ్ చర్చల్ని ఇటీవల సోషల్ మీడియాలో పెట్టడం ప్రారంభించారు. ఇలాంటి ఓ వీడియోను ఎడిట్, ట్యాంపరింగ్ చేసిన రాజేష్ మహాసేన తన యూట్యూబ్ చానల్‌లో పెట్టడంతో పాటు సోషల్‌మీడియాలోనూ పోస్టు చేశారన్నది ప్రధాన ఆరోపణ. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

నగరంలో వర్షం

లింగంపల్లిలో 4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో వర్షం కురిసింది. మంగళవారం రాత్రి ఉన్నట్టుండి ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. మేఘాలు కమ్ముకుపోయాయి. చిరు జల్లుతో ప్రారంభమైన వర్షం పలు ప్రాంతాల్లో దంచి కొట్టింది. లింగంపల్లిలో అత్యధికంగా 4 సెంటీమీటర్ల వర్ష కురిసింది. చందానగర్‌లో 3.4 సెంటీమీటర్లు, మూసాపేటలో 2.6, గచ్చిబౌలిలో 2.4, ఆర్‌సీపురంలో 2 సెంటీ మీటర్ల వర్షపాతం కురిసింది. మాదాపూర్, బోరబండ, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజగుట్ట, యూసఫ్‌గూడ, మాదాపూర్, హైటెక్ సిటీ, మియాపూర్, కుత్బుల్లాపూర్, సూరారం, సుచిత్ర, కొంపల్లి, చింతల్, షాపూర్ ఏరియాల్లో వర్షం కురిసింది.



ఎర్రగడ్డలో మంగళవారం రాత్రి వర్షం..

ప్రశ్నించే గొంతులను పాలకులు టార్గెట్ చేస్తున్నారు

పౌరహక్కుల నేత ప్రొఫెసర్ హరగోపాల్



హిమాయత్‌నగర్: పాలకులు ప్రశ్నించే గొంతులను టార్గెట్ చేస్తున్నారని, నేడు దేశంలో ప్రశ్నించడమే ఒక నేరమైందని పౌరహక్కుల నేత ప్రొఫెసర్ హరగోపాల్ ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో జన విజ్ఞాన వేదిక తెలంగాణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సైంటిస్టులు సర్ సి.వి. రామన్, మేరీ క్యూరీ పుట్టిన రోజులను పురస్కరించుకుని, 'ప్రగతికి తొలి మెట్టు ప్రశ్న' జాతీయ శాస్త్రీయ దృక్పథ ప్రచారోద్యమ వాల్ పోస్టర్‌ను వేదిక ప్రతినిధులతో కలిసి ప్రొ. హరగోపాల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రశ్నించడమే ఒక నేరమైందని, భవిష్యత్తులో ఇకపై తమను ఎవరు ప్రశ్నించవద్దన్న లక్ష్యంతో దాడులకు దిగుతున్నారన్నారు. ఇది సమాజ శ్రేయస్సుకు ఏ మాత్రం మంచిది కాదన్నారు. సంపద పెరగాలన్న, దేశం అభివృద్ధి చెందాలన్న, అది ప్రశ్న వల్లనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మాజీ అధ్యక్షులు ప్రొఫెసర్ బి.ఎస్.రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రాజా, వెంకటరమణ రెడ్డి, కోశాధికారి వరప్రసాద్, జెవివి హైదరాబాద్ నగర కమిటీ ప్రధాన కార్యదర్శి ఎస్. లింగస్వామి, నాయకులు బురాన్, ఆల్తాఫ్, విద్యాసాగర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పథకాలు దేశానికే ఆదర్శం

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్



ప్రేమ్‌నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఖైరతాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి దానం నాగేందర్

పంజగుట్ట: తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఆయన ప్రేమ్‌నగర్‌లో గడపగడపకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు ఆయనకు మంగళ హారతులు పట్టి ఘనంగా స్వాగతం పలికారు. నియోజకవర్గంలో పేదల బస్తీల్లో ఇప్పటికే 90 శాతం సమస్యలు పరిష్కరించానని మరోసారి అవకాశం ఇస్తే సమస్యలు లేని ఖైరతాబాద్‌గా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. 10 ఏళ్ల క్రితం బస్తీల్లో అనేక సమస్యలు ఉండేవని తెలంగాణ వచ్చాక సీసీ రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సరఫరాకు కొత్త లైన్‌లు వేయడం తదితర చర్యలు తీసుకున్నామని గుర్తుచేశారు. ఇంకా కొన్ని సమస్యలు ఉన్నప్పటికీ వాటిని కూడా ఎన్నికల కోడ్ ముగియగానే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్, బీజేపీ నేతలు మాయమాటలు చెబుతారని కాని వాటిని నమ్మకుండా జాగ్రత్తగా ఓటు వేయాలని సూచించారు. ముఖ్యంగా మహిళలకు రూ. 400కే గ్యాస్ ఇస్తామని ఇంట్లో అందరితో బీఆర్‌ఎస్‌కు ఓటువేసేలా చూడాలని కోరారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

దానంకు మద్దతుగా కార్పొరేటర్ ప్రచారం

ఫిలింనగర్: ఖైరతాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు ఓటు వేసి గెలిపించాలంటూ జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ మంగళవారం బీఆర్‌ఎస్ సీనియర్ నేత మామిడి నర్సింగ్‌రావుతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఫిలింనగర్‌లోని గౌతంనగర్, భగత్‌సింగ్ కాలనీ, దుర్గా భవానీనగర్, దీన్‌దయాల్‌నగర్ బస్తీలో ఇంటింటికి వెళ్ళి బీఆర్‌ఎస్ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. గృహిలక్ష్మి, సౌభాగ్యలక్ష్మి, ఆరోగ్యరక్ష తదితర పథకాలు వచ్చే నెల నుంచి అమలవుతాయని బడుగు బలహీన వర్గాలు మరోసారి బీఆర్‌ఎస్‌కు అండగా నిలబడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్‌ఎస్ నేతలు మారెమ్మ, వెంకటస్వామి, లింగాచారి, ఎల్లయ్య, శ్రీనివాస్, నాగేష్ సాగర్, భాగ్య నవీన్, తదితరులు పాల్గొన్నారు.

నేడు దానం నామినేషన్

ఖైరతాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ బుధవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్‌లోని నామినేషన్ కేంద్రం వరకు భారీ సంఖ్యలో కార్యకర్తలు, నేతలతో కలిసి ర్యాలీ నిర్వంహించనున్నారు. ఇందులో భాగంగా ఖైరతాబాద్ బడా గణేష్ వద్ద బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. నియోజక వర్గ వ్యాప్తంగా వేల సంఖ్యలో కార్యకర్తలు హాజరుకానుండటంతో అందుకు తగినట్లుగా బీఆర్‌ఎస్ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నాయి. దాదాపు 25 వేల మందిని సమీకరించాలని యోచినట్లు సమాచారం.

జోరుగా నామినేషన్ల పర్వం

ఐదు నామినేషన్లు దాఖలు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ నియోజక వర్గంలో నామినేషన్ల పర్వం ఊపందుకుంది. మంగళవారం ఐదు మంది అభ్యర్థులు వివిధ పార్టీల తరపున నామినేషన్లు దాఖలు చేశారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని షేక్‌పేట మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అభ్యర్థులు తమ నామినేషన్ల అందజేశారు. ఫిలింనగర్‌లోని మహాత్మగాంధీనగర్ బస్తీకి చెందిన డి. భీమయ్య మాదిగ బీజేపీ అభ్యర్థిగా మొదటి సెట్ నామినేషన్ దాఖలు చేశారు. యూసుఫ్‌గూడ సంజయ్‌నగర్ బస్తీకి చెందిన సయ్యద్ సలావుద్దీన్ ఆమ్ ఆద్మీ పార్టీ తరపున, ఎల్లారెడ్డిగూడకు చెందిన గొంటి శ్రీకాంత్ సమైఖ్యాంధ్ర పరిరక్షణ సమితి పార్టీ తరపున, ఎల్లారెడ్డిగూడ ఎస్‌బీహెచ్ కాలనీకి చెందిన ఎం. ప్రసూనాంబ నవరంగ్ కాంగ్రెస్ పార్టీ తరపున, వెంకటగిరికి చెందిన వెంకట్‌రెడ్డి పాట పార్టీ తరపున రిటర్నింగ్ అధికారి రవికి నామినేషన్లు అందజేశారు. ఇదిలా ఉండగా సమైఖ్యాంధ్ర పరిరక్షణ సమితి అభ్యర్థి గొంటి శ్రీకాంత్ సినిమా హీరో కావడం విశేషం

ఖైరతాబాద్‌లో నిల్...

ఖైరతాబాద్ అసెంబ్లీకి మంగళవారం నామినేషన్లు దాఖలు కాలేదు.

బీఆర్‌ఎస్‌కు మళ్లీ పట్టం కట్టాలి



మాట్లాడుతున్న వలిగొండ శ్రీనివాస్

లిబర్టీ: రాష్ట్ర ప్రగతి, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతున్న భారత రాష్ట్ర సమితి పార్టీని అన్ని వర్గాల ప్రజలు ఆదరించాలని దళిత బహుజన విద్యార్థి సమాఖ్య తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు శ్రీనివాస్ అన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలిచిందన్నారు. మంగళవారం సమాఖ్య కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. ప్రజా సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతు బీమా, గృహలక్ష్మి, ఆసరా పింఛన్, దివ్యాంగులకు పెన్షన్, ప్రాజెక్టుల నిర్మాణంతో తెలంగాణ ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని కొనియాడారు. అన్ని వర్గాల ప్రజలు బీఆర్‌ఎస్‌ను గెలిపించి కేసిఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రి చేయాలని కోరారు. సమావేశంలో ఇంద్రకరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికార సాధనే ధ్యేయం



ర్యాలీలో పాల్గొన్న వడ్లమూరి కృష్ణస్వరూప్

లిబర్టీ: రాజ్యాధికార సాధనకు దళిత బహుజనులు సిద్ధం కావాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణస్వరూప్ అన్నారు. చట్ట సభల్లోకి దళిత బహుజనులు పంపించాలని దళిత, బహుజనులను వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించాలని కోరుతూ మంగళవారం ప్రదర్శన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ దళిత బహుజన చట్టసభల్లోకి పంపిస్తే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. బీసీ ముఖ్యమంత్రి జపం చేస్తూ బీజేపీ నాటకాలు ఆడుతుందని ఆరోపించారు. తెలంగాణకు ఎలాంటి మేలు చేయని ప్రధానమంత్రి నరేంద్రమోదీకి రాష్ట్రంలో పర్యటించే హక్కు లేదన్నారు. ప్రధాన రాజకీయ పార్టీలకు అసలైన ప్రత్యామ్నాయ శక్తితామే అని వెల్లడించారు. బీజేపీ, బీఆర్‌ఎస్ ఒక్కటేనని, ఆయా పార్టీలకు ఓటర్లు తిరస్కరించాలని కోరారు. ఈ ప్రదర్శనలో ఎన్నికల కమిటీ చైర్మన్ డాక్టర్ వి.ఎల్.రాజు, దేవునూరి శ్రీనివాస్, బి.సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బసవతారకం కేన్సర్ ఆస్పత్రికి వీల్‌చైర్ల వితరణ

బంజారాహిల్స్: జాతీయ కేన్సర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని అమెరికాలో నివసిస్తున్న రవి పొట్లూరి 30 వీల్ చైర్లను కేన్సర్ పేషంట్ల కోసం బంజారాహిల్స్‌లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రికి విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో బాలకృష్ణతో పాటు సీఈవో ఆర్‌వి. ప్రభాకర్‌రావు, కల్పనా రఘునాథ్, డాక్టర్ ఫణి కోటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మోదీ సభకు భారీగా తరలిన కార్యకర్తలు



మోదీ సభకు వెళ్తున్న బీజేపీ నేతలు, కార్యకర్తలు

వెంకటేశ్వరకాలనీ: ఎల్బీ స్టేడియంలో జరిగిన ప్రధాని నరేంద్ర మోదీ సభకు నియోజక వర్గ వ్యాప్తంగా అన్ని డివిజన్ల నుంచి పెద్ద ఎత్తున బీజేపీ నేతలు, కార్యకర్తలు తరలివెళ్లారు. మంగళవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 1 జీవీకే చౌరస్తా నుంచి వెంకటేశ్వరకాలనీ డివిజన్ అధ్యక్షుడు మన్నెం వీరాస్వామి ఆధ్వర్యంలో కార్యకర్తలు పెద్ద ఎత్తున సభకు తరలివెళ్లారు.

9న నవరస రామచరితం నృత్య నాటకం



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

పంజగుట్ట: మువ్వ నిత్య రాగ నిగామం ఆధ్వర్యంలో ఈ నెల 9న మాదాపూర్ లోని శిల్పకళావేదికలో 'నవరస రామచరితం' కూచిపూడి నృత్య నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్లు మువ్వ వ్యవస్థాపకులు డాక్టర్ హిమబిందు, శ్రీవల్లి, డాక్టర్ హరికృష్ణలు తెలిపారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ .. తులసీదాసు రచించిన రామ చరిత మానస్ గ్రంథం ఆధారంగా నాట్యంలోనే నవరసాలు కలిపి కూచిపూడి నృత్య నాటకాన్ని రూపొందించామన్నారు. రామాయణంలోని అన్ని ఘట్టాలను ఇందులో ప్రదర్శిస్తామని రాముడు, సీత, లక్ష్మణుడు, శూర్పనఖ, జటాయివు ఇలా మొత్తం 45 మంది కళాకారులు ఈ ప్రదర్శనలో పాల్గొంటారన్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పోయింది

జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి అజహరుద్దీన్



కాంగ్రెస్‌లో చేరుతున్న లక్ష్మణ్ తదితరులు

రహమత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నదని జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మహ్మద్ అజహరుద్దీన్ అన్నారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు తంగలపల్లి లక్ష్మణ్ తన అనుచరులతో కలిసి మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సంతోషగిరిలో ఏర్పాటు చేసిన సమావేశంలో అజహరుద్దీన్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బహ్మరథం పడుతున్నారని, వివిధ పార్టీలకు చెందిన నాయకులు స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. బీఆర్‌ఎస్‌పై ప్రజలకు నమ్మకం పోయిందని, తెలంగాణ ప్రజలు మళ్లీ కాంగ్రెస్ పాలన కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో నగర కాంగ్రెస్ నాయకుడు భవానిశంకర్, జాఫర్‌హుస్సేన్, గ్యారనాగరాజు, జేపిజ్ఞానేశ్వర్, సుందర్, మేఘన పద్మ, మాలాశ్రీ,రాంబాబు, అండాలు, కేశవులు, ముబిన్, నయూం,షేర్‌ఆలం, అహ్మద్, రాకేష్‌యాదవ్, విఘ్నేష్, రాజు, గిరి.సుభాకర్, శివ బోడరవికుమార్, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు రహమత్‌నగర్ పీజేఆర్ విగ్రహం వద్ద నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు.

భారీ బందోబస్తు ఏర్పాటు



జూబ్లీహిల్స్ ఆర్‌వో కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని షేక్‌పేట మండల కార్యాలయంలో జూబ్లీహిల్స్ నియోజక వర్గ నామినేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక పోలీసు బలగాలతో భారీ బందోబస్తు చర్యలు చేపట్టారు. ఆర్‌వో కేంద్రానికి దారితీసే రహదారుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసు బందోబస్తు మధ్య అభ్యర్థితో పాటు నలుగురిని మాత్రమే నామినేషన్ కేంద్రంలోకి అనుమతిస్తున్నారు. అడుగడుగునా ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలతో పాటు రోడ్లకు నలువైపులా సాయుధ బలగాలు మోహరించాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

కుంగ్‌ఫూ పోటీల్లో సత్తా చాటిన చిన్నారులు



మెడల్స్‌తో విద్యార్థులు

రహమత్‌నగర్: ఫస్ట్ నేషనల్ ఓపెన్ కరాటే, కుంగ్‌ఫూ చాంపియన్ షిప్ 2023 పోటీల్లో ఎస్పీఆర్‌హిల్స్‌కు చెందిన స్కూల్ ఆఫ్ షావోలిన్ కుంగ్ ఫూ మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులు సత్తా చాటారు. బహదూర్‌పల్లిలో నిర్వహించిన పోటీలో‌ మొదటి స్థానంలో ఎ.ధనుంజయ్, రెండో స్థానంలో బి.పావణి, బి.ప్రశాంత్, సయ్యద్ రేహాన్, సయ్యద్ జునైద్, యండి అహిల్.ఎ.పావని, మూడవ స్థానంలో, బావేష్ నిలిచారు. విజేతలకు పోటీల నిర్వాహకుడు విఠల్ అవార్డులను అంద జేశారు. ఎస్పీఆర్ హిల్స్‌కు చెందిన వీరు పీజేఆర్ ఆలయఆవరణలో మాస్టర్ మనోహర్ వద్ద శిక్షణ పొందుతున్నారు.

చేయూతనందిస్తే సత్తా చాటుతా..



బంగారు పతకాన్ని ప్రదర్శిస్తున్న ప్రతిభ తక్కడపల్లి

పంజగుట్ట: ప్రభుత్వం చేయూతనందిస్తే దేశానికి మరిన్ని పతకాలు అందిస్తానని ప్రపంచ చెస్ బాక్సింగ్ విజేత ప్రతిభ తక్కడపల్లి అన్నారు. అక్టోబర్ 28 నుంచి నవంబర్ 3 వరకు ఇటలీలో జరిగిన 3వ ప్రపంచ చెస్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో బంగారు పతకం సాధించినట్లు ఆమె పేర్కొన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె సాధించిన మెడల్స్‌ను ప్రదర్శించారు. పోటీల్లో 5 ఖండాలకు చెందిన బాక్సర్‌లు పాల్గొన్న ఈ పోటీల్లో తెలంగాణకు చెందిన తాను బంగారు పతకం సాధించానని తెలిపారు. గతంలో కిక్‌బాక్సింగ్, థాయ్ బాక్సింగ్, మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్‌లలో కూడా ప్రపంచ విజేతగా నిలిచానన్నారు. పాటియాలాలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్‌లో కిక్ బాక్సింగ్, థాయ్ బాక్సింగ్, చెస్ బాక్సింగ్ కోచ్‌గా శిక్షణ పూర్తిచేసుకున్నానని భారతదేశంలో మొట్టమొదటి ఉమెన్ బాక్సింగ్ కోచ్‌గా శిక్షణ పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం సహకారం అందిస్తే మరిన్ని పతకాలు సాధిస్తానని తెలిపారు. 2024 జూన్‌లో జరగనున్న ఓపెన్ ఇంటర్నేషనల్ బాక్సింగ్ పోటీలకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు.

చెరుకు రాంచందర్ గృహ నిర్బంధం



బంజారాహిల్స్: ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల11న మాదిగల విశ్వరూప బహిరంగ సభకు హాజరు కానున్న నేపథ్యంలో ఆయన సభను అడ్డుకుంటామని ఎస్సీ వర్గీకరణ అంశానికి బీజేపీ మద్దతు ఇస్తే బీజేపీకి కర్ణాటకలో పట్టిన గతే తెలంగాణనూ పడుతుందని తెలంగాణ మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్ అన్నారు. మంగళవారం ఆయనను బంజారాహిల్స్ పోలీసులు గృహనిర్బంధం చేశారు. మోదీని అడ్డుకోవాలంటూ మంగళవారం తాము నిరసన కార్యక్రమం చేపట్టేందుకు యత్నించగా పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారని ఆరోపించారు. మోదీ, కిషన్‌రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు.

జూబ్లీహిల్స్‌లో మాగంటి హ్యాట్రిక్ ఖాయం



ప్రచారంలో పాల్గొన్న మంత్రి తలసాని, బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్, మాజీ ఎమ్మెల్యే విష్ణు వర్ధన్ రెడ్డి

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

రహమత్‌నగర్: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ హ్యాట్రిక్ సాధించడం ఖాయమని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన బోరబండ డివిజన్‌లో నిర్వహించిన ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులే బీఆర్‌ఎస్‌ను మూడోసారి అధికారంలోకి తీసుకొస్తాయన్నారు. మాజీ ఎమ్మెల్యే పి. విష్ణువర్ధన్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరడంతో పార్టీ బలం మరింత పెరిగిందన్నారు. హైదరాబాద్‌నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మాత్రమే దక్కుతుందన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా బడు గు, బలహీన, దళిత, మైనారిటీ వర్గాల సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. మతాన్ని అడ్డుపెట్టుకుని ప్రజలను మభ్యపెట్టే బీజేపీ నాయకుల మాటలను నమ్మవద్దని సూచించారు. డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు కృష్ణమోహన్, ఇన్‌చార్జ్ సిరాజ్, కోఆర్డినేటర్ విజయసింహా, విజయ్‌కుమార్, దేవమణి, సర్దార్, బాబానాయక్, యూసుఫ్, ధర్మ, వీరేశం పాల్గొన్నారు.

ఆకృతి ఎలైట్ లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్ ప్రారంభం



సాక్షి, సిటీ బ్యూరో: నగరంలోని హోటల్ తాజ్ డెక్కన్ వేదికగా ఆకృతి ఎలైట్ లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్‌ను ఆకృతి ఎగ్జిబిషన్ డైరెక్టర్ శశినాథ్ మంగళవారం ప్రారంభించారు. బుధవారం కూడా కొనసాగనున్న ఈ ప్రదర్శనలో దీపావళి పండగ నేపథ్యంలో చీరలు, హోమ్ డెకర్ తదితర కలెక్షన్స్ ప్రదర్శిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ అజీజ్ పాషా

సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ అజీజ్ పాషా

హిమాయత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి సీపీఐ కృషి చేస్తుందని పార్టీ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ అజీజ్ పాషా అన్నారు. మంగళవారం హిమాయత్ నగర్‌లోని మఖ్దూమ్ భవన్‌లో మలక్‌పెట్ అసెంబ్లీ నియోజకవర్గం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అజీజ్ పాషా మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నిరంకుశ పాలన, బీజేపీ విభజన రాజకీయాలను తెలంగాణ ప్రజలు సహించబోరన్నారు. తోడు దొంగలైన బీజేపీ, బీఆర్‌ఎస్‌లను ఈ అసెంబ్లీ ఎన్నికల్లో బుద్ధి చెబుతారన్నారు. మతాన్ని అడ్డంపెట్టుకుని మైనారిటీలను అభివృద్ధికి దూరం చేస్తున్న ఎంఐఎంకు కూడా తగిన గుణపాఠం చెబుతారన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సమాఖ్య స్ఫూర్తిని రక్షించేందుకు 'ఇండియా కూటమి' లో భాగంగా సీపీఐ, కాంగ్రెస్ పార్టీలు కలిసి పోటీ చేస్తున్నాయని, హైదరాబాద్ నగరంలో అసెంబ్లీ స్థానాలకు పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం సీపీఐ శ్రేణులు ప్రచారం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు ఈ.టి. నరసింహ, ఎస్. ఛాయాదేవి, షేక్ అక్బర్, కమతం యాదగిరి, డా. వలి ఉల్లాహ్ ఖాద్రి, కె. ధర్మేంద్ర, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నిమ్స్‌లో రేడియేషన్ సేఫ్టీ అవేర్‌నెస్ వాక్

లక్డీకాపూల్ : 'ఇంటర్నేషనల్ డే ఆఫ్ రేడియాలజీని పురస్కరించుకుని బుధవారం నిమ్స్‌లో రోగులకు మద్దతుగా రేడియాలజిస్టులు, రేడియోగ్రాఫర్‌లు అనే థీమ్‌తో నిమ్స్ ట్రామా బ్లాక్ నుంచి మెయిన్ గేట్ వరకు 'రేడియేషన్ సేఫ్టీ అవేర్‌నెస్ వాక్' నిర్వహించనున్నారు. అనంతరం నిమ్స్ లెర్నింగ్ సెంటర్‌లో నిర్వహించనున్న అవగాహన కార్యక్రమంలో నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప, డీన్ డాక్టర్ లీజా రాజశేఖర్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ, ఎక్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డాక్టర్ శాంత్ వీర్ , రేడియాలజీ సీనియర్ ప్రొఫెసర్ రామ్మూర్తి, డాక్టర్ జ్యోత్స్న, హెడ్ ఆఫ్ ద డిపార్ట్‌మెంట్ డాక్టర్ అను కపూర్ పాల్గొననున్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం



జవహర్ కాలనీలో ఓటు అభ్యర్థిస్తున్న ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పి. విజయారెడ్డి

ఫిలింనగర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని ఓట్ల కోసం మరోసారి మోసం చేసేందుకు ఆ పార్టీ నేతలు వస్తున్నారని వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పి. విజయారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఆమె జూబ్లీహిల్స్ డివిజన్ బంజారాహిల్స్ రోడ్ నెం.2లోని జవహర్‌కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీతో పాటు పక్కనే ఉన్న ఇందిరానగర్ బస్తీ తన తండ్రి పీజేఆర్ హయాంలో ఏర్పాటయ్యాయన్నారు. అప్పట్లో ఇళ్లు కూల్చివేస్తామని స్థానికులను రెవెన్యూ అధికారులు భయభ్రాంతులకు గురి చేయగా పీజేఆర్ కూల్చివేతలను అడ్డుకోవడమే కాకుండా ప్రజల కోసం జైలుకు కూడా వెళ్లారని గుర్తు చేశారు. ఓటు కోసం వచ్చే బీఆర్‌ఎస్, బీజేపీలకు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. దళిత బంధు పథకాన్ని బీఆర్‌ఎస్ బంధుగా మార్చారని, బీఆర్‌ఎస్ ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా నెరవేరలేదన్నారు. పేదలందరికీ కాంగ్రెస్‌లోనే న్యాయం జరిగిందని గుర్తు చేశారు. తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం సోనియాగాంధీ ఆరు గ్యారంటీలను ఇవ్వడం జరిగిందని ఆ కరపత్రాలను ఆమె ఇంటింటికి అందజేశారు. డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడితో పాటు యూత్ కాగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఒక్కసారి అవకాశం ఇవ్వండి

పంజగుట్ట: తన తండ్రిలా ప్రజాసేవ చేసేందుకే ప్రజల్లోకి వచ్చానని కార్పొరేటర్‌గా ఎన్నో అభివృద్ధి పనులు చేశానని, ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలు తన సమస్యలుగా భావించి పనిచేస్తానని పి.విజయారెడ్డి అన్నారు. ఖైరతాబాద్ డివిజన్ పరిధిలోని చింతల్‌బస్తీ డిగ్రీ కాలేజీ వీధిలో ఏర్పాటు చేసిన పబ్లిక్ మీటింగ్‌లో పెద్ద సంఖ్యలో వివిధ పార్టీలకు చెందిన మహిళలు, యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ .. తాను కార్పొరేటర్‌గా ఉన్నప్పుడే ఎంతో మంది ఎన్నో ఆటంకాలు సృష్టించేందుకు చూశారని అయినా ఏనాడూ బెదరకుండా అభివృద్ధి పనులు కొనసాగిస్తూనే ఉన్నానన్నారు. హనుమాన్ దేవాలయం నుండి డిగ్రీ కాలేజీ వరకు కొత్త పైప్‌లైన్ వేయించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించామన్నారు. బస్తీలోని కమ్యూనిటీహాల్‌ను ఆధునీకరించామని, అంబేడ్కర్ యువజన సంఘం స్థలంలో రూ.50 లక్షలతో కమ్యూనిటీహాల్ నిర్మించామన్నారు. నిత్యం ప్రజల్లో ఉండే నాయకున్ని ఎంచుకోవాలి కాని గెలవగానే నాలుగున్నర సంవత్సరాలు కనిపించకుండా పోయే నాయకుడు మనకు ఎందుకని ప్రశ్నించారు. కాంగ్రెస్ గెలిస్తే రూ.500కే గ్యాస్, 200 యూనిట్స్ వరకు కరెంటు ఉచితంగా ఇస్తామన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

పాన్ కార్డ్ లింకేజీ పేరుతో రూ.50 వేలు స్వాహా

పంజగుట్ట: మీ బ్యాంకు అకౌంట్‌కు పాన్ కార్డు లింక్ చేయాలని నమ్మించి రూ.50వేలు కాజేసిన సంఘటన పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. గచ్చిబౌలి ప్రాంతానికి చెందిన బండి శ్రీనివాస్ రఘువీర్ ఓ చానల్ చైర్మన్. ఈ నెల 5న అతను నాగార్జున సర్కిల్‌లో తన కార్యాలయంలో ఉండగా గుర్తుతెలియని నెంబర్ నుంచి ఫోన్ వచ్చింది. ఇండస్ ఇండ్ బ్యాంక్ నుంచి మాట్లాడుతున్నామని, మీ అకౌంట్‌కు పాన్‌కార్డు లింక్ చేయాలని లేని పక్షంలో బ్యాంకు అకౌంట్ డీ యాక్టివేట్ అవుతుందని చెప్పారు. మీకు ఒక లింక్ పంపించాను దానిని ఓపెన్ చేయాలని సూచించడంతో శ్రీనివాస్ ఓపెన్ చేశారు. మీకు ఓ ఓటీపీ వస్తుంది షేర్ చేయాలని చెప్పడంతో ఓటీపీ చెప్పాడు. ఓటీపీ చెప్పగానే అతడి బ్యాంకు అకౌంట్ నుంచి రూ. 49,999 వేలు డెబిట్ అయ్యాయి. తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు ఈ నెల 6న పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా...

ఎన్నికల ముందు బీసీలు గుర్తొచ్చారా?

కాంగ్రెస్ నేతలు వీహెచ్, పొన్నం

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల ముందు ప్రధాని మోదీకి బీసీలు గుర్తొచ్చారని కాంగ్రెస్ బీసీ నేతలు, మాజీ ఎంపీలు వి.హనుమంతరావు, పొన్నం ప్రభాకర్ విమర్శించారు. గాంధీభవన్‌లో మంగళవారం వారు మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఎల్బీ స్టేడియంలో నరేంద్రమోదీ ఏర్పాటు చేసిన బీసీ ఆత్మగౌరవ సభ హాస్యాస్పదమని ఎద్దేవాచేశారు. బీసీల మీద ప్రేమ ఉంటే కులగణనని ఎందుకు అంగీకరించడం లేదని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ భారత్ జోడోయాత్ర తర్వాత ఓబీసీల సమస్యలు దేశానికి తెలిశాయని, అందుకే ఓబీసీ కులగణనకు కాంగ్రెస్ హామీ ఇచ్చిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కావాలని అడిగిన పవన్ కల్యాణ్ ఇప్పుడు మోదీ పక్కన చేరారని, పవన్ కల్యాణ్‌ని బీజేపీ వాళ్లు వాడుకుంటున్నారని ఆరోపించారు. మోదీ, కేసీఆర్ ఇద్దరూ బీసీలకు అన్యాయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్‌లో బడుగు బలహీన వర్గాలకు అవకాశం కల్పించే పరిస్థితి ఉందా? అని ప్రశ్నించారు. బీజేపీ ఓబీసీ సెల్ జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్ ఏడాది కాలంగా ఎందుకు బీసీ సమావేశం పెట్టలేదని వారు ప్రశ్నించారు. బీసీలకు ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ 23 సీట్లు ఇచ్చిందన్నారు. 10వ తేదీన కామారెడ్డిలో ఎన్నికల ప్రచారానికి కర్ణాటక సీఎం సిద్ధరామయ్య వస్తున్నట్లు తెలిపారు.

సొంతకారు లేని ఈటల

ఆయన తరఫున నామినేషన్ వేసిన సోదరుడు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: హుజూరాబాద్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ తరఫున ఆయన సోదరుడు భద్రయ్య మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల అధికారులకు ఆస్తులు, కేసుల వివరాల అఫిడవిట్ అందజేశారు. ఈటలకు సొంత కారులేదని, ఆస్తులు రూ.16,74,473 ఉండగా, భార్య పేరుతో ఉన్న షేర్స్, బాండ్స్, వెహికిల్స్, పర్సనల్ అడ్వాన్సెస్ కలిపి రూ.26,48,70,394 చరాస్తులు ఉన్నాయని వెల్లడించారు. ప్రస్తుతం ఈటల చేతిలో నగదు రూ.లక్ష, ఆయన భార్య జమున వద్ద రూ.లక్షన్నర మాత్రమే ఉన్నాయన్నారు. రాజేందర్ స్థిరాస్తుల విలువ ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం రూ.12.50 కోట్లు ఉండగా, జమున పేరిట రూ.14.78 కోట్లు ఉన్నాయని తెలిపారు. జమున పేరిట జమున హ్యాచరీస్‌తో పాటు అభయ డెవలపర్స్, నార్త్ ఈస్ట్ ప్రాజెక్ట్స్, ఎస్వీఎస్ అర్బవాన్ అండ్ డొలరైట్ అనే కంపెనీల్లో పెట్టుబడులున్నాయన్నారు. ఉద్యమ సమయంలో నమోదైన కేసులు, ఎన్నికల కేసులు కలిపి ప్రస్తుతం ఈటల రాజేందర్‌పై 40 కేసులున్నాయి.

బీజేపీకి చాన్స్ ఇస్తే 2 లక్షల ఉద్యోగాలిస్తాం: సంజయ్

కరీంనగర్ టౌన్: 'నిరుద్యోగ తమ్ముళ్లారా.. కేసీఆర్ రాక్షస పాలనలో మీరుపడ్డ గోసలు ఈ 23 రోజులు గుర్తుచేసుకోండి. 9 ఏళ్లుగా ఒక్క ఉద్యోగం భర్తీ చేయకుండా జాబ్ కేలండర్ అంటూ మభ్యపెడుతున్న దండుపాళ్యం ముఠా మాటలు నమ్మకండి. మీకోసం యుద్ధం చేసిన బీజేపీని గుర్తుంచుకోండి. అధికారంలోకి వచ్చిన వెంటనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం' అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ తెలిపారు. కరీంనగర్‌లోని 24వ డివిజన్‌లో పాదయాత్ర ప్రారంభించిన సంజయ్ పార్టీ కార్యకర్తలతో కలిసి ఇంటింటా తిరుగుతూ బీజేపీకి ఓటేయాలంటూ అభ్యర్థిస్తున్నారు. ఆయన మాట్లా డుతూ వయోపరిమితిని సడలించి నిరుద్యోగులకు జరిగిన నష్టాన్ని పూడుస్తామన్నారు. బీసీ నాయకుడే సీఎం అవుతారని సంజయ్ ఉద్ఘాటించారు. కేసీఆర్‌కు దమ్ముంటే ఆయన రాజకీయ వారసుడెవరో ప్రకటించాలని సవాల్ విసిరారు. సంజయ్ నామినేషన్ కార్యక్రమానికి స్వచ్ఛందంగా యువత వేలాదిగా తరలివచ్చి భారత్ మాతా కీ జై.. జై శ్రీరాం అంటూ బీజేపీకి మద్దతు తెలిపారు. బీఆర్ఎస్ నేతలకు ఈ ర్యాలీని చూసి మైండ్‌బ్లాంక్ అయిందన్నారు.

జనసేన అభ్యర్థుల ప్రకటన

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో పొత్తులో భాగంగా 8 చోట్ల పోటీ చేస్తున్నట్టు జనసేన పార్టీ ప్రకటించింది. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ అభ్యర్థులను ఖరారు చేశారని పవన్ రాజకీయకార్యదర్శి పి.హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. తాండూర్ నుంచి జనసేన రాష్ట్ర అధ్యక్షుడు నేమూరి శంకర్‌గౌడ్ పోటీలో ఉన్నారు. 8 మందిలో ఒక మహిళకు అవకాశం కల్పించారు. బీజేపీతో సీట్ల సర్దుబాటులో భాగంగా శేరిలింగంపల్లి స్థానాన్ని కూడా తమకు కేటాయించాలని జనసేన కోరింది. అయితే చేవేళ్ల లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని శేరిలింగంపల్లి, తాండూరు స్థానాలను జనసేనకు ఇవ్వొద్దని పార్టీ నాయకత్వం వద్ద మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పట్టుబట్టారు. అధిష్టానం చివరకు శేరిలింగంపల్లిని బీజేపీకి, తాండూరును జనసేనకు కేటాయించింది. అయితే బీజేపీలో శేరిలింగంపల్లి సీటు కోసం రవికుమార్ యాదవ్, గజ్జెల యోగానంద్ మధ్య పోటీ నెలకొంది. వీరిలో ఎవరికి టికెట్ దక్కుతుందోనని పార్టీలో చర్చనీయాంశమైంది.

జనసేన అభ్యర్థులు వీరే...

కూకట్‌పల్లి– ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్, తాండూరు– నేమూరి శంకర్‌గౌడ్, కోదాడ– మేకల సతీశ్‌రెడ్డి, నాగర్‌కర్నూల్– లక్ష్మణ్‌గౌడ్, ఖమ్మం– మిర్యాల రామకృష్ణ, కొత్తగూడెం– లక్కినేని సురేందర్‌రావు, వైరా– డాక్టర్ తేజావత్ సంపత్‌నాయక్, అశ్వారావుపేట– ముయబోయిన ఉమాదేవి.



మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన బీసీ ఆత్మగౌరవ సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న మోదీ. చిత్రంలో జాజుల, బూర నర్సయ్యగౌడ్, కూన శ్రీశైలం గౌడ్, ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, ఈటల రాజేందర్, కె. లక్ష్మణ్, కిషన్‌రెడ్డి, పవన్‌కల్యాణ్, బండి సంజయ్, ధర్మపురి అర్వింద్, చింతల రామచంద్రారెడ్డి, కృష్ణయాదవ్, మర్రి శశిధర్‌రెడ్డి తదితరులు

బీసీ విరోధి సర్కార్!

బీజేపీ 'బీసీ ఆత్మ గౌరవ సభ'లో ప్రధాని మోదీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో గత తొమ్మిదేళ్లలో బీసీ, ఎస్సీ, ఎస్టీల వ్యతిరేక పాలన సాగిందని.. నవంబర్ 30న ఈ బీసీ వ్యతిరేక సర్కారును ఊడబెరికే సువర్ణ అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అధికారానికి రావడానికి పెద్దపెద్ద హామీలు ఇచ్చిందని.. రైతులకు రూ.లక్ష రుణమాఫీ, డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని చెప్పి పూర్తిస్థాయిలో అమలు చేయలేదని మండిపడ్డారు. తెలంగాణలోని అన్నివర్గాలు మార్పు కోరుతున్నాయని.. అది నెరవేరుతుందన్న విశ్వాసం తమకు ఉందని చెప్పారు. మంగళవారం ఎల్‌బీ స్టేడియంలో రాష్ట్ర బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'బీసీ ఆత్మ గౌరవ సభ'లో ప్రధాని మోదీ మాట్లాడారు. తొలుత సమ్మక్క–సారలమ్మ, యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి వారిని స్మరించుకున్నారు. 'నా కుటుంబ సభ్యులారా..'అంటూ తెలుగులో ప్రసంగాన్ని ప్రారంభించి తర్వాత హిందీలో కొనసాగించారు. ప్రధాని మోదీ ప్రసంగం సారాంశం ఆయన మాటల్లోనే..

''తెలంగాణ ఉద్యమం నీళ్లు, నిధులు, నియామకాల కోసమే జరిగింది. వీటి విషయంలో బీఆర్ఎస్ మోసం చేసింది. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఎందరో అమరులయ్యారు. కానీ వారి ఆకాంక్షలు నెరవేరలేదు. స్వరాష్ట్రంలో బీసీలను మోసం చేశారు. వారి ఆకాంక్షలను కేసీఆర్ సర్కార్ పట్టించుకోలేదు. తెలంగాణలో నిజమైన అభివృద్ధి కనిపించడం లేదు. ఇప్పుడు తెలంగాణలో మార్పు తుఫాను కనిపిస్తోంది. బీజేపీ సర్కారు ఏర్పడగానే బీసీల గౌరవం పెంచడానికి చర్యలు చేపడతాం. ప్రజల విశ్వాసాన్ని నిలబెడతాం.

యువతకు విశ్వాస ఘాతుకం చేశారు: తెలంగాణ ప్రభుత్వం యువత విషయంలో తీవ్రంగా విశ్వాస ఘాతుకానికి పాల్పడింది. టీఎస్‌పీఎస్సీ పరీక్షల కోసం తొమ్మిదేళ్లుగా కష్టపడుతున్న నిరుద్యోగ యువతను మభ్యపెట్టి మోసం చేసింది. పోటీ పరీక్షలకు సిద్ధమైన యువత జీవితాలను పేపర్ల లీకేజీతో దుర్భరం చేసింది. కనీసం నిరుద్యోగ భృతి హామీని అయినా అమలు చేయలేదు. అలాంటి బీఆర్ఎస్‌ను ఇంటికి పంపాలా.. వద్దా?

బీఆర్ఎస్‌ది కాంగ్రెస్ మోడలే..

బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు వేర్వేరు కాదు. కాంగ్రెస్‌వారసత్వ, కుటుంబ, అవినీతి మోడల్‌ను బీఆర్ఎస్ కొనసాగిస్తోంది. దేశ సంపదను లూటీ చేయడం, కొడుకు, కూతురు, బంధువులకు కట్టబెట్టడమే తప్ప ప్రజలు, వారి కుటుంబాల సంక్షేమం, మేలు ఈ పార్టీలకు పట్టదు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఓ నాణేనికి బొమ్మా బొరుసు వంటివి. అవినీతి, కుటుంబ పాలన, బుజ్జగింపు రాజకీయాలు బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల లక్షణాలు. బీఆర్ఎస్ కాంగ్రెస్‌కు సీ టీమ్.. కాంగ్రెస్ బీఆర్ఎస్‌కు సీ టీమ్. రెండు పార్టీల డీఎన్ఏ ఒక్కటే.

ఉచిత రేషన్ మరో ఐదేళ్లు పొడిగింపు

''పేదరికాన్ని జయించిన వ్యక్తిగా నాకు పేదల కష్టాలు తెలుసు. కరోనా సమయంలో ఎవరూ ఆకలితో అలమటించకుండా ఉచిత రేషన్ పంపిణీ ప్రారంభించాం. నేటికీ 80 కోట్ల మందికి అందుతోంది. డిసెంబర్ నాటికి అది ముగియాల్సి ఉన్నా.. మరో ఐదేళ్లు ఉచిత రేషన్ పొడిగించాలని నిర్ణయించాం.''అని ప్రధాని ప్రకటించారు. ఈ నిర్ణయానికి మద్దతిస్తూ సభికులంతా తమ ఫోన్లలో టార్చ్‌లైట్‌ను ఆన్‌చేయాలని కోరారు. దీంతో సభికులు తమ ఫోన్లలో టార్చ్‌లైట్‌ను ఆన్ చేసి చూపారు.

బీసీలకు మేలు చేసేది బీజేపీయే..

ముందు నుంచీ బీసీల ఆకాంక్షలను పట్టించుకునేది బీజేపీ మాత్రమే. కేంద్ర కేబినెట్‌లో 27 మంది బీసీ మంత్రులు ఉన్నారు. ఓబీసీలకు ఎంపీలుగా ఎక్కువ అవకాశాలిచ్చింది బీజేపీయే. పార్లమెంట్‌లో దాదాపు 85 మందికి పైగా బీసీ ఎంపీలు ఉన్నారు. అబ్దుల్ కలామ్, రామ్‌నాథ్ కోవింద్, గిరిజన మహిళ ద్రౌపదీ ముర్ము వంటివారిని రాష్ట్రపతిని చేసిన ఘనత బీజేపీకే దక్కుతుంది. ఈ క్రమంలోనే ఓబీసీని అయిన నన్ను ప్రధానిని చేసింది. కేంద్రంలోని మా ప్రభుత్వం కిసాన్ సమ్మాన్ యోజన కింద రూ.9 వేల కోట్లను రాష్ట్ర రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేసింది. వారిలో బీసీ రైతులే ఎక్కువగా ఉన్నారు. 2047 (వందేళ్ల స్వతంత్ర భారత్) నాటికి పూర్తిగా అభివృద్ధిచెందిన దేశంగా ఎదిగే దిశలో కృషిని ప్రారంభించాం. అందులో భాగంగా తెలంగాణ కూడా వేగంగా అభివృద్ధి చెందేందుకు.. యువత, ఇతర అన్ని వర్గాల వారికి మంచి అవకాశాలు లభించేందుకు బీజేపీ ప్రభుత్వం పనిచేస్తుంది..''అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

బీజేపీకి మద్దతిచ్చి గెలిపిస్తే ఈటల సీఎం?

బీసీ సంఘాలతో భేటీలో మోదీ హామీ ఇచ్చారంటున్న పార్టీ శ్రేణులు

ఎల్బీ స్టేడియంలో సభ ముగిశాక 33 సంఘాలతో ప్రధాని సమావేశం

సభలోనూ ఈటలను పిలిచి పక్కన కూర్చోబెట్టుకున్న మోదీ

సాక్షి, హైదరాబాద్: బీజేపీ తరఫున ముఖ్యమంత్రి అభ్యర్థిగా రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ పేరు దాదాపు ఖరారైనట్టు పార్టీ వర్గాలు చెప్తున్నాయి. రాష్ట్రంలోని బీసీవర్గాలంతా కలసి బీజేపీని గెలిపిస్తే పరిపాలనా అనుభవమున్న ఈటలను ముఖ్యమంత్రి చేస్తామని మోదీ పేర్కొన్నారని అంటున్నాయి. నిజానికి బీజేపీ 'బీసీల ఆత్మ గౌరవసభ' వేదికగా సీఎం అభ్యర్థిపై ప్రధాని స్పష్టత ఇస్తారన్న ప్రచారం జరిగింది. కానీ అలా జరగలేదు. కానీ సభ ముగిశాక 33 బీసీ, కుల సంఘాల ప్రతినిధులతో భేటీ సందర్భంగా 'మెజారిటీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులను, బీసీలను గెలిపించుకోండి. అందరికీ అందుబాటులో ఉండే ఈటల రాజేందరే మీ నాయకుడు' అని ప్రధాని స్పష్టత ఇచ్చినట్టు తెలిసింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్, ఇతర పార్టీ నేతలతో విడిగా భేటీ అయినప్పుడూ ఈ విషయాన్ని పేర్కొన్నట్టు సమాచారం.

సభలో పిలిచి దగ్గర కూర్చోబెట్టుకుని..

సభా వేదికపై మరోవైపు కూర్చున్న ఈటల రాజేందర్‌ను ప్రధాని మోదీ పిలిపించి పక్కన కూర్చోబెట్టుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులు, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల తీరు, బీజేపీ అభ్యర్థుల ఖరారు, ఎన్నికల సన్నద్ధత తీరు, పార్టీ బీసీ నినాదానికి ప్రజల్లో వస్తున్న స్పందనపై మోదీ ఆరా తీసినట్టు సమాచారం. గజ్వేల్‌లో తన నామినేషన్ సందర్భంగా 20వేల మంది వరకు వచ్చారని, ప్రజల్లో మంచి స్పందన ఉందని ఈటల వివరించినట్టు తెలిసింది. అంతకుముందు సభాస్థలికి ఓపెన్ టాప్ జీప్‌లో వచ్చినప్పుడు వెనుక ఉన్న ఈటలను మోదీ ముందుకు పిలిపించుకుని తన పక్కన నిలబెట్టుకున్నారని పార్టీ నేతలు తెలిపారు.

మాది తెలంగాణ టీమ్: కేటీఆర్

బీజేపీకి బీ టీమ్ కాదు..కాంగ్రెస్‌కు సీ టీమ్ కాదు

బీజేపీ పాలనలో బీసీలకు మిగిలింది వేదన, అరణ్య రోదనే

బీఆర్ఎస్ దృష్టిలో బీసీలంటే బలమైన వర్గాలు

సాక్షి, హైదరాబాద్: భారత్ రాష్ట్ర సమితి కాంగ్రెస్ పార్టీకి సీ టీం అంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు 'ఎక్స్' వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. 'రాహుల్‌గాంధీ మమ్మల్ని మీ బీ టీమ్ అంటారు. మీరు కాంగ్రెస్ సీ టీమ్ అని అంటారు. మేం బీజేపీకి బీ టీమ్ కాదు, కాంగ్రెస్‌కు సీ టీమ్ కాదు. మాది ముమ్మాటికీ 'టీ (తెలంగాణ) టీమ్' అని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల హక్కుల కోసం ఎవరితోనైనా, ఎక్కడి దాకైనా పోరాడే ఏకైక టీమ్ తమదేనని అన్నారు. నిన్నటి దాకా మత రాజకీయం చేసి, నేడు కుల రాజకీయానికి తెర తీశారా అని ప్రశ్నించారు. పదేళ్ల బీజేపీ పాలనలో దేశంలోని బీసీలకు మిగిలింది వేదన, అరణ్య రోదన మాత్రమేనని కేటీఆర్ విమర్శించారు. కనీసం బీసీల జనగణన కూడా చేయలేదని, కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖను పెట్టని బీజేపీ ముమ్మాటికీ బీసీల వ్యతిరేక పార్టీయేనని అన్నారు. బీసీలంటే బీజేపీ దృష్టిలో బలహీనవర్గాలని, కానీ బీఆర్ఎస్‌కు మాత్రం వారు బలమైన వర్గాలని కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ అంటే భారత రైతు సమితి అని కూడా గుర్తుంచుకోవాలని అన్నారు. దర్యాప్తు సంస్థల దుర్వినియోగంలో బీజేపీ..కాంగ్రెస్‌ను మించిపోయిందని ధ్వజమెత్తారు.

విద్య, వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ పెడతా

ఆత్మీయ సన్మానంలో త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి



నల్లగొండ టూటౌన్: త్రిపురలో అట్టడుగున ఉన్న పేదల అభ్యున్నతికి కృషి చేస్తానని, విద్య, వైద్య సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ పెడతానని ఆ రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. మంగళవారం నల్లగొండ పట్టణంలోని పోలీస్ ఆడిటోరియంలో ఇంద్రసేనారెడ్డి మిత్రులు నిర్వహించిన ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ జిల్లా (తుంగతుర్తి మండలం గానుగబండ్ల) తాను పుట్టిన జిల్లా అని, తన తండ్రి చదువు కోసం 5వ తరగతిలోనే హైదరాబాద్‌కు తీసుకుపోయినట్లు తెలిపారు. స్కూల్‌లో చదివే రోజుల్లో ఆర్ఎస్ఎస్‌లో పనిచేశానని, ఎమర్జెన్సీ సమయంలో తాను జైలుకు వెళ్లగా అక్కడే ఉన్న నీలం సంజీవరెడ్డి తనను తెలంగాణ ప్రాంత ఏబీవీపీ కన్వీనర్‌గా నియమించినట్లు గుర్తుచేశారు. తెలంగాణలో ఆరుగురు గవర్నర్లు అయ్యారని, నల్లగొండ జిల్లా నుంచి మొదటి వ్యక్తిని తాను అని ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో ఎక్కువ హిందువులున్న రాష్ట్రం త్రిపుర అని పేర్కొన్నారు. ఇటీవల తిరుపతికి వెళ్లినప్పుడు త్రిపురలో వేంకటేశ్వర దేవాలయం నిర్మించాలని చైర్మన్ కరుణాకర్ రెడ్డిని.. లక్ష్మీనరసింహ కల్యాణం నిర్వహించాలని యాదాద్రి ఈవోను కోరగా వారు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. నమ్మిన సిద్ధాంతం కోసం పని చేస్తే పదవులు అవే వస్తాయన్నారు. ప్రకృతి వ్యవసాయం చేసిన నలుగురు రైతులను ఆయన సత్కరించారు. అనంతరం ఇంద్రసేనారెడ్డి ఆత్మీయులు ఆయన్ను ఘనంగా సత్కరించారు.

చెత్త కుప్పలో 30 లక్షల డాలర్లు



బనశంకరి : రోడ్డు పక్కన చిత్తు కాగితాలు ఏరుకునే వ్యక్తికి ఒక బ్యాగు దొరికింది. అందులో 30 లక్షల అమెరికన్ డాలర్ల కట్టలున్నాయి. భారతీయ కరెన్సీలోకి మారిస్తే వాటి విలువ సుమారు రూ.25 కోట్లు ఉంటుంది. ఈ నెల 3వ తేదీన బెంగళూరు నాగవార రైల్వేస్టేషన్ వద్ద పట్టాల పక్కన ఎస్‌కే సాల్మన్ చెత్త సేకరిస్తుండగా ఓ బ్యాగు దొరికింది. దానిపై యునైటెడ్ నేషన్స్ అనే ముద్ర ఉంది. పశ్చిమ బెంగాల్‌లోని నాడియాకు చెందిన ఎస్‌కే సాల్మన్ బెంగళూరులో చెత్త ఏరుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సంచిని అమృతహళ్లిలోని ఇంటికి తీసుకెళ్లి తెరిచి చూడగా 23 బండిళ్ల డాలర్లు కనిపించాయి. ఏం చేయాలో తెలియక గుజరీ వ్యాపారికి ఈ విషయం చెప్పాడు. తాను వేరే ఊరికి వెళ్లానని, బెంగళూరుకు వచ్చేవరకు మీ వద్ద పెట్టుకోవాలని సూచించాడు. కానీ భయపడ్డ సాల్మన్.. స్వరాజ్ ఇండియా సామాజిక కార్యకర్త ఆర్.కలీముల్లాకు విషయం చెప్పాడు. కలీముల్లా ఈ సంగతిని నగర సీపీ దయానందకు తెలిపారు. ఆయన సూచనతో సాల్మన్‌ను, నగదును తీసుకుని కమిషనర్ ఆఫీసుకు వెళ్లారు. మరోవైపు నగదు దొరికిన ప్రదేశంలో పోలీసులు తనిఖీలు చేశారు. ఈ డాలర్లు నకిలీవని భావిస్తున్నారు. తనిఖీ కోసం వాటిని నగరంలోని రిజర్వు బ్యాంకుకు పంపినట్టు పోలీసులు తెలిపారు. ఈ డబ్బు ఐక్యరాజ్యసమితి ఆర్థిక నేరాల విభాగానికి చెందినదని పోలీసులు చెప్పారు. బ్యాగులో విషపూరితమైన రసాయనాలున్నందున.. తెరిచేటప్పుడు జాగ్రత్త అని ఒక పెద్ద లెటర్ కూడా అందులో ఉండటం విశేషం.

పురందేశ్వరి మేక వన్నె పులి



ఏపీ బీజేపీ అధ్యక్ష పదవిలో కూర్చొని టీడీపీని బతికించేందుకు పాట్లు

ఏపీ చలన చిత్రాభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళి

సాక్షి, అమరావతి: ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి మేక వన్నె పులి అని ఏపీ చలన చిత్రాభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళి విమర్శించారు. బీజేపీ అధ్యక్ష పదవిలో కూర్చుని టీడీపీని బతికించుకోవడానికి పని చేయడం సిగ్గు చేటన్నారు. ఏపీలో మళ్లీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తారనే విషయం ఖాయమవడంతో పురందేశ్వరిలో భయం మొదలైందన్నారు. అందుకే సీఎం జగన్, ఎంపీ విజయసాయిరెడ్డి బెయిల్ రద్దు చేయాలంటూ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖలు రాశారన్నారు. మంగళవారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. పురందేశ్వరి తనకు దేశంపై అమితమైన ప్రేమ ఉందని అంతా అనుకోవాలని తాపత్రయ పడుతున్నారన్నారు. 'ఆమె నిజ స్వరూపం తెలిస్తే సీజేఐ కూడా నివ్వెరపోతారు. పురందేశ్వరి తన తమ్ముడు బాలకృష్ణ మహిళలను కుసంస్కారంతో మాట్లాడితే సంతోషిస్తుంది. ఇద్దరు వ్యక్తులపై తుపాకీతో హత్యా యత్నానికి పాల్పడితే చట్టాన్ని, న్యాయాన్ని తప్పుదోవ పట్టించి దొడ్డిదారిన కాపాడుతుంది. తెలంగాణ ప్రభుత్వాన్ని కూలదోయాలని చూసిన మరిది చంద్రబాబుకు మద్దతు పలుకుతుంది. అసలు పురందేశ్వరికి నిజాయితీ, విలువలు లేవు' అని పేర్కొన్నారు.

ఏనాడైనా బీజేపీ కోసం పని చేశారా

చంద్రబాబు కోసం సీఎం జగన్‌ను దెబ్బతీసేందుకు కుట్ర చేస్తున్న పురందేశ్వరి తన జీవితంలో ఏనాడైనా బీజేపీ కోసం పని చేశారా? ఒక్క ఊరిలో అయినా పర్యటించారా అని పోసాని నిలదీశారు. దుర్మార్గ రాజకీయాలు చేయడంలో చంద్రబాబు మగ వగలాడి అయితే పురందేశ్వరిని ఏమనాలో తనకు అర్థం కావట్లేదన్నారు. దేశంలో ఉన్న అన్ని పార్టీలతో పొత్తు పెట్టుకున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. అందుకే చంద్రబాబు మళ్లీ గెలిస్తే.. తానూ ఎంపీగా గెలిచి కేంద్రంలో ఎవరున్నా కేంద్ర మంత్రి పదవి దక్కించుకోవచ్చే దుర్బుద్ధితో కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో సీఎం జగన్‌పై అక్రమ కేసులు బనాయించి, న్యాయస్థానాలను తప్పుదోవ పట్టించి అవినీతి ముద్ర వేశారన్నారు. చంద్రబాబు మాదిరిగా అవినీతి చేసి పక్కా ఆధారాలతో దొరికిపోయి జైలుకు వెళ్లలేదన్నారు. అడ్డదారుల్లో లేఖలు రాస్తూ న్యాయ వ్యవస్థలను మలినం చేయొద్దని హితవు పలికారు. గతంలో పురందేశ్వరి, పవన్ కల్యాణ్ చంద్రబాబును అవినీతి పరుడని తిట్టి.. ఇప్పుడు అంటకాగుతున్నారని విమర్శించారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్, మజ్లిస్ ఒక్కటే: కిషన్‌రెడ్డి

కాంగ్రెస్ అమ్ముడుపోయే పార్టీ అయితే.. బీఆర్ఎస్ కొనుగోలు చేసే పార్టీ అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అసలు బీఆర్ఎస్, కాంగ్రెస్, మజ్లిస్ ఒకే తాను ముక్కలని విమర్శించారు. బీసీల ఆత్మగౌరవ సభలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. ''కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ కుటుంబ, అవినీతి, దోపిడీ, కుంభకోణాల పార్టీలే. వాటి డీఎన్ఏ ఒక్కటే. బొమ్మబొరుసు లాంటి ఈ పార్టీలు మజ్లిస్ మోచేతి నీళ్లు తాగేవే. కాషాయ జెండా మాత్రమే తెలంగాణలో మార్పు తెస్తుంది. గ్రామ పంచాయతీ నుంచి ఢిల్లీ వరకు నీతివంతమైన ప్రభుత్వాన్ని ఇస్తాం. బీజేపీతోనే బీసీ ముఖ్యమంత్రి కాబోతున్నారు''అని పేర్కొన్నారు. పదేళ్ల క్రితం గుజరాత్ సీఎంగా మోదీ ఎల్బీ స్టేడియానికి వచ్చారని, నాటి సభ తర్వాతే మోదీ భారత ప్రధాని అయ్యారని కిషన్‌రెడ్డి గుర్తు చేసుకున్నారు.

కేటీఆర్ బీసీలను అవహేళన చేస్తున్నారు: లక్ష్మణ్

బీసీని సీఎం చేస్తామని బీజేపీ అంటే అవమానిస్తున్నారని.. రాష్ట్రంలో బీజేపీని గెలిపించి, బీసీని సీఎం చేసి అలాంటి వారికి సమాధానం చెప్పాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ పిలుపునిచ్చారు. ''రాహుల్ గాంధీకి సామాజిక స్పృహ లేదు. బీసీల అభ్యున్నతికి కాంగ్రెస్ ఏనాడూ పాటుపడలేదు. బీసీలంటే ఓటింగ్ మెషీన్లు కాదు. బీసీ సీఎం అంటే కులం కాదు గుణం ముఖ్యమని కేటీఆర్ అవహేళన చేస్తున్నారు. సొమ్ము ఒకరిది, సోకు ఒకరిది అన్నట్టు నిధులు మోదీ ఇస్తే.. పేరు కేసీఆర్‌ది అన్నట్టుగా సొంత ప్రచారం చేసుకుంటున్నారు. కేసీఆర్‌కు గుణపాఠం చెప్పి తీరాల్సిందే. బీజేపీకి ఒక అవకాశం ఇవ్వండి''అని కోరారు. 100 రోజుల్లో 26 కులాలను బీసీ కేంద్ర జాబితాలో చేర్చుతామని హామీ ఇచ్చారు.



వేదికపై బండి సంజయ్‌ను అభినందిస్తున్న ప్రధాని మోదీ

బీసీలంతా బీజేపీని గెలిపించాలి: సంజయ్

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు బీసీలను అవమానిస్తున్నాయని బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి బండి సంజయ్ మండిపడ్డారు. బీసీలు కులాల వారీగా చీలిపోయి ఉన్నాయని, వారికి ఏం చేసినా వృథాయే అన్నట్టుగా ఆ పార్టీలు వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. బీఆర్ఎస్ సర్కార్ హయాంలో బీసీలకు తీరని అన్యాయం జరుగుతోందని విమర్శించారు. వచ్చే ఎన్నికలు బీసీ కులాలన్నీ నిర్ణయాత్మకంగా వ్యవహరించాలని.. ఓటు ఆయుధంతో బీఆర్ఎస్‌కు గుణపాఠం చెప్పి బీజేపీని గెలిపించాలని పిలుపునిచ్చారు.

బీఆర్ఎస్‌ను బొంద పెట్టాలి: ఈటల

తెలంగాణలో బీసీలు రాజ్యాధికారం అందిపుచ్చుకునే సమయం ఆసన్నమైందని, ఇందుకోసం బీఆర్ఎస్‌ను బొందపెట్టాలని బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. ''ఇప్పుడు బీసీ జాతి మోసపోయేది కాదు. చైతన్యవంతమైంది. మోదీ అండగా బీసీలను ఆపేశక్తి ఎవరికీ లేదు. స్వాతంత్య్రం వచ్చాక రాష్ట్రంలో ఇప్పటిదాకా ఒక్కరంటే ఒక్క బీసీ కూడా సీఎం కాలేదు. బీసీని సీఎంను చేస్తామని బీజేపీ ప్రకటిస్తే.. దానిని రాహుల్ అవహేళన చేస్తున్నారు. తెలంగాణ తొలి సీఎం దళితుడే అని చెప్పి మోసం చేసిన పార్టీ బీఆర్ఎస్. అదే మోదీ కేబినెట్‌లో 27 మంది బీసీ మంత్రులు ఉన్నారు''అని ఈటల పేర్కొన్నారు.

'ఔర్ ఏక్ బార్ మోదీ సర్కార్'కోసం కష్టపడతా: పవన్

ఔర్ ఏక్ బార్ మోదీ సర్కార్ కోసం తాను మనస్ఫూర్తిగా శాయశక్తులా కష్టపడతానని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చెప్పారు. దేశం బాగుపడాలంటే నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాని కావాలన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి అండగా ఉంటానని ప్రకటించారు. కలసి పోటీచేసే అవకాశమిచ్చిన బీజేపీ తెలంగాణ రాష్ట్ర శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. బీసీని ముఖ్యమంత్రిని చేస్తామన్న బీజేపీకి జనసేన నుంచి పూర్తి సహకారం ఉంటుందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదాలతో పోరాటం చేసి రాష్ట్రాన్ని సాధించుకున్నా.. ఒక్కటి కూడా అమలు కాలేదని విమర్శించారు.

ప్రచార ఖర్చు పరిమితిదాటే అవకాశం ఉందనే హాజరు కాలేదు: రాజాసింగ్

సాక్షి, హైదరాబాద్: ఎల్‌బీస్టేడియంలో మంగళవారం జరిగిన బీసీ ఆత్మగౌరవ సభకు తాను హాజరుకాకపోవడంపై బీజేపీ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ వివరణ ఇచ్చారు. గోషామహల్ పరిధిలో ఎల్‌బీస్టేడియం సభ ఉందని, ఈ సభకు తాను హాజరైతే ఈ సభ ఖర్చు తన ఎన్నికల ప్రచార ఖర్చులో పడుతుందన్నారు. దీంతో ఎమ్మెల్యే అభ్యర్థి సగటు ఎన్నికల ప్రచార ఖర్చు పరిమితి దాటే అవకాశం ఉందని అందుకే హాజరుకాలేకపోయానని రాజాసింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధాని సభకు హాజరుకాలేకపోవడం బాధగానే ఉందన్నారు. పార్టీ కార్యకర్తలు అర్థం చేసుకోవాలి అని కోరారు.

మనోళ్లకి సీట్లొచ్చాయి.. అది చాలు

- **నాలుగో జాబితా టికెట్లపై బండి, ఈటల 'ముద్ర'**
- **జనసేన జాబితా ప్రకటనతో 8 స్థానాలపై స్పష్టత**

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల వేళ రాష్ట్ర బీజేపీ ముఖ్యనేతల మధ్య 'ప్రెషర్ పాలిటిక్స్'కాక రేపుతున్నాయి. మంగళవారం 12 మంది అభ్యర్థులతో బీజేపీ నాలుగో జాబితాను ప్రకటించింది. ఇప్పటివరకు బీజేపీ 100 నియోజకవర్గాలు, మిత్రపక్షం జనసేనకు విడిగా 8 స్థానాల జాబితా విడుదలతో మొత్తం 108 సీట్లకు అభ్యర్థులను ప్రకటించినట్టయ్యింది. ఇంకా 11 స్థానాలకు బీజేపీ చివరి జాబితాను ప్రకటించాల్సి ఉంది. తాజాగా ఖరారు చేసిన నాలుగో జాబితాలోనూ తమ అనుయాయులకు సీట్ల కేటాయింపులో ముఖ్య నేతలు పంతం నెగ్గించుకుంటున్నట్టు స్పష్టమవుతోంది. నాలుగో జాబితాతోపాటు తుది జాబితాలోని అభ్యర్థిత్వాల ఖరారు విషయమై ఈటల రాజేందర్, బండి సంజయ్, ఇతర ముఖ్య నేతల మధ్య పోటీ తీవ్రమైనట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

విద్యాసాగర్‌రావు కుమారుడికి టికెట్ దక్కలే

నాలుగో లిస్టులో ఒకే ఒక్క మహిళకు చోటు దక్కింది. వేములవాడ టికెట్‌ను కరీంనగర్ జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమకు కేటాయించారు. ఈ సీటును ఆశించిన మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు కుమారుడు డా. వికాస్‌రావుకు ఇది దక్కలేదు. ఈ టికెట్ విషయమై బండి వర్సెస్ ఈటల అన్నట్లుగా సాగినా ఈటల తన అనుచరురాలు ఉమకు టికెట్ ఇప్పించుకోవడంలో సక్సెస్ అయ్యారని అంటున్నారు. హుస్నాబాద్ టికెట్ విషయంలోనూ ఇరువురు నేతలూ పోటీపడగా, ఇక్కడ సంజయ్ ప్రతిపాదించిన బొమ్మ శ్రీరామ్ చక్రవర్తికి అధిష్టానం టికెట్ కేటాయించింది. ఈటల ప్రతిపాదించిన సురేందర్ రెడ్డి పేరును తిరస్కరించింది.

వందలో 37మంది బీసీలే: ఇప్పటివరకు ప్రకటించిన మొత్తం బీజేపీ 100 మంది అభ్యర్థుల్లో...బీసీలు–37, రెడ్డి–27, వెలమ–6, ఎస్టీలు–10, ఎస్సీలు–16, బ్రాహ్మణ–1, వైశ్య–1, అగర్వాల్–1, కమ్మ 1 ఉన్నారు.



నల్లగొండ కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నామినేషన్ దాఖలు సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభకు హాజరైన ప్రజలు. ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

అమరుల కుటుంబాలకు ఎందుకు ఉద్యోగాలు ఇవ్వలేదు

సీఎంను ప్రశ్నించిన కోమటిరెడ్డి

నల్లగొండ: తెలంగాణ కోసం 1,200 మంది అమరులైతే ఆ కుటుంబాలందరికీ కేసీఆర్ ఎందుకు ఉద్యోగం కల్పించ లేదని నల్లగొండ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణ ఇచ్చిన నాడు కుటుంబంతో కలిసి ఢిల్లీకి వెళ్లిన కేసీఆర్ సోనియా గాంధీ కాళ్లు మొక్కారని, నేడు ఆమెను బలి దేవత అంటు న్నాడని, 1,200 మంది విద్యార్థులు చనిపోయిన తర్వాతనే తెలంగాణ ఇచ్చిందనడం దురదృష్టకరమన్నారు. మంగ ళవారం ఆయన వేలాది మంది కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీగా వచ్చి నామినేషన్ పత్రాలను సమర్పించారు. అనంతరం నల్లగొండ పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. తెలంగాణ కోసం ఆత్మబలిదానం చేసుకున్న శ్రీకాంతాచారి తల్లికి ఎలాంటి పదవి ఇవ్వలేదని విమర్శించారు. నిధులు, నీరు, నియామకాలు పేరిట ఏర్పడ్డ తెలంగాణలో ఉద్యోగ కల్ప నలో బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. బంగారు తెలంగాణ చేస్తారనుకుంటే బాధల తెలంగాణ చేశాడని, ఒకటో తేదీ జీతాలు రావడం లేదని, కట్టిన ప్రాజె క్టులు నాణ్యత లేక కూలిపోతున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆరు గ్యారంటీ స్కీమ్‌లను కచ్చితంగా అమలు చేస్తామని ఆయన చెప్పారు. నవంబర్ 30న పోలింగ్, డిసెంబర్ 3న కౌంటింగ్, అదే రోజు కేసీఆర్ రాజీ నామా చేస్తాడని చెప్పారు. 'డిసెంబర్ 9న తెలంగాణ ప్రక టించిన రోజే కాదు.. తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ పుట్టినరోజు కూడా. అదే రోజు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేస్తోంది. ప్రతి హామీని నెరవేరుస్తుం ది'అని చెప్పారు.

ఏదో ఒక రోజు మీ కోరిక నెరవేరుతుంది..

'ఏదో ఒక రోజు మీ కోరిక నెరవేరుతుంది. కోమటిరెడ్డి వెం కట్‌రెడ్డి సీఎం అవుతాడు. మీకున్న తొందర నాకు ఇప్పుడు లేదు. ఇప్పుడు నాకు సీఎం కావల్సిన అవసరం లేదు'అని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సభలో ప్రజలంతా సీఎం .. సీఎం అని నినాదాలు చేయగా కోమటిరెడ్డి పైవిధంగా స్పందించారు. 'నా చర్మం వలిచి మీకు చెప్పులు కుట్టిచ్చి నా తక్కువే. 20 ఏళ్లుగా నన్ను ఎంతో పెద్ద నాయకుడిని చేసి గుర్తింపు తెచ్చారు. ఒక్క పిలుపుతోనే నా నామినే షన్‌కు వేలాదిగా తరలి వచ్చారు. నా జన్మ ధన్యమైంది. మీ కోసం ఏ త్యాగాల కైనా సిద్ధమే'అని కోమటిరెడ్డి భావో ద్వేగానికి గురైయ్యారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ కాం గ్రెస్ అభ్యర్థి వేముల వీరేశం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి ప్రచారం చేయను: సంభాని



కల్లూరు రూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ప్రచారం చేయబోనని మాజీ మంత్రి, పీసీసీ ఉపాధ్యక్షుడు సంభాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా కల్లూరు సమీపంలోని రామకృష్ణాపురంలో మంగళవారం ఆయన సత్తుపల్లి నియోజకవర్గంలోని మండలాల కాం గ్రెస్ అధ్యక్షులు, బ్లాక్ అధ్యక్షులతో సమావేశమయ్యారు. పదిహేనేళ్లుగా సత్తుపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు పూర్వవైభవం తెచ్చామన్నారు. పార్టీ అభివృద్ధికి అహర్నిశలు శ్రమించిన తనలాంటి సీనియర్లతో పాటు నాయకులు, కార్యకర్తలకు గుర్తింపు లేదని, కార్పొరేట్ల శక్తుల చేతుల్లోకి పార్టీ వెళ్లడంతో డబ్బున్న వాళ్ల ఇంటికి వెళ్లి కండువాలు కప్పుతున్నారని చంద్రశేఖర్ ఆరోపించారు. రెండు నెలల కిందట పార్టీలో చేరిన వ్యక్తి కులం సర్టిఫికెట్ చెల్లదని తేలడంతో ఆయన భార్యకు టికెట్ ఇవ్వడం ఏంటో అర్థం కావడం లేదని వాపోయారు. సత్తుపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ అయిన తనకు కనీసం టికెట్ ఎవరికి ఇస్తున్నారో కూడా చెప్పలేదన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని కల్లూరు, తల్లాడ, పెను బల్లి, సత్తుపల్లి, వేంసూరు మండలాల అధ్యక్షు లు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులతో పాటు పలువు రు నాయకులు పార్టీకి రాజీనామా చేస్తూ లేఖ లను చంద్రశేఖర్‌కు అందించారు. సమావేశం లో పీసీసీ సభ్యుడు బైరెడ్డి మనోహర్‌రెడ్డి, నాయకులు పలువురు పాల్గొన్నారు.

హాస్టల్ భవనం పైనుంచి దూకిన విద్యార్థిని

- విరిగిన కాళ్లు, వెన్నుపూసకు గాయాలు
- ఆరు గంటలపాటు చలిలో విద్యార్థిని నరకయాతన..
- ఆస్పత్రికి తీసుకెళ్లని కేజీబీవీ సిబ్బంది



అవిలను పరకాలలోని ఆసుపత్రికి తరలించిన తల్లిదండ్రులు

టేకుమట్ల: హాస్టల్‌లో ఉండటం ఇష్టం లేక ఓ విద్యార్థిని అర్ధరాత్రి భవనం పైనుంచి దూకి పారిపోయేందుకు ప్రయత్నించింది. ఈ ఘటనలో ఆమె రెండు కాళ్లు విరిగి వెన్నుపూసకు బలమైన దెబ్బలు తగిలాయి. ఉదయం వరకు ఆ విద్యార్థినిని ఎవరూ గమనించకపోవడంతో ఆరు గంటలపాటు చలిలో నరకయాతన అనుభవించింది. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా, టేకుమట్ల మండల కేంద్రంలోని కస్తూర్బాగాం ధీ బాలికా విద్యాలయంలో మంగళవారం వెలుగు చూసింది. కాటారానికి చెందిన పస్తం అవిల కేజీబీవీలో ఇంటర్ మొదటి సం వత్సరం చదువుతోంది. హాస్టల్‌లో ఉండటం ఇష్టంలేక రెండు నెలలుగా ఇంటివద్దనే ఉం టూ.. వారం రోజుల క్రితమే హాస్టల్‌కు వచ్చిం ది. అయితే మరోసారి పారిపోయే ప్రయత్నం లో సోమవారం అర్ధరాత్రి ఒంటిగంటకు రెం డవ అంతస్తు భవనం కిటికీ నుంచి కిందికి దూకింది. దీంతో రెండు కాళ్లు విరగడంతో పాటు, వెన్నుపూసకు బలమైన దెబ్బ తగిలిం ది. లేవలేని స్థితిలో తెల్లవారుజామున (మం గళవారం) ఆరు గంటల వరకు చలిలో నరకయాతన అనుభవించింది. ఉదయం మొక్కలకు నీళ్లు పెట్టే క్రమంలో పాఠశాల సిబ్బంది అచేతన స్థితిలో పడి ఉన్న అవిలను గుర్తించారు. అయితే అవిలను ఆస్పత్రికి తరలించకుండా హాస్టల్లోని ఓ గదిలో ఉం చారు. అనంతరం తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి బాలికను ఆస్పత్రికి తరలించారు. కాగా, ప్రాణాపాయ స్థితిలో ఉన్న విద్యార్థిని ఆస్పత్రికి తరలించకుం డా గదిలో ఉంచడంపై అవిల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై పాఠశాల ఎస్ఓ స్వప్నను వివరణ కోరగా గతంలోనే ఆమె హాస్టల్‌లో ఉండటం ఇష్టం లేదని చెబితే టీసీ ఇచ్చామని, తల్లిదండ్రులు బతిమిలాడితే రీ అడ్మిషన్ ఇచ్చామని చెప్పారు. కాగా, కాళ్లువిరిగి ప్రాణాపాయ స్థితిలో ఉన్న అవిలపై సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆమె తండ్రి పస్తం శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉచిత విద్యుత్ పేటెంట్ కాంగ్రెస్‌దే..

▶ మొదటి పేజీ తరువాయి

24 గంటల కరెంట్ ఇస్తే నా నామినేషన్ వాపస్ తీసుకుంటా. లేకుంటే ఇదే నడిగడ్డ మీద సీఎం కేసీఆర్ ముక్కు నేలకు రాసి రైతులకు క్షమాపణలు చెప్పాలి. వస్తావా? లేక తీసేసిన అబ్రహామో, కొత్త అభ్యర్థి పేరు తెల్వదు గానీ దొరగారి గడీల బానిస వస్తాడా.. లేక కేటీఆర్‌ను పంపిస్తావా? కర్ణాటకలో మా ప్రభుత్వం ఉంది. మిత్రుడు డిప్యూటీ సీఎం డీకే శివ కుమార్, సీఎం సిద్ధరామయ్యతో నేను, అలంపూర్ సంపత్‌కుమార్ కూర్చొని మాట్లాడి తుమ్మిళ్ల ప్రాజెక్టు సమస్యను పరిష్కరిస్తాం. కృష్ణా పుష్కరాల సందర్భంగా రూ.100 కోట్లతో జోగుళాంబ ఆలయాన్ని అభివృద్ధి చేస్తానన్న కేసీఆర్ హామీ ఏమైంది?

ముదిరాజ్‌లు అక్కర్లేదా?

తెలంగాణలో 11 శాతం ఉన్న ముదిరాజ్‌లకు బీఆర్ఎస్ ఒక్క టికెట్ ఇవ్వలేదు. ఇవాళ ముదిరాజ్‌ల ఓట్లు అక్కర్లేకుం డా పోయాయా? కేసీఆర్ సమాధానం చెప్పాలి. హేమాహేమీలు పోటీపడ్డా ముదిరాజ్‌లకు సముచిత స్థానం కల్పించేందుకే వారికి కాంగ్రెస్ పార్టీ టికెట్లు ఇచ్చింది. మక్తల్‌లో వాకిటి శ్రీహరి, రాజేంద్రనగర్‌లో నరేందర్, గోషామహల్‌లో సునీతారావు, పటాన్‌చెరులో నీలం మధుకు టికెట్ ఇచ్చాం.

ధరణి కంటే మెరుగైన విధానం తెస్తాం

సీఎం కేసీఆర్ కుటుంబం ధరణిని దోపిడీకి వాడుకుంటోంది. ధరణి వారికి ఏటీఎంగా మారింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ధరణి కంటే నాణ్యమైన విధానాన్ని తీసుకొచ్చి భూములను కాపాడుతాం. ఎక్కడైతే డబుల్ బెడ్రూం ఇళ్లు ఇచ్చారో అక్కడ బీఆర్ఎస్ ఓట్లు అడగాలి. ఎక్కడైతే ఇం దిరమ్మ ఇళ్లు ఇచ్చామో అక్కడ కాంగ్రెస్ ఓట్లు అడుగుతుంది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 24 గంటలపాటు ఉచిత విద్యుత్ ఇచ్చే బాధ్యతను తీసుకుంటుంది. ధరణి రద్దు చేస్తే రైతుబంధు పోతుందని అబద్ధాలు మాట్లాతున్నారు. ధరణి లాంటిది లేకుండానే వైఎస్ హయాంలో రైతులకు రుణమాఫీ, బీమా సౌకర్యం, ఎరువుల సబ్సిడీ ఇవ్వలేదా?



గద్వాలలో కాంగ్రెస్ ప్రజాగర్జన సభకు హాజరైన జనం

లక్ష కోట్ల దోపిడీ జరిగింది

ఎవరో పనిమంతుడు పందిరేస్తే.. కుక్కతోక తగలగానే కూలిపోయిందట. కాళేశ్వరం పరిస్థితి అట్లా ఉంది. మేడిగడ్డ కడితే భూమిలోకి కుంగిపోయింది. అన్నారం కడితే ఫక్కున పగిలిపోయింది. సుందిళ్ల రేపోమాపో కూలేటట్టు ఉంది. ఇక మీ పాపం పండిపోయింది. కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరిట రూ.లక్ష కోట్ల దోపిడీకి పాల్పడ్డారు. ఇప్పటికే తప్పుడు వాగ్దానాలతో కేసీఆర్ రెండు సార్లు సీఎం అయ్యారు. పది వేల ఎకరాల భూములను అక్రమంగా సంపాదించుకున్నా రు. ఆయన ఇంట్లో అల్లుడు, బిడ్డ, కొడుక్కు పదవులు ఇచ్చారు. మూడోసారి గెలిస్తే మనవడికి కూడా పదవి ఇచ్చేలా ఉన్నారు. గుడిని, గుడిలోని లింగాన్ని మింగేసే కేసీఆర్‌ను మళ్లీ గెలిపిస్తే కృష్ణా నదిలో ముంచేస్తారు. దొరల తెలంగాణ కావాలా.. ప్రజల తెలంగాణ కావాలా.. ప్రజలు ఆలోచించుకోవాలి. కాంగ్రెస్ పార్టీని గెలిపించాలి..'' అని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సభల్లో కాంగ్రెస్ అభ్యర్థులు సంపత్‌కుమార్, సరిత తిరుపతయ్య, వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఐ అహ్మద్ మృతి

మహబూబ్‌నగర్ క్రైం: నవంబర్ 2న కానిస్టేబుల్ చేసిన దాడిలో తీవ్రంగా గాయపడిన సీసీఎస్ సీఐ ఇఫ్తికార్ అహ్మద్ మృతిచెందారు. ఆరు రోజు లుగా హైదరాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన మంగళవారం మృతి చెం దారని మహబూబ్‌నగర్ డీఎస్పీ టి.మహేశ్ వెల్లడించారు. దాడికి కారకులైన వారు ఇంకా పరారీలో ఉన్నారని, వీరి కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా చేస్తున్నట్లు డీఎస్పీ చెప్పారు. అయితే ఈ కేసులో దాడికి పాల్పడిన ముగ్గురు పోలీసు లు అదుపులో ఉన్నట్లు సమాచారం.

కాంగ్రెస్‌తో పొత్తు ముగిసిన అధ్యాయం: తమ్మినేని

అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే సీపీఎం పోటీ



ఖమ్మం మయూరిసెంటర్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో పొత్తు అనేది ముగిసిన అధ్యాయమని, చర్చలకు ఇక అవకాశంలేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం స్పష్టం చేశారు. ఖమ్మంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తమ్మినేని మాట్లాడుతూ అభ్యర్థులను ప్రకటించాక కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ స్పందించి తమ కేంద్ర కమిటీతో మాట్లాడారన్నారు. దీంతో సోమవారంరాత్రి అత్యవసరంగా రాష్ట్ర కమిటీ ఆన్‌లైన్‌లో సమావేశమై చర్చించి కాంగ్రెస్ ప్రతిపాదనను తిరస్కరిం చినట్లు వెల్లడించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏ ఒక్క స్థానంలోనూ పోటీకి అవకాశం లేనప్పుడు సీపీఎం పొత్తులకు వెళ్లేది లేదన్నారు. సీపీఎం ఒంటరిగానే పోటీ చేస్తుం దని స్పష్టం చేశామన్నారు. రాష్ట్రం లో ఒంటరిగా 19 స్థానాల్లో పోటీచేయాలని నిర్ణయించగా, ఇప్పటికే 16 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించామని తమ్మినేని చెప్పారు. కోదాడ- మట్టిపల్లి సైదులు, మునుగోడు- దోనూరి నర్సిరెడ్డి, ఇల్లెందు-దుగ్గి కృష్ణ పోటీ చేస్తారని తెలిపారు. ఇల్లెందులో మద్దతు ఇస్తామని, ఇతర చోట్ల తమకు మద్దతు ఇవ్వాలని కోరగా ప్రజాపంథా, న్యూడెమోక్రసీ ఒప్పుకోలేదని చెప్పా రు. సమావేశంలో నాయకులు పోతినేని సుదర్శన్‌రావు, నున్నా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నాకు బతకాలని లేదు..!

- బోరుమన్న ములకలపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు నాగమణి
- అశ్వారావుపేట కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపాటు



రోదిస్తున్న నాగమణి

ములకలపల్లి: 'నాకు బతకాలని లేదు'అంటూ భద్రాద్రి కొత్త గూడెం జిల్లా ములకలపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు సున్నం నాగమణి రోదిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆమె అశ్వారావుపేట నియోజకవర్గం నుంచి కాం గ్రెస్ టికెట్ ఆశించారు. అయితే సోమవారం రాత్రి ప్రకటిం చిన జాబితాలో అశ్వారావుపేట అభ్యర్థిగా జారే ఆదినారా యణ పేరును అధిష్టానం ఖరారు చేసింది. దీంతో స్థానిక కాంగ్రెస్ నేతలు కొందరు అసంతృప్తికి గురైనట్లు సమాచా రం. ఈ క్రమంలో మండల పరిధిలోని మాధారంలో నాగ మణి ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేశారు. అక్కడికి వచ్చిన నాయకుల ఎదుట నాగమణి తన గోడు వెల్లబోసు కుందని, తనకు బతకాలని లేదని బోరున విలపించినట్లు తెలిసింది. సమావేశంలో ములకలపల్లి, దమ్మపేట, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ, అశ్వారావుపేట మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు తాండ్ర ప్రభాకర్‌రావు, మద్దిశెట్టి సత్యప్రసాద్, వనమా. గాంధీ, దారం గోవిందరెడ్డి, తుమ్మా రాంబాబు, ములకలపల్లి, అశ్వారావుపేట మండ లాల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాళ్లు బూరుగుపల్లి పద్మశ్రీ, మష్టిన శిరీష తదితరులు పాల్గొన్నారు.

బీఫామ్ అందుకున్న కూనంనేని

నేడు కొత్తగూడెంలో నామినేషన్

సాక్షి, హైదరాబాద్: కొత్తగూడెం శాసనసభ నియోజకవర్గం సీపీఐ అభ్యర్థిగా కూనంనేని సాంబశివరావు పేరును ఆ పార్టీ ఖరారు చేసింది. కాంగ్రెస్ పార్టీ మద్దతుతో సీపీఐ ఈ స్థానం నుంచి పోటీ చేయనుంది. కొత్తగూడెం అభ్యర్థిగా పోటీ చేయనున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేనికి పార్టీ జాతీయ కార్యదర్శులు కె.నారాయణ, సయ్యద్ అజీజ్ పాషా, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డిలు మం గళవారం బీఫామ్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... శాసనసభలో పేదలు, కార్మికులు కర్షకులు సామాన్యుల గొంతును వినిపించేందుకు సీపీఐని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సాం బశివరావు బుధవారం కొత్తగూడెంలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. కూనంనేని విశాలాంధ్ర దినపత్రిక విలేకరిగా కొత్తగూడెంలో తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత కమ్యూనిస్టు పార్టీలో హోల్ టైమర్‌గా పనిచేస్తున్నారు. 1987లో కొత్తగూ డెం మండల ప్రజా పరిషత్ అధ్యక్షునిగా విజయం సాధించారు. 2009లో కూనంనేని ఉమ్మడి ఆం ధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో సీపీఐ తరఫున కొత్తగూడెం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.



కూనంనేనికి బీఫామ్ అందజేస్తున్న నారాయణ, అజీజ్ పాషా. చిత్రంలో చాడ వెంకట్‌రెడ్డి

కాంగ్రెస్‌కు అసంతృప్తుల కాక

- టికెట్లు దక్కకపోవడంతో ఆశావహులు, వారి అనుచరుల నిరసనలు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన మూడో జాబి తాపై కూడా తీవ్ర నిరసనలు వెల్లువెత్తాయి. జాబితాలో పేర్లు లేని ఆశావహులు, వారి అనుచరులు ఆందోళనలు చేప ట్టారు. అటు గాంధీభవన్, ఇటు రేవంత్‌రెడ్డి నివాసం వద్ద ఈ ఆందోళనలు జరిగాయి. జి చిన్నారెడ్డి (వనపర్తి), సంజీవరెడ్డి (నారాయణఖేడ్), కాట శ్రీనివాస్‌గౌడ్ (పటాన్‌చెరు), బెల్లయ్య నాయక్ (డోర్నకల్), మానవతా రాయ్ (సత్తుపల్లి)లు తమ అనుచరులతో కలిసి, వ్యక్తిగతంగా తమ నిరసనలు పార్టీ అధిష్టానానికి తెలియజేసే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో గాంధీభవన్, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నివాసం వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. గాంధీభవన్‌లోని ప్రధాన గేటులో ఒకదానికి తాళం వేయగా, జూబ్లీహిల్స్‌లో రేవంత్ నివాసానికి వెళ్లే నాలుగువై పులా బారికేడ్లను ఏర్పాటు చేశారు.

చిన్నారెడ్డి అనుచరుల నిరసన

వనపర్తి టికెట్ ఆశించిన చిన్నారెడ్డి అనుచరులు ఉదయం రేవంత్ ఇంటివద్ద ఆందోళనకు దిగారు. తమ నాయకుడికి ఇచ్చిన టికెట్‌ను మార్చి ఇతరులకు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వినతిపత్రం సమర్పించారు. రేవంత్ మాట్లాడుతూ చిన్నారెడ్డి విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అక్కడి నుం చి గాంధీభవన్‌కు చేరుకున్న చిన్నారెడ్డి అనుచరులు మెట్లపై కూర్చొని తమ నాయకుడికే టికెట్ ఇవ్వాలని నినాదాలు చేశారు. పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తుండడంతో చిన్నారెడ్డి జోక్యం చేసుకొని వారిని వారించారు. ఇలావుం డగా వనపర్తి టికెట్ దక్కించుకున్న మేఘారెడ్డికి బీ ఫాం అం దింది. మంగళవారం గాంధీభవన్‌లో మేఘారెడ్డి సోదరుడు మహేశ్వర్ రెడ్డికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కు మార్ రెడ్డి బీ ఫాం అందజేశారు.

కాట వర్గీయుల మండిపాటు

పటాన్‌చెరు టికెట్ ఆశించిన కాట శ్రీనివాస్‌గౌడ్ అనుచరులు సోమవారం అర్ధరాత్రే స్థానికంగా నిరసనలకు దిగారు. పార్టీ జెండాలను దహనం చేశారు. మంగళవారం ఉదయం హైద రాబాద్‌లో రేవంత్‌రెడ్డి ఇంటిని, గాంధీభవన్‌ను ముట్టడిం చారు. రేవంత్ అలంపూర్ పర్యటనకు వెళ్లిన తర్వాత ఆయన నివాసం వద్దకు వచ్చిన శ్రీనివాస్‌గౌడ్, అనుచరులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పార్టీలో కొత్తగా చేరిన నీలం మధుకు టికెట్ ఎలా ఇస్తారంటూ లోనికి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేశారు. పోలీసులు అడ్డుకొని వారిని అక్కడి నుంచి పంపించారు. అనంతరం వారు గాంధీభవన్ వద్ద ఆందోళనకు దిగారు. పారాచూట్లకు టికెట్లు అమ్ముకున్నారం టూ రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. మరోవైపు రామచంద్రా పురంలోనూ నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. పటాన్ చెరు టికెట్‌ను అమ్ముకున్నారని ఆరోపించారు. అధినాయ కత్వం పునరాలోచించాలని డిమాండ్ చేశారు. ఆ సమయం లో శ్రీనివాస్‌గౌడ్‌కు ఫోన్ చేసిన మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ టికెట్ విషయంలో భరోసా ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కాగా నారాయణఖేడ్ టికెట్ ఆశించి భంగపడిన సంజీవరెడ్డి అనుచరులు కూడా గాంధీభవన్ వేదికగా ఆందోళనకు దిగారు. ఖేడ్‌లోనూ నిరసన వ్యక్తం చేశారు.

టికెట్ ఇవ్వకపోతే ఆత్మహత్యకూ వెనుకాడను

తెలంగాణ కాంగ్రెస్ ఎస్టీ విభాగం చైర్మన్‌గా ఉన్న తనకు టికెట్ కేటాయించకపోవడంపై బెల్లయ్య నాయక్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మహబూబాబాద్, డోర్నకల్‌లలో ఎక్కడా టికెట్ ఇవ్వకుండా మోసం చేశారంటూ గాంధీ బొమ్మ ఎదుట దీక్షకు దిగారు. తనకు అవకాశం ఇవ్వకపోతే ఆత్మహత్య చేసుకోవడానికి కూడా వెనుకాడనని హెచ్చరిం చడంతో పోలీసులు ఆయన్ను అక్కడి నుంచి తీసుకెళ్లారు.

బరిలోకి దిగేది ఖాయం: మానవతారాయ్

సత్తుపల్లి విషయంలో నిర్ణయాన్ని 24 గంటల్లోగా మార్చు కొని తనకు పార్టీ బీఫాం ఇవ్వకపోతే 9, 10 తేదీల్లో రెబల్ అభ్యర్థిగా బరిలోకి దిగుతానని ఓయూ విద్యార్థి నేత, టీపీ సీసీ ప్రధాన కార్యదర్శి కె మానవతారాయ్ హెచ్చరించారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తున్నానని పేర్కొంటూ రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు.

భీం భరత్‌కు ఎట్టకేలకు బీ ఫాం

చేవెళ్ల టికెట్‌ను భీం భరత్‌కు ఇస్తామని ప్రకటించిన అధి ష్టానం బీ ఫాం మాత్రం ఇవ్వలేదు. దీంతో రెండు మూడురో జులుగా తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అయితే ఆయన మంగళ వారం పార్టీ పెద్దలను కలిసిన నేపథ్యంలో రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే బీఫాం అందజేయడతో గందర గోళానికి తెరపడింది.

దామోదర వర్సెస్ జగ్గారెడ్డి

మెదక్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేతలు దామోదర రాజన ర్సింహ, జగ్గారెడ్డి మధ్య విభేదాలు పొడ చూపాయి. పటాన్ చెరు కాంగ్రెస్ టికెట్ నీలం మధు ముదిరాజ్‌కు దక్కడంలో తన ప్రమేయం ఉందంటూ కాట శ్రీనివాస్‌గౌడ్ కుటుంబ సభ్యులతో రాజనర్సింహ తనను బద్నాం చేయిస్తున్నారని జగ్గారెడ్డి ఆరోపించారు. ఇది మంచి పద్ధతి కాదని, దమ్ముం టే రాజకీయంగా తేల్చుకోవాలే తప్ప వ్యక్తిగతంగా డ్యామేజీ చేసేందుకు ప్రయత్నించడం సరికాదని అన్నారు. మరోవైపు తన అనుచరులు కాట శ్రీనివాస్‌గౌడ్, సంజీవరెడ్డిలకు టికెట్లు దక్కకపోవడంపై రాజనర్సింహ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే మంగళవారం తన నియోజకవర్గం మునిపల్లి మండలంలో ఎన్నికల ప్రచారాన్ని నిలిపివేసి ఢిల్లీకి వెళ్లినట్లు సమాచారం.

సాక్షి బిజినెస్
బుధవారం
8-11-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	16	64,942
నిఫ్టీ ▽	5	19,407

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	13,615	△	93
డోజోన్స్	34,141	△	45
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,410	▽	8
డాక్స్	15,153	△	17
షాంఘై	3,057	▽	1
నికాయ్	32,708	▽	448

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)		
60,579	▽	474
బంగారం (99.5 స్వచ్ఛత)		
60,336	▽	472
వెండి (కేజీ)		
72,705	▽	1,332

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎనీటెం	82.48	84.15
£	బ్రిటన్ పౌండ్	ఎనీటెం	99.99	103.36
€	యూరో	ఎనీటెం	87.01	90.10
¥	జపాన్ ఎన్ (100)	ఎనీటెం	54.58	56.26
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎనీటెం	52.53	54.84
S$	సింగపూర్ డాలర్	ఎనీటెం	60.20	62.14
SAR	సౌదీ రియాల్	[illegible]	21.19	22.82
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.65	23.49
¥	చైనా యువాన్	[illegible]	10.29	12.38

స్వల్పంగా పెరిగిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రుణ రేటు



ముంబై: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కొన్ని కాలపరిమితుల రుణాలపై వడ్డీ రేటును స్వల్పంగా 0.05 శాతం (ఐదు బేసిస్ పాయింట్లు) పెంచింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గడచిన ఐదు ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్షల్లోనూ రెపో రేటు (బ్యాంకులకు తానిచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీరేటు– ప్రస్తుతం 6.5%) పెంపుపై ఎటువంటి నిర్ణయం తీసుకోనప్పటికీ, హెచ్‌డీఎఫ్‌సీ తాజా రేటు పెంపు నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం, ఓవర్‌నైట్ ఎంసీఎల్‌ఆర్ 8.65 శాతానికి పెరిగింది. మూడేళ్ల ఎంసీఎల్‌ఆర్ 9.30 శాతానికి ఎగసింది. కాగా, సాధారణంగా అధిక రుణాలకు ప్రాతిపదిక అయిన ఏడాది రుణ రేటు మాత్రం 9.20 శాతం వద్ద స్థిరంగా ఉంది.

హైదరాబాద్‌లో రిలయన్స్ స్వదేశ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రిటైల్ రంగ దిగ్గజం రిలయన్స్ రిటైల్ 'స్వదేశ్' తొలి ఔట్‌లెట్‌ను హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఏర్పాటు చేసింది. రిలయన్స్ ఫౌండేషన్ ఫౌండర్, చైర్‌పర్సన్ నీతా అంబానీ చేతుల మీదుగా నేడు (బుధవారం) ఈ స్టోర్ ప్రారంభం కానుంది. సుమారు 30,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇది కొలువుదీరింది. చేనేత వస్త్రాలు, హస్తకళలు, ఫర్నిచర్, బొమ్మలు, ఆభరణాలు, గృహాలంకరణ వస్తువులు, పెయింటింగ్స్, యాక్సెసరీస్‌తోపాటు వ్యవసాయ ఉత్పత్తులను ఇక్కడ విక్రయిస్తారు. దేశవ్యాప్తంగా చేతి వృత్తుల కళాకారులకు చెందిన గుర్తింపు ఉన్న సంఘాల నుంచి నేరుగా వీటిని సేకరిస్తారు. రూ.6 లక్షలకుపైగా ధర పలికే వస్తువులనూ విక్రయిస్తారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

08-11-2023	
విశాఖ	530-00
చిత్తూరు	593-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	525-00
విజయవాడ	525-00
రిటైల్ ధర (డజను)	72.00
07-11-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	515-00
వరంగల్	517-00
రిటైల్ ధర	5.75

వుయ్‌వర్క్ దివాలా!

- వ్యాపార పునర్వ్యవస్థీకరణపై దృష్టి
- లీజుల క్రమబద్ధీకరణకు కసరత్తు



న్యూయార్క్: ఆఫీస్ స్పేస్ విభాగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన అంతర్జాతీయ దిగ్గజం వుయ్‌వర్క్ దివాలా ప్రకటించింది. వ్యాపారాన్ని యథాప్రకారం కొనసాగిస్తూ, కార్యకలాపాలను పునర్‌వ్యవస్థీకరించుకునే దిశగా అమెరికాలో చాప్టర్ 11 దివాలా పిటిషన్ దాఖలు చేసింది. వ్యాపార పునర్నిర్మాణ ప్రక్రియ ప్రారంభించినట్లు కంపెనీ తెలిపింది. కమర్షియల్ ఆఫీస్ లీజుల పోర్ట్‌ఫోలియోను మరింత క్రమబద్ధీకరించుకోనున్నట్లు పేర్కొంది. రుణభారాన్ని గణనీయంగా తగ్గించుకునే దిశగా పునర్‌వ్యవస్థీకరణ విషయంలో తోడ్పాటు అందించేలా సంబంధిత వాటాదారులతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపింది. అమెరికా, కెనడా వెలుపలి దేశాల్లోని తమ కార్యకలాపాలపై ఈ పరిణామ ప్రభావం ఉండబోదని వుయ్‌వర్క్ వివరించింది. సమస్యలను పరిష్కరించుకుని, వ్యాపారాన్ని మెరుగుపర్చుకుంటూ ముందుకు సాగడంపై దృష్టి పెడుతున్నట్లు సంస్థ సీఈవో డేవిడ్ టోలీ ఒక ప్రకటనలో తెలిపారు. కంపెనీ ఈ ఏడాది ప్రథమార్ధంలో 696 మిలియన్ డాలర్ల నష్టం నమోదు చేసింది. జూన్ 30 నాటికి వుయ్‌వర్క్‌కు 39 దేశాల్లో 777 చోట్ల కార్యకలాపాలు ఉన్నాయి.

అప్పట్లో 50 బిలియన్ డాలర్ల వేల్యుయేషన్ ..
గతంలో దాదాపు 50 బిలియన్ డాలర్ల వేల్యుయేషన్‌తో వెలుగొందిన వుయ్‌వర్క్ దివాలా తీయడానికి అనేక కారణాలు ఉన్నాయి. అతి దూకుడుగా విస్తరించడం, వ్యవస్థాపకుడు ఆడమ్ న్యూమాన్ పోకడలు మొదలైనవి ఇందుకు దారితీశాయి. వాస్తవానికి కొన్నాళ్ల క్రితం నుంచే దివాలా సంకేతాలు కనిపించడం మొదలైంది. 2019లో తొలి పబ్లిక్ ఇష్యూ ప్రయత్నం ఘోరంగా విఫలం కాగా ఆ తర్వాత 2021లో ఐపీవోకి వచ్చినా వేల్యుయేషన్ అనేక రెట్లు తగ్గి 9 బిలియన్ డాలర్లకు పడిపోయింది. అంతకన్నా ముందే కంపెనీ, వ్యవస్థాపకుడి పనితీరుపై ఇన్వెస్టర్లలో తీవ్ర అసంతృప్తి నెలకొనడంతో.. న్యూమాన్ ఉద్వాసనకు గురయ్యారు. సంస్థలో మెజారిటీ వాటాలు తీసుకున్న జపాన్ దిగ్గజం సాఫ్ట్‌బ్యాంక్.. కంపెనీని నిలబెట్టేందుకు ప్రయత్నించింది. నిర్వహణ వ్యయాలను తగ్గించుకోవడం, ఆదాయాన్ని పెంచుకోవడం వంటి ప్రయత్నాలు జరిగినా పెద్దగా ఫలితం లేకపోయింది. వ్యాపారాన్ని కొనసాగించే సామర్థ్యాలు అంతంతమాత్రంగానే ఉన్నాయంటూ వుయ్‌వర్క్ ఆగస్టులోనే వెల్లడించింది. ఆ తర్వాత లీజులన్నింటినీ పునఃసమీక్షించుకునే యోచనలో ఉన్నట్లు సెప్టెంబర్‌లో ప్రకటించింది. నష్టాల్లో ఉన్న లొకేషన్ల నుంచి వైదొలగనున్నట్లు తెలిపింది.

భారత్‌లో ప్రభావం ఉండదు..

వుయ్‌వర్క్ గ్లోబల్ దివాలా ప్రభావం భారత విభాగంపై ఉండదని వుయ్‌వర్క్ ఇండియా సీఈవో కరణ్ విర్వాణి స్పష్టం చేశారు. దివాలా ప్రక్రియలో భారత వ్యాపారం భాగంగా లేదని తెలిపారు. వుయ్‌వర్క్ ఇండియాలో రియల్ ఎస్టేట్ సంస్థ ఎంబసీ గ్రూప్‌నకు 73 శాతం, వుయ్‌వర్క్ గ్లోబల్‌కు 27 శాతం వాటాలు ఉన్నాయి. భారత్‌లో ఏడు నగరాల్లో వుయ్‌వర్క్ ఇండియాకు 50 కేంద్రాలు ఉన్నాయి. 2021 జూన్‌లో వుయ్‌వర్క్ ఇండియాలో వుయ్‌వర్క్ గ్లోబల్ 100 మిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేసింది.

బ్యాంకింగ్‌కు ప్రత్యామ్నాయంగా ఫిన్‌టెక్

'ఆర్‌బీఐ' నివేదిక



ముంబై: సమీప భవిష్యత్తులో సాంప్రదాయ బ్యాంకింగ్‌కు ఫిన్‌టెక్ రంగం ప్రత్యామ్నాయంగా ఎదిగే అవకాశాలు ఉన్నాయని సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ ఫైనాన్షియల్ రీసెర్చ్ అండ్ లెర్నింగ్ (క్రెఫ్రాల్) ఒక నివేదికలో పేర్కొంది. డిజిటలీకరణ వృద్ధికి, ఆర్థిక స్థిరత్వ సాధనకు ఎప్పటికప్పుడు తగు విధంగా మల్చుకోగలిగే నియంత్రణ విధానాలు అవసరమని తెలిపింది. ఇండియా ఫైనాన్స్ రిపోర్ట్ 2023 పేరిట క్రెఫ్రాల్ రూపొందించిన తొలి ప్రచురణను రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ మంగళవారం విడుదల చేశారు. బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగంలో పరిశోధనలను ప్రోత్సహించేందుకు 2011లో క్రెఫ్రాల్‌ను లాభాపేక్ష రహిత సంస్థగా ఆర్‌బీఐ ఏర్పాటు చేసింది. దేశీయంగా బ్యాంకిగేతర ఆర్థిక రంగ స్థితిగతులను అర్థం చేసుకోవడంలో నియంత్రణ సంస్థలు, విధాన నిర్ణేతలు సహా సంబంధిత వర్గాలకు సహాయకరంగా ఉండే అంశాలను తాజా నివేదికలో పొందుపర్చారు. దేశీ సాంకేతిక తోడ్పాటుతో భారత్‌లో డిజిటలీకరణ వేగవంతమవుతోందని, డిజిటల్ రుణాలు.. ముఖ్యంగా ఫిన్‌టెక్ రుణాలు గణనీయంగా పెరిగాయని నివేదిక పేర్కొంది.

పవర్ గ్రిడ్ లాభం అప్

క్యూ2లో రూ. 3,781 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం పవర్ గ్రిడ్ కార్ప్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 4 శాతం వృద్ధితో రూ. 3,781 కోట్లను అధిగమించింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 3,650 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 11,349 కోట్ల నుంచి రూ. 11,530 కోట్లకు ఎగసింది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 4 చొప్పున మధ్యంతర డివిడెండును ప్రకటించింది. డిసెంబర్ 6కల్లా చెల్లించనుంది.

ఫలితాల నేపథ్యంలో పవర్ గ్రిడ్ షేరు ఎన్‌ఎస్‌ఈలో దాదాపు యథాతథంగా రూ. 208 వద్ద ముగిసింది.

జోయాలుక్కాస్ దీపావళి క్యాష్‌బ్యాక్ ఆఫర్లు



హైదరాబాద్: దీపావళి సందర్భంగా జోయాలుక్కాస్ క్యాష్‌బ్యాక్ ఆఫర్లు ప్రకటించింది. రూ.50,000 విలువైన డైమండ్, అన్ కట్ డైమండ్స్–ప్రెషస్ జ్యువెలరీ కొనుగోలుపై రూ.2 వేల విలువైన క్యాష్‌బ్యాక్ గిఫ్ట్ వోచర్ పొందవచ్చు. అలాగే రూ.50 వేల విలువైన బంగారం ఆభరణాల కొనుగోలుపై రూ.1000 విలువైన క్యాష్‌బ్యాక్ గిఫ్ట్ వోచర్, రూ.10వేల విలువైన వెండి ఆభరణాలపై రూ.500 విలువైన గిఫ్ట్ వోచర్లు అందిస్తుంది. అడ్వాన్స్ బుకింగ్ స్కీమ్‌తో షాపింగ్ చేసే కస్టమర్లు ప్రోత్సాహక బహుమతి పొందొచ్చు. ఇప్పటికే ప్రారంభమైన ఆఫర్లు నవంబర్ 12 వరకు అమలులో ఉంటాయి. క్యాష్‌బ్యాక్ రూపంలో కస్టమర్లకు మేమిచ్చే బహుమతులు వారి దీపావళిని మరింత శోభాయమానం చేస్తాయని సంస్థ ఎండీ జాయ్ అలుక్కాస్ తెలిపారు.

3 రోజుల లాభాలకు బ్రేక్

- స్వల్ప నష్టాల ముగింపు
- విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాల ప్రభావం



ముంబై: దేశీయ మార్కెట్లో విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలు కొనసాగడంతో స్టాక్ సూచీల 3 రోజుల వరుస లాభాలకు మంగళవారం బ్రేక్ పడింది. ఆసియా, యూరప్ మార్కెట్లలో నెలకొన్న బలహీన సంకేతాలు సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం చూపాయి. ఛత్తీస్‌గఢ్, మిజోరం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ట్రేడర్లు ఆచితూచి వ్యవహరించారు. ట్రేడింగ్‌లో 383 పాయింట్ల రేంజ్‌లో కదలాడిన సెన్సెక్స్ చివరికి 16 పాయింట్ల స్వల్ప నష్టంతో 64,942 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 94 పాయింట్ల పరిధిలో కదలాడింది. ఆఖరికి ఐదు పాయింట్ల నష్టంతో 19,407 వద్ద నిలిచింది. చైనా అక్టోబర్ ఎగుమతులు భారీగా క్షీణించినట్లు డేటా వెల్లడికావడంతో ఆసియాలో ఒక్క తైవాన్ తప్ప మిగిలిన అన్ని దేశాల స్టాక్ సూచీలు 2% నష్టపోయాయి. కార్పొరేట్ క్యూ3 ఆర్థిక ఫలితాల ప్రకటన, ఇంధన షేర్ల పతనంతో యూరప్ మార్కెట్లు ఒకశాతం మేర పతనమయ్యాయి.

- హోనాసా కన్జూమర్ లిస్టింగ్ పర్వాలేదనిపించింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.324) వద్దే లిస్టయ్యింది. చివరికి 4% లాభంతో రూ.337 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.10,848 కోట్లుగా నమోదైంది.
- ఈఎస్‌ఏఎఫ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఐపీఓ చివరిరోజు నాటికి 73.15 రెట్లు సబ్‌స్క్రయిబ్ అయ్యింది. 5.77 కోట్ల ఈక్విటీలను జారీ చేయగా 422 కోట్ల ఈక్విటీలకు బిడ్లు దాఖలయ్యాయి. క్యూఐబీ కోటా 173.52 రెట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల కోటా 84.37 రెట్లు, రిటైల్ ఇన్వెస్టర్ల కోటా 16.97 రెట్లు సబ్‌స్క్రయిబ్ అయ్యాయి.

మ్యాక్సివిజన్ బ్రాండ్ అంబాసిడర్‌గా ధోని



చెన్నై: కంటి సంరక్షణ సేవల సంస్థ మ్యాక్సివిజన్‌సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పిటల్స్ తాజాగా క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోనిని తమ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకుంది. అన్ని వర్గాలకు చిరపరిచితమైన ధోని వంటి దిగ్గజంతో జత కట్టడమనేది.. క్రమం తప్పకుండా కంటి చెకప్‌లు చేయించుకోవాల్సిన ఆవశ్యకతపై ప్రజల్లో అవగాహన పెంచడానికి దోహదపడగలదని సంస్థ సీఎండీ జీఎస్‌కే వేలు తెలిపారు. చౌకగా కంటి సంరక్షణ సేవలను అందరికీ అందుబాటులోకి తేవాలని తాము లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన చెప్పారు. తమ నెట్‌వర్క్‌లోని 40కిపైగా ఆస్పత్రుల్లో నిత్యం వేల కొద్దీ పేషెంట్లకు సర్వీసులు అందిస్తున్నామని సంస్థ సీఈవో సుధీర్ వీఎస్ తెలిపారు.

జాబ్ పాయింట్

ఎన్‌ఐఆర్‌డీపీఆర్, హైదరాబాద్‌లో యంగ్ ప్రొఫెషనల్ పోస్టులు

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్.. ఒప్పంద ప్రాతిపదికన యంగ్ ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 04
» **అర్హత:** పీజీ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. ఎంబీఏ(హెచ్ఆర్) చేసిన వారికి ప్రాధాన్యం ఉంటుంది. వయసు: 30 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.32,000.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 12.11.2023
» **వెబ్‌సైట్:** www.nirdpr.in

పీజీసీఐఎల్, న్యూఢిల్లీలో 10 ఆఫీసర్ ట్రైనీ(లా) పోస్టులు

న్యూఢిల్లీలోని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(పీజీసీఐఎల్).. క్లాట్ 2024 స్కోరు ద్వారా ఆఫీసర్ ట్రైనీ(లా) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 10
» **అర్హత:** 60 శాతం మార్కులతో ఎల్ఎల్‌బీ లేదా ఇంటిగ్రేటెడ్ లా/ఎల్ఎల్‌బీ కోర్సు ఉత్తీర్ణతతో పాటు క్లాట్–2024 స్కోరు సాధించి ఉండాలి.
» **వయసు:** 29.11.2023 నాటికి 28 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** క్లాట్–2024 స్కోర్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 09.11.2023.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 29.11.2023
» **వెబ్‌సైట్:** www.powergrid.in

అల్లూరి సీతారామరాజు జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖలో 13 ఉద్యోగాలు

అల్లూరి సీతారామరాజు జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం.. ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 13
» **పోస్టుల వివరాలు:** జిల్లా కోఆర్డినేటర్–1, జిల్లా ప్రాజెక్ట్ అసిస్టెంట్–1, బ్లాక్ కోఆర్డినేటర్–11.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి
» **వేతనం:** నెలకు జిల్లా కోఆర్డినేటర్‌కు రూ.30,000. జిల్లా ప్రాజెక్ట్ అసిస్టెంట్‌కు రూ. 18,000. బ్లాక్ కోఆర్డినేటర్‌కు రూ.20,000
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం, బాలసదన్ పక్కన, పాడేరు, అల్లూరి సీతారామ రాజు జిల్లా చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 10.11.2023.
» **వెబ్‌సైట్:** allurisitharamaraju.ap.gov.in

బెల్ బెంగళూరులో 16 ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టులు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, బెంగళూరు కాంప్లెక్స్.. ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 16
» **అర్హత:** బీఈ, బీటెక్(ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ /ఎలక్ట్రానిక్స్ /టెలికమ్యూనికేషన్/కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ /ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఇన్‌స్ట్రుమెంటేషన్).
» **వేతనం:** నెలకు రూ.40,000 నుంచి రూ.55,000 వరకు ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.11.2023
» **వెబ్‌సైట్:** www.belindia.in

నంద్యాల జిల్లా మహిళా,శిశు సంక్షేమ, సాధికారత కార్యాలయంలో 23 పోస్టులు

నంద్యాల జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం.. ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 23
» **పోస్టుల వివరాలు:** జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ –01, ప్రొటెక్షన్ ఆఫీసర్ ఇన్‌స్టిట్యూషనల్ కేర్–01, ప్రొటెక్షన్ ఆఫీసర్ నాన్ ఇన్‌స్టిట్యూషనల్ కేర్–01, లీగల్ కమ్ ప్రొటెక్షన్ ఆఫీసర్–01, కౌన్సిలర్–01, సోషల్ వర్కర్–02, అకౌంటెంట్–01, డేటా అనలిస్ట్–01, అసిస్టెంట్ కమ్ డేటాఎంట్రీ ఆపరేటర్–01, అవుట్‌రీచ్ వర్కర్స్ –02, మేనేజర్/కోఆర్డినేటర్(మహిళలు)–01, సోషల్ వర్కర్ కమ్–ఎర్లీ చైల్డ్‌హుడ్ ఎడ్యుకేటర్ (మహిళలు)–01, నర్సు(మహిళలు)–01, డాక్టర్(పార్ట్‌టైమ్)–01, ఆయా(మహిళలు)–06, చౌకీదార్(మహిళలు)–01.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిప్లొమా, ఇంటర్,డిగ్రీ,పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం, బీఎస్ఎన్ఎల్ క్వార్టర్స్, బొమ్మలసత్రం, నంద్యాల చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 10.11.2023.
» **వెబ్‌సైట్:** nandyal.ap.gov.in

ఐఐఎంల్లో.. సమ్మర్ ప్లేస్‌మెంట్స్ హవా!

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్.. సంక్షిప్తంగా ఐఐఎం! మేనేజ్‌మెంట్ విద్యలో అంతర్జాతీయ ప్రమాణాలు పాటిస్తూ.. విద్యార్థులకు నిత్యనూతన నైపుణ్యాలు అందించడంలో.. ముందుండే ఇన్‌స్టిట్యూట్స్!! వీటిలో కోర్సులు పూర్తి చేసుకుంటే.. కార్పొరేట్ సంస్థల రెడ్ కార్పెట్ స్వాగతం ఖాయం అనే అభిప్రాయం! ఐఐఎంల్లో ఇటీవల సమ్మర్ ప్లేస్‌మెంట్ ప్రక్రియ మొదలైంది! పలు సంస్థలు భారీ స్టయిఫండ్‌తో ఎస్‌పీఓలు ఖరారు చేస్తున్నాయి! ఈ నేపథ్యంలో.. ఐఐఎంల్లో సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ తాజా ట్రెండ్స్, అవకాశాలు కల్పిస్తున్న రంగాలు, స్టయిఫెండ్స్ తదితర వివరాలు..

» ఐఐఎంలలో మొదలైన ఎస్‌పీఓ ప్రక్రియ
» పలు ఇన్‌స్టిట్యూట్స్‌లో వందశాతం ఆఫర్లు
» సగటున రూ.2 లక్షల స్టయిఫండ్

కార్పొరేట్ సంస్థలకు ఐఐఎం విద్యార్థులు హాట్ కేక్స్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆయా కంపెనీలకు అవసరమైన నిర్వహణ నైపుణ్యాలు ఐఐఎంల విద్యార్థుల్లో ఉంటాయని భావించడమే ఇందుకు నిదర్శనం. తాజాగా ఐఐఎంలలో కొనసాగుతున్న ఎస్‌పీఓ ప్రక్రియ, అందిస్తున్న ఆఫర్లే ఇందుకు నిదర్శనం అంటున్నారు నిపుణులు.

సమ్మర్ ప్లేస్‌మెంట్స్‌గా

ఐఐఎం పీజీ ప్రోగ్రామ్‌ల్లో చేరిన విద్యార్థులు మొదటి సంవత్సరం పూర్తయ్యాక లభించే సెలవు రోజుల్లో సమ్మర్ ప్లేస్‌మెంట్స్ చేస్తారు. అంతకు ముందు కంపెనీలు విద్యార్థులను ఇంటర్న్ ట్రైనీగా ఎంపిక చేసేందుకు ప్రత్యేక ప్రక్రియ నిర్వహిస్తారు. ఈ సమ్మర్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో నెగ్గిన విద్యార్థులకు సంస్థలు రెండు వారాల వ్యవధిలో ఇంటర్న్ ట్రైనీగా విధులు నిర్వహించడానికి అవకాశం కల్పిస్తాయి. ఇలా ఇంటర్న్ ట్రైనీగా ఎంపికైన వారికి స్టయిపండ్ పేరుతో ఆర్థిక ప్రోత్సాహకాలు కూడా అందిస్తాయి. ఇది రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు ఉంటుంది.

అందరికీ ఆఫర్స్

- 2023–25 బ్యాచ్ విద్యార్థులకు సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ వెల్లువెత్తున్నాయి.
- ఐఐఎం–లక్నోలో మొత్తం 576 మంది విద్యార్థులకు సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ లభించాయి. వీరికి సగటు స్టయిఫండ్ నెలకు రూ 1.31 లక్షలుగా, గరిష్ఠ స్టయిఫండ్ రూ.3.5 లక్షలుగా నిలవడం గమనార్హం.
- ఐఐఎం–కోల్‌కతలో.. 466 మంది విద్యార్థులకు గాను అందరికీ సమ్మర్ ప్లేస్‌మెంట్స్ లభించడం విశేషం. వీరికి సగటు స్టయిఫండ్ రూ.1.65 లక్షలుగా, గరిష్ఠ స్టయిఫండ్ రూ.3.75 లక్షలుగా ఉంది.
- ఐఐఎం–నాగపూర్‌లోనూ నూటికి నూరు శాతం విద్యార్థులకు సమ్మర్ ప్లేస్‌మెంట్స్ లభించాయి. సగటు స్టయిఫండ్ రూ.79 వేలుగా ఉంది.

కొనసాగుతున్న ప్రక్రియ

దేశంలోని ఇతర ఐఐఎంలలోనూ ప్రస్తుతం సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ ప్రక్రియ కొనసాగుతోంది. ఐఐఎం–అహ్మదాబాద్, బెంగళూరు తదితర క్యాంపస్‌లలో ఈ నెల రెండో వారంలోపు ఈ ప్రక్రియ పూర్తవనుంది. ఇప్పటి వరకు లభించిన సమాచారం ప్రకారం–ఇతర ఐఐఎంలలోనూ సమ్మర్ ప్లేస్‌మెంట్స్ దాదాపు వంద శాతం లభించే సంకేతాలున్నాయని ఆయా క్యాంపస్ ప్లేస్‌మెంట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

బీఎఫ్ఎస్ఐ, కన్సల్టింగ్, ఫైనాన్స్

- ఐఐఎంలు, ఇతర బి–స్కూల్స్‌లో సమ్మర్ ప్లేస్‌మెంట్స్‌లో ఈ ఏడాది కన్సల్టింగ్, ఫైనాన్స్ రంగాల హవా కనిపించింది. ఇప్పటి వరకు అన్ని బి–స్కూల్స్‌లో దాదాపు 40 శాతం మేర సమ్మర్ ప్లేస్‌మెంట్స్.. కన్సల్టింగ్, ఫైనాన్స్ రంగాలకు చెందిన సంస్థల నుంచే ఉన్నాయి. బీసీజీ, బెయిన్ అండ్ కో, యాక్సెంచర్ స్ట్రాటజీ, పీడబ్ల్యూసీ, డెలాయిట్, కేపీఎంజీ, సినర్జీ కన్సల్టింగ్ కంపెనీలు టాప్ రిక్రూటర్స్‌గా నిలిచాయి.
- కన్సల్టింగ్, ఫైనాన్స్ రంగాల తర్వాత ఐటీ, ఈ–కామర్స్ సంస్థలు టాప్ రిక్రూటర్స్‌గా ఉన్నాయి. ఈ రంగాల్లో డేటా మేనేజ్‌మెంట్, ఫైనాన్స్, మార్కెటింగ్ విభాగాల్లో ఇంటర్న్‌షిప్ చేసే విధంగా ఆఫర్లు లభించాయి. అదే విధంగా గూగుల్, ఫేస్‌బుక్ సంస్థలు కూడా ఎస్‌పీఓ ఆఫర్లు కల్పించాయి.

సేల్స్, అండ్ మార్కెటింగ్‌లోనూ

సేల్స్ అండ్ మార్కెటింగ్ ప్రొఫైల్స్‌లోనూ ఈ ఏడాది సమ్మర్ ప్లేస్‌మెంట్స్ జోరు కొనసాగింది. ముఖ్యంగా ప్రొడక్ట్ రీసెర్చ్, మార్కెట్ అనాలిసిస్ విభాగాల్లో విధులు నిర్వర్తించే విధంగా ఈ ఆఫర్స్ లభించాయి. అదే సమయంలో జనరల్ మేనేజ్‌మెంట్ విభాగంలోనూ సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ ఖరారయ్యాయి. పలు సంస్థలు ఈ విభాగాల్లో విద్యార్థులను నియమించుకునే క్రమంలో విశ్లేషణాత్మక దృక్పథం, మార్కెట్ పరిస్థితులపై వారికున్న అవగాహనను క్షుణ్నంగా పరిశీలించి ఆఫర్స్ ఇచ్చినట్లు ఐఐఎంల వర్గాలు పేర్కొన్నాయి.



ఎంబీఏ స్పెషల్

ఈ ప్రొఫైల్స్‌లో అధికంగా

సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్‌లో ఎక్కువగా డేటా మేనేజ్‌మెంట్; ఫైనాన్స్ మేనేజ్‌మెంట్; జనరల్ అడ్మినిస్ట్రేషన్; సేల్స్ అండ్ మార్కెటింగ్; డేటా అనలిటిక్స్; బిజినెస్ స్ట్రాటజీస్ ప్రొఫైల్స్ ముందంజలో ఉంటున్నాయి.

ఎందుకంత క్రేజ్

సమ్మర్ ప్లేస్‌మెంట్స్ పేరిట కంపెనీలు ఐఐఎంల విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ఆఫర్స్, రూ.లక్షల్లో స్టయిపండ్ ఇవ్వడానికి కారణం ఏంటి? అంటే వినిపిస్తున్న సమాధానం.. ఈ ఇన్‌స్టిట్యూట్‌ల విద్యార్థులకు రియల్ టైమ్ నైపుణ్యాలు, అప్‌డేటెడ్ నాలెడ్జ్ ఉంటుందని ఆయా సంస్థలు భావించడమేననే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇక్కడ బోధన విధానాలు అత్యున్నత స్థాయిలో ఉంటాయి. విద్యార్థులను కార్పొరేట్ లీడర్లుగా తీర్చిదిద్దే విధంగా కరిక్యులం ఉంటుంది. అందుకే ఈ ఇన్‌స్టిట్యూట్స్ నుంచి ఇంటర్న్ ట్రైనీలను నియమించుకునేందుకు సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని పేర్కొంటున్నారు.

పూర్తిస్థాయి కొలువుకు మార్గం

సమ్మర్ ప్లేస్‌మెంట్స్ ట్రైనింగ్ సమయంలో విద్యార్థులు చూపే పనితీరు ఆయా సంస్థల్లో పూర్తి స్థాయి కొలువుకు మార్గంగా నిలుస్తుంది. ఎస్‌పీఓ దక్కించుకున్న అభ్యర్థులు ట్రైనీగా ప్రతిభ చూపితే.. అదే సంస్థలో శాశ్వత నియామకం సొంతం చేసుకునే అవకాశం కూడా ఉంది. ఇంటర్న్‌షిప్ చేసిన సమయంలో తమకు కేటాయించిన విధులు, విభాగాల్లో తమ సామర్థ్యాలను, నైపుణ్యాలను ప్రదర్శించిన వారికి కంపెనీలు ముందుగానే ఆఫర్స్ ఖరారు చేస్తున్నాయి. ఇలాంటి అభ్యర్థులకు ద్వితీయ సంవత్సరం చివర్లో నిర్వహించే ఫైనల్ ప్లేస్‌మెంట్స్ ప్రక్రియల్లో పాల్గొనకుండానే ఫైనల్ ఆఫర్ లభిస్తుంది.

ఫైనల్ ప్లేస్‌మెంట్స్

ప్రస్తుతం సమ్మర్ ప్లేస్‌మెంట్ ట్రెండ్స్‌ను పరిగణనలోకి తీసుకుంటే.. ఫైనల్ ప్లేస్‌మెంట్ ప్రక్రియ కూడా ఆశాజనకంగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సంస్థల వ్యాపారాలు పుంజుకుంటున్నాయని, అవి తమ కార్యకలాపాలు విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాయని క్యాంపస్ ప్లేస్‌మెంట్ వర్గాలు పేర్కొంటున్నాయి. అందుకు అవసరమైన స్కిల్స్ ఉన్న వారిని నియమించుకునేందుకు ప్లేస్‌మెంట్స్‌కు వస్తున్నాయని చెబుతున్నారు.

ఇతర బి-స్కూల్స్‌లోనూ

ఐఐఎంలతోపాటు దేశంలోని ఇతర ప్రముఖ బి–స్కూల్స్‌లోనూ ఈ ఏడాది సమ్మర్ ప్లేస్‌మెంట్ డ్రైవ్స్ ఆశాజనకంగా ఉండనున్నాయి. అలాగే మరో ప్రముఖ బీస్కూల్ ఎక్స్ఎల్ఆర్ఐ–జెంషెడ్‌పూర్‌లోనూ వంద శాతం ఇంటర్న్‌షిప్ ఆఫర్లు లభించాయి. అంతేకాకుండా రెండు నెలల వ్యవధికి ఇచ్చే స్టయిపండ్ కూడా గరిష్ఠంగా రూ.3.5 లక్షలుగా నమోదవడం విశేషం. అదే విధంగా ఢిల్లీ యూనివర్సిటీ ఫ్యాకల్టీ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగంలోనూ ఎంబీఏ విద్యార్థులకు బెస్ట్ ఆఫర్లు లభిస్తాయని భావిస్తున్నారు.



సూపర్ స్వియాటెక్...

మహిళల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నీ డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) తొలిసారి విజేతగా నిలిచి మళ్లీ ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకుంది. మెక్సికోలో మంగళవారం జరిగిన ఫైనల్లో స్వియాటెక్ 6-1, 6-0తో ఐదో ర్యాంకర్ జెస్సికా పెగూలా (అమెరికా)ను ఓడించింది. స్వియాటెక్‌కు ట్రోఫీతోపాటు 30,78,000 డాలర్ల (రూ. 25 కోట్ల 62 లక్షలు) ప్రైజ్‌మనీ, రన్నరప్ పెగూలాకు 16,02,000 డాలర్ల (రూ. 13 కోట్ల 33 లక్షలు) ప్రైజ్‌మనీ దక్కింది.

ప్రిక్వార్టర్ ఫైనల్లో జ్యోతి సురేఖ



ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఆర్చర్లు వెన్నం జ్యోతి సురేఖ, ధీరజ్ బొమ్మదేవర ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. బ్యాంకాక్‌లో మంగళవారం జరిగిన మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగం రెండో రౌండ్‌లో సురేఖ 144-141తో ప్రతుమ్‌సువన్ (థాయ్‌లాండ్)పై గెలిచింది. పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగం రెండో రౌండ్‌లో ధీరజ్ 6-4తో తై యు సువాన్ (చైనీస్ తైపీ)పై గెలిచాడు.

201 వన్డేల్లో ఆస్ట్రేలియా తరఫున తొలి డబుల్ సెంచరీతోపాటు అత్యధిక వ్యక్తిగత స్కోరు చేసిన ప్లేయర్‌గా మ్యాక్స్‌వెల్ నిలిచాడు. షేన్ వాట్సన్ (185 నాటౌట్; 2011లో బంగ్లాదేశ్‌పై మిర్పూర్‌లో) పేరిట ఉన్న రికార్డును మ్యాక్స్‌వెల్ బద్దలు కొట్టాడు.

3 ప్రపంచకప్ చరిత్రలో నమోదైన డబుల్ సెంచరీలు. గతంలో న్యూజిలాండ్‌కు చెందిన మార్టిన్ గప్టిల్ (237 నాటౌట్; వెస్టిండీస్‌పై 2015లో వెల్లింగ్టన్‌లో), వెస్టిండీస్ స్టార్ క్రిస్ గేల్ (215; జింబాబ్వేపై 2015లో కాన్‌బెర్రాలో) ఈ ఘనత సాధించారు.

2 వన్డేల్లో వేగవంతంగా డబుల్ సెంచరీ చేసిన రెండో ప్లేయర్‌గా మ్యాక్స్‌వెల్ (128 బంతుల్లో) నిలిచాడు. ఈ రికార్డు భారత ప్లేయర్ ఇషాన్ కిషన్ (126 బంతుల్లో; 2022లో బంగ్లాదేశ్‌పై చిట్టగాంగ్‌లో) పేరిట ఉంది.

1 వన్డేల్లో ఛేజింగ్ చేస్తూ అత్యధిక స్కోరు సాధించిన ప్లేయర్‌గా మ్యాక్స్‌వెల్ నిలిచాడు. పాకిస్తాన్ ప్లేయర్ ఫఖర్ జమాన్ (193; 2021లో దక్షిణాఫ్రికాపై జొహనెస్‌బర్గ్‌లో) పేరిట ఉన్న రికార్డును మ్యాక్స్‌వెల్ సవరించాడు.

2 ప్రపంచకప్ చరిత్రలో అత్యధిక సిక్స్‌లు కొట్టిన క్రికెటర్ల జాబితాలో మ్యాక్స్‌వెల్ (43) మూడో స్థానానికి చేరుకున్నాడు. క్రిస్ గేల్ (49), రోహిత్ శర్మ (45) వరుసగా తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	8	8	0	16	2.456
దక్షిణాఫ్రికా	8	6	2	12	1.376
ఆస్ట్రేలియా	8	6	2	12	0.861
న్యూజిలాండ్	8	4	4	8	0.398
పాకిస్తాన్	8	4	4	8	0.036
అఫ్గానిస్తాన్	8	4	4	8	-0.338
బంగ్లాదేశ్	8	2	6	4	-1.142
శ్రీలంక	8	2	6	4	-1.160
నెదర్లాండ్స్	7	2	5	4	-1.398
ఇంగ్లండ్	7	1	6	2	-1.504

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ప్రపంచకప్‌లో నేడు

ఇంగ్లండ్ × నెదర్లాండ్స్
వేదిక: పుణే

మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఒకే ఒక్కడు



ఆస్ట్రేలియా విజయలక్ష్యం 292... 18.3 ఓవర్ల వరకు ఆ జట్టు స్కోరు 91/7... ఇక ఐదుసార్లు విశ్వ విజేత ఆస్ట్రేలియాకు అఫ్గానిస్తాన్ చేతిలో ఘోర పరాభవం లాంఛనమేనని అందరూ భావించారు. కానీ గ్లెన్ మ్యాక్స్‌వెల్... కలిసొచ్చిన అదృష్టం (లైఫ్‌లు)... క్రీజులో కదల్లేకపోయిన దైన్యం... ఒకదాని తర్వాత ఒకటి వెంబడించినా... అదృష్టాన్ని అందిపుచ్చుకొని, కష్టాన్ని పంటిబిగువన భరించి ఈ ప్రపంచకప్‌కే అసాధారణ 'షో'కు తెచ్చాడు. అఫ్గాన్ చేతుల్లో పడిన సంచలనాన్ని మ్యాక్సీ ఒంటిచేత్తో లాక్కున్నాడు. ఆ ఒక్కడే ఆసీస్ సైన్యంగా మారి గెలిచేదాకా నిలిచాడు. కాళ్లు కదలనీయలేకపోయినా... ఉక్కు పిడికిలితో బ్యాట్ పట్టి కొండంత లక్ష్యాన్ని కరిగించాడు. డబుల్ సెంచరీతో ఈ ప్రపంచకప్‌కే వన్నె తెచ్చాడు.

పరుగులు **201** నాటౌట్
బంతులు **128**
4×21; 6×10
1×39; 2×9
స్ట్రయిక్‌రేట్ **157.03**

ముంబై: నవంబర్ 19న వన్డే వరల్డ్‌కప్ ఫైనల్... టైటిల్ పోరు ఎవరి మధ్యయినా జరగొచ్చు... విజేత ఎవరైనా కావొచ్చు. కానీ ఈ ప్రపంచకప్ అంటే తప్పక గుర్తుండే క్రికెటర్ మాత్రం ఒక్కడే! అతడే మ్యాక్స్‌వెల్! ఛేదించలేని లక్ష్యం. కొండంత కష్టం కళ్లముందుంటే... కఠిన సవాల్ సైతం సలామ్ కొట్టేలా 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మ్యాక్స్‌వెల్ (128 బంతుల్లో 201 నాటౌట్; 21 ఫోర్లు, 10 సిక్స్‌లు) అద్భుత ఇన్నింగ్స్ ఆడేశాడు. ఓటమి కోరల్లోంచి లాగి... మరో మ్యాచ్ మిగిలి ఉండగానే ఆస్ట్రేలియాను ఒంటిచేత్తో సెమీఫైనల్‌కు తీసుకెళ్లాడు. అందరూ ముఖమంత కళ్లు చేసుకొని చూసిన ఈ మ్యాచ్‌లో మ్యాక్స్‌వెల్ మహిమతో ఆస్ట్రేలియా 3 వికెట్ల తేడాతో అఫ్గానిస్తాన్‌పై గెలిచింది. మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అఫ్గానిస్తాన్ 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 291 పరుగులు చేసింది. ఓపెనర్ ఇబ్రహీమ్ జద్రాన్ (143 బంతుల్లో 129 నాటౌట్; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు) అజేయ సెంచరీ చేశాడు. ఆఖర్లో రషీద్ ఖాన్ (18 బంతుల్లో 35 నాటౌట్; 2 ఫోర్లు, 3 సిక్సర్లు) మెరిపించాడు. హాజల్‌వుడ్‌కు 2 వికెట్లు దక్కాయి. అనంతరం ఆస్ట్రేలియా 46.5 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 293 పరుగులు చేసి గెలిచింది. ఈ 293 పరుగుల్లో 201 మ్యాక్స్‌వెల్ ఒక్కడివే అంటేనే ఇంకెవరూ చెప్పుకోదగ్గ స్కోర్లే చేయలేదనేది ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. దీంతో అఫ్గాన్ బౌలర్లు నవీనుల్ (2/47), రషీద్ (2/44), ఒమర్జాయ్ (2/52) చిందించిన చెమట... పడగొట్టిన వికెట్లు వృథా అయ్యాయి.

జబర్దస్త్ జద్రాన్...



ఇబ్రహీమ్ జద్రాన్

ఓపెనర్లలో రహ్మానుల్లా గుర్బాజ్ (25 బంతుల్లో 21; 2 ఫోర్లు) నిష్క్రమించగా, ఇబ్రహీమ్ జద్రాన్ ఆద్యంతం ఇన్నింగ్స్‌కు వెన్నెముకగా నిలిచాడు. ఈ క్రమంలో జద్రాన్ 62 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. రహ్మత్ షా (44 బంతుల్లో 30; 1 ఫోర్) కుదురుగా ఆడగా అఫ్గాన్ 21వ ఓవర్లో 100 పరుగులు దాటింది. రెండో వికెట్‌కు ఇద్దరు కలిసి 83 పరుగులు జోడించారు. ఆ తర్వాత కెప్టెన్ హష్మతుల్లా (26; 2 ఫోర్లు) చేసింది తక్కువే అయినా మూడో వికెట్‌కు 52 పరుగుల భాగస్వామ్యం నమోదైంది. జద్రాన్‌కు జతయిన అజ్మతుల్లా ఒమర్జాయ్ (18 బంతుల్లో 22; 1 ఫోర్, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడటంతో 41వ ఓవర్లో అఫ్గాన్ 200 స్కోరు చేరింది. జద్రాన్ 131 బంతుల్లో అఫ్గాన్ తరఫున తొలి శతకాన్ని లిఖించాడు.

ఒక్కడే అయినా... ఒంటరి కాదు విక్టరీ!

హెడ్ (0) ఖాతా తెరువలేదు. మిచెల్ మార్ష్ (24), వార్నర్ (18)లు గొప్పగా ఆడలేదు. ఇంగ్లిస్ (0), లబుషేన్ (14), స్టొయినిస్ (6)లు అంతే! అఫ్గాన్ బౌలర్లకు కలిసికట్టుగా దాసోహమయ్యారు. జట్టు స్కోరు 50కి ముందే (49/4) ఆసీస్ నలుగురు టాప్ బ్యాటర్లను... వందకు ముందు (91/7) మిగిలిపోయిన బ్యాటింగ్ అస్త్రాలను కోల్పోయింది. గెలుపు సంగతి దేవుడెరుగు! అసలు ప్రపంచకప్‌లలోనే ఫేవరెట్, ఐదుసార్లు ప్రపంచ చాంపియన్ పరువు సంగతి ఏంటి? ఎంత భారీతేడాతో ఓడుతుందనే కళ్లే మ్యాచ్‌ను చూశాయి.

మ్యాక్స్ 'వెల్‌డన్'

ఆస్ట్రేలియాను ఒంటిచేత్తో గెలిపించిన బ్యాటర్

క్లిష్ట పరిస్థితుల్లో అజేయ డబుల్ సెంచరీ

అఫ్గానిస్తాన్‌పై మూడు వికెట్లతో నెగ్గి సెమీస్ చేరిన ఆస్ట్రేలియా

ఇబ్రహీమ్ జద్రాన్ సెంచరీ వృథా

కలిసొచ్చిన రివ్యూలు, మిస్ క్యాచ్‌లు

ఒమర్జాయ్ 9వ ఓవర్ తొలి బంతికే వార్నర్, రెండో బంతికి ఇంగ్లిస్‌లను అవుట్ చేశాడు. జట్టుస్కోరు 49/4 వద్ద మ్యాక్స్‌వెల్ క్రీజులోకి వచ్చాడు. బౌలర్ 'హ్యాట్రిక్' కోసం ప్రయత్నించాడు. ఎల్బీకోసం రివ్యూకు సైతం వెళ్లాడు. కానీ బంతి మ్యాక్సీ బ్యాట్ అంచును తాకి కీపర్‌కు చాలా ముందుగా పడింది. దీంతో అఫ్గాన్‌కు ఫలితం దక్కలేదు. ఆ తర్వాత 22వ ఓవర్లో రెండుసార్లు... ఎల్బీగా అంపైర్ అవుటిస్తే రివ్యూతో బయటపడ్డాడు. అదే ఓవర్లో ముజీబ్ జారవిడిచిన క్యాచ్‌తో, కాసేపయ్యాక నబీ అందుకోలేకపోయిన క్యాచ్‌తో బతికి బయటపడ్డాక వెనుదిరిగి చూసుకోలేదు. అప్పటికీ మ్యాక్సీ కనీసం 35 పరుగులైనా చేయలేదు.

రాత మార్చిన ఘనుడు

మ్యాక్స్‌వెల్ భారీ హిట్టింగ్‌కు, మ్యాచ్ విన్నింగ్ షాట్లకు పెట్టింది పేరు. కానీ పెద్ద లక్ష్యం, అంతదూరం ఎలా పయనిస్తాడో అనుకుంటే... జతకూడిన కమిన్స్‌తో కలిసి జట్టు రాతను తన బ్యాట్‌తో మార్చేశాడు. 20 ఓవర్లదాకా మ్యాక్సీ సాధారణ ఆటే ఆడాడు. 51 బంతుల్లో ఫిఫ్టీ పూర్తిచేశాడు. నూర్ అహ్మద్ వేసిన 29వ ఓవర్లో 2 వరుస సిక్సర్లతో గేర్ మార్చాడు. స్పిన్నర్లపై దూకుడు పెంచి బౌండరీలు, సిక్సర్లతో శివమెత్తాడు. దీంతో ఛేదించాల్సిన రన్‌రేట్ తగ్గుతూ వచ్చింది. 76 బంతుల్లోనే శతక్కొట్టిన మ్యాక్సీ డబుల్ సెంచరీకి అవసరమైన బంతులు 128 మాత్రమే!

బతికించిన ముజీబ్ ఓవర్లోనే ముగించి...

సునాయాసమైన క్యాచ్‌ను నేలపాలుచేసిన ముజీబ్ 47వ ఓవర్ వేశాడు. అప్పటికీ 24 బంతుల్లో 21 పరుగులు కావాలి. అయితే మ్యాక్సీ 0, 6, 6, 4, 6లతో ఆ ఓవర్ కూడా పూర్తవకముందే లక్ష్యాన్ని, తన డబుల్ సెంచరీని ముగించాడు. మ్యాక్సీ, కమిన్స్‌లు అబేధ్యమైన 8వ వికెట్‌కు 202 పరుగుల భాగస్వామ్యం జోడించడంతో కొత్త ప్రపంచ రికార్డు నమోదైంది. 2006లో భారత్‌పై 8వ వికెట్‌కు దక్షిణాఫ్రికా బ్యాటర్స్ జస్టిన్ కెంప్, అండ్రూ హాల్ చేసిన 138 పరుగుల భాగస్వామ్యం కనుమరుగైంది.

స్కోరు వివరాలు

అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (సి) స్టార్క్ (బి) హాజల్‌వుడ్ 21; జద్రాన్ (నాటౌట్) 129; రహ్మత్ (సి) హాజల్‌వుడ్ (బి) మ్యాక్స్‌వెల్ 30; హష్మతుల్లా (బి) స్టార్క్) 26; ఒమర్జాయ్ (సి) మ్యాక్స్‌వెల్ (బి) జంపా 22; నబీ (బి) హాజల్‌వుడ్ 12; రషీద్ (నాటౌట్) 35; ఎక్స్‌ట్రాలు 16; **మొత్తం (50 ఓవర్లలో 5 వికెట్లకు) 291. వికెట్ల పతనం:** 1-38, 2-121, 3-173, 4-210, 5-233. **బౌలింగ్:** స్టార్క్ 9-0-70-1, హాజల్‌వుడ్ 9-0-39-2, మ్యాక్స్‌వెల్ 10-0- 55-1, కమిన్స్ 8-0-47-0, జంపా 10-0- 58-1, హెడ్ 3-0-15-0, స్టొయినిస్ 1-0- 2-0.

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: వార్నర్ (బి) ఒమర్జాయ్ 18; హెడ్ (సి) ఇక్రామ్ (బి) నవీనుల్ 0; మార్ష్ (ఎల్బీడబ్ల్యూ) (బి) నవీనుల్ 24; లబుషేన్ (రనౌట్) 14; ఇంగ్లిస్ (సి) జద్రాన్ (బి) ఒమర్జాయ్ 0; మ్యాక్స్‌వెల్ (నాటౌట్) 201; స్టొయినిస్ (ఎల్బీడబ్ల్యూ) (బి) రషీద్ 6; స్టార్క్ (సి) ఇక్రామ్ (బి) రషీద్ 3; కమిన్స్ (నాటౌట్) 12; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (46.5 ఓవర్లలో 7 వికెట్లకు) 293. వికెట్ల పతనం:** 1-4, 2-43, 3-49, 4-49, 5-69, 6-87, 7-91. **బౌలింగ్:** ముజీబ్ 8.5-1-72-0, నవీనుల్ 9-0-47-2, ఒమర్జాయ్ 7-1-52-2, రషీద్ ఖాన్ 10-0-44-2, నూర్ అహ్మద్ 10-1-53-0, నబీ 2-0-20-0.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.